# గీతామృతం

డా॥ ఇలపావులూరి పాండురంగరావు



కార్యనిర్వాహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
2002

# గీతామృతం

## సరళ సంగ్రహ భాష్యం

డా॥ ఇలపావులూరి పాండురంగరావు

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు,

తిరుపతి.

2002

# GEETAMRUTAM

(Bhagavad Gita - Original Text in Telugu Script with Sarala Sangraha Bhashya)

*by*

**Dr. ILAPAVULURI PANDURANGA RAO**

© All Rights Reserved

T.T.D. Religious Publications Series No. : 572

First Edition: 1999
Re-print : 2002

Copies : 2,000

*Published by*

**Dr. P. Krishnaiah, I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507.

*Printed at*

Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

# ముందుమాట

భారతీయ తత్త్వచింతనకు ముఖ్యాధారాలు భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు. వీటినే ''ప్రస్థాన త్రయం'' అని అంటారు. ఈ మూడింటిలో అందరికీ అందుబాటులో ఉండేది భగవద్గీత. ఉపనిషత్తుల సారం ఇందులో ఇమిడి ఉంది.

నిజానికి, జీవితంలో ఏ చిక్కు ప్రశ్న తటస్థించినా గీతలో ఏదో ఒక శ్లోకం అందుకు సమాధానం చెప్పగలదు. గీతామాత శ్రీమాతవలె సర్వకాల సర్వావస్థలయందు మన వెంటనే ఉండి, మనకు సరియైన దారి చూపిస్తూ ఉంటుంది. గీతకు గల ఈ ప్రాశస్త్యానికి ప్రధాన కారణం అందలి ధర్మనిష్ఠ. 'ఎక్కడ ధర్మం ఉంటే అక్కడ విజయం ఉంటుంది'. ''యతో ధర్మః తతో జయః'' ఇదే గీత ప్రతిపాదించే పరమసత్యం!

గీత మహాభారతంలో కీలకమైన స్థానంలో నెలకొని ఉండి, ఆ 'పంచమ వేదం' యొక్క సందేశాన్ని ప్రపంచానికి చక్కగా చాటుతూవుంది. గీతోపనిషత్తు ఆవిర్భవించిన నాటినుండి ఆ యా భాషలలో భాష్యాలు, టీకలు, వ్యాఖ్యానాలు, అనువాదాలు - అసంఖ్యాకంగా వెలసినాయి; వెలువడుతున్నాయి. భవిష్యత్తులోనూ వెలువడుతుంటాయి. 'గీతాసప్తశతి' కి గల ప్రాచుర్యం అలాంటిది!

సుగృహీతనామధేయులు, బహుభాషాకోవిదులైన విద్యావేత్తలు, కవివతంసులు డా॥ ఇలపావులూరి పాండురంగరావుగారు ''గీతామృతం'' అనే పేరుతో తెలుగున రచించిన ఈ సరళ సంగ్రహ భాష్యం అలాంటి వివరణల్లో విశిష్టమయింది. ఇందులో గీతాస్వరూపం (18 అధ్యాయాలు) (i) కర్మవల్లి, (ii)జ్ఞానవల్లి, (iii) భక్తివల్లి, (iv) ముక్తివల్లి - అని నాలుగు భాగాలుగా వింగడింపబడింది. ఈ వింగడింపు ఆధ్యాత్మిక విషయాలను ఆసక్తికరంగా సోపాన క్రమంలో విశదీకరించే వినూత్న కౌశలాన్ని ప్రకటిస్తున్నది.

ఇందలి అవతారికలో శ్రీయుతులు పాండురంగరావుగారు తదితర అనేకాంశాలతోపాటు గీతకు పూర్వరంగంగా అధివసించి ఉన్న దేవీతత్త్వాన్ని, గీతాసప్తశతిలో అధిష్ఠించియున్న మాతృత్వాన్ని ఆవిష్కరించిన తీరు అపూర్వంగా, ఆలోచనావమృతంగా విలసిల్లుతూవుంది.

క్లిష్టములగు వేదాంత విషయాలనుసైతం - చేసి తీరాలి, తెలిసి చెయ్యాలి, చేసి చూడాలి, చూచి చేరాలి - అనే తేటతెలుగు శీర్షికలక్రింద సరళ సుందర శైలిలో అందరకూ ఆహ్లాదకరంగా వివరిస్తూవున్న ఈ గీతాభాష్యం జిజ్ఞాసువులైనవారెల్లరూ పదే పదే పఠింపదగింది.

ఇంచుమించు ఇరువదేళ్ళ క్రితం (1978లో) 'ప్రాగ్భారతి' ప్రకటించిన ఈ ప్రశస్తకృతిని తిరుమల తిరుపతి దేవస్థానముల పక్షాన 1999లో ప్రచురించిన ప్రతులన్నీ చెల్లిపోయిన కారణంగా యథాతథంగా ఇప్పుడు పునర్ముద్రిస్తున్నాం. సహృదయ పాఠకులు అభిలాషతో గీతామృతాన్ని ఆస్వాదించగలరని ఆశిస్తున్నాము.

కార్యనిర్వహణాధికారి,

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

## ఇందులో...


| | | | | పుట |
|---|---|---|---|---|
| 1. | అవతారిక | -- | | 1 |
| 2. | కర్మవల్లి | -- | చేసి తీరాలి | 15 |
| 3. | జ్ఞానవల్లి | -- | తెలిసి చెయ్యాలి | 59 |
| 4. | భక్తివల్లి | -- | చేసి చూడాలి | 99 |
| 5. | ముక్తివల్లి | -- | చూచి చేరాలి | 147 |

ఓం

శ్రీకృష్ణ పరమాత్మనే నమః

# అవతారిక

ప్రాగ్భారతి వెలయించిన ప్రశస్తవాఙ్మయంలో భగవద్గీతకు ప్రత్యేకమైన స్థానం ఉంది. భూమండలానికి ప్రాగ్భాగంలో (తూర్పున) ఉన్న భారత దేశానికీ, వాఙ్మయమండలానికీ ప్రాగ్రూప(తొలి)మైన మహాభారతానికీ జ్యోతి ర్మయమైన సామ్యం ఉంది. 'భా' - అంటేనే వెలుగు, దీప్తి, జ్యోతి. మనకు కనిపించే వెలుగును వెలయించే తొలి వెలుగు ప్రావెలుగు, ప్రాగ్భాతి. వేదకాలంనుంచి ఈనాటివరకు ఈ వెలుగును వివరించే విజ్ఞాన వాఙ్మయం (ప్రాగ్భారతి)లో శ్రీమద్భగవద్గీతకు ఉన్నంత ప్రాశస్త్యం, గౌరవం, ప్రచారం మరో గ్రంథానికి లేదు. ప్రపంచంలో ఏ మూలకు వెళ్ళి చూచినా కనీసం భగవద్గీతపేరు విననివాడుండడు. జనమానసంలో ఇంతటి ఆత్మీయ తను పొందేందుకు ఇందులో గొప్ప రహస్యమేదో ఉండితీరాలి. సాక్షాత్ భగవత్స్వరూపుడైన కృష్ణపరమాత్మ నోట వెలువడిన గానం కాబట్టి, జ్ఞాన వాఙ్మయంలో దీనికి అద్వితీయమైన స్థానం లభించిందని కొందరు భావిస్తారు. పంచమవేదమయిన భారతంలో కీలకమైన స్థానంలో కృష్ణద్వైపాయనుడు కూర్చిన సర్వవేదాంతసార మవటంవల్ల, ఈ గ్రంథానికి ఇంత ప్రచారం వచ్చిందని మరి కొందరు అంటారు. అసలు భారతమే ఒక విజ్ఞాన సంగ్రహం. వేదవిదులకు వేదంగా, పౌరాణికులకు పురాణంగా, కవులకు కావ్యంగా, ధార్మికులకు ధర్మశాస్త్రంగా, విజ్ఞానవేత్తలకు జ్ఞాన నవనీతంగా, భావనాపరులకు భావరసాయనంగా, అక్షరపరాయణులకు అక్షయ లక్ష్యంగా ప్రసిద్ధిచెందిన మహాభారతసంహిత, లక్షశ్లోకాల్లో వివరించిన తత్త్వద లక్ష్యా ర్థాన్ని, భగవద్గీత అందులో ఒక భాగమై ఆ లక్ష్యాన్ని ఏడువందల శ్లోకాల్లో సాధించింది. గీతాసప్తశతి మహాభారతసంహితకు చక్కని సార సంగ్రహం.

భారతసంహితలోనే ఒకభాగమయిన శ్రీవిష్ణుసహస్రనామంకూడా ఈ పనిని వెయ్యి నామాలలో సాధించింది. ఈ రెండింటిలో భారతసావిత్రి పరమ రమణీయ రూపంలో సాక్షాత్కరిస్తుంది. కనుకనే శంకరభగవత్పాదులు "గేయం గీతా నామసహస్రం" అని ప్రపంచానికి ప్రబోధించారు.

'గీతాసప్తశతి' అనగానే దుర్గాసప్తశతి గుర్తుకు వస్తుంది. గీతలో ఏడువందల శ్లోకాలు ఉన్న మాట అందరికీ తెలిసినదే అయినా, దీనికి సప్తశతి అనేపేరు ప్రచారంలో లేదు. కాని గీతను జాగ్రత్తగా పరిశీలిస్తే ఇది దేవీపరమైన శాస్త్రంలాగానే కనిపిస్తుంది. అసలు 'గీతా' అనే పదం స్త్రీవాచకం; 'భగవద్గీత' అంటే భగవంతునిచేత కీర్తింపబడినది -- అని అర్థం. ఏమిటి కీర్తింపబడినది? గానం చేయబడిన పదార్థం ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పుకునేందుకు భగవద్గీతను జాగ్రత్తగా పరిశీలించాలి. నేను, నన్ను, నాచేత, నావల్ల, నానుండి, నాయొక్క, నాకు, నాయందు అని మాటిమాటికి జగత్ప్రభువైన గీతాచార్యుడు చెప్పే 'నా' తత్త్వమేమిటో గమనించాలి. అదే శ్రీ తత్త్వం. శ్రీమాత సకల జగన్మాత. జగన్నియంత ఆధ్వర్యంలో ఆమె సచరాచరసృష్టి సాగిస్తుంది. అసంఖ్యాక జీవరాశిని ఆత్మానందంకోసం సృష్టించి, పాలించి, పోషించి లయింపచేస్తుంది. పరమేష్ఠి మహాకాల స్వరూపుడు. పరమేశ్వరి మహాకాళి, మహాకాళి. తల్లిగా, దుర్గగా, భవానిగా, కల్యాణిగా, కామాక్షిగా, సాధ్విగా, చండిగా -- అనేకరూపాల్లో నిత్యజీవితంలో సాక్షాత్కరించే మహాదేవి, మహాకాలుని కనుసంజ్ఞలను గమనించి, మనకోసం అన్నిపనులు చేస్తూ ఉంటే, ఈ రహస్యం తెలుసుకోలేని అమాయకులు ఇదంతా తమ పురుషార్థమని భ్రమిస్తారు. తాను చేస్తున్నాననే భావంతో చేసేసరికి తగాదా వస్తుంది. సరిగా ఇలాంటి ధర్మసందేహంలోనే అర్జునుడు చిక్కుకుంటాడు. ఈ చిక్కునుండి అతనిని బయటకు లాగి సరియైన దృష్టిని అతనికి ప్రసాదించేందుకే పార్థసారథి పాటుపడ్డాడు. ఏది ధర్మం, ఏది అధర్మం, ఏది పాపం, ఏది పుణ్యం, ఏం చెయ్యాలి, ఏం చెయ్యకూడదు -- అనే విషయం అతనికి బోధపడలేదు. కాని తనకు బోధపడలేదని అతడు భావించలేదు. ఏవో సారంగ నీతులు చెప్పి చివరకు రణరంగంలో కూలబడ్డాడు. అలా

చదికిలపడ్డవాణ్ణి నిలబెట్టేందుకు గీతామాత వెలసింది. ప్రతిజీవిలో సహజంగా పాతుకుపోయి ఉండే భండాసురుణ్ణి ఖండించి, అతనిలోని సామ్యయోగాన్ని క్రియారూపంలో సాగుచేసేందుకే గీతామాత శ్రీ మాతలా ఆవిర్భవించింది. ఇది గీతారహస్యం.

భగవద్గీతకు పూర్వరంగంగా భారతసంహితలోని రెండు మూడు అధ్యాయాలు పరిశీలిస్తే, గీతా సప్తశతిలోని మాతృత్వం చక్కగా గోచరిస్తుంది. భగవద్గీత భీష్మపర్వంలోది. భీష్మపర్వంతో భారతయుద్ధం ఆరంభమవుతుంది. రణరంగంలో సర్వలోకసారథి పార్థుని రథాన్ని నడుపుకుంటూ రణరంగంలోకి ప్రవేశిస్తాడు. యుద్ధభూమిని చూడగానే పార్థునికి పరమేశ్వరిని స్తుతించాలని స్ఫురిస్తుంది. పరమేష్ఠి సాక్షాత్తు తనప్రక్కనే ఉండి తనరథం తోలుతూ ఉంటే, పరమేశ్వరి అతని మనస్సులో ప్రవేశించింది. గీతాపర్వానికి రెండు అధ్యాయాలు ముందుగా ఈ దేవీస్తుతి జరుగుతుంది. అందులో రెండు మూడు శ్లోకాలు చూస్తే గీతాసప్తశతిలోని దేవీసప్తశతిత్వం గోచరిస్తుంది.

" నమస్తే సిద్ధసేనాని ఆర్యే మందారవాసిని,
కుమారి కాలి కాపాలి కపిలే కృష్ణపింగళే.

భద్రకాళి నమస్తుభ్యం మహాకాళి నమోఽస్తుతే,
చండి చండే నమస్తుభ్యం తారిణీ వరవర్ణిని.

కాత్యాయని మహాభాగే కరాళి విజయే జయే,
శిఖిపింఛధ్వజధరే నానాభరణ భూషితే."

ఇలా సర్వరుణానవద్యాంగి, సర్వాభరణ భూషితమైన శ్రీదేవిని అర్జునుడు స్తుతించగానే, దేవి అతనికి రణరంగంలో సాక్షాత్కరించి, అతణ్ణి ఆశీర్వదిస్తుంది.

"నర స్త్వమసి దుర్ధర్ష నారాయణసహాయవాన్"

అని చాల సారగర్భితంగా ఆమె కృష్ణార్జున సంయోగాన్ని వివరిస్తుంది. 'నారాయణుని సాయం పొందిన నరుడవు. నీకు అపజయం లేదు.

జయం తథ్యం' అని చెప్పి ఆమె అంతర్ధాన మవుతుంది. ఈ స్తోత్రం చేసిన తర్వాతనే అర్జునుడు రథంమీదికి వస్తాడు. రథ మెక్కిన తర్వాత ఇరువైపులా శత్రురూపంలో నిలబడ్డ స్వజనాన్ని చూచేసరికి అర్జునుణ్ణి మహామోహం ఆవరిస్తుంది. మమకారం సమరోత్సాహానికి అవరోధంగా నిలబడుతుంది. తల్లి అనుగ్రహం లభించినా, తండ్రి చైతన్యబోధ తప్పనిసరి అయింది. అందుకే గీత అవతరించింది.

ఉన్నట్టుండి ఆవరించిన యీ మోహానికి ముఖ్యకారణం ఆత్మ విస్మృతి. తన నిజస్వరూపం తాను తెలుసుకోలేక తన స్వార్థంకోసం, రాజ్యలాభంకోసం తాను యుద్ధం చేస్తున్నానని, కర్తృత్వ భోక్తృత్వాలు తనకు తాను ఆరోపించుకుంటున్నాడు - అమాయకుడయిన అర్జునుడు. అంతటితో ఆగక సర్వజ్ఞుడైన శ్రీకృష్ణపరమాత్మను కేవలం సారథిగా, మహా అయితే బావగారిగా, ఆపద్బాంధవుడిగా భావించి ఆయనకే శ్రీరంగనీతులు చెపుతున్నాడు. యుద్ధంచేస్తే వర్ణ సంకర మవుతుందట. ధర్మం నశిస్తుం దట. ఇలాంటి అసంబద్ధప్రలాపాలు ఏవేవో అర్జునుడి నోట దొర్లాయి. వాటికి జగన్నాటక సూత్రధారుడు నవ్వుకున్నాడు. బహుశా తనలో తాను నవ్వుకుని ఉంటాడు. అందుకనే ఆ నవ్వు బయటికి ఆట్టే కనిపించలేదు. "ప్రహసన్నివ" అని వ్యాసుడు ఈ ఆంతర దరహాసాన్ని అప్రమత్తతతో వర్ణిస్తాడు. అంతే -- ఆ నవ్వు గీతగా వెలసింది. గీతాశాస్త్రమంతా అర్జునుణ్ణి ఆవరించిన అజ్ఞానసమ్మోహాన్ని, ఆత్మవిస్మృతిని పోగొట్టి, నిజ మైన ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించేందుకే ఉదయించింది. అందుకనే తాను చెప్పవలసిందంతా పూసగ్రుచ్చినట్లు చెప్పి, అడిగిన ప్రశ్నల కన్నింటికీ ఓపికగా సమాధానం చెప్పి, చెప్పిన మాటలకు ప్రత్యక్షంగా ప్రమాణం చూపించి, చివరకు గీతాచార్యుడు పార్థుణ్ణి అడుగుతాడు.

కచ్చి దేతచ్ఛ్రుతం పార్థ! త్వయైకాగ్రేణ చేతసా,
కచ్చి దజ్ఞాన సంమోహః ప్రణష్ట స్తే ధనంజయ!

(చెప్పిందంతా జాగ్రత్తగా విన్నావా? అజ్ఞానంవల్ల ఏర్పడిన మహా మోహం, భ్రమ తొలగిందా?)

అప్పటికిగాని ధనంజయుడు ధర్మంజయుడు కాలేదు. వెంటనే అర్జునుడు అంటాడు.

నష్టో మోహః స్మృతి ర్లబ్ధా త్వత్ప్రసాదా న్మయాచ్యుత!
స్థితోఽస్మి గతసందేహః కరిష్యే వచనం తవ.

(నాలోని మోహమంతా నశించింది. నా స్వరూపం నాకు గుర్తుకు వచ్చింది. (స్మృతి లభించింది.) అంతా మీ అనుగ్రహం. నా సందేహాలన్నీ పోయినాయి. ఇక మీరు ఎలా చెప్తే అలా చేస్తాను. నీమాట దాటను.)

కాని, కృష్ణుడు ఫలానా పని చెయ్యవలసిందని చెప్పడు. ధర్మసమ్మతమైన కర్మ ఎలా ఉంటుంది? కర్మకు, జ్ఞానానికి సంబంధం ఏమిటి? ఎందుకు చెయ్యాలి? ఏం చెయ్యాలి? ఎలా చెయ్యాలి? -- అనే విషయాలు కూలంకషంగా చర్చించి అర్జునుడికి విడమరచి చెప్పాడు, అంతే. ఆ తర్వాత నీ కెలా తోస్తే అలా చెయ్యవలసిందని అతనికి పూర్తిగా స్వేచ్ఛ ఇచ్చాడు. ఆత్మ జ్ఞానం లభించిన తర్వాత ఒకరి కొకరు చెప్పవలసిన పనిలేదు. ఆత్మవంతులు చేసే పనులు పరమాత్మకు ఇష్టంగానే ఉంటాయి. కాబట్టి ఆత్మానాత్మ వివేకంతో పరమాత్మ తత్త్వం బోధపరచుకొని ఆత్మానందంకోసం (స్వార్థంకోసంకాదు) అన్ని పనులు చేస్తూ, ఏమి చేయనట్టే భావిస్తూ మెలకువతో, నిలకడతో జీవిత యాత్ర సాగించటమే గీత బోధించే 'ఆత్మయోగం'.

గీతాశాస్త్రానికి సారం -- ఆత్మయోగం. విశ్వరూప సందర్శనంలో పరమాత్మ చూపించింది, జీవాత్మ చూచింది -- ఈ ఆత్మస్వరూపమే. "దర్శయాత్మాన మవ్యయమ్" (ఎన్నటికీ నశించని ఆత్మస్వరూపాన్ని చూపించుమని) యోగేశ్వరుణ్ణి అర్జునుడు అర్థిస్తాడు. భక్తితో కోరిన పార్థుని అభ్యర్థనను పరమాత్మ వెంటనే మన్నించి విశ్వరూపం చూపించి, "రూపం పరం దర్శిత మాత్మ యోగాత్" (ఆత్మయోగంవల్ల నీ వీ పరమవరేణ్యామైన రూపాన్ని చూడగలిగావు) అని సారగర్భితంగా అంటాడు. కాని ఆత్మ యోగంతో పరస్వరూపాన్ని సాక్షాత్కరించుకొనేందుకు ముందు కొంత సాధన అవసరం. అదే గీత వివరించే నీతి.

చేయవలసినపని చేసితీరాలి. కాని తెలిసి చెయ్యాలి. ఆత్మానాత్మ వివేకంతో, కర్తృత్వ భోక్తృత్వ విచక్షణతో "నైవ కించిత్కరోమి" (నే నేమి చేయటం లేదు) అనే నిర్లిప్తభావంతో, తెలిసిచేసిన పని చిత్తశుద్ధికి దారితీస్తుంది. కర్మవల్ల ముక్తి లభిస్తుందా? జ్ఞానంవల్ల లభిస్తుందా? అని తాత్త్వికులు తర్జనభర్జన చేస్తారు. కాని గీత రెంటిని సమన్వయపరుస్తుంది. కర్మ వదలి జ్ఞానాన్ని అనుసరించే అంతరిక్షయాత్రను గీత ఆమోదించదు. ఆత్మజ్ఞానానికి కర్మ సహకారి కావాలి. జ్ఞానంవల్ల ఆత్మదర్శనం లభిస్తుంది. కర్మవల్ల జ్ఞానం, జ్ఞానంతోపాటు భక్తి, భక్తి ద్వారా ముక్తి -- ఇదీ గీతా శాస్త్రం నిర్దేశించే ఆత్మయోగసాధన. ఈ యోగ సాధనకు అడవుల్లోకి వెళ్ళి ఏకాంతంగా తపస్సు చేయవలసిన పని లేదు. నిత్యజీవితంలో నియతకర్మలను చేస్తూనే, కుటుంబ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూనే ఈసాధన చెయ్యవచ్చు. కర్మయోగం ఈ ఆత్మయోగానికి పునాది. జ్ఞానయోగం గోడలు. భక్తి యోగం పై కప్పు. ఇలా కర్మ జ్ఞాన భక్తి సహకారంతో నిర్మించిన ఆత్మసదనం ముక్తికాంతకు ముచ్చటగా వాసయోగ్యమైన నివాసంగా రూపొందుతుంది. గీతలోని ప్రతిశ్లోకం ఏదో ఒక రూపంలో ఈ ఆత్మసామ్రాజ్యాన్ని కీర్తిస్తుంది.

గీతలో 18 అధ్యాయా లున్నాయి. భారతంలో పర్వాలుకూడా 18. భారతయుద్ధం 18 రోజులు సాగింది. ఈ సంఖ్యను జయ సంఖ్యగా భావిస్తారు. క ఖ గ ఘ -- ఈ వరుసలో 'జ' అనేది 8వ అక్షరం. 'య' నుండి మొదలయ్యే -- యాదివర్గంలో 'య' మొదటి అక్షరం. 'అంకానాం వామతో గతిః' అనే సూత్రంప్రకారం జయశబ్దంలోని రెండక్షరాలు ఎనిమిదికి, ఒకటికి ప్రతిరూపం కావటంవల్ల జయశబ్దం అష్టాదశ సంఖ్యావాచి అవుతుంది. భగవద్గీత అష్టాదశాధ్యాయిని. ఈ 18 అధ్యాయాలకు వేరువేరు పేర్లున్నాయి. మొదటిది విషాదయోగం. చివరిది మోక్షసన్న్యాస యోగం. విషాదంనుంచి విమలవైరాగ్యంతో లభించే నిశ్శ్రేయసానందంవరకు ఏర్పడే వివిధ సాధనావస్థలు ఈ 18 అధ్యాయాల్లో కనిపిస్తాయి. ఈ రెండు తీరాలకు మధ్య సాంఖ్యం, కర్మ, జ్ఞానం, సన్న్యాసం, ధ్యానం, జ్ఞానవిజ్ఞానం,

అక్షరపరబ్రహ్మ, రాజవిద్య, విభూతి, విశ్వరూపం, భక్తి, క్షేత్ర క్షేత్రజ్ఞ వివేకం, గుణత్రయ విభాగం, పురుషోత్తమ తత్త్వం, దైవాసుర సంపద్వి-వేచన, శ్రద్ధాత్రయ విచారం -- అనే పదహారు సోపానాలు కనిపిస్తాయి. ఇంత చక్కని విశ్లేషణ మరో తాత్త్విక గ్రంథంలో కనిపించదు. దిగులుతో దిగజారి సమరాంగణంలో చదికిలబడిపోయిన వ్యక్తిని నిశ్శ్రేయస పథంలో అత్యున్నతమైన స్థాయికి తీసికొనిపోయే మహాయానం గీతాజ్ఞానం.

ఈ 18 అధ్యాయాల్లో నాలుగు భాగాలు స్పష్టంగా కనిపిస్తాయి. మొదటి మూడు అధ్యాయాల్లో కర్మయోగాన్నిగురించి ఎక్కువగా చర్చ వినిపిస్తుంది. మూడవ అధ్యాయమైన కర్మయోగంతో ఈ భాగం పూర్తి అవుతుంది. తరువాత నాలుగు అధ్యాయాల్లో (4,5,6,7) కర్మనిర్వహణకు కావలసిన జ్ఞాన మీమాంస జరుగుతుంది. ఈ భాగంలో చివరి అధ్యాయం జ్ఞానవిజ్ఞాన యోగం. ఎనిమిదవ అధ్యాయం అక్షరపరబ్రహ్మయోగం. ఎనిమిది నుండి పన్నెండో అధ్యాయం(భక్తియోగం)వరకు బ్రహ్మతత్త్వం, బ్రహ్మ సాక్షాత్కారం, భక్తి ప్రదానంగా కనిపిస్తాయి. భక్తికి సంబంధించిన యీ భాగంలో చివరి అధ్యాయం భక్తియోగ మవటం గమనించదగ్గ విషయం. చివరి ఆరు (13-18) అధ్యాయాల్లో సాయుజ్యం, సాద్గుణ్యం, సాధన, మోక్షం -- ఇలాంటి విషయాలు వినవస్తాయి. ఈ భాగానికే కాక, గీతకే సారాంశమైన చివరి అధ్యాయం మోక్షసన్న్యాస యోగం. దానినే ఆత్మ సాక్షాత్కారమని, ఆత్మసాయుజ్యమని అనవచ్చు. ఇదే గీతాశాస్త్రానికి పరమావధి. ఈ విధంగా కర్మభాగం, జ్ఞానభాగం, భక్తిభాగం, ముక్తిభాగం అని గీతార్థసారాన్ని నాలుగు భాగాలుగా భావించుకోవచ్చు. వీటినే కర్మవల్లి, జ్ఞానవల్లి, భక్తివల్లి, ముక్తివల్లి అని వ్యవహరించినా తప్పులేదు. పరిభాషను పరిహరించి సామాన్యజన భాషలో చెప్పకుంటే, మొదటిభాగం 'చేసి తీరాలి', రెండవభాగం 'తెలిసి చెయ్యాలి', మూడవ భాగం 'చేసిచూడాలి', నాల్గవభాగం 'చూచి చేరాలి' -- అని నాలుగు నానుడులుగా విడమరచి చెప్పకోవచ్చు. ఈ నాలుగు భాగాల్లో అధ్యాయాల సంఖ్య 3,4,5,6 ఆరోహణక్రమంలో ఉండటంవల్ల

సోపానభావంకూడా చక్కగా అతికిపోతుంది. ఈ విభాగాన్ని అనుసరించే యీ 'గీతామృతం' భావింపబడింది.

వరాహపురాణంలో గీతామాహాత్మ్యం చెప్తూ గీతకు 18 నామాలు సూచించటం జరిగింది. అవికూడా గీతార్థాన్ని సాంగోపాంగంగా సూత్రప్రాయంగా సూచిస్తాయి.

గీతా గంగా చ గాయత్రీ సీతా సత్యా సరస్వతీ,
బ్రహ్మవిద్యా బ్రహ్మవల్లీ త్రిసంధ్యా ముక్తి గేహినీ.
అర్ధమాత్రా చిదానందా భవఘ్నీ భయనాశినీ,
వేదత్రయీ పరానంతా తత్త్వార్థ జ్ఞానమంజరీ.
ఇత్యేతాని జపన్నిత్యం నరో నిశ్చలమానసః,
జ్ఞానసిద్ధిం లభే చ్ఛీఘ్రం తథాంతే పరమంపదమ్.

గీత, గంగ, గాయత్రి, సీత, సత్య, సరస్వతి, బ్రహ్మవిద్య, బ్రహ్మవల్లి, త్రిసంధ్య, ముక్తిగేహిని, అర్ధమాత్ర, చిదానంద, భవఘ్ని, భయనాశిని, వేదత్రయి, పర, అనంత, తత్త్వార్థజ్ఞానమంజరి -- ఈ 18 పేర్లు నిత్యం పఠించినా పరమపదం లభిస్తుందట. ఈ నామాల్లో ఒక్కొక్కటి ఒక్కొక్క అధ్యాయానికి అన్వయించుకుంటూ పోతే, గీతార్థసారమంతా నామసంకీర్తనంలో ఇమిడిపోతుంది. ఈ నామాలన్నీ ఒక్కొక్క దేవికి ఒక్కొక్క నామం చొప్పన చెప్పబడినట్టు అనిపిస్తాయి. ఒక్కొక్క అధ్యాయానికి ఒక్కొక్క అధిష్ఠాత్రి ఉన్నట్టు భావించవచ్చు. ఒక అధ్యాయం చదివితే ఒక దేవిని ఆరాధించినట్లు. అలా సమగ్రంగా గీతాపారాయణం చేస్తే 18 దేవీ మూర్తులను ఆరాధించినట్టవుతుంది. గీతాపారాయణానికి అవకాశం లేని సమయంలో ఈ నామాలను పఠించినా కావలసిన మనశ్శాంతి, ఆత్మ శుద్ధి లభిస్తాయి. పారాయణ గ్రంథంగా భావించినా భగవద్గీత చాల అనుకూలమైన గ్రంథం. రోజుకు ఒక్క శ్లోకం చదివినా చాలు, దాని అర్థం తెలుసుకొని ఆచరణలో పెట్టేందుకు ప్రయత్నిస్తే జీవితంలో కావలసినంత

చైతన్యకాంతి ప్రవేశిస్తుంది. "స్వల్ప మప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్" అన్న భగవద్వాక్యం పరమ సత్యం.

గీతాపారాయణానికి కఠోరమైన నియమాలు, నిష్ఠలు కూడా అవసరం లేదు. స్నానం చెయ్యకపోయినా పరవాలేదు. విభూతిని, విశ్వరూపాన్ని స్మరిస్తే అంతా పవిత్రమైపోతుందని వరాహపురాణం చెపుతుంది.

" స్నాతో వా యది వాఽస్నాతః శుచిర్వా యది వాఽశుచిః,
విభూతిం విశ్వరూపం చ సంస్మరన్ సర్వదా శుచిః."

కుల మత వివక్షత లేకుండా అన్ని కులాలవాళ్లు చదువవచ్చు. పిల్లలు, పెద్దలు, స్త్రీలు, పురుషులు, ధనికులు, పేదలు -- అందరూ అనాయాసంగా చదువగలిగిన గ్రంథం. అర్థం తెలియకుండా చదివితే పారాయణ ఫలితం దక్కుతుంది. అర్థం తెలిసి చదివితే జీవిత పరమార్థం చిక్కుతుంది. పారాయణానికి పారాయణం, శాస్త్రానికి శాస్త్రం, యోగానికి యోగం, అనుభూతికి అనుభూతి, సాహితికి సాహితి, ఏ విధంగా ఆరాధిస్తే ఆవిధంగా ఫలించే కల్పతరువు -- భగవద్గీత. బ్రహ్మపదార్థాన్ని వివరించే పదజాలంలోనే బ్రహ్మవిద్యను ప్రవేశపెట్టి మంత్రంగా, స్తోత్రంగా, శాస్త్రంగా, గ్రంథంగా ఈ సప్తశతిని సమకూర్చిన కృష్ణద్వైపాయనుడు అఖండవాఙ్మయ తపోనిధి. ఏ విధమైన భేదభావం లేకుండా అందరికీ అందుబాటులో ఉండే యీ విశ్వజనీన రచనను కీర్తించిన వరాహపురాణం దీనిలోని సమబుద్ధిని బ్రహ్మపదార్థంతో పోల్చి చెప్తూ ఉంటుంది.

గీతాసు న విశేషోఽస్తి జనేషూచ్చావచేషు చ,
జ్ఞానేష్వేవ సమగ్రేషు సమా బ్రహ్మస్వరూపిణీ.

గొప్ప, తక్కువ అనే భేదం గీతలకు లేదు. జ్ఞానమే ప్రధానం. బ్రహ్మజిజ్ఞాస కలవాళ్ల కందరికీ ఇది సమానంగా రుచిస్తుంది. బ్రహ్మభావంలోనే సమభావం ఉంది. గీతలో మాటిమాటికి నొక్కి చెప్పిన గుణం కూడా సామ్యమే. సమభావాన్ని మించిన యోగమే లేదు. కష్టసుఖాలను,

మానావమానాలను, లాభ నష్టాలను, శీతోష్ణాలను, జయాపజయాలను, వెలుగు నీడలను సమదృష్టితో చూచి అనుభవించగలిగిన వాడు నిజమైన యోగి. తనలోఉన్న ఆత్మతత్త్వమే అందరిలో ఉన్నదని గమనించిన వేత్తకు సమభావం సహజంగా సమకూరుతుంది. అదే భగవద్గీత బోధించే పరమార్థం.

జీవితంలో ఒక్కసారి గీత చదివినా చాలునని వరాహపురాణం చెప్తుంది. అంటే ఒక్కసారి చదివి మానమని కాదు. ఒక్కసారి చదివిచూస్తే ఇక వదలరని అభిప్రాయం. గీతామృతంలోని రుచి అలాంటిది. వ్యక్తిదృష్టి అటువైపు మరలితే చాలునని మహర్షుల ఆవేదన. ఎలాగయినా సరే మంచి మాటలు చెవినిపడితే ప్రపంచం బాగుపడుతుందని వాళ్ల తాపత్రయం. అలా జరగకుండా పెడముఖంపెట్టి పారిపోయే పెద్దమనుషులు కొందరూ, మధ్యమధ్యలో వెనక్కు తిరిగిచూచే వాళ్ళనుకూడా పారద్రోలే పారంగతులు కొందరూ తయారవటంతో మహర్షుల సాధన సామాన్య మానవులకు అందుబాటులో లేకుండా పోయింది. ప్రాచీన మహర్షుల ప్రాగ్భారతిని పామరజనులకుకూడా అందేట్టు చేసినది గీతామాత. తల్లి పిల్లలకు ఎలా బోధిస్తుందో, అంత చిన్న చిన్న మాటల్లో గొప్పభావాలను అందిస్తుంది గీత. అందుకనే ఉపనిషత్తులను గోవులుగా, గోపాల నందనుని దోగ్ధగా, పార్థుణ్ణి దూడగా భక్తులను భోక్తలుగా భావించి గీతను అమృతంతో పోల్చి చెప్పారు. గీత అంటే గీతాచార్యునికి ఎనలేని అనురాగం.

" గీతా మే పరమా విద్యా బ్రహ్మరూపా న సంశయః,
అర్ధమాత్రాక్షరా నిత్యా స్వనిర్వాచ్యపదాత్మికా."

పరమాత్మ స్వరూపాన్ని నిరూపించే బ్రహ్మవిద్య గీత. కొద్దిమాటల్లో గొప్పసత్యాన్ని ప్రతిపాదించిన పరమార్థ విజ్ఞానశాస్త్రం. 'ఇది నా విద్య' అని భగవంతుడు దీనిని తనదిగా చెప్పుకున్నాడు. గీతాశాస్త్రాన్ని ఆధారం చేసుకొనే ఆయన మూడు లోకాలను పాలిస్తాడట. చిన్నతనంనుంచి నవనీతసారాన్ని మనసార గ్రోలిన గోవిందుడు కాబట్టి, పరమరహస్యమైన పరతత్త్వాన్ని సరళమైన పదాలలో పదిమందికి అందించగలిగాడు.

భారతీయ తత్త్వచింతనకు ఆధారభూతములైన గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రం -- ఈ మూడింటిని కలిపి ప్రస్థానత్రయ మంటారు. ఈ మూడింటిలో అందరికీ అందుబాటులో ఉండేది భగవద్గీత. ఉపనిషత్తుల సారం కూడా ఇందులో ఉంది. భగవద్గీతలో కనిపించే ప్రతిపదం ఉపనిషత్తులలో ఏదో ఒక సందర్భంలో మహర్షుల నోట వెలువడినదే. బ్రహ్మసూత్రంలో సార గర్భితంగా సూత్రప్రాయంగా చెప్పబడిన రహస్యాలన్నీ గీతలో తేటతెల్లంగా తేల్చి చెప్పబడ్డాయి. అయినా గీతకు ఎన్నో భాష్యాలు, వ్యాఖ్యానాలు వెలువడ్డాయి. ఇన్ని వ్యాఖ్యానాలు ఉన్న గ్రంథం ఎంత గంభీరంగానో, గహనంగానో, గూఢంగానో ఉంటుందని దూరంగానే ఊహించి, ఆ జోలికి పోని అయ్యలు ముఖ్యంగా గమనించ వలసిన విషయం ఒకటి ఉంది. గీతకు ఇన్ని భాష్యాలు వెలువడినందుకు కారణం దానిలోని జటిలత్వం కాదు. గీతామృతం ఎంత ఆస్వాదించినా, ఎంత వివరించినా తనివి తీరని తియ్యదనం, కమ్మదనం, చెప్ప నలవిగాని గొప్ప రుచి దానిలో దాగియుండటమే దీనికి కారణం. ఏ భాష్యం జోలికి పోకపోయినా గీత, గీతగా అర్థం చేసుకునేందుకు ఏమీ ఇబ్బంది ఉండదు. మన సంస్కారాన్నిబట్టి, అనుభవాన్ని బట్టి, మనోనైర్మల్యాన్ని బట్టి, హృదయ సారళ్యాన్ని బట్టి గీతార్థం మనజీవితంలో చరితార్థ మవుతుంది. ఎంత చర్వితం చేస్తే అంత చరితార్థ మవుతుంది. సర్వకాల సర్వావస్థలయందు గీతార్థం మన స్మృతిపథంలో సంచరిస్తూ ఉండాలి. అంతఃకరణంలో గీతాస్మరణం ఎంతవారికో! అలాంటి మహనీయులు అన్ని యజ్ఞాలు చేసినట్టే, అన్ని జపాలు చేసినట్టే. వాళ్ళకు మించిన పండితులు, జ్ఞానులు, యోగులు ఉండరు.

యస్యాంతఃకరణం నిత్యం గీతాయాం రమతే సదా,
సర్వాగ్నికః సదా జాపీ క్రియావాన్ స చ పండితః.
దర్శనీయః స ధనవాన్ స యోగీ జ్ఞానవానపి,
స ఏవ యాజ్ఞికో ధ్యానీ సర్వవేదార్థదర్శకః.

నిజానికి జీవితంలో ఏ చిక్కుప్రశ్న తటస్థించినా గీతలో ఏదో ఒక శ్లోకం దానికి సమాధానం చెప్పగలదు. గీత చెప్పిన మాట మనం వినలేదు. కాబట్టి

ఇలాంటి విషమపరిస్థితి ఏర్పడిందని వెంటనే మన మనస్సుకు స్ఫురిస్తుంది. అందువల్లనే గీత తల్లిలాంటిదని అన్నారు. గీతామాత శ్రీమాతవలె సర్వకాల సర్వావస్థలయందు మన వెంటనే ఉండి మనకు సరియైన దారి చూపిస్తూ ఉంటుంది. ఆమెను హృదయంలో నెలకొల్పుకుని ఉండాలి. ముందు నోట పట్టాలి. ఆ తర్వాత మనసున పట్టాలి. అప్పుడు గీతావాక్యాలు అంతరంగంలో రంగరించుకొనిపోవాలి. అప్పుడే గీతామాత మన జీవితంలో ఒక భాగమయిపోతుంది. ఈ విషయాన్నే వరాహపురాణం ఒక చక్కని శ్లోకంలో చెప్పుతుంది.

యోఽధీతే సతతం గీతాం దివారాత్రౌ యథార్థతః,
స్వపన్ గచ్ఛన్ వదం స్తిష్ఠన్ శాశ్వతం మోక్ష మాప్నుయాత్.

అహర్నిశలు ఏ పనిచేస్తున్నా (నిద్రపోతున్నా, నడుస్తున్నా, మాట్లాడుతున్నా, నిలబడియున్నా) గీతనే మననంచేసుకునే మహనీయులకు శాశ్వతమైన శాంతి లభిస్తుందని యీ శ్లోకం చెప్పుతుంది. అలా గీత మన చేతోజగత్తులో ఒకభాగమయితే అంతకు మించిన పరమావధి లేదు. గీతాచార్యునికి నివాసస్థలమైన గీత మనలో చోటుచేసుకొనగలిగితే జన్మ తరించినట్లే.

భారతీయ వాఙ్మయంలో ఎన్నో గీత లున్నాయి. శివ గీత, రాము గీత, గోపికా గీతలు, భ్రమర గీతలు -- ఇలాంటివి చాలా ఉన్నాయి. కాని 'గీత' అనగానే శ్రీకృష్ణుడు అర్జునునికి చెప్పిన భగవద్గీత మాత్రమే స్ఫురిస్తుంది. గీతకుగల ప్రాశస్త్యానికి ఇదే ప్రమాణం. అలాగే జన్మాష్టమి అనగానే శ్రీకృష్ణ జన్మాష్టమి మాత్రమే బోధపడుతుంది. గీతకు గీతాచార్యునకు గల యీ ప్రాశస్త్యానికి కారణం ధర్మనిష్ఠ. రామాయణం సత్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తే, భారతం ధర్మానికి జయం చేకూర్చుతుంది. ఎక్కడ ధర్మముంటే అక్కడ కృష్ణుడుంటాడు. ఎక్కడ కృష్ణుడుంటే అక్కడ జయముంటుంది. అంటే ధర్మమున్నచోట జయముంటుంది. "యతో ధర్మ స్తతో జయః" ఇది భారతామృత సర్వస్వమైన గీత ప్రతిపాదించే పరమసత్యం. ఇదే సకల ధర్మసారం, శాస్త్రసారం, జ్ఞానసారం, యోగసారం.

యస్మాద్ ధర్మమయీ గీతా సర్వజ్ఞానప్రయోజికా,
సర్వశాస్త్రమయీ గీతా తస్మాద్ గీతా విశిష్యతే.

ధర్మమయి, జ్ఞానమయి, శాస్త్రమయి అయిన శ్రీమద్భగవద్గీత సర్వవేదాంత సారం. అలాంటి గీతామృతాన్ని ఆస్వాదించి అనుభవించి అనుసరించగలిగిన జీవి అమరజీవి కాగలదు. అమరత్వమంటే చావు లేక పోవటం కాదు. చావని సత్యాన్ని, మరణించని మంచితనాన్ని, శరీరంలోని శరీరిని, సత్యంలోని సారాన్ని, వేరుచేసుకొని చూచి, తనలో తాను లీనంకావడం అమరత్వం. పంచభూతాల్లో కలిసిపోవడం పంచత్వం(మరణం). తనలో తాను లీనమయిపోవడం ఆత్మ సాయుజ్యం. ఈ సాయుజ్యానికి సాధనమే గీతామృతం. ఈ జీవిత పరమార్థాన్ని ఎలా సాధించాలో గీతామృతంలోని కర్మ జ్ఞాన భక్తి సమన్వయం వివరిస్తుంది. ఈ సమరం(మార్గం)లో విజయమేకాని, పరాజయం లేదు.

"యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః,
తత్ర శ్రీ ర్విజయో భూతిః ధ్రువా నీతి ర్మతి ర్మమ.

* * *

ఓం

# కృష్ణం వందే జగద్గురుమ్

# గీతామృతం

## కర్మవల్లి : చేసి తీరాలి

| | | | |
|---|---|---|---|
| అధ్యా. | 1 | : | అర్జునవిషాద యోగం |
| ,, | 2 | : | సాంఖ్య యోగం |
| ,, | 3 | : | కర్మ యోగం |

# చేసి తీరాలి

నర నారాయణ సంవాదరూపంలో వెలసిన శ్రీమద్భగవద్గీత సంజయ ధృతరాష్ట్ర సంభాషణతో ఆరంభమవుతుంది. భారతయుద్ధానికి ఇరుపక్షాల వీరాధివీరులు సన్నద్ధులై, ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలోకి చేరుకుంటున్నారు. ఒక వైపు భీష్మాదుల విక్రమంతో విలసిల్లే కౌరవసేన. మరో వైపు భీమాదుల పరాక్రమంతో తారసిల్లే పాండవసేన. ఒకరి నొకరు రణరంగంలో చూచుకుంటున్నారు. ఏ క్షణంలోనయినా యుద్ధం ఆరంభం కావచ్చు. ఆ సంరంభం చూద్దామని ముసలితాత ధృతరాష్ట్రుని మనస్సులో గాఢమైన కోరిక ఉంది. కాని, చూచేందుకు కళ్లు లేవు. ధర్మచక్షువులే కాక కర్మచక్షువులు కూడ లేని ధృతరాష్ట్రుడు, రాష్ట్రం నిలబెట్టుకునేందుకు తన సంతతి చేసే అధర్మ కృత్యాలను అనురాగానికి లొంగి ఆమోదించాడు. కాని, హృదయాంతరాల్లో అతనికి తెలుసు -- ఇది పాండవులతో చేస్తున్న యుద్ధం కాదు; ధర్మంతో చేస్తున్న యుద్ధమని. అందుకనే, తనకు జరుగుతున్నది జరుగుతున్నట్టు వివరించేందుకు నియమితుడైన సంజయుణ్ణి అడిగిన ప్రశ్నలో మొట్టమొదట ధర్మం, తర్వాత కర్మ అప్రయత్నంగా అతనినోట వెలువడుతుంది.

ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః,
మామకాః పాండవాశ్చైవ కి మకుర్వత సంజయ?

ధర్మక్షేత్రమయిన కురుక్షేత్రంలో యుద్ధం చేసేందుకు కూడుకున్న మావాళ్లు, పాండవులు ఏం చేశారు? అని ప్రశ్నిస్తాడు. ఒక విధంగా ఇది అర్థంలేని ప్రశ్న. కాని, జాగ్రత్తగా పరిశీలిస్తే భారతసర్వస్వం, గీతార్థసారం దీనిలో ఇమిడి ఉన్నాయి. రణరంగంలో కూడిన యోధులు ఏం చేశారు? అని ప్రశ్నించటం హాస్యాస్పదం. కాని ఎలాగయినా యీ అధర్మయుద్ధం తప్పిపోయి, తన కొడుకులు బ్రతికి బాగుపడితే చాలుననే హృదయావేదన కూడా ఈ ప్రశ్నలో తొంగిచూస్తున్నది. నిజంగా యుద్ధం ఆరంభమయిందా? అని అడగటంలో ఆంతర్యం ఇదే. అందువల్లనే ధర్మాన్ని

ముందు స్మరించాడు తాతయ్య. మావాళ్ళు (మామకాః) అని కౌరవులను స్మరించి, పాండవులను 'పాండవాః' అని స్మరించటంలో అతని మమకారం వ్యక్తమవుతుంది. ధర్మ కర్మలలో ముందు ధర్మం చెప్పి, కౌరవ పాండవులలో ముందు తనవారిని చెప్పకోవటంలోకూడా, ఎలాగయినా ధర్మం తనవారి పక్షంలో ఉంటే బాగుండునని అతని పిచ్చి ఆపేక్ష. కాని, తాతయ్య మనస్తాపం ఎంత విశుద్ధమైనదంటే, అత డనుకున్నంత పని జరిగేంత పని అయింది. కాని ధర్మసంస్థాపకుడు అడ్డుపడ్డాడు.

సాక్షాత్ కృష్ణపరమాత్మ రథం తోలుతూ ఉంటే వాయువేగ మనోవేగా లను మించిన శరవేగంతో రణరంగంలో ప్రవేశించి, దుర్గాదేవిని అనర్గళమైన వాగ్వైఖరితో స్తుతించి, ఆమె ఆశీస్సులను పొంది, రథమెక్కి, ఇరుసేనల మధ్యభాగంలో నిలబడ్డ అర్జునుడు చటుక్కున చతికిలబడిపొయ్యాడు. 'ఎటుచూచినా బంధువులు, గురువులు, తాతలు, తండ్రులు, తనయులు, బావలు, బావమరదులు, మామలు, అల్లుళ్ళు, ఆత్మీయులైన ఆప్తబంధువు లపై అస్త్ర శస్త్ర ప్రయోగమా? పూజ్య పాదులయిన ఆచార్యవర్యులతో పోరాటమా? లేదు, ఇది ధర్మం కాదు. ఈపని నావల్ల కాదు. నాకు చేతులాడటం లేదు. ఒళ్ళు చల్లబడిపోయింది. కరచరణాలు దిగజారి పోతున్నాయి. నోరు తడి ఆరిపోతున్నది. కాయం కంపించిపోతున్నది. గాండీవం జారిపోతున్నది. చర్మం సలసల కాగిపోతున్నది. నిలబడలేక పోతున్నాను. కళ్ళు తిరుగుతున్నాయి' -- అని అర్జునుడు మహారథులమధ్య మహామోహంలో మునిగిపోతాడు. 'నా వాళ్ళను చంపి నేను సాధించే దేముంది? ఈ రాజ్యం, ఈ భోగం, ఈ సౌఖ్యం -- అంతా వాళ్ళకోసమే గదా? వాళ్ళే పోయిన తర్వాత మనం సాధించగలిగే దేముంది? నన్ను వాళ్ళు చంపినా సరే, నేను మాత్రం వాళ్ళను చంపను. పదమదాంధులైన బంధువులు, యుక్తాయుక్త వివేకం లేకుండా తనవాళ్ళను చంపుకునేంత దౌర్జన్యానికి సిద్ధపడ్డారు. కాని మనంకూడా వాళ్ళ అజ్ఞానంలో పడిపోవటం ధర్మం కాదు. మూడులోకాలకు నన్ను అధిపతి చేసినా సరే, ఈ అన్యాయం నేను చేయలేను. నా చేతులతో నేను ఈ వంశ నాశనం చెయ్యలేను. వంశం నశించటంతో, వంశపరంపరగా వస్తున్న ధర్మసంతతి నశిస్తుంది. అధర్మం

తాండవిస్తుంది. స్త్రీజాతి చెడిపోతుంది. వర్ణసంకర మవుతుంది. దానితో పూర్వీకులందరూ నరకంపాలవుతారు. కులధర్మం, జాతిధర్మం, నరధర్మం -- అన్ని ధర్మాలూ నశిస్తాయి. చివరకు మిగిలేది యీ నశ్వర శరీరం. క్షణభంగురమైన రాజ్యం అక్కర్లేదు. చస్తే నే నీ పని చెయ్యను. కౌరవులు నన్ను చంపినా సరే, నేను నా వాళ్ళను ఇలా చంపుకోలేను.' ఇలా విచారంతో, విషాదంతో, నైరాశ్యంతో తన ఆందోళనను వెలిబుచ్చుకుని శోక సంమిశ్రమానసుడైన అర్జునుడు, రథంమీద నిలుచున్నవాడు కూర్చుని పోతాడు. ఇప్పుడు కూర్చున్నవాణ్ణి నిలబెట్టాలి. స్నేహభావంతో అతని వ్యామోహాన్ని తొలగించాలి. ధర్మ కర్మ సమన్వయాన్ని గురించి అతని మనసులో ఉన్న అపోహలను విప్పిచెప్పాలి. సత్య ధర్మ సమన్వితమైన కర్మయోగాన్ని అతనికి నచ్చచెప్పాలి. రణరంగంలో జరుగరానిది జరిగింది. ముఖ్యంగా ధనంజయుడు చేయవలసిన పని కాదది.

కాని, జగన్నాటక సూత్రధారుడు అంతా గమనిస్తున్నాడు. మమకారానికి లొంగి, కన్నీళ్ళతో కదనరంగాన్ని అభిషేకిస్తున్న అర్జునుడి ముఖవైఖరి చూచాడు. అటు దుర్యోధనాదుల దురహంకారాన్ని, దుష్టసాహసాన్ని, దురాలోచనలను కూడా చూస్తున్నాడు. అప్పుడప్పుడే దుర్యోధనుడు ద్రోణాచార్యుల దగ్గరికి వెళ్ళి ఇరుసేనల బలాబలాలను వివరిస్తున్నాడు. మన వైపు భీష్ముణ్ణి, అటువైపు భీముణ్ణి ఒక కంట కనిపెట్టి ఉండటం మంచిదని, ఆచార్యులవారికి విన్నవించుకుంటున్నాడు. ఈ మాటలోని మర్మాన్ని మరుక్షణమే గమనించిన భీష్మాచార్యులు, వెంటనే సింహనాదం చేసి శంఖం పూరించాడు. ఆ శంఖధ్వని విని అందరూ తమ తమ శంఖాలు పూరించారు. అందరితో పాటు అర్జునుడుకూడా తన దేవదత్తాన్ని పూరించాడు. శ్రీకృష్ణుని పాంచజన్యంతోపాటు, ఆతని దేవదత్తం ధవళరథానికి తారళ్యం చేకూర్చింది. 'ఇప్పుడిప్పుడే ఇదంతా జరిగింది. ఇంతలో అర్జునుడికి ఏమయింది? ధర్మరక్షణకు అన్నీ విఘ్నాలేనా? అందులో అడుగులోనే హంసపాదా? కాదు, అలా అయ్యేందుకు వీల్లేదు. అర్జునుడు ఋజువర్తనుడు. చాల మంచివాడు. మెతకవాడు. 'మెత్తనిపులి' అయిన ధర్మనందనుని తమ్ముడు. ధర్మాధర్మాలు చక్కగా తెలుసుకున్నవాడు. కాని,

నరుడు. నర సహజమైన మమకారం, మోహం, దౌర్బల్యం అతన్ని క్షణికంగా ఆవరించాయి. ఈ అవరోధాన్ని (ఆటంకాన్ని) అవలీలగా దాటవచ్చు. సత్యం, ధర్మం, కర్మ, జ్ఞానం, యోగం, ఆత్మ, అనాత్మ, క్షరం, అక్షరం, భక్తి, ముక్తి -- ఇవన్నీ సంగ్రహంగా చెప్తే అర్జునుడు మళ్ళీ తేరుకుంటాడు. ఈ నెపంతో లోకంకూడా తరిస్తుంది' -- అని ఇలా ఏవేవో ఆలోచనలు లోకనాయకుని అంతరంగంలో మెరుపుతీగలా ఉదయించి, అతని ముఖంలో చిరునవ్వును వెలయించాయి. ఇరుసేనల మధ్య విచారంతో క్రుంగి పోయిన 'భారతీయుని' సంబోధించి, లోకానందానికి నాయకుడయిన హృషీకేశుడు నవ్వుతున్నట్టుగా నగుమోమును వెలయిస్తూ, తన ధోరణి సాగించాడు.

త ముహాచ హృషీకేశః ప్రహసన్నివ భారత!
సేనయో రుభయో ర్మధ్యే విషీదంత మిదం వచః.

చిన్మయానందుని చిరునవ్వునుండి వెడలిన యీ పుష్పహాసమే గీతామృతం. 'ఇరుసేనలు గుమిగూడిన యీ విషమ సమయంలో నీ కీ పిరికితనం పనికిరాదు. అందులో నీలాంటి పరంతపునికి ఇలాంటి మాంద్యం శ్రేయస్కరం కాదు. క్షుద్రమైన యీ హృదయ దౌర్బల్యాన్ని చీడపురుగులా విదిలించుకొని లేచి యుద్ధం చెయ్యి!' అని పార్థుని మందలించి, గీతాచార్యుడు తన ఉపదేశామృతం సాగిస్తాడు. గీతోపదేశం ఒక్క పార్థునికే కాదు, పరమార్థకాములైన భారతీయులకు (భా = ప్రకాశం, కాంతి కాములకు) అందరికీ ఉపయోగించాలని గీతాచార్యుని సంకల్పం. ఈ విషయం గీతలో మాటిమాటికి వినవచ్చే 'భారత!' అనే సంబోధనలో సారగర్భితంగా ధ్వనిస్తుంది. అందువల్లనే కృష్ణుడు జగద్గురువు.

ఇక్కడినుండి అచ్చమైన గీతామృతం ఆరంభమవుతుంది.

అశోచ్యా నన్వశోచ స్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే,
గతాసూ నగతాసూంశ్చ నానుశోచంతి పండితాః.

"అనవసరంగా లేనిపోని ఆలోచనలతో మనస్సును కష్టపెట్టుకుంటు న్నావు. అసలు దిగులుపడి దిగజారవలసిన దిందులో ఏముంది? పైగా

పెద్ద మనిషిలాగా గొప్ప గొప్ప గోవిందనీతులు చెప్తున్నావు. అసలు తెలివి గలవాళ్ళు ఉన్నవాళ్ళకోసం, పోయినవాళ్ళకోసం ఊరకే దిగులుపడరు. అది పండితుల లక్షణం కాదు. పుట్టుకనుంచి గిట్టుకవరకే జీవితం పరిమిత మనుకోవటంతో ఈ చిక్కు వచ్చింది. మనం పుట్టకముందుకూడా మనం ఉన్నాము. గిట్టిన తర్వాతకూడా ఉంటాము. నేను, నీవే కాదు -- ఈ రాజాధిరాజులు, యోధానుయోధులు అందరూ అన్నికాలాలలో ఉన్నారు, ఉంటారు. నేను లేని కాలం లేదు. నీవు లేని కాలం లేదు. వీళ్ళందరు లేని కాలం కూడా లేదు. మన శరీరం కాలంలో కలిసిపోతుంది. కాని మనం కాలంతో కలిసి ఉంటాం. కాలంతోపాటు కాయం మారుతుంది. బాల్యంలో పెరుగుతుంది. యౌవనంలో సుఖపడుతుంది. వార్ధక్యంలో కృశిస్తుంది. ఆ తర్వాత నశిస్తుంది. దాన్నే మనం మరణం అంటాం. కాని మరణంతో నశించేది శరీరం మాత్రమే, మనం కాదు. మనమంటే మన ఆత్మ. శరీరంతో మనకు సనాతన సంబంధం లేదు. కంటికి కనబడే వస్తువులకూ శాశ్వతమైన సంబంధం లేదు. క్షణానికి ఒకదృశ్యం కంటికి కనిపిస్తుంది. మరుక్షణం మరో దృశ్యం కనిపిస్తుంది. అలాగే చెవికి వినిపించే ధ్వనులు, నాసికను మురిపించే నానా పరిమళాలు, నాలుకను మేల్కొల్పే నానా రుచులు, శరీరాన్ని పులకరింపజేసే అనేక స్పర్శలు -- అన్నీ క్షణభంగురాలు. చల్లదనం, వెచ్చదనం, సుఖం, దుఃఖం ఇవన్నీ ఇంద్రియాలకూ, ఇంద్రియార్థాలయిన శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలకూ సంబంధించినవి. అలాగే శరీరంలో వచ్చే మార్పులు కూడా రక్తమాంసాలకు సంబంధించినవి. ఈ శరీరంలో నివసించే శరీరికి వీటితో శాశ్వతమైన సంబంధం లేదు. ఆ శరీరి అశరీరిగా కూడా ఉండగలదు. అదే ఆత్మ. ఆత్మతత్త్వం తెలిసినవారిని ఈ క్షణభంగురమైన కష్టసుఖాలు బాధించవు. అవి వస్తాయి, వచ్చిన దారినే వెళ్లుతాయి. ఆత్మ అన్నింటినీ చూస్తూ ఉంటుంది.

ఆత్మ నశించదు. శరీరం నశిస్తుంది. నశించేది లేదు. నశించనిది ఉన్నది. ఉన్నదానిని, లేనిదానిని సాంతంగా పరిశీలించిన తత్త్వవేత్తలు, నశించని ఆత్మతత్త్వాన్ని అంతట వ్యాపించినట్టు చూచారు. అంతటా

కనిపించే ఆత్మతత్త్వం అవినశ్వరం. అవ్యయం. నశించదు. క్షీణించదు. క్షీణించేది శరీరం. క్షీణించే శరీరంలో క్షీణించకుండా ఉంటూ అంతటా తన ఉనికిని వ్యాపించుకున్న ఆత్మతత్త్వాన్ని అర్థం చేసుకో. అప్పుడు చావు లేదు. చంపటం లేదు. చంపేవాడు లేదు. చనిపోయేవాడు లేదు. అదే పరమ సత్యం నీకు బోధపడుతుంది. ఆత్మకు జననం లేదు, మరణం లేదు. ఒకప్పు డుండి మరొకప్పుడు లేకపోవటం లేదు. ఉన్నది ఎప్పుడూ ఉన్నది. లేనిది ఎప్పుడూ లేదు. శరీరం నశించినప్పుడు, అంతకు ముందునుంచి ఉన్నది ఉంటుంది. అప్పటి కప్పుడు ఏర్పడ్డది పోతుంది. మాసిన గుడ్డలను విడిచి, మంచి బట్టలను వేసుకోటంలాంటిది మరణం. నశించని, మరణించని, క్షీణించని ఆత్మ నిత్యం, శాశ్వతం అని తెలుసుకున్నతర్వాత మరణం ప్రకృతిసిద్ధ మనిపిస్తుంది. మరణించటమే జీవికి సహజం. జీవించటం ఒక విచిత్రం.

ఏమి చేసినా ఆత్మ నశించదు. కత్తిపోటుల కది లొంగదు. అగ్నికి కాలదు. నీటికి తడవదు. ఎండకు ఎండదు. గాలికి ఆరదు. తెంచితే తెగనిది. కాల్చితే కాలనిది. తడిపితే తడవనిది. ఆరబెట్టితే ఆరనిది. అంతటా అన్నివేళలా చలించకుండా నిలకడగా మెలకువగా ఉండే ఆత్మను స్మరించిన తర్వాత, ఆందోళనకు తావులేదు. ఒకవేళ ఆత్మ జీవునితో జన్మించి, జీవునితో నశిస్తుందని భావించినా విచారించవలసిన పనిలేదు. విచారించి చేయగలిగినదీ లేదు. పుట్టినవాడు గిట్టక మానడు. ఏదో ఒకరోజు ప్రతిజీవికి మరణం తప్పదు. తప్పించేందుకు, తప్పుకునేందుకు వీలులేని మరణాన్ని గురించి విచారించి దిగులుపడటం తెలివి తక్కువ, నిష్ప్రయోజనం.

> జాతస్య హి ధ్రువో మృత్యుః
> ధ్రువం జన్మ మృతస్య చ,
> తస్మా దపరిహార్యేఽర్థే
> న త్వం శోచితు మర్హసి.

ఏ దృష్టితో చూచినా మృత్యువు శోకహేతువు కాకూడదు. తనది కానిది శరీరం. తనదయినది ఆత్మ. నశించింది తనది కాదు. తా నయినది

నశించదు. పుట్టకముందు, గిట్టిన తర్వాత ఆత్మనుగురించి మనకు తెలియదు. మధ్యజీవితంలో ఈ శరీరం, వ్యామోహం, కష్టం, సుఖం, జననం, మరణం అన్నీ కనిపిస్తాయి. ఈ జీవితానుభవాలు ఆత్మ లీలలు. ఆట ముగియగానే ఆటగాళ్ళు విలపించరు. గెలిస్తే ఆనందిస్తారు. ఓడిపోతే తర్వాతి ఆటలో గెలిచేందుకు ప్రయత్నిస్తారు. జీవితం కూడా అంతే. జీవనలీల ఆత్మకు క్రీడ. కాబట్టి నశించే దేహాన్నిగురించి విచారించకు. నశించని దేహినిగురించి ఆలోచించు. ఎంత ఆలోచించినా అంతు చిక్కని ఆత్మతత్త్వాన్ని అర్థంచేసుకునేందుకు చాలామంది ప్రయత్నించారు. కాని, అత్యద్భుతమైన యీ ఆత్మ తత్త్వాన్ని ఎవరో కొందరు అదృష్టవంతులు మాత్రమే ఆశ్చర్యకరంగా చూడగలుగుతారు. ఇతరులు ఆశ్చర్యకరమైన కథలు చెప్పుకుంటారు. మరి కొందరు ఆశ్చర్యంతో ఆ కథలు వింటారు. ఎంత విన్నా, ఎంత చెప్పినా, ప్రత్యక్షంగా చూడనిదే ఆత్మతత్త్వం బోధపడదు.

అందాకా వెళ్ళ నక్కరలేదు. ఆత్మసంగతి అలా ఉంచి, స్వధర్మాన్ని బట్టి ఆలోచించినా యుద్ధం చెయ్యటం క్షత్రియుని కులధర్మం. అప్రయత్నంగా లభించిన యీ అవకాశాన్ని ఉపయోగించుకొని యుద్ధం చెయ్యకపోతే, తలుపులు తెరచిన స్వర్గంలో ప్రవేశించక, తొలగిపోవటంలాంటి అవివేకం అవుతుంది. స్వధర్మంతోపాటు యశస్సుకూడా నశిస్తుంది. నలుగురు నాలుగు మాట లంటారు. ఆత్మాభిమానికి అవమానం మరణంకంటే దారుణ మయినది. ఇప్పుడు రణరంగం వదలి తిరిగిపోతే పిరికిపందలా పారిపోయినాడని అందరూ హేళన చేస్తారు. అనరాని మాట లంటారు. పరనింద సహించేకంటే మరణం మేలు. గెలిస్తే రాజ్యం, లేకుంటే స్వర్గం -- ఎలాగయినా యుద్ధం చెయ్యటమే శ్రేయస్కరం కాబట్టి, లేచి యుద్ధం చెయ్యి. కష్ట సుఖాలను, లాభ నష్టాలను, జయాపజయాలను సమానంగా భావించి యుద్ధం చెయ్యి! అలా చెయ్యటంలో పాపం లేదు.

ఎందుకు లేదు? ఎలా చేసినా పాపం పాపమే కదా? కాదు. ఆత్మ బుద్ధితో చూచినా కర్మబుద్ధితో చూచినా సమభావంతో చేసిన పాపం కూడా పుణ్య మవుతుంది. ఇంతవరకు ఆత్మపరంగా ఆలోచించాం.

కర్మపరంగా చూచినా సమబుద్ధితో చేసిన పని సామాన్యమైన కర్మ కాకుండా, కర్మయోగ మవుతుంది. సంసారికీ, సంస్కారికీ అదే భేదం. సంసారభావంతో జీవించే వ్యక్తి స్వార్థంకోసం జీవిస్తాడు. సంస్కారం గల వాడు పరమార్థంకోసం ప్రాణాలను ధరిస్తాడు. ఫలాపేక్షతో చేసిన పని కర్మబంధానికి కారణమవుతుంది. నిరపేక్షంగా నిర్లిప్తంగా చేయవలెనని చేసిన పని ముక్తిమార్గానికి దారితీస్తుంది. ఇలా సమబుద్ధితో సాధించిన కర్మయోగానికి పరాజయం లేదు. పరాభవం లేదు. ఆగిపోవటం లేదు. ఎదురు తిరగటం లేదు. ఎంతవరకు సాధించగలిగితే అంతవరకే ఫలితం దక్కుతుంది. అసలు ఫలాపేక్షతో ప్రమేయమే లేని స్వతంత్రమార్గమిది. ఇందులో ఏ కొద్ది సాధన చేసినా మహాపాపాలు నశిస్తాయి. మహద్భయాలు తొలగిపోతాయి. ఈ మార్గంలో ప్రవేశించినవాళ్ళకు ఒకే ఒక నిశ్చయం. ఏకైకనిష్ఠతో వాళ్ళు ఆత్మసాక్షాత్కారంవైపు నిర్దిష్టపథంలో ప్రయనిస్తారు. కాని, స్వర్గసుఖంకోసం భోగభాగ్యాలకోసం ఏ క్రతువులో వ్రతాలో యాత్రలో చేసే ఫలపరాయణుల ప్రయాణపద్ధతి వంకర టింకరగా అనేక మార్గాల్లో వెళుతుంది. ఎవ రెలా చెప్తే అదే మంచి దనిపిస్తుంది. చిన్న చిన్న సుఖాలకోసం చిన్మయ సౌఖ్యం పోగొట్టుకొని, కమ్మని మాటలతో కవ్వించే గారడీలకు గురియై, నిలకడలేక చెడిపోతారు -- భోగలాలసులు. వేదాలు, వేదవిహితకర్మలు యజ్ఞయాగాదులు సత్త్వ రజ స్తమోగుణాలవరకే పరిమితములయినవి. కాని, ఆత్మవేత్త త్రిగుణాతీతుడు. సుఖదుఃఖాలకు, శీతోష్ణాలకు, లాభ నష్టాలకు, జయాపజయాలకు అతీతంగా సత్స్వరూపాన్ని సాధించిన సంస్కారి ఆత్మవంతుడు. కాబట్టి, నీవు ఆత్మవంతుడివి కావాలి. ఆత్మానందం చూరగొన్న తర్వాత చిన్న చిన్న ఆనందాలు చిలిపిచేష్టలనిపిస్తాయి. సకల వేదసారం ఆత్మసౌందర్యం. ఆత్మజ్ఞాని వేదవేదాంగాలలో తనకు కావలసినంతవరకే గ్రహిస్తాడు. సారాన్ని గ్రహించి పిప్పిని వదిలేస్తాడు. అలాగే, ప్రపంచంలో ప్రాణికోటి ఆచరించే కర్మలలోకూడా సకల కౌశలసారాన్ని అతడు గ్రహిస్తాడు. అదే కర్మసిద్ధాంతం.

కర్మణ్యేవాధికార స్తే మా ఫలేషు కదాచన,
మా కర్మఫలహేతుర్భూ ర్మా తే సంగోఽస్త్వకర్మణి.

పని చేయటంవరకే మన పని. దాని ఫలితంతో మనకు ప్రమేయం లేదు. ఫలాపేక్ష పనికిరాదు. నీవు చేసిన పని ఫలిస్తే, దానికి నీవు కర్తవు కావు. అలాగని పనిచెయ్యటమే మానే ప్రమాదం రాకూడదు. పనిమాత్రం చెయ్యాలి; ఫలితం సంగతి మరచిపోవాలి. ఫలించినా, అందులో నీ పురుషార్థం ఉందని భావించకూడదు. ఇదీ పనితనం. ఇదే కర్మయోగం. చేసినపని సిద్ధించనీ, సిద్ధించకపోనీ -- సమబుద్ధితో పని చేస్తే అదే సామ్యయోగం అవుతుంది. ఈ సమత్వమే యోగం. సమశబ్దానికి 'మయా సహ' (లక్ష్మితో కూడినది) అని అర్థం చెప్పుకుంటే, సమభావం విష్ణుభావంతో సమానమవుతుంది. ఫలాపేక్షతో చేసే కర్మ, నిష్కామకర్మముందు ఎందుకూ పనికిరాదు. కాబట్టి బుద్ధిమంతుడవై సమబుద్ధిని అలవరచుకొని, తాను చేసే కర్మ సామాన్యమైన కర్మకాక, యోగమనే భావంతో చేసినప్పుడే ఆ కర్మ సకర్మక మవుతుంది. సార్థక మవుతుంది. యోగమే పనిలోని పనితనం. కర్మలోని పరమార్థం. ఇలా కర్మఫలాపేక్ష వదలి, చేయవలసిన పనులను కర్తవ్యభావంతో చేసే బుద్ధిమంతులు జన్మబంధంనుంచి ముక్తిపొంది పరమపదాన్ని పొందుతారు. సాధారణంగా బంధహేతువైన కర్మ యోగబుద్ధితో ఆచరించినపుడు ముక్తికి దగ్గరిదారిగా మారగలదు. నిర్మలమైన అంతఃకరణంతో దారిలోని కల్మషాన్ని, మురికి కాలువలాంటి మోహాన్ని దాటితే, సారహీనమైన సంసారంమీద జాలి వేస్తుంది. విన్నవి, వినదగినవని అనుకొన్నవి -- అన్నీ చిన్న పిల్లల సల్లాపా లనిపిస్తాయి. ఇవన్నీ దాటి ఆత్మయోగాన్ని అందుకున్న తర్వాత బుద్ధి నిలబడుతుంది. మనస్సు నిర్మలమయినప్పుడు నిశ్చలంగా నిలబడుతుంది. అదే కర్మయోగం. స్థితప్రజ్ఞుని సమాధిస్థితి.

ఈ మాటలు విన్న అర్జునునికి ఆత్మజిజ్ఞాస ఉదయించింది. ఆత్మతత్త్వమంటే ఆసక్తి కలిగింది. మాయ, మోహం క్రమంగా తొలగిపోతున్నాయి. తాను సర్వస్వమని భావించిన శరీరానికి మించిన మరో స్థితి ఉన్నదని తెలియవచ్చింది. దానిని గురించి వివరంగా తెలుసుకుందామని కృష్ణుణ్ణి అడుగుతాడు.

స్థితప్రజ్ఞస్య కా భాషా? సమాధిస్థస్య కేశవ!
స్థితధీః కిం ప్రభాషేత? కిమాసీత వ్రజేత కిమ్?

"మహామోహాన్ని దాటి మహాసమాధిని సాధించిన స్థితప్రజ్ఞుడు ఎలా ఉంటాడు? అతన్ని ఎలా గుర్తించటం? అతడెలా మాట్లాడుతాడు? ఎలా కూర్చుంటాడు? ఎలా నడుస్తాడు?" ఈ ప్రశ్నలో అర్జునుడి మనస్తత్త్వంలో వచ్చిన మార్పు కనిపిస్తుంది. 'న యోత్స్యే' (నేను యుద్ధం చెయ్యను) అని స్పష్టంగా చెప్పి మారు పలకని పార్థుడు, గీతాచార్యుడు వివరించిన ఆత్మవైభవం వినగానే, తనకు తెలియని విషయాలు చాలా ఉన్నాయని గమనించి, వాటిని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. కాని శరీరంతో ఉండికూడా శరీరవ్యామోహాన్ని వదలి, ప్రాపంచిక పరిధులను అధిగమించి, నిశ్చలమైన ఆత్మతత్త్వంలో నిర్వికల్పమైన సమాధిని సాధించే మహనీయులు అసలున్నారా? ఉంటే వాళ్ళు ఎలా ఉంటారు? చూచేందుకు వాళ్లుకూడా మామూలు మనుష్యులే కదా? ఉప్పు, కర్పూరం చూచేందుకు ఒకటిగా ఉన్నా, రుచిలో వెంటనే పట్టిస్తాయి. అలాగే అందరిలో కొందరు పుణ్యాత్ములను ఎలా గుర్తించటం -- అనేది అర్జునుని సమస్య. దీనికి సమాధానంగా గీతాచార్యుడు సరిగా 18 శ్లోకాల్లో స్థితప్రజ్ఞుని రూపురేఖలను చిత్రకారునిలా నిరూపిస్తారు. ఈ 18 శ్లోకాల్లో గీతలోని 18 అధ్యాయాలు ఇమిడి ఉన్నట్టు తోస్తుంది. గీత సమగ్రంగా చదువలేనివాళ్ళు రెండవ అధ్యాయంలోని యీ చివరి శ్లోకాలను (55-72) చదువుకుంటే చాలు. అసలు స్థితప్రజ్ఞుడనే శబ్దమే గీతామాత మనకు ప్రసాదించిన పరమ రమణీయమైన పదరాజం.

"సామాన్యంగా మనస్సు ఇంద్రియముల వెంటబడి, వాటి కోరికలను తీరుస్తూ, అందులోనే ఆనందం ఉందని భ్రమపడి, నానావికారాలకు గురి అవుతుంటుంది. ఈ కోరికలు ఎంత తగ్గితే, మనస్సులో అంత నిలకడ ఏర్పడుతుంది. అవి పూర్తిగా మనస్సును వదలితే నిర్మలమైన మనస్సు శరీర వ్యామోహాన్ని వదలి, ఆత్మానందంవైపు ప్రసరిస్తుంది. ఆత్మ మనస్సుల సంయోగమే యోగం. ఎప్పటికప్పుడు ఉదయించే కోరికల అలజడిని పూర్తిగా

ఆపుకొని, తనలో తాను ఆనందించగలిగే స్థితికి తాను వచ్చినప్పుడు, అతని బుద్ధి (ప్రజ్ఞ) స్థిరపడుతుంది. అప్పుడే అతన్ని స్థితప్రజ్ఞుడంటారు. అయితే ఈ మార్పు లోలోపల జరుగుతుంది. బయటికి స్థితప్రజ్ఞుడని ఎలా తెలుస్తుంది? దానికి బాహ్యలక్షణాలను తెలుసుకొనటం అవసరం.

స్థితప్రజ్ఞుడైన మహనీయుడు కష్ట సమయంలో కుంగిపోడు, సుఖ సమ-యంలో పొంగిపోడు. విషాదంతో విలపించడు, ఆనందంతో మైమరచిపోడు. అనురాగం, భయం, కోపం అతణ్ణి సమీపించవు. బుద్ధి నిలబడినప్పుడు మనస్సు మౌనం వహిస్తుంది.

మేలు జరిగినా, కీడు జరిగినా తొణకడు. చలించడు. యువరాజయినా వనరాజయినా ప్రసన్నవదనంతో కర్మపరిపాకాన్ని అంగీకరించి, ఆనందంగా నిర్లిప్తంగా జీవితయాత్ర సాగిస్తాడు. తన మంచిని చూచి పొంగిపోడు. ఇతరుల దుష్ప్రవర్తనను చూచి ద్వేషించడు.

తాబేలు తన అవయవాలను తన చిప్పలో దాచుకున్నట్టు, తన ఇంద్రియములను ఇంద్రియార్థముల (శబ్ద స్పర్శ రూప రస గంధముల) నుండి ఉపసంహరించుకుంటాడు. వినికూడా విననట్టుంటాడు. చూచికూడా చూడనట్టుంటాడు. రసాస్వాదనపరుడైకూడా రసనిరపేక్షుడై ఉంటాడు.

ఇలా కళ్లు, చెవులు, ముక్కు, నాలుక మొదలయిన ఇంద్రియాలు బాహ్యవిషయాలను ఉపేక్షాభావంతో చూచేసరికి, క్రమంగా శబ్ద స్పర్శాదులకు విసుగుపుట్టి, ఇంద్రియములజోలికి వెళ్లటమే మానివేస్తాయి. అందాకా వచ్చి లాభంలేదని తిరిగి వెళతాయి. ఇలా శబ్దాది విషయాలన్నీ తిరిగి వెళ్ళిన తర్వాత, ఒక్క రసస్వరూపమైన ఆనందం మాత్రం యోగిలో మిగిలి ఉంటుంది. ఆత్మసాక్షాత్కారంవల్ల లభించే పరమానందాన్ని అనుభవించిన తర్వాత, ఆ రసంకూడా ఉడిగిపోతుంది. తరిగిపోతుంది. ఆత్మసాయుజ్యం జీవిత పరమావధి.

కాని, ఇలా ఇంద్రియాలను ఇంద్రియార్థాలనుంచి ఉపసంహరించు కోవటం అందరికీ సాధ్యం కాదు. గొప్ప గొప్ప తపస్సంపన్నులుకూడా

ఈ సాధనలో తప్పటడుగులు వేశారు. ఇంద్రియముల ప్రభావ మలాంటిది. ఉన్నట్టుండి మనస్సును స్వాధీనం చేసుకుంటాయి. ముని మనస్సులనుకూడా క్షణంలో హరించగల ఇంద్రియములను క్రమంగా వశపరచుకోవాలి.

బలవంతంగా మనస్సును తమవైపు లాగుకొనే ఇంద్రియాలను, యోగ బలంతో తనవైపు లాక్కొనిన పరమాత్మపరాయణులయిన పరమ యోగులే స్థితప్రజ్ఞులు. ఇంద్రియములు చెప్పిన మాట మనస్సు వినటం మానేస్తే, మనసు చెప్పిన మాట ఆత్మ వింటుంది. ఆత్మకూ, ఇంద్రియ గ్రామమైన శరీరానికీ మనస్సు మధ్యవర్తి. అనాత్మనుండి ఆత్మవైపు మనస్సు చేసే ప్రయాణమే యోగసాధన. ఆత్మపరాయణులే మహాత్ములు, స్థితప్రజ్ఞులు.

ఇంద్రియనిగ్రహం ఒకనాటితో వచ్చేదికాదు. దానికి మూలకారణం గమనించి, మొదటిలోనే వాటిని (విషయాలను) మొదలంట నిర్మూలించాలి. రమణీయమైన దృశ్యాలు, స్పృహణీయమైన శబ్దాలు, కమనీయ మైన వాసనలు, నోరూరే భక్ష్యభోజ్యాలు -- అన్నీ మనస్సును తమవైపు లాక్కొంటాయి. వాటినిగురించి ఆలోచిస్తేనే చాలు, వాటిపై ఆసక్తి ఏర్పడుతుంది. ఆసక్తివల్ల కోరిక లేర్పడుతాయి. కోరికలు తీరకపోతే కోపతాపాలు బయలుదేరుతాయి.

కోపం వచ్చినప్పుడు రూపమే మారిపోతుంది. మంచి చెడుగా, చెడు మంచిగా కనిపిస్తుంది. దానితో మతి చెడిపోతుంది. వివేకం నశిస్తుంది. వివేకంలేని జీవితం వ్యర్థమైపోతుంది. కాబట్టి విషయాసక్తి, విషయచింతన యీ విషవలయానికి కేంద్రం. దానిని అదుపులో పెట్టుకోవాలి.

కాని, ఆత్మకు విధేయుడై రాగద్వేషాలకు దూరంగా ఈ విషవలయంలో సంచరిస్తూ కూడా స్థితప్రజ్ఞుడు పరమానందాన్ని అనుభవిస్తాడు. అతని ఇంద్రియాలు మనస్సును హరించవు. ఆత్మను ఆరాధిస్తాయి. అమాయకమైన మనస్సును ఇంద్రియాలు నానావిధాల బాధిస్తాయి, వేధిస్తాయి. వివేకవంతమైన మనస్సు సాధ్యమైనంత త్వరలో ఈ బాధను ఆత్మకు నివేదించుకోవాలి. ఆ తర్వాత ఇంద్రియ నిగ్రహం ఆత్మబాధ్యత అవుతుంది.

ఈ పని ఎంత త్వరలో జరిగితే ఈశ్వరానుగ్రహం, భగవత్ ప్రసాదం అంత త్వరగా లభిస్తుంది. అది మహోన్నతమైన మనఃస్థితి.

ఈ ప్రసాదస్థితి నందుకొన్న తర్వాత దుఃఖ మనేదే ఉండదు. శోకమోహాలు సోకవు. అది ఒక రకమైన అశోకవాటిక. అక్కడ బుద్ధి చలించదు. ప్రసన్న పుణ్యమైన చైతన్యం ప్రమాద రహితంగా, ప్రమోద సహితంగా నిర్మలానందంతో నిండి నిబిడీకృతమై ఉంటుంది.

ఈ ప్రసన్న గంభీర మనఃస్థితిని అందుకొనటమే యోగం. ఈ యోగాన్ని సాధించినవాడు యుక్తుడు. కానివాడు అయుక్తుడు. అయుక్తుని బుద్ధి నిలబడదు. ఉన్నదనే భావం అతని మనస్సులో ఉదయించదు. ఆస్తిక్యభావం, సదసద్ వివేకం లేకుండా శాంతి లభించదు. శాంతి లేనిదే సౌఖ్యం లేదు. కాబట్టి ఆత్మయోగం (ఆత్మ మన స్సంయోగం) ఆత్మశాంతికి, శాశ్వత సుఖానికి పునాది.

అలాకాక, ఇష్టం వచ్చినట్లు సంచరించే ఇంద్రియ సంతతిని అనుసరించి, వాటి వెనువెంట మనస్సు పరుగిడుతూ ఉంటే ఇంద్రియములకు మనస్సు చులకన అవుతుంది. అవి మనస్సును, మేధస్సును తప్పుదారి పట్టిస్తాయి. గాలికి కొట్టుకొనిపోయే పడవలాగా అయుక్తుని ప్రజ్ఞ అనిర్దిష్టంగా తిరుగుతూ ఉంటుంది.

స్థితప్రజ్ఞత కావాలంటే ఇంద్రియములను ఇంద్రియార్థాలనుంచి మర లించాలి. ఇంద్రియ పరాయణుడుకూడా సుఖంగా ఉండవచ్చు. కాని, అది క్షణికమైన సుఖం. శాశ్వత సౌఖ్యం స్థితప్రజ్ఞునికే సాధ్య మవుతుంది.

లౌకికమయిన దృష్టితో చూస్తే సంయమంతో జీవితం గడిపే సాధ కుడు పిచ్చివాడుగా కనిపించవచ్చు. ఎదుట నున్న సుఖాన్ని పరిత్యజించి, కనిపించని రూపంకోసం, వినిపించని నాదం కోసం, రుచి తెలియని పాకంకోసం, అతిలోకపు సాధనకోసం పగలు రేయిగా, రేయి పగలుగా జీవిత మొక పోరాటంగా గడిపే యోగి, భోగుల దృష్టిలో పిచ్చివాడే, యోగికి పగలు, భోగికి రాత్రి; భోగికి పగలు, యోగికి రాత్రి.

సంసారి కోరికల వెంట పరుగిడుతాడు. కోరికలు సంస్కారిని ఆశ్రయించి వస్తాయి. ఆశ్రయించిన కోరికలను అనుమతించి హర్షించినా ఆత్మవంతుడయిన యోగి చలించడు. ఎన్ని నదులు సముద్రంలో కలిసినా, సముద్రం ఎప్పటిలాగే పరిపూర్ణంగా, నిశ్చలంగా, సుప్రతిష్ఠితంగా తన ఆనందంలో తాను మునిగి తేలుతూ ఉంటుంది. తన అలజడి తనది. ఎన్ని కోరికలు చెలరేగినా తొణకని యోగికి శాంతి లభిస్తుంది. కోరికలవెంట పరుగులు తీసే కామార్థికి శాంతి లభించదు.

అన్ని రకముల కోరికలను అంతఃకరణ శుద్ధితో పరిత్యజించి అహంకారానికీ, మమకారానికీ దూరమయిన శాంతికామునికే పరమశాంతి లభిస్తుంది.

ఈ స్థితిలో స్థితప్రజ్ఞుడు బ్రహ్మానందాన్ని అనుభవిస్తాడు. బ్రహ్మలో లీనమయి, తానే బ్రహ్మ అయి, బ్రహ్మభావంతో బాహ్యజగత్తును సమీక్షించే యీ బ్రాహ్మీస్థితి అవసానదశలో లభించినా చాలు, జన్మ తరిస్తుంది. శోకమోహాలకు అతీతమైన బ్రహ్మనిర్వాణం లభిస్తుంది.

ఇలా, బ్రహ్మసూత్రంతో శ్రీకృష్ణ పరబ్రహ్మ తన వాక్ప్రసూనాలను అల్లుకుంటూ పోతుంటే, అర్జునునికి అసలైన సందేహం వచ్చింది. ఒక వైపు యుద్ధం చెయ్యవలసిందని మందలిస్తూ, మరో వైపు ఆత్మసాయుజ్యాన్ని గురించి చెప్పే శ్రీకృష్ణ వాక్యాలు పార్థునికి సరిగా బోధపడలేదు. చేయవలసిన పని చెయ్యటం మంచిదా? లేక ప్రాపంచిక వ్యాసంగం మాని, పరమార్థాన్ని సాధించటం మంచిదా? అని అతనికి సందేహం వచ్చింది. ఒకసారి జ్ఞానం మంచిదనీ, మరోసారి కర్మ మంచిదనీ చెప్పి, నన్ను ఇబ్బంది పెట్టక, ఈ రెండింటిలో ఏది మంచిదో తేల్చి చెపితే, దాన్నే అనుసరిస్తానని అర్జును డడుగుతాడు. జ్ఞానమే శ్రేష్ఠమయితే, నన్నీ ఘోరకర్మ (యుద్ధం) చేసేందుకు ఎందుకు ప్రేరేపిస్తున్నావు? ఇదంతా గందరగోళంగా ఉంది. నాకు కచ్చితంగా ఒక మార్గం తెలుపవలసిందని పార్థుడు చాలా చనువుతో అడుగుతాడు. ఇలాంటి చిక్కు వస్తుందని కృష్ణుడికి తెలుసు. వెంటనే అవకాశాన్ని పురస్కరించుకొని, ప్రశస్తమైన కర్మమార్గాన్ని విడమరచి చెప్తాడు.

లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయానఘ!
జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్.

లోకంలో రెండు ప్రధానమైన మార్గా లున్నాయని నేను చెప్పాను. ఒకటి జ్ఞాన యోగం. రెండవది కర్మ యోగం. కర్మకాండతో ప్రమేయం లేకుండానే సమ్యగ్జ్ఞానంవల్ల ఆత్మసాయుజ్యం పొందటం మొదటి మార్గం. ఇది అందరికీ సాధ్యం కాదు. నియత కర్మలను ఆచరిస్తూ, సమ బుద్ధితో కర్మబంధంనుంచి ముక్తిని పొంది, ఆత్మసాక్షాత్కారం పొందటం రెండవ మార్గం. ఇది కర్మయోగులు అనుసరించే ప్రశస్తమార్గం. మొదటిది సాంఖ్యం. రెండవది యోగం. ఏ మార్గాన్ని అనుసరించినా చేయవలసిన పనులను చేయకుండా తప్పించుకునేందుకు వీల్లేదు. పనిమాత్రం చేసితీరాలి. పని చెయ్యకుండా జీవితంలో ఒక్కక్షణం కూడా సాగదు. పని చెయ్యటం ప్రతివ్యక్తికీ సహజం. కాని ఎలా చెయ్యాలి? అనేదే ప్రశ్న. ఏ భావంతో చేస్తే ఆ మార్గానికి చెందిన కర్మ అవుతుంది. సిసలైన కర్మసన్న్యాసం చేయవలసిన పని మానివెయ్యటం కాదు. పైకి కర్మేంద్రియములను అదుపులో పెట్టుకుని, మనస్సులో ఎప్పుడూ విషయవాసనలనే స్మరిస్తూ ఉండేకంటే, మనసును స్వాధీనం చేసుకుని, నిర్లిప్త భావంతో, ఆసక్తి లేకుండా చేయవలసిన పనులను చెయ్యటమే శ్రేయస్కరం. అసలు పనిచేయకుండా ఉండేకంటే ఏదో పని చెయ్యటం మంచిది. విహితమైన పనులు చెయ్యటం -- చెయ్యవలసిన పద్ధతిలో చెయ్యటం మరీ మంచిది. పని చెయ్యకపోతే జీవితమే సాగదు.

ఏ భావంతో చేస్తే చేసిన పని యోగమవుతుందో కొంచెం జాగ్రత్తగా గమనించాలి. తనకోసం కాకుండా, ఫలాపేక్ష లేకుండా, విషయ వాసనలపై మక్కువ పెంచుకోకుండా చేసిన పని సామాన్యమైన ఆచరణ కాక, అదొక యజ్ఞ మవుతుంది. ఒకే ఆత్మతత్త్వంనుంచి అనేక జీవకోటి ఎలా ఉదయించిందో, ఒక్కొక్కజీవి ఒక్కొక్క రకంగా ఎలా ప్రవర్తిస్తాడో, ఈ లీల కంతటికీ మూలకారణ మేమిటో అని ఆలోచించి, ఆ పదార్థాన్ని పసిగట్టేందుకు చేసే పనులు, తదర్థపు పను లవుతాయి. ఈ తదర్థ

కార్యమే పరమార్థాన్ని ప్రసాదించే పవిత్ర యజ్ఞం. ప్రజలను సృష్టించినప్పుడే ప్రజాపతి యీ యజ్ఞభావాన్ని కూడా వెలయించాడు. తత్పదార్థంనుంచి ఉదయించిన జీవులు పుట్టుకతోనే ఆ యత్పదార్థాన్ని గురించి ఆలోచించటం మొదలుపెడుతారు. ఎవరు? ఎవరిచేత? ఎవనియందు? ఎందుకు? అనే జిజ్ఞాస యజ్ఞకార్యానికి బీజం. యత్ -- పదార్థాన్ని తెలియజేసే యజ్ఞం, కామధేనువులా మనం కోరినదల్లా ప్రసాదిస్తుంది. ఏకాత్మ ప్రత్యయ సారమయిన పరమాత్మ, అనేకాత్మకంగా అసంఖ్యాక జీవరాశిలో ప్రవేశించి, 'కస్మై' (ఎవరికోసం), యస్మై (ఎవరికోసమయితే), తస్మై (వానికోసం) -- అనే జిజ్ఞాసను కలుగజేస్తాడు. యజ్ఞం చేయించేది దేవతలు, చేస్తే సంతోషించేదికూడా దేవతలే. ఇది అన్యోన్య సహకారంతో జరిగే సత్కార్యం. అచ్చం తనకోసం కాకుండా, ఇతరులకోసంకూడా చేసిన పనులన్నీ యజ్ఞం లాంటివే. ఇతరులకు ఆనందం పంచిపెట్టి అందరి ఆనందంలోనే తన ఆనందం కూడా ఉన్నదని భావించటమే, యజ్ఞంవల్ల లభించే యాదృచ్ఛికమైన ఆనందం. అలా యజ్ఞకార్యంలో మిగిలిన ప్రసాదం మనఃప్రసాదానికీ, ఆత్మోన్నతికీ కారణమవుతుంది. 'నా కాయుష్యం నా కారోగ్యం' అని అస్తమానం తన సంగతి తాను చూచుకునే ఆత్మపరాయణుడు భుజించే ఆహారం పాపపంకిలమై పోతుంది.

'చిన్ని నా పొట్టకు శ్రీరామరక్ష' -- అని ఏకాంతంగా పంచభక్ష్య పరమాన్నాలు తినేకంటే, నలుగురితోపాటు నాలుగు మెతుకులు తిన్నా చాలు. అసలీ అన్నం ఎలా వస్తున్నది? అని కాస్త యోచిస్తే ప్రపంచంలో సహజంగా వ్యాపించియున్న యజ్ఞభావం గోచరిస్తుంది. పంట పండితే అన్నం వస్తుంది. వర్షం కురిస్తే పంట పండుతుంది. నేలమీది నీరు ఆవిరిగా మారి మేఘాలు ఏర్పడితే వర్షం కురుస్తుంది. నీరు ఆవిరి కావాలంటే, ఆకాశంనుంచి సూర్యకిరణాలు భూమి మీదికి వచ్చి, నీటిని పైకి తీసుకొనిపోవాలి. భూమ్యాకాశాలు ఒకరి యోగక్షేమం మరొకరు ఇలా ఎందుకు చూచుకోవాలి? దేనిపాటి కది హాయిగా కాలక్షేపం చేస్తే ఏమవుతుంది? కాబట్టి ప్రజాపతి సృష్టిలో యజ్ఞభావం సహజంగా కూడి ఉన్నది. బ్రహ్మ యజ్ఞ స్వరూపుడు. ఈ బ్రహ్మసూత్రాన్ని గమనించకుండా

చేసిన పని కేవలం ఇంద్రియాలకు తృప్తి చేకూర్చుతుంది. ఇంద్రియ తృప్తితోపాటు, ఇంద్ర సంతృప్తినీ, భూతతృప్తినీ సాధించే కార్యం యజ్ఞకార్య మవుతుంది.

ఆత్మ బుద్ధితో చూస్తే, ఆత్మతత్త్వం తెలుసుకున్న ఆత్మ వంతులకు, ఏ పని చేయవలసిన అవసరమూ లేదు. చేసినందువల్ల సాధించగల ప్రయోజనం లేదు. చేయనందువల్ల జరిగే ప్రమాదమూ లేదు. ఒకరివల్ల వాళ్ళకు లభించే లాభమూ లేదు. నష్టమూ లేదు. కాని అలాంటి తత్త్వవేత్తలు కూడా పనిచెయ్యటం మానరు. వాళ్ళు చేసే పనులు లోక కల్యాణంకోసం పనికి వస్తాయి. ఆసక్తి లేకుండా, ఫలాపేక్షతో ప్రమేయం లేకుండా చేసిన సత్కర్మలు పరలోకానికి దారి చూపిస్తాయి. ఇహలోకానికి పనికివచ్చే పనులు అందరూ చేస్తారు. కాని పరలోకానికి ఉపకరించే పనులు ఆత్మవంతులే చేయగలరు.

జనకమహారాజులాంటివాళ్లు లోకసంగ్రహంకోసం -- పదిమంది మేలు కోసం -- నియతకర్మలను ఆచరించి, కర్మవల్లి ఇలా ఉండాలని మేలుబంతి వ్రాసి చూపించారు. గొప్పగొప్పవాళ్లు ఎలా చేస్తే, వాళ్లను చూచి సామాన్యులు నేర్చుకుంటారు. కాబట్టి ఆదర్శజీవితం గడిపే ఆత్మవంతులు, చాల మెలకువగా ప్రవర్తించాలి. తనకు పనిచేయవలసిన అవసరం లేకపోయినా కనీసం ఇతరులకోసమయినా చేసితీరాలి. మూడులోకాలను పాలించే నాకు (పరమాత్మకు) ఏ పని చేయవలసిన అవసరమూ లేదు. నాకు కావలసినదీ, లేనిదీ లేదు. కాని నేను పని చెయ్యటం మానివేస్తే ప్రపంచమంతా నిష్క్రియమైపోతుంది. చైతన్యం నశించిపోతుంది. కాబట్టి పండితులు, పామరులు అందరూ ఎవరికి తోచిన పని వాళ్ళు చేసితీరాలి. పండితులు రాగద్వేషాలు లేకుండా అనాసక్తితో చేస్తే, పామరులు విషయవాసనలకు లోనయి, అహంకారంతో చేస్తారు.

కాని, పండితులు పామరులను విమర్శించకూడదు. మీరు చేస్తున్నది మంచి పద్ధతి కాదని చెప్పరాదు. మమకారంతో, మక్కువతో, ఫలాపేక్షతో చేసేవాళ్లను అలాగే చెయ్యనిస్తూ ఉండాలి. ప్రకృతి సిద్ధంగా జరుగుతున్న

పనులకు తాము కర్తలమని వాళ్లు విఱ్ఱవీగుతుంటారు. తత్త్వవేత్త దీనికంతా తత్పదార్థమే కారణమని తెలుసుకుని, నిర్లిప్తభావంతో నియత కర్మలను ఆచరిస్తాడు. తప్పుదారి ననుసరించేవాళ్ళను దండించి మందలించేకంటే, తనమటుకు తాను సరియైన మార్గంలో నడిస్తే, దారి తప్పినవాళ్ళుకూడా క్రమంగా సరియైన దారికి వస్తారు. తెలిసినవాళ్లు తెలియనివాళ్ళకు తెలియచెప్పేకంటే, తాము తెలివిగా ప్రవర్తించటమే మంచిది. కాబట్టి, ఏ ఫలితాన్నికూడా ఆశించకుండా, మమకారానికి గురి కాకుండా తన విధ్యుక్త ధర్మమని యుద్ధం చెయ్యి. అది నీకు ఆరోగ్యకరమవుతుంది. శ్రద్ధతో పనిచేసే నిర్మలచేతస్కులను కర్మ బంధించదు. ప్రకృతి సిద్ధమైన పనులను అప్రమత్తతతో, అనాసక్తితో, స్వాధీనమనస్సుతో ఆచరిస్తే, నీ స్వధర్మమే నీకు నిశ్శ్రేయసం కూర్చగలదు. ఇతరులవలె నేను చేయలేకపోతున్నానని పరితపించవలసిన పని లేదు. తన ధర్మం తాను నిర్వర్తిస్తే చాలు. అంతఃకరణం పాప పుణ్యాలను నిర్ణయించే న్యాయాధికరణం. తాను చేసిన పని పదిమందితో చెప్పుకోగలిగితే, అది పుణ్యం. నలుగురితో చెప్పుకునేందుకు జంకితే, అది పాపం. ఈ దృష్టిలో పుణ్యమయినది స్వధర్మం. పాప మయినది పర ధర్మం. స్వధర్మంలో మరణించినా పరవాలేదు. పర ధర్మం చాల భయంకరమైనది.

మళ్లీ అర్జునుడికి మరో సందేహం వచ్చింది. ప్రకృతి సిద్ధంగా అందరూ మంచి పనులు చెయ్యాలనే అనుకుంటారు. కాని, తీరా చేసేప్పుడు చెడ్డ పనులే చెయ్యాలని అనిపిస్తుంది. ఎందువల్ల?

దీనికి పరమాత్మ చెప్పిన సమాధానంతో కర్మవల్లి ముగిసిపోతుంది. కామక్రోధాలు మనిషిని లొంగదీస్తాయి. కామార్తి, క్రోధావేశం జ్ఞానాన్ని కప్పివేస్తాయి. పొగ కమ్మిన నిప్పులాగా, దుమ్ము పట్టిన అద్దంలాగా, గర్భంలోని పిండంలాగా, కామక్రోధాలకు గురియైన జ్ఞానం ప్రకాశించదు. అందులో ముఖ్యంగా కామం ఇంద్రియాలను, మనస్సును, బుద్ధిని ఆవరించి, తనవశం చేసుకుంటుంది. కాబట్టి, ఇంద్రియాలను ముందు స్వాధీనం చేసుకోవాలి. అవి అన్నిటికంటే స్థూలమయినవి. ఇంద్రియాలు స్వాధీన

మయితే, ఇంద్రియార్థాలు -- శబ్ద స్పర్శ రూప రస గంధాలుకూడా స్వాధీనమయిపోతాయి. తర్వాత మనస్సు మనం చెప్పినట్లు నడుస్తుంది. మనస్సుకంటె సూక్ష్మమయిన బుద్ధి - వివేకం - ఆ తర్వాత విధేయత నలవరచుకుంటుంది. బుద్ధికి అతీతమయింది పరమాత్మ స్వరూపం. ఇలా ఇంద్రియములు స్వాధీనమయితే, అంచె లంచెలుగా పరమాత్మతత్త్వంవరకు ప్రవేశం లభిస్తుంది. కాబట్టి కామరూపంలో, ఇంద్రియాల్లో ప్రవేశించిన శత్రువును జయించు. కామాన్ని జయించినవాడు నిజమైన కర్మయోగి. కామాన్ని జయించాలంటే, కర్మ ఆచరించి తీరాలి. కర్మలను ఆచరిస్తూనే, కామాన్ని జయించాలి. కామి కానివాడు యోగి కాలేదు. యోగి కావాలంటే చేయవలసిన పనులను చేయవలసిన పద్ధతిలో చేసి తీరాలి.

* * *

# ధ్యానమ్

ఓం

పార్థాయ ప్రతిబోధితాం భగవతా నారాయణేన స్వయం
వ్యాసేన గ్రథితాం పురాణమునినా మధ్యే మహాభారతమ్,
అద్వైతామృతవర్షిణీం, భగవతీం, అష్టాదశాధ్యాయినీం
అంబ! త్వాం - అనుసందధామి భగవద్గీతే! భవద్వేషిణీమ్.

2

నమోఽస్తు తే వ్యాస! విశాల బుద్ధే!
ఫుల్లారవిందాయతపత్రనేత్ర!
యేన త్వయా భారతతైలపూర్ణః
ప్రజ్వాలితో జ్ఞానమయః ప్రదీపః.

3

ప్రపన్న పారిజాతాయ వేత్ర తోత్రైక పాణయే,
జ్ఞానముద్రాయ కృష్ణాయ గీతామృతదుహే నమః.

4

సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః,
పార్థో వత్సః, సుధీ ర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్.

5

వసుదేవసుతం దేవం కంస చాణూర మర్దనమ్,
దేవకీ పరమానందం కృష్ణం వందే జగద్గురుమ్.

6

భీష్మద్రోణ తటా జయద్రథ జలా గాంధార నీలోత్పలా
శల్య గ్రాహవతీ కృపేణ వహనీ కర్ణేన వేలాకులా,
అశ్వత్థామ వికర్ణ ఘోరమకరా దుర్యోధనావర్తినీ
సోత్తీర్ణా ఖలు పాండవై రణనదీ కైవర్తకే కేశవే.

7

పారాశర్య వచఃసరోజ మమలం, గీతార్థ గంధోత్కటం,
నానాఖ్యానక కేసరం, హరికథా సద్బోధనా బోధితమ్,
లోకే సజ్జన షట్పదై రహరహః పేపీయమానం ముదా
భూయా ద్భారతపంకజం, కలిమలప్రధ్వంసి నః శ్రేయసే.

8

మూకం కరోతి వాచాలం పంగుం లంఘయతే గిరిమ్,
యత్కృపా తమహం వందే పరమానంద మాధవమ్.

9

యం బ్రహ్మావరుణేంద్ర రుద్ర మరుతః స్తున్వంతి దివ్యైః స్తవైః
వేదైః సాంగపదక్రమోపనిషదై ర్గాయంతి యం సామగాః,
ధ్యానావస్థిత తద్గతేన మనసా పశ్యంతి యం యోగినః
యస్యాంతం న విదుః సురాసురగణా దేవాయ తస్మై నమః.

* * *

## ప్రథమోఽధ్యాయః

# అర్జునవిషాదయోగః

### ధృతరాష్ట్ర ఉవాచః

ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః,
మామకాః పాణ్డవాశ్చైవ కిమకుర్వత సఞ్జయ! 1

### సఞ్జయ ఉవాచః

దృష్ట్వాతు పాణ్డవానీకం వ్యూఢం దుర్యోధన స్తదా,
ఆచార్య ముపసఙ్గమ్య రాజా వచన మబ్రవీత్. 2

పశ్యైతాం పాణ్డుపుత్రాణా మాచార్య! మహతీం చమూమ్,
వ్యూఢాం ద్రుపదపుత్రేణ తవ శిష్యేణ ధీమతా. 3

అత్ర శూరా మహేష్వాసా భీమార్జునసమా యుధి,
యుయుధానో విరాటశ్చ ద్రుపదశ్చ మహారథః. 4

ధృష్టకేతు శ్చేకితానః కాశీరాజశ్చ వీర్యవాన్,
పురజి త్కున్తిభోజశ్చ శైబ్యశ్చ నరపుఙ్గవః. 5

యుధామన్యుశ్చ విక్రాన్తః ఉత్తమౌజాశ్చ వీర్యవాన్,
సౌభద్రో ద్రౌపదేయాశ్చ సర్వ ఏవ మహారథాః. 6

అస్మాకం తు విశిష్టా యే తాన్నిబోధ ద్విజోత్తమ!
నాయకా మమ సైన్యస్య సంజ్ఞార్థం తాన్ బ్రవీమి తే. 7

భవాన్ భీష్మశ్చ కర్ణశ్చ కృపశ్చ సమితిఞ్జయః,
అశ్వత్థామా వికర్ణశ్చ సౌమదత్తి స్తథైవ చ. 8

అన్యే చ బహవ శ్శూరా మదర్థే త్యక్తజీవితాః,
నానాశస్త్రప్రహరణా స్సర్వే యుద్ధవిశారదాః. 9

అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాభిరక్షితమ్,
పర్యాప్తం త్విదమేతేషాం బలం భీమాభిరక్షితమ్. 10

అయనేషు చ సర్వేషు యథాభాగ మవస్థితాః,
భీష్మ మేవాభిరక్షన్తు భవన్త స్సర్వ ఏవ హి. 11

తస్య సఞ్జనయ౯ హర్షం కురువృద్ధః పితామహః,
సింహనాదం వినద్యోచ్చై శ్శఙ్ఖం దధ్మౌ ప్రతాపవా౯. 12

తత శ్శఙ్ఖాశ్చ భేర్యశ్చ పణవానకగోముఖాః,
సహసైవాభ్యహన్యన్త స శబ్ద స్తుములోఽభవత్. 13

తతః శ్వేతై ర్హయై ర్యుక్తే మహతి స్యన్దనే స్థితౌ,
మాధవః పాణ్డవశ్చైవ దివ్యౌ శఙ్ఖౌ ప్రదధ్మతుః. 14

పాఞ్చజన్యం హృషీకేశో దేవదత్తం ధనఞ్జయః,
పౌణ్డ్రం దధ్మౌ మహాశఙ్ఖం భీమకర్మా వృకోదరః. 15

అనన్తవిజయం రాజా కున్తీపుత్రో యుధిష్ఠిరః,
నకుల స్సహదేవశ్చ సుఘోష మణిపుష్పకౌ. 16

కాశ్యశ్చ పరమేష్వాస శ్శిఖణ్డీ చ మహారథః,
ధృష్టద్యుమ్నో విరాటశ్చ సాత్యకి శ్చాపరాజితః. 17

ద్రుపదో ద్రౌపదేయాశ్చ సర్వశః పృథివీపతే!
సౌభద్రశ్చ మహాబాహు శ్శఙ్ఖా న్దధ్ముః పృథక్పృథక్. 18

స ఘోషో ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్,
నభశ్చ పృథివీం చైవ తుములో వ్యనునాదయన్. 19

అథ వ్యవస్థితాన్ దృష్ట్వా ధార్తరాష్ట్రాన్ కపిధ్వజః,
ప్రవృత్తే శస్త్రసమ్పాతే ధను రుద్యమ్య పాణ్డవః. 20

హృషీకేశం తదా వాక్య మిదమాహ మహీపతే!

అర్జున ఉవాచ:

సేనయో రుభయో ర్మధ్యే రథం స్థాపయ మేఽచ్యుత! 21

యావదేతా న్నిరీక్షేఽహం యోద్ధుకామా నవస్థితాన్,
కై ర్మయాసహ యోద్ధవ్య మస్మిన్ రణసముద్యమే. 22

యోత్స్యమానా నవేక్షేఽహం య ఏతేఽత్ర సమాగతాః,
ధార్తరాష్ట్రస్య దుర్బుద్ధే ర్యుద్ధే ప్రియచికీర్షవః. 23

సఞ్జయ ఉవాచ:

ఏవముక్తో హృషీకేశో గుడాకేశేన భారత!
సేనయో రుభయో ర్మధ్యే స్థాపయిత్వా రథోత్తమమ్. 24

భీష్మద్రోణప్రముఖత స్సర్వేషాం చ మహీక్షితామ్,
ఉవాచ పార్థ! పశ్యైతాన్ సమవేతాన్ కురూ నితి. 25

తత్రాపశ్యత్ స్థితా న్పార్థః పితౄనథ పితామహాన్,
ఆచార్యా న్మాతులా న్భ్రాతౄన్ పుత్రా న్పౌత్రా న్సఖీం స్తథా. 26

శ్వశురా న్సుహృదశ్చైవ సేనయో రుభయోరపి,
తా న్సమీక్ష్య స కౌన్తేయ స్సర్వాన్ బన్ధూ నవస్థితాన్. 27

కృపయా పరయావిష్టో విషీద న్నిదమబ్రవీత్,

అర్జున ఉవాచ:

దృష్ట్వేమం స్వజనం కృష్ణ! యుయుత్సుం సముపస్థితమ్. 28

సీదన్తి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి,
వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే. 29

గాణ్డీవం స్రంసతే హస్తా త్త్వక్చైవ పరిదహ్యతే,
న చ శక్నోమ్యవస్థాతుం భ్రమతీవ చ మే మనః. 30

నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ!
న చ శ్రేయోఽనుపశ్యామి హత్వా స్వజన మాహవే. 31

న కాంక్షే విజయం కృష్ణ! న చ రాజ్యం సుఖాని చ,
కిం నో రాజ్యేన గోవిన్ద! కిం భోగై ర్జీవితేన వా. 32

యేషా మర్థే కాంక్షితం నో రాజ్యం భోగా స్సుఖాని చ,
త ఇమేఽవస్థితా యుద్ధే ప్రాణాం స్త్యక్త్వా ధనానిచ. 33

ఆచార్యాః పితరః పుత్రా స్తథైవ చ పితామహాః,
మాతులా శ్శ్వశురాః పౌత్రా శ్శ్యాలా స్సమ్బన్ధిన స్తథా. 34

ఏతా న్న హన్తు మిచ్ఛామి ఘ్నతోఽపి మధుసూదన!
అపి త్రైలోక్యరాజ్యస్య హేతోః కిం ను మహీకృతే. 35

నిహత్య ధార్తరాష్ట్రాన్నః కా ప్రీతిస్స్యా జ్జనార్దన!
పాపమేవాశ్రయే దస్మా౯ హత్వైతా నాతతాయినః. 36

తస్మా న్నార్హా వయం హన్తుం ధార్తరాష్ట్రా న్స్వబాన్ధవాన్,
స్వజనం హి కథం హత్వా సుఖినస్స్యామ మాధవ! 37

యద్యప్యేతే న పశ్యన్తి లోభోపహతచేతసః,
కులక్షయకృతం దోషం మిత్రద్రోహే చ పాతకమ్. 38

కథం న జ్ఞేయ మస్మాభిః పాపాదస్మా న్నివర్తితుమ్,
కులక్షయకృతం దోషం ప్రపశ్యద్భి ర్జనార్దన! 39

కులక్షయే ప్రణశ్యన్తి కులధర్మా స్సనాతనాః,
ధర్మే నష్టే కులం కృత్స్న మధర్మోఽభిభవత్యుత. 40

అధర్మాభిభవా త్కృష్ణ! ప్రదుష్యన్తి కులస్త్రియః,
స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ! జాయతే వర్ణసంకరః. 41

సంకరో నరకాయైవ కులఘ్నానాం కులస్య చ,
పతన్తి పితరో హ్యేషాం లుప్తపిణ్డోదక క్రియాః. 42

దోషై రేతైః కులఘ్నానాం వర్ణ సఙ్కరకారకైః,
ఉత్సాద్యన్తే జాతిధర్మాః కులధర్మాశ్చ శాశ్వతాః. 43

ఉత్సన్న కులధర్మాణాం మనుష్యాణాం జనార్దన!
నరకే నియతం వాసో భవతీత్యనుశుశ్రుమ. 44

అహోబత మహత్పాపం కర్తుం వ్యవసితా వయమ్,
యద్రాజ్యసుఖలోభేన హన్తుం స్వజన ముద్యతాః. 45

యది మా మప్రతీకార మశస్త్రం శస్త్రపాణయః,
ధార్తరాష్ట్రా రణే హన్యు స్తన్మే క్షేమతరం భవేత్. 46

సఞ్జయ ఉవాచ:

ఏవ ముక్త్వార్జున స్సఙ్ఖ్యే రథోపస్థ ఉపావిశత్,
విసృజ్య సశరం చాపం శోక సంవిగ్నమానసః. 47

ఓం తత్సదితి

శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జునసంవాదే అర్జునవిషాదయోగో నామ
ప్రథమోఽధ్యాయః.

* * *

# ద్వితీయోఽధ్యాయః

# సాంఖ్యయోగః

సఞ్జయ ఉవాచ:

తం తథా కృపయావిష్ట మశ్రుపూర్ణాకులేక్షణమ్,
విషీదన్త మిదం వాక్య మువాచ మధుసూదనః. 1

శ్రీ భగవానువాచ:

కుతస్త్వా కశ్మలమిదం విషమే సముపస్థితమ్,
అనార్యజుష్ట మస్వర్గ్య మకీర్తికర మర్జున! 2

క్లైబ్యం మాస్మగమః పార్థ! నైతత్త్వయ్యుపపద్యతే,
క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరన్తప! 3

అర్జున ఉవాచ:

కథం భీష్మమహం సంఖ్యే ద్రోణం చ మధుసూదన!
ఇషుభిః ప్రతియోత్స్యామి పూజార్హా వరిసూదన! 4

గురూ నహత్వా హి మహానుభావాన్,
శ్రేయో భోక్తుం భైక్ష్య మపీహ లోకే,
హత్వార్థకామాంస్తు గురూ నిహైవ,
భుంజీయ భోగాన్ రుధిర ప్రదిగ్ధాన్. 5

న చైతద్విద్మః కతరన్నో గరీయో,
యద్వా జయేమ యదివా నో జయేయుః,
యానేవ హత్వా న జిజీవిషామః
తేఽవస్థితాః ప్రముఖే ధార్తరాష్ట్రాః. 6

కార్పణ్య దోషోపహత స్వభావః
పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః,
యచ్ఛ్రేయస్స్యా న్నిశ్చితం బ్రూహి తన్మే,
శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్. 7

నహి ప్రపశ్యామి మమాపనుద్యాత్
యచ్ఛోక ముచ్ఛోషణ మిన్ద్రియాణామ్,
అవాప్య భూమా వసపత్న మృద్ధం
రాజ్యం సురాణామపి చాధిపత్యమ్. 8

సఞ్జయ ఉవాచః

ఏవముక్త్వా హృషీకేశం గుడాకేశః పరన్తపః
న యోత్స్య ఇతి గోవిన్ద ముక్త్వా తూష్ణీం బభూవ హ. 9

త మువాచ హృషీకేశః ప్రహసన్నివ భారత!
సేనయో రుభయో ర్మధ్యే విషీదన్త మిదం వచః. 10

శ్రీ భగవానువాచః

అశోచ్యా నన్వశోచ స్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే,
గతాసూ నగతాసూంశ్చ నానుశోచన్తి పణ్డితాః. 11

న త్వేవాహం జాతు నాసం న త్వం నేమే జనాధిపాః,
న చైవ న భవిష్యామ స్సర్వే వయ మతః పరమ్. 12

దేహినోఽస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా,
తథా దేహాన్తరప్రాప్తి ర్ధీర స్తత్ర న ముహ్యతి. 13

మాత్రాస్పర్శాస్తు కౌన్తేయ! శీతోష్ణసుఖదుఃఖదాః,
ఆగమాపాయినోఽనిత్యా స్తాం స్తితిక్షస్వ భారత! 14

యం హి న వ్యథయన్త్యేతే పురుషం పురుషర్షభ!
సమదుఃఖసుఖం ధీరం సోఽమృతత్వాయ కల్పతే. 15

నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః,
ఉభయోరపి దృష్టోఽన్త స్త్వనయో స్తత్త్వదర్శిభిః. 16

అవినాశి తు తద్విద్ధి యేన సర్వమిదం తతమ్,
వినాశ మవ్యయస్యాస్య న కశ్చి త్కర్తుమర్హతి. 17

అన్తవన్త ఇమే దేహా నిత్యస్యోక్తా శ్శరీరిణః,
అనాశినోఽప్రమేయస్య తస్మాద్యుధ్యస్వ భారత! 18

య ఏనం వేత్తి హన్తారం యశ్చైనం మన్యతే హతమ్,
ఉభౌ తౌ న విజానీతో నాయం హన్తి న హన్యతే. 19

న జాయతే మ్రియతే వా కదాచి
న్నాయం భూత్వాభవితా వా న భూయః,
అజో నిత్య శ్శాశ్వతోఽయం పురాణో
న హన్యతే హన్యమానే శరీరే. 20

వేదావినాశినం నిత్యం య ఏన మజ మవ్యయం,
కథం స పురుషః పార్థ! కం ఘాతయతి? హన్తి కమ్? 21

వాసాంసి జీర్ణాని యథా విహాయ
నవాని గృహ్ణాతి నరోఽపరాణి,
తథా శరీరాణి విహాయ జీర్ణా
న్యన్యాని సంయాతి నవాని దేహీ. 22

నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః,
న చైనం క్లేదయన్త్యాపో న శోషయతి మారుతః. 23

అచ్ఛేద్యోఽయ మదాహ్యోఽయ మక్లేద్యోఽశోష్య ఏవ చ,
నిత్య స్సర్వగతః స్థాణు రచలోఽయం సనాతనః. 24

అవ్యక్తోఽయ మచిన్త్యోఽయ మవికార్యోఽయముచ్యతే,
తస్మాదేవం విదిత్వైనం నానుశోచితు మర్హసి. 25

అథ చైనం నిత్యజాతం నిత్యం వా మన్యసే మృతమ్,
తథాపి త్వం మహాబాహో! నైవం శోచితు మర్హసి. 26

జాతస్య హి ధ్రువో మృత్యు ర్ధ్రువం జన్మ మృతస్య చ,
తస్మా దపరిహార్యేఽర్థే న త్వం శోచితు మర్హసి. 27

అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత!
అవ్యక్తనిధనాన్యేవ తత్ర కా పరిదేవనా. 28

ఆశ్చర్యవత్పశ్యతి కశ్చి దేన
మాశ్చర్యవద్వదతి తథైవ చాన్యః,
ఆశ్చర్యవచ్చైన మన్య శ్శృణోతి
శ్రుత్వాప్యేవం వేద న చైవ కశ్చిత్. 29

దేహీ నిత్య మవధ్యోఽయం దేహే సర్వస్య భారత!
తస్మా త్సర్వాణి భూతాని న త్వం శోచితు మర్హసి. 30

స్వధర్మమపి చావేక్ష్య న వికమ్పితు మర్హసి,
ధర్మ్యాద్ధి యుద్ధా చ్ఛ్రేయోఽన్యత్ క్షత్రియస్య నవిద్యతే. 31

యదృచ్ఛయా చోపపన్నం స్వర్గద్వార మపావృతమ్,
సుఖినః క్షత్రియాః పార్థ! లభన్తే యుద్ధ మీదృశమ్. 32

అథ చే త్త్వమిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి,
తత స్స్వధర్మం కీర్తిం చ హిత్వా పాప మవాప్స్యసి. 33

అకీర్తించాపి భూతాని కథయిష్యన్తి తేఽవ్యయామ్,
సంభావితస్య చాకీర్తి ర్మరణా దతిరిచ్యతే. 34

భయా ద్రణా దుపరతం మన్యన్తే త్వాం మహారథాః,
యేషాం చ త్వం బహుమతో భూత్వా యాస్యసి లాఘవమ్. 35

అవాచ్యవాదాంశ్చ బహూ న్వదిష్యన్తి తవాహితాః,
నిన్దన్త స్తవ సామర్థ్యం తతో దుఃఖతరం ను కిమ్. 36

హతో వా ప్రాప్స్యసి స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్,
తస్మా దుత్తిష్ఠ కౌన్తేయ! యుద్ధాయ కృతనిశ్చయః. 37

సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ,
తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాప మవాప్స్యసి. 38

ఏషా తేఽభిహితా సాఙ్ఖ్యే బుద్ధి ర్యోగే త్విమాం శృణు,
బుద్ధ్యా యుక్తో యయా పార్థ! కర్మబన్ధం ప్రహాస్యసి. 39

నేహాభిక్రమనాశోఽస్తి ప్రత్యవాయో న విద్యతే,
స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్. 40

వ్యవసాయాత్మికా బుద్ధి రేకేహ కురునన్దన!
బహుశాఖా హ్యనన్తాశ్చ బుద్ధయోఽవ్యవసాయినామ్. 41

యా మిమాం పుష్పితాం వాచం ప్రవదన్త్యవిపశ్చితః,
వేదవాదరతాః పార్థ! నాన్యదస్తీతి వాదినః. 42

కామాత్మాన స్స్వర్గపరా జన్మకర్మఫలప్రదామ్,
క్రియావిశేష బహులాం భోగైశ్వర్యగతిం ప్రతి. 43

భోగైశ్వర్య ప్రసక్తానాం తయాపహృతచేతసామ్,
వ్యవసాయాత్మికా బుద్ధి స్సమాధౌ న విధీయతే. 44

త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున!
నిర్ద్వన్ద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్. 45

యావా నర్థ ఉదపానే సర్వత స్సంప్లుతోదకే,
తావా న్సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః. 46

కర్మణ్యేవాధికార స్తే మా ఫలేషు కదాచన,
మా కర్మఫలహేతు ర్భూ ర్మా తే సఙ్గోஉస్త్వకర్మణి. 47

యోగస్థః కురు కర్మాణి సఙ్గం త్యక్త్వా ధనంజయ!
సిద్ధ్యసిద్ధ్యో స్సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే. 48

దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగా ద్ధనంజయ!
బుద్ధౌ శరణ మన్విచ్ఛ కృపణాః ఫలహేతవః. 49

బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృత దుష్కృతే,
తస్మా ద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్. 50

కర్మజం బుద్ధియుక్తా హి ఫలం త్యక్త్వా మనీషిణః,
జన్మబన్ధ వినిర్ముక్తాః పదం గచ్ఛ న్త్యనామయమ్. 51

యదా తే మోహకలిలం బుద్ధి ర్వ్యతితరిష్యతి,
తదా గన్తాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ. 52

శ్రుతివిప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా,
సమాధా వచలా బుద్ధి స్తదా యోగ మవాప్స్యసి. 53

అర్జున ఉవాచః

స్థితప్రజ్ఞస్య కా భాషా? సమాధిస్థస్య కేశవ!
స్థితధీః కిం ప్రభాషేత? కి మాసీత? వ్రజేత కిమ్? 54

శ్రీ భగవానువాచః

ప్రజహాతి యదా కామా న్సర్వా న్పార్థ! మనోగతాన్,
ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞ స్తదోచ్యతే. 55

దుఃఖే ష్వనుద్విగ్నమనా స్సుఖేషు విగతస్పృహః,
వీతరాగభయక్రోధ స్థ్సితధీ ర్ముని రుచ్యతే. 56

య స్సర్వత్రానభిస్నేహ స్తత్తత్ప్రాప్య శుభాశుభమ్,
నాభినన్దతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా. 57

యదా సంహరతే చాయం కూర్మోఽఙ్గానీవ సర్వశః,
ఇన్ద్రియాణీన్ద్రియార్థేభ్య స్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా. 58

విషయా వినివర్తన్తే నిరాహారస్య దేహినః,
రసవర్జం రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే. 59

యతతో హ్యపి కౌన్తేయ! పురుషస్య విపశ్చితః,
ఇన్ద్రియాణి ప్రమాథీని హరన్తి ప్రసభం మనః. 60

తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః,
వశే హి యస్యేన్ద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా. 61

ధ్యాయతో విషయాన్పుంస స్సఙ్గ స్తేషూపజాయతే,
సఙ్గా త్సంజాయతే కామః కామా త్క్రోధోఽభిజాయతే. 62

క్రోధా ద్భవతి సమ్మోహ స్సమ్మోహా త్స్మృతివిభ్రమః,
స్మృతిభ్రంశా ద్బుద్ధినాశో బుద్ధినాశా త్ప్రణశ్యతి. 63

రాగద్వేష వియుక్తైస్తు విషయా నిన్ద్రియై శ్చరన్,
ఆత్మవశ్యై ర్విధేయాత్మా ప్రసాద మధిగచ్ఛతి. 64

ప్రసాదే సర్వదుఃఖానాం హాని రస్యోపజాయతే,
ప్రసన్న చేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతే. 65

నాస్తి బుద్ధి రయుక్తస్య న చాయుక్తస్య భావనా,
న చాభావయత శ్శాన్తి రశాన్తస్య కుతస్సుఖమ్. 66

ఇన్ద్రియాణాం హి చరతాం యన్మనోఽనువిధీయతే,
తదస్య హరతి ప్రజ్ఞాం వాయు ర్నావ మివామ్భసి. 67

తస్మాద్యస్య మహాబాహో! నిగృహీతాని సర్వశః,
ఇన్ద్రియాణీన్ద్రియార్థేభ్య స్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా. 68

యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ,
యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః. 69

ఆపూర్యమాణ మచల ప్రతిష్ఠం
    సముద్ర మాపః ప్రవిశన్తి యద్వత్,
తద్వత్కామా యం ప్రవిశన్తి సర్వే
    స శాన్తి మాప్నోతి న కామకామీ. 70

విహాయ కామా న్య స్సర్వా౯ పుమాం శ్చరతి నిస్స్పృహః,
నిర్మమో నిరహంకార స్స శాన్తి మధిగచ్ఛతి. 71

ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థ! నైనాం ప్రాప్య విముహ్యతి,
స్థిత్వాఽస్యామన్తకాలేఽపి బ్రహ్మనిర్వాణ మృచ్ఛతి. 72

ఓం తత్సదితి

శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జునసంవాదే సాఙ్ఖ్యయోగో నామ
ద్వితీయోఽధ్యాయః.

* * *

## తృతీయోఽధ్యాయః

# కర్మయోగః

అర్జున ఉవాచ:

జ్యాయసీ చేత్కర్మణస్తే మతా బుద్ధి ర్జనార్దన!
తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి కేశవ! 1

వ్యామిశ్రేణేవ వాక్యేన బుద్ధిం మోహయసీవ మే,
తదేకం వద నిశ్చిత్య యేన శ్రేయోఽహ మాప్నుయామ్. 2

శ్రీ భగవానువాచ:

లోకేఽస్మి న్ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయానఘ!
జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్. 3

న కర్మణా మనారమ్భా న్నైష్కర్మ్యం పురుషోఽశ్నుతే,
న చ సన్న్యసనాదేవ సిద్ధిం సమధిగచ్ఛతి. 4

న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠ త్యకర్మకృత్,
కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజై ర్గుణైః. 5

కర్మేన్ద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్,
ఇన్ద్రియార్థా న్విమూఢాత్మా మిథ్యాచార స్స ఉచ్యతే. 6

యస్త్విన్ద్రియాణి మనసా నియమ్యారభతేఽర్జున!
కర్మేన్ద్రియైః కర్మయోగ మసక్త స్స విశిష్యతే. 7

నియతం కురు కర్మ త్వం కర్మజ్యాయో హ్యకర్మణః,
శరీరయాత్రాఽపి చ తే న ప్రసిద్ధ్యే దకర్మణః. 8

యజ్ఞార్థా త్కర్మణోఽన్యత్ర లోకోఽయం కర్మబన్ధనః,
తదర్థం కర్మ కౌన్తేయ! ముక్తసఙ్గ స్సమాచర. 9

సహయజ్ఞాః ప్రజా స్సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః,
అనేన ప్రసవిష్యధ్వ మేషవోఽస్త్విష్టకామధుక్. 10

దేవా న్భావయతానేన తే దేవా భావయన్తు వః,
పరస్పరం భావయన్త శ్శ్రేయః పర మవాప్స్యథ. 11

ఇష్టా న్భోగా న్హి వో దేవా దాస్యన్తే యజ్ఞ భావితాః,
తై ర్దత్తా నప్రదాయైభ్యో యో భుంక్తే స్తేన ఏవ సః. 12

యజ్ఞశిష్టాశిన స్సన్తో ముచ్యంతే సర్వకిల్బిషైః,
భుఞ్జతే తే త్వఘం పాపా యే పచన్త్యాత్మకారణాత్. 13

అన్నా ద్భవన్తి భూతాని పర్జన్యా దన్న సమ్భవః,
యజ్ఞా ద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మసముద్భవః. 14

కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షరసముద్భవమ్,
తస్మా త్సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్. 15

ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయతీహ యః,
అఘాయు రింద్రియారామో మోఘం పార్థ! స జీవతి. 16

యస్త్వాత్మరతి రేవ స్యా దాత్మతృప్తశ్చ మానవః,
ఆత్మన్యేవ చ సన్తుష్ట స్తస్య కార్యం న విద్యతే. 17

నైవ తస్య కృతేనార్థో నాకృతేనేహ కశ్చన,
న చాస్య సర్వభూతేషు కశ్చి దర్థవ్యపాశ్రయః. 18

తస్మా దసక్త స్సతతం కార్యం కర్మ సమాచర,
అసక్తో హ్యాచర న్కర్మ పరమాప్నోతి పూరుషః. 19

కర్మణైవ హి సంసిద్ధి మాస్థితా జనకాదయః,
లోకసంగ్రహమేవాపి సంపశ్య న్కర్తు మర్హసి. 20

యద్య దాచరతి శ్రేష్ఠ స్తత్తదేవేతరో జనః,
స యత్ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే. 21

న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన,
నా నవాప్త మవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి. 22

యది హ్యహం న వర్తేయం జాతు కర్మ ణ్యతంద్రితః,
మమ వర్త్మానువర్తన్తే మనుష్యాః పార్థ! సర్వశః. 23

ఉత్సీదేయు రిమే లోకా న కుర్యాం కర్మ చేదహమ్,
సంకరస్య చ కర్తా స్యా ముపహన్యా మిమాః ప్రజాః. 24

సక్తాః కర్మ ణ్యవిద్వాంసో యథా కుర్వంతి భారత!,
కుర్యా ద్విద్వాం స్తథాఽసక్త శ్చికీర్షు ర్లోక సఙ్గ్రహమ్. 25

న బుద్ధిభేదం జనయే దజ్ఞానాం కర్మసఙ్గినామ్,
జోషయే త్సర్వకర్మాణి విద్వా న్యుక్త స్సమాచరన్. 26

ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః,
అహంకారవిమూఢాత్మా కర్తాఽహమితి మన్యతే. 27

తత్త్వవిత్తు మహాబాహో! గుణకర్మ విభాగయోః,
గుణా గుణేషు వర్తన్త ఇతి మత్వా న సజ్జతే. 28

ప్రకృతే ర్గుణసమ్మూఢా స్సజ్జన్తే గుణకర్మసు,
తా నకృత్స్నవిదో మన్దాన్ కృత్స్నవి న్నవిచాలయేత్. 29

మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మచేతసా,
నిరాశీ ర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః. 30

యే మే మత మిదం నిత్య మనుతిష్ఠన్తి మానవాః,
శ్రద్ధావన్తోఽనసూయన్తో ముచ్యన్తే తేఽపి కర్మభిః. 31

యే త్వేతదభ్యసూయన్తో నానుతిష్ఠన్తి మే మతమ్,
సర్వజ్ఞానవిమూఢాం స్తా న్విద్ధి నష్టా నచేతసః. 32

సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతేర్ జ్ఞానవానపి,
ప్రకృతిం యాన్తి భూతాని నిగ్రహః కిం కరిష్యతి. 33

ఇన్ద్రియస్యేన్ద్రియస్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ,
తయో ర్న వశమాగచ్ఛే త్తౌ హ్యస్య పరిపన్థినౌ. 34

శ్రేయా న్స్వధర్మో విగుణః పరధర్మా త్స్వనుష్ఠితాత్,
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః. 35

అర్జున ఉవాచ:

అథ కేన ప్రయుక్తోఽయం పాపం చరతి పూరుషః,
అనిచ్ఛన్నపి వార్ష్ణేయ! బలాదివ నియోజితః. 36

శ్రీ భగవానువాచ:

కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః,
మహాశనో మహాపాప్మా విద్ధ్యేన మిహ వైరిణమ్. 37

ధూమేనావ్రియతే వహ్ని ర్యథాఽఽదర్శో మలేన చ,
యథోల్బేనావృతో గర్భ స్తథా తేనేదమావృతమ్. 38

ఆవృతం జ్ఞానమేతేన జ్ఞానినో నిత్యవైరిణా,
కామరూపేణ కౌన్తేయ! దుష్పూరేణానలేన చ. 39

ఇన్ద్రియాణి మనో బుద్ధి రస్యాధిష్ఠానముచ్యతే,
ఏతై ర్విమోహయ త్యేష జ్ఞానమావృత్య దేహినమ్. 40

తస్మా త్త్వ మిన్ద్రియాణ్యాదౌ నియమ్య భరతర్షభ!
పాప్మానం ప్రజహి హ్యేనం జ్ఞానవిజ్ఞాన నాశనమ్. 41

ఇన్ద్రియాణి పరాణ్యాహు రిన్ద్రియేభ్యః పరం మనః,
మనసస్తు పరా బుద్ధి ర్యో బుద్ధేః పరతస్తు సః. 42

ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సంస్తభ్యాత్మానమాత్మనా,
జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్. 43

ఓం తత్సదితి
శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జునసంవాదే కర్మయోగో నామ
తృతీయోఽధ్యాయః.

కర్మవల్లి సమాప్తం.

* * *

ఓం

# గీతామృతం

## జ్ఞానవల్లి : తెలిసి చెయ్యాలి


| | | | |
|---|---|---|---|
| అధ్యా. | 4 | : | జ్ఞాన యోగం |
| ,, | 5 | : | కర్మసన్న్యాస యోగం |
| ,, | 6 | : | ఆత్మసంయమ యోగం |
| ,, | 7 | : | విజ్ఞాన యోగం |

# తెలిసి చెయ్యాలి

కామరహితమైన (నిష్కామ) కర్మ చేసితీరాలని తీర్మానించి, దానికి కావలసిన జ్ఞానబలాన్ని చేకూర్చేందుకు త్రిలోకజ్ఞుడయిన గోవిందుడు తన సనాతనతత్త్వాన్ని వివరిస్తూ అంటాడు.

ఇమం వివస్వతే యోగం ప్రోక్తవా నహ మవ్యయమ్,
వివస్వా న్మనవే ప్రాహ మను రిక్ష్వాకవేఽబ్రవీత్.

"ఈ యోగశాస్త్రం ఈనాటిది కాదు. మొట్టమొదట నే నీ యోగాన్ని సకలలోకనివాసి అయిన వివస్వంతునికి(సూర్యునికి ) చెప్పాను. కాంతికాయుడైన సూర్యుడు కొన్నాళ్ళ తర్వాత ఈ యోగాన్ని ఆలోచనాపరుడైన వైవస్వతమనువుకు చెప్పాడు. మనువునుండి మహారాజులు, రాజర్షులు, ఇక్ష్వాకు వంశ నరేశులు క్రమంగా ఈ విద్యను సాధించారు. కాని, ఆరంభంలో నేను చెప్పిన రహస్యం కాలంతోపాటు చాలా మార్పుచెంది ఈనాటి రాజకీయాల్లో నలిగిపోతున్నది. మళ్ళీ నాకు ఇష్టుడు, భక్తుడు అయిన అధికారివి నీవు దొరికావు కాబట్టి, యీ రహస్య విజ్ఞానాన్ని నీకు ఈనాడు చెప్పాను."

దీనితో పార్థుని ఒళ్ళు పులకరించింది. కొంత ఆనందంతో, మరికొంత ఆశ్చర్యంతో, ఇంతవరకు కృష్ణుణ్ణి తన ఆత్మబంధువుగా, ఆప్తమిత్రునిగానే భావిస్తున్న అర్జునుడు ఈ మాటలు నమ్మలేక పోయాడు. "నిన్న మొన్నటివాడవయిన నీవు, ఎప్పుడో వివస్వంతుడైన భాస్కరునికి యోగశాస్త్రం చెప్పానంటావే, ఇది ఎలా నమ్మటం?" అని చనువుగా అడుగుతాడు.

కృష్ణుడు గంభీరంగా బదులు చెప్తాడు: "ఇలాంటి జన్మలు నేను చాలా ఎత్తాను. నీవుకూడా ఇంతకుముందు ఎన్నిసార్లో పుట్టావు. కాని, అవన్నీ నీకు తెలియవు; నాకు తెలుసు. అంతే భేదం. నిజంగా చెప్పాలంటే నాకసలు జన్మే లేదు. జననం లేదు; కాబట్టి మరణంకూడా లేదు. అవ్యయమైన ఆత్మయోగంతో అఖిలాండ కోటిని పాలిస్తూ ఉంటాను. ఈ లోకపాలనలో ఒక భాగంగా అప్పుడప్పుడూ నా సృష్టిని పర్యవేక్షించుకునేందుకు ప్రపంచ

పర్యటనకై బయలుదేరుతుంటాను. యోగమాయను పురస్కరించుకుని మనుష్య రూపంలో అవతరిస్తాను. కాని, ఎప్పుడోగాని అలా బయలుదేరను.

యదా యదా హి ధర్మస్య గ్లాని ర్భవతి భారత!
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్.

భారతీయులలో (వెలుగునుకోరే జీవకోటిలో) ధర్మం లోపించి అధర్మం వ్యాపించినప్పుడు, నా ఆత్మ ప్రపంచంలో అవతరిస్తుంది. దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించటమే నా అవతారంయొక్క ఆశయం. ప్రతియుగంలో ఉదయిస్తాను. ద్వంద్వాత్మకమైన భావజగత్తులో ప్రతిక్షణం ఉదయిస్తాను. స్థూలరూపంలో నన్ను ఎప్పుడో కాని చూడలేరు. కాని, సూక్ష్మరూపంలో భావనారాయణమూర్తిగా నేను భక్తులకు అనుదినం కనిపిస్తూనే ఉంటాను. ఎవరు, ఎక్కడ, ఎప్పుడు స్మరిస్తే, వాళ్ళకు అక్కడ అప్పుడే ప్రత్యక్షమవుతాను. ఆత్మలో మనస్సు లయించిన క్షణమే నాకు యుగం.

ఇలా నా పుట్టు పూర్వోత్తరాలలోని దివ్యరహస్యాన్ని సమగ్రంగా తెలుసుకున్న ధన్యజీవులకు పునర్జన్మ ఉండదు. నన్ను తెలుసుకున్న జీవి నాలోనే లయించి పరమపదాన్ని పొందుతాడు. ఇలా నాలో చేరవలెనంటే రాగద్వేషాలు పోవాలి. (మృత్యు)భయం తొలగాలి. కోపం శాంతించాలి. ప్రపంచమంతా పరమేశ్వర సాన్నిధ్యంతో పరిపూర్ణమై ఉన్నదనే పూజ్యభావం ఏర్పడాలి. ఇదే జ్ఞానతపస్సు. జ్ఞానమార్గంలో నన్ను ఆరాధించినా, కర్మమార్గంలో సేవించినా నాకు భేదమేమీ లేదు. మార్గమేదయినా, గమ్యం నేనయితే నాలో చేరటం సాధ్యమవుతుంది. నన్ను ఎలా సమీపిస్తే అలాగే నేను వాళ్ళను దగ్గర తీస్తాను. ఒక విధంగా చూస్తే ప్రత్యక్షంగానో పరోక్షంగానో అందరూ నా మార్గాన్ని అనుసరించేవాళ్ళే. ఏదో ఒకనాటికి నన్ను చేరటం తథ్యం.

కాని, లేనిపోని కోరికలకు లొంగిపోయి, చిన్న చిన్న సుఖాలకోసం చిల్లర దేవతల నారాధించటంవల్ల, నా బిడ్డలు అనేకమార్గాల్లో తిరుగుతుం

టారు. వాళ్ళ గుణగణాలనుబట్టి, చేసే పనుల మంచిచెడ్డలనుబట్టి వాళ్ళ ముఖంలో వన్నెలు మారుతూ ఉంటాయి. ఈ వర్ణ విచక్షణ నేను కల్పించానని వాళ్ళనుకుంటూ ఉంటారు. ఇందులో నేను చేసిందేమీలేదు. ఎవరి సంస్కారంకొద్ది వాళ్ళ వర్చస్సులో హెచ్చుతగ్గులు, మెరుగుతరుగులు కనిపిస్తూ ఉంటాయి. ఈ వర్ణభేదం గుణకర్మలవల్ల వచ్చిందేకాని, పుట్టుకతో వచ్చింది కాదు. ఎవరి వర్ణానికి వాళ్ళే కర్తలు.

"నేను చేసే పనులు నావల్ల జరుగుతున్నాయే కాని, నేను చేయటం లేదు. వాటి ఫలితంతో నాకు ప్రమేయంలేదు -- అనే సర్వస్వ భావంతో, పారమార్థికదృష్టితో తెలిసి చేసిన పనులు జీవిని బంధించవు. ఇలా చేయవలసిన పనులను ఎందుకు చేయాలో, ఎలా చేయాలో, చేస్తున్న దెవరో, చేయిస్తున్నదెవరో వివరంగా విమర్శించుకొని, సమగ్రంగా తెలిసి చేసి తరించిన మహనీయులు ఎందరో ఇంతకుముందు ఆత్మసాయుజ్యం పొందారు. ఏది కర్మ? ఏది అకర్మ? ఈ కర్మ విచారంలో మహామహులు కూడా మహామోహానికి గురి అవుతారు. ఆ రహస్యం తెలిస్తే కీడు తొలగి మేలు చేకూరుతుంది."

కర్మ, వికర్మ, అకర్మ - మూడు రకాలుగా కర్మపద్ధతి ఉంటుంది. ఈ మూడింటినీ బుద్ధిమంతుడు బోధపరచుకోవాలి. కర్మ రహస్యం చాలా నిగూఢమైనది. కాని, నిర్మలమైన అంతఃకరణంతో ఆలోచిస్తే అవలీలగా అర్థమవుతుంది. చేయవలసిన పనులన్నీ సక్రమంగా చేస్తూకూడా చేయ-నట్టుగా, చేయకుండానే చేసినట్టుగా భావించగలిగిన భావయోగి నిజమైన కర్మయోగి. ఇది జ్ఞానయుక్తమైన కర్మలోని అంతర్యం. ఇలా కర్మరహస్యాన్ని తెలిసి చేసిన వ్యక్తి అన్నీ చేసినా ఏమీ చేయనట్టే; ఏమీ చేయకపోయినా అన్నీ చేసినట్టే. ఇది ఎలా సాధ్యమవుతుంది? కొంచెం జాగ్రత్తగా ఆలోచించాలి.

తెలివి గలిగిన యోగికూడా అందరిలాగానే పని చేస్తాడు. కాని యీ పని తాను చేస్తున్నానని భావించడు. చేయవలెననికూడా మొండిపట్టు పట్టడు. భగవత్సంకల్పం -- అని పని ప్రారంభిస్తాడు. ఆ పనివల్ల జరిగే పర్యవసానం, లభించే ఫలితం, సాధించే ప్రయోజనం అంతా భగవంతునిదే. కర్తృత్వంతో

కాని, భోక్తృత్వంతో కాని తనకేమీ ప్రమేయం లేదు. అలా చేసిన పని తెలివితో సాధించిన కర్మయోగమయి కర్మబంధాన్ని తొలగించివేస్తుంది. జ్ఞానంలో కర్మ విలీనమైపోతుంది. చేసిన పనికంటే, పని చేయించిన వివేకానికి విలువ హెచ్చుతుంది. ఫలాపేక్ష లేనప్పుడు పని నెరవేరిన తర్వాత రావలసిన ఆనందం పని చేసేప్పుడే లభిస్తుంది. ఎక్కడి కక్కడికే తృప్తి. ఒకరిమీద ఆధారపడవలసిన ప్రమేయం లేదు. అలా తెలివితో చేసిన పని చేసినా చేయనట్టే అవుతుంది. కర్మ అకర్మ అవుతుంది. అలాగే పని చెయ్యకపోయినా, పనివల్ల సాధించే ప్రయోజనం -- వివేకలాభం - సహజంగానే ఏర్పడిఉంది. కాబట్టి చేసినట్టే అవుతుంది. అకర్మకూడా విశిష్టమైన వికర్మ అవుతుంది. కర్మయోగి సాధించే జ్ఞానయోగ మిది.

విషయవాసనలకు లొంగక, భోగలాలసతో పొంగక, ఆశలకు అమ్ముడు పోక, మనస్సును స్వాధీనపరచుకొని చేయవలసిన పనులను తనకోసం కాక, తనువుకోసం చేసే కర్మయోగిని కర్మబంధించలేదు. ఎప్పుడు ఏది లభిస్తే దానితో తృప్తి పొందుతాడు. రాగ ద్వేషాలకు గురికాని మనస్సులో మాత్సర్యానికి తావు లేదు. తలపెట్టిన కార్యం ఫలించినా ఫలించకపోయినా పొంగడు. క్రుంగడు. జ్ఞానంతో కూడిన కర్మ సర్వసంగపరిత్యాగంకంటేకూడా సులభంగా ముక్తిని సాధించగలదు. యజ్ఞ (యత్-జ్ఞ) భావంతో తెలిసి చేసిన కర్మ తెలివిలో లయించిపోతుంది.

ప్రపంచమంతా యజ్ఞమయం. బ్రహ్మ యజ్ఞస్వరూపుడు. యజ్ఞం చేసేవాడు బ్రహ్మ, చేయించేవాడు బ్రహ్మ. ఆహుతి బ్రహ్మ, హవిస్సు నందుకునేవాడు బ్రహ్మ. బ్రహ్మస్వరూపుడైన యజమాని బ్రహ్మరూపమైన హవిస్సును అగ్నిరూపంలో ఉన్న బ్రహ్మకు బ్రహ్మభావంతో అర్పిస్తున్నాడు. జ్ఞానం, కర్మ అంతా బ్రహ్మార్పణం. బ్రహ్మార్పణమని చేసే కార్యకలాపమంతా బ్రహ్మమయమే. ఇలాంటి బ్రహ్మభావం ప్రతియజ్ఞంలో కనిపిస్తుంది.

ఆత్మసమర్పణ యజ్ఞంలోని మూలభావం. త్యాగం ఒకటే అమృతత్వాన్ని సాధిస్తుంది. తన కిష్టమైనదానిని, ఒకదానిని అర్పించటంలో యజ్ఞభావం ఉంది. కొందరు పరమాత్మస్వరూపులైన దేవతలకు యజ్ఞ

ద్రవ్యాన్ని అర్పిస్తారు. కొందరు బ్రహ్మనే అగ్నిగా భావించి యజ్ఞాన్ని బ్రహ్మకు అర్పిస్తారు. అంటే తాము చేసిన సత్కర్మలను స్వామికి అర్పిస్తారు. కొందరు యజ్ఞాన్ని యజ్ఞానికే అర్పిస్తారు. 'ఎక్కడ చేసింది అక్కడితో సరి' అనేభావం ఈ యజ్ఞసూత్రం. కొందరు కళ్లు, చెవులు, ముక్కు మొదలైన ఇంద్రియాలను సంయమాగ్నిలో వ్రేల్చి యజ్ఞం చేస్తారు. కొందరు శబ్ద స్పర్శ రూప రస గంధాలను వాటికి సంబంధించిన ఇంద్రియాలకు అర్పిస్తారు. కొందరు సకలేంద్రియ వ్యాపారాన్నీ, పంచప్రాణాలనూ జ్ఞానంచేత ప్రజ్వలింపజేయబడిన ఆత్మసంయమమనే అగ్నికుండంలో ఆహుతి చేస్తారు. కొందరు ప్రాణాన్ని అపానానికి అర్పిస్తారు. కొందరు అపానాన్ని ప్రాణానికి అర్పిస్తారు. కొందరు ప్రాణాపానాలను అరికట్టి ప్రాణాయామం చేస్తారు. కొందరు ధనం వెచ్చించి యజ్ఞం చేస్తారు. కొందరు జ్ఞానాన్ని ఆర్జించి అర్పిస్తారు. జ్ఞానం సంపాదించటం ఒక యజ్ఞం. పంచి పెట్టటం మరో యజ్ఞం. తపస్సొక యజ్ఞం. యోగసాధన ఒక యజ్ఞం. ఆకలిని అరికట్టి జఠరానలాన్ని యోగానలంగా మార్చటం ఒక యజ్ఞం. ప్రాణాలను ప్రాణాలకు అర్పించటం ఒక యజ్ఞం. ఇలా ఎన్నిరకాల యజ్ఞాలో ప్రపంచంలో ఉన్నాయి. త్యాగభావాన్ని పెంపొందించే ఏ సత్కర్మ అయినా యజ్ఞమే. ఇతరులకు పెట్టి తాను తినవలెననే భావం యజ్ఞం. తాను తింటే చాలు ననుకొనటం యజ్ఞాన్ని ధ్వంసంచేసే రాక్షసప్రవృత్తి. అన్ని యజ్ఞాలకూ కర్మానుష్ఠానం మూలం. పనిచేయాలి. కాని తెలిసి చెయ్యాలి. త్యాగబుద్ధితో చెయ్యాలి. యజ్ఞభావంతో చెయ్యని పనులు ఇహలోకంలోనే ఫలించవు. పరలోకందాకా వెళ్ళనక్కరలేదు. లోకాభ్యుదయం కోసం లోకనాయకుడు సృష్టించిన అన్ని యజ్ఞాలలో జ్ఞానయజ్ఞం సర్వోత్తమమయింది.

కర్మలను జ్ఞానాగ్నిలో వ్రేల్చి కర్మఫలాన్ని పూర్తిగా పరిహరించటమే జ్ఞానయజ్ఞం. తెలిసి చేసిన మంచి పనులన్నీ జ్ఞానయజ్ఞం కిందికి వస్తాయి. కాని, జ్ఞానం ఎలా లభిస్తుంది? జ్ఞానవంతుల అనుగ్రహంవల్ల లభిస్తుంది. వినయంతో నమస్కరించి, శ్రద్ధగా అడిగి తెలుసుకుంటే తెలియని విషయాలు తెలుస్తాయి. ఆత్మతత్త్వం తెలిపిన ద్రష్టలు శ్రద్ధాభక్తులను ఆదరిస్తారు. తెలుసుకొనవలెననే ఉత్సాహం నిజంగాఉంటే తెలియకపోవటం అనేది

ఉండదు. తెలియవలసినది తెలిసిన తర్వాత పొరబడటం (మోహం) ఉండదు. అందరిలో ఉన్న ఆత్మతత్త్వమే తనలో కూడా ఉన్నదనే చిదంబరరహస్యం క్షణంలో తెలిసిపోతుంది. ఇది చదివి తెలుసుకునేది కాదు. విని అర్థం చేసుకోవాలి. కాని ఆనందించాలి. జ్ఞానమనే నౌక దొరికితే ఘోరమయిన సంసారసముద్రాన్ని కూడా అవలీలగా దాటవచ్చు. క్షణికమైన జ్ఞానోదయం జన్మజన్మాంతరాలనుండి పేరుకొనిపోయిన అజ్ఞానాంధకారాన్ని తొలగిస్తుంది. జ్ఞానాగ్ని ఏ రవ్వంత సోకినా కర్మబంధం దూదిలా భస్మమైపోతుంది. జ్ఞానంతో సరితూగగల పవిత్ర వస్తువు ప్రపంచంలో లేదు. సమత్వమనే కర్మయోగాన్ని సాధించి ఆరితేరిన ఆత్మవంతునకు కాలక్రమంలో ఎప్పుడో జ్ఞానామృతం లభిస్తుంది. శ్రద్ధ, భక్తి, సంయమం -- ఈ మూడింటితో జ్ఞానాన్ని సంపాదించవచ్చు. అశ్రద్ధ, అవజ్ఞ, సంశయం ఈ మూడు జ్ఞానానికి గర్భశత్రువులు. అస్తమానం అనుమానించే క్షుద్రజీవికి ఇహలోకం, పరలోకం -- రెండూ దూరమే. సమత్వమనే యోగంలో సకల కర్మలను సన్న్యసించి, జ్ఞానమనే ఖడ్గంతో సందేహాలను ఛేదించి, ఆత్మతత్త్వాన్ని అవగాహన చేసుకున్నవానికి కర్మబంధం ఉండదు.

"కాబట్టి అన్నిసందేహాలను మాని, జ్ఞానంతో అజ్ఞానాన్ని పారద్రోలి యోగాన్ని సాధించు. యుద్ధాన్ని సాగించు" -- అని గీతాచార్యుడు తన జ్ఞానామృతంతో పార్థుణ్ణి జ్ఞానలోకానికి తీసుకవెళ్ళుతాడు. కాని, వెంటనే యుద్ధం చెయ్యవలసిందే -- అని జ్ఞాపకం చేస్తాడు.

దీనితో అర్జునుడు అడిగిన ప్రశ్ననే మరికొంత సూటిగా అణకువతో అడుగుతాడు. 'కర్మసన్న్యాసమని కొంతసేపు, కర్మయోగమని కొంతసేపు చెప్తున్నావు. ఈ రెంటిలో ఏది మంచిదో నికరంగా తేల్చి చెప్పు' అంటాడు. అడిగినదే అడిగేందుకు అర్జునుడికి విసుగు లేదు. చెప్పిందే చెప్పేందుకు కృష్ణునికీ చిరాకు లేదు. కాని, ఎన్నిసార్లు చెప్పినా ఏదో క్రొత్త మాట చెపుతున్నట్టే ఉంటుంది. గీతామృతంలోని గేయమాధుర్య మది.

సన్న్యాసం, కర్మయోగం రెండూ మంచివే. రెండూ కైవల్యాన్ని ఇస్తాయి. కాని ఈ రెంటిలో ఏది మంచిదని అడిగావు కాబట్టి, కర్మ

సన్న్యాసం కంటే కర్మయోగమే మంచిదని ఖచ్చితంగా చెప్పవలసివచ్చింది. కాని, సన్న్యాసాన్నిగురించి అపోహలే ఎక్కువ. రాగద్వేషాలకు దూరంగా ఉండి కష్ట సుఖాలను, లాభ నష్టాలను, మానావమానాలను సమానంగా చూడగలవాడే నిజమైన సన్న్యాసి. నిత్య సన్న్యాసి. ఈ దృష్టితో ఆలోచించి చూస్తే సన్న్యాసికీ, నిష్కామ కర్మయోగికీ భేదమే లేదు. ఎవరికీ కర్మబంధం లేదు. ఇద్దరూ ముక్తులే. కనీసం ముక్తికి యోగ్యులే. జ్ఞానయోగులు ఉపాసించే సాంఖ్యం వేరనీ, కర్మయోగులు సాధించే యోగం వేరనీ భావించే అల్పజ్ఞులకు అసలువిషయం తెలియదు. లేనిపోని భేదాలతో దేనికీ కొరగాని పరిస్థితికి దారితీసే వితండవాదా లివి. నిజంగా పండితులయిన యోగ్యులు రెంటినీ సమదృష్టితో చూస్తారు. ఇద్దరి ధ్యేయం ఒకటే, గమ్యం ఒకటే. మార్గాలు వేరు.

కర్మసన్న్యాసం కష్టసాధ్యమయిన మార్గం. కర్మయోగాన్ని అనుసరించి వెళ్ళితే గమ్యాన్ని త్వరగా చేరుకోవచ్చు. ఇంద్రియములను వశపరచుకొని, ఆత్మశక్తితో కోరికలను జయించి, నిర్మలమైన అంతఃకరణంతో అందరిలో తనన్నూ, తనలో అందరినీ చూచుకొనగల కర్మయోగికి, అచిరకాలంలోనే కర్మబంధం తొలగిపోతుంది. ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది. ముక్తి లభిస్తుంది. ఏ పని చేస్తున్నా చేస్తున్నది తాను కాదనే భావంతో చేయుటంవల్ల, చేసిన పనులు వాసనలు అతనికి సోకవు. 'కళ్ళు చూస్తున్నాయి, చెవులు వింటున్నాయి, చేతులు తాకుతున్నాయి, ముక్కులు వాసన చూస్తున్నాయి, నోరుతింటున్నది, కాళ్ళు నడుస్తున్నాయి -- ఇలా అన్ని ఇంద్రియాలూ వాటి పని అవి చేస్తున్నాయి గాని, నేనేం చేయటంలేదు' -- అనే అకర్మ భావన కర్మబంధంనుంచి ముక్తిని ప్రసాదిస్తుంది. ఏమి జరిగినా అది ఈశ్వరేచ్ఛ అనుకోవటం, తాను చేసిన సాధనను ఈశ్వరార్పణం -- అని భావించటంవల్ల, తామరాకు నీటికి తడవకుండా ఉన్నట్లే, కర్మయోగి కర్మతో ప్రమేయం లేకుండా వ్యవహరిస్తాడు. కేవలం ఆత్మశుద్ధికోసం అతను పనిచేస్తాడు. మనస్సు, వాక్కు, క్రియ -- అన్నీ వాటి పని అవి చేసుకుంటూపోతాయి. కర్మయోగి కేవలం సాక్షీభూతుడై ఉంటాడు. అందువల్ల అతనికి పరమశాంతి లభిస్తుంది. అతను చేసే ప్రతిపనికూడా

పరమేశ్వరారాధనే. శరీరం అన్ని పనులు చేస్తున్నా మనస్సు నిర్లిప్తంగా నిర్విచారంగా తొమ్మిది వాకిళ్ళ మహాపురంలో విశ్రమిస్తూ ఉంటుంది. శారీరకంగా అత డన్నిపనులు చేస్తున్నా మానసికంగా ఏమీ చేయనట్టే. స్వభావసిద్ధంగా జరుగుతున్న పనులను నిరపేక్షభావంతో అంతరాత్మతోపాటు అతనుకూడా చూస్తూఉంటాడు. పాప పుణ్యాలు, మంచి చెడ్డలు -- ఇవన్నీ ఆత్మకు సంబంధించినవి కావు. మనస్సే వీటికి కారణం. బంధమోక్షాలకు కూడా మనస్సే కారణం. కాబట్టి, మనస్సును ఆత్మలో లీనంచేసి కర్మల నాచరించినా, సన్న్యసించినా అత డాత్మయోగి అవుతాడు.

ఆత్మయోగికి జ్ఞానం, కర్మ పరస్పర సహకారిగా తోస్తాయి. జ్ఞానోదయంచేత అజ్ఞానం నశిస్తుంది. చీకటి పోగానే వెలుతురు వచ్చి సూర్యోదయం అయినట్టు, అజ్ఞానం నశించగానే జ్ఞానం ప్రకాశిస్తుంది. కర్మయోగికూడా జ్ఞానం వల్లనే ముక్తి పొందుతాడు. కాని, కర్మసన్న్యాసికంటె కర్మయోగికి జ్ఞానోదయం సులభంగా అవుతుంది. తత్త్వబుద్ధితో తాదాత్మ్యభావంతో తన్మయుడై చేసిన పనులు అతనికి జన్మరాహిత్యాన్ని సహజంగా చేకూర్చుతాయి. ఆత్మజ్ఞానానికి ఏర్పడే సమభావం కర్మయోగికికూడా ఆచరణపూర్వకంగా సిద్ధిస్తుంది. పండితులు, చండాలురు, ఆవులు, ఏనుగులు, కుక్కలు -- అన్నీ అతని దృష్టికి సమానమే. అందరిలో పరబ్రహ్మస్వరూపం అతనికి గోచరిస్తుంది. సమత్వం, దోషరాహిత్యం పరబ్రహ్మకు లక్షణాలు. కర్మయోగికికూడా ఇవి సహజగుణాలు కాబట్టి, సమబుద్ధిని సాధించిన యోగి పరబ్రహ్మతో సమైక్యభావాన్ని పొందుతాడు. ఇష్టమైనవి చూచి మురిసిపోతాడు. ఇష్టం కానివి చూచి ఏవగించుకోడు. బ్రహ్మవేత్త పొందిన బ్రాహ్మీస్థితిలో అతని మనస్సు దేనికీ చలించదు. ఏ విషయంలో పొరబడదు. బాహ్యవిషయాలలో అతనికి ఆనందం లేదు. అతడు పొందే ఆనందం అంతరంగంనుంచి ఉదయిస్తుంది. శబ్ద స్పర్శ రూప రస గంధాలతో ఇంద్రియసంపర్కంవల్ల లభించే ఆనందం క్షణికం. దుఃఖమే దానికి పర్యవసానం. మొదలు, తుద కలిగిన సుఖ మేదయినా సరే, దుఃఖానికే దారితీస్తుంది. అనాది, అనంతమైన శాశ్వతసుఖమే చిరంతనానందాన్ని ప్రసాదించగలుగుతుంది.

కాని, ఇంద్రియజన్యసుఖం ఎంత క్షణభంగురమైనా, మనసు దానివైపే మాటిమాటికి వెళ్ళుతుంది. దానిని మరల్చటం చాల కష్టం. కాని, అలా మరల్చగలిగినవాడికే నిజమైన సుఖం లభిస్తుంది. బహిర్ముఖమైన దృష్టి అంతర్ముఖమైతేనేకాని లోపలి వెలుగు కనిపించదు. లోపలి వెలుగు చూచి లోపలి ఆనందాన్ని చవిచూచిన తర్వాత అంతటా బ్రహ్మపదార్థమే గోచరిస్తుంది. బ్రహ్మ కానిది ప్రపంచంలో ఏదీ కనిపించదు. అంతటా పరబ్రహ్మస్వరూపాన్ని సాక్షాత్కరించుకొని, తానుకూడా బ్రహ్మననే భావాన్ని అనుభవసిద్ధంగా అవగాహన చేసికొనటమే బ్రహ్మనిర్వాణం. సకల చరాచరసృష్టిని సమభావంతో చూడగలిగిన ఋషులకే యీ బ్రాహ్మీస్థితి లభిస్తుంది. పాపబుద్ధి, ద్వైతభావం పూర్తిగా నశించిన కర్మయోగులకుకూడా ఈ బ్రాహ్మీస్థితి సిద్ధిస్తుంది. జ్ఞానులు అంతస్సాధనతో దీనిని సాధిస్తే, కర్మ యోగులు నిత్య కర్మానుష్ఠానంలో నెమ్మదిగా ఈ పదవిని పొందుతారు. కామక్రోధాదులకు గురికాని కర్మయోగులు, ప్రాణాయామ పరాయణులైన బ్రహ్మర్షులు ఒకే లక్ష్యాన్ని చేరుకుంటారు. అదే బ్రహ్మనిర్వాణం, పరమశాంతి, నిశ్శ్రేయసం.

ఫలాపేక్ష లేకుండా చేయువలసిన పనులను చేసే కర్మయోగికీ, సన్న్యాసికీ భేదమే లేదు. కేవలం కర్మసన్న్యాసంవల్ల జ్ఞానం లభించదు. కర్మసన్న్యాసంకంటే కర్మఫలసన్న్యాసం గొప్పది. సంకల్పరాహిత్యం రెంటికీ సామాన్య లక్షణం. సంకల్పరాహిత్యం లేకుండా ఫలాపేక్షను వదలటం సాధ్యంకాదు. సాంఖ్యయోగి సంకల్పరాహిత్యంతో మొదలుపెట్టి నిర్వికల్ప సమాధిని పొందుతాడు. కర్మయోగి కూడా సంకల్పరాహిత్యంతోనే ఆరంభించి, అందరి లోనున్న ఆత్మతత్త్వాన్ని చూచి దానిలో లీనమైపోతాడు. యోగమార్గంలో ప్రవేశించేవరకే జ్ఞానానికీ, కర్మకూ వ్యత్యాసం కనిపిస్తుంది. యోగస్థితిని అధిరోహించిన తర్వాత ఇద్దరూ యోగారూఢులే. యోగమనేది ఇద్దరికీ కావలసిన మార్గం. జ్ఞానయుక్తమైన కర్మ సాధించగల యోగం సర్వోత్కృష్టమైనది. యోగారూఢుడైన తర్వాత కర్మయోగికికూడా కర్మలతో ప్రయోజనం లేదు. కర్మల స్థానంలో శమదమాది సాధన సంపత్తి ప్రవేశిస్తుంది. అప్పుడు జ్ఞానివలె అతనుకూడా సర్వ సంకల్ప సన్న్యాసాన్ని అవలంబిస్తాడు. ఆత్మబలంతోనే అతనికీ ఉన్నతస్థితి లభిస్తుంది. ఈ

యోగాన్ని ఆత్మసంయమయోగ మనవచ్చు. తనను తాను అదుపులో పెట్టుకున్నందువల్లనే తాను యోగారూఢుడు అవుతాడు. యోగస్థాయిని అందుకుంటాడు. దీనికి ఇతరు లెవ్వరూ సాయం చేయలేరు. దారి చూపగలరు. కాని ఆ దారిలో పురోగమించవలసినది తానే. తనకు తానే చేయూత నిచ్చుకోవాలి. తనకు తానే మిత్రుడు. తనకు తానే శత్రువు. తనకు తానే గురువు. తన సంగతి తానే చూచుకోవాలి. రాగద్వేషాలు, కోపతాపాలు, విషయ వాసనలు -- అన్నీ శాంతించిన తర్వాత భూతాత్మ పూతాత్మగా మారి, పరమాత్మస్వరూపాన్ని ప్రత్యక్షంగా ప్రపంచమంతటా చూడగలుగుతుంది. అప్పుడు శీతోష్ణాలు, సుఖదుఃఖాలు అతణ్ణి బాధించవు. తిట్టినా కొట్టినా అతడు చలించడు. తనలోని తెలివికి, తనదైన వెలుగుకు అతను లోలోపల మురిసికొని పోతుంటాడు. మట్టి పెళ్ళకూ, మణి కాంచన హారాలకూ అతని దృష్టిలో భేద ముండదు. అతనికి స్నేహితులు లేరు. విరోధులు లేరు. బంధువులు లేరు. పరాయివాళ్లు లేరు. మంచివాళ్ళు లేరు. చెడ్డవాళ్ళు లేరు. అతని దృష్టికి అందరూ సమానులే.

ఈ సమదృష్టి యోగసాధనవల్లకూడా లభిస్తుంది. నిష్కామకర్మ యోగంవల్లకూడా సాధ్యమవుతుంది. కర్మయోగికూడా కొంత వికాసాన్ని పొందిన తర్వాత యోగసాధన చెయ్యవచ్చు. అందువల్ల గమ్యస్థానం త్వరగా చేరవచ్చు. యోగసాధనకు ఏకాంతస్థలం అనుకూలంగా ఉంటుంది. ఏకాంత మంటే కేవలం ఒంటరితనం కాదు. శరీరం పదిమంది మధ్యలో ఉన్నా, మనస్సు ఏకాంతాన్ని అనుభవించవచ్చు. అలాగే నిర్జనప్రదేశంలో ఉండికూడా మనస్సులో రకరకాల చీకులూ, చిరాకులూ ప్రవేశించి, అంతరంగం కీకార ణ్యంగా తయారవచ్చు. కాబట్టి శారీరికంగానే కాక, మానసికంగాకూడా యోగసాధనకు ఏకాంతం అవసరం. అలాంటి ఏకాంతంలో నివసించే యోగి, మనస్సును విషయవాసనలనుండి మరల్చి, ఆత్మలో లీనం చేసుకోగలుగు తాడు. పరిశుభ్రమైన పరిసరాలుకూడా యోగసాధనకు సహకరిస్తాయి. సుఖమైన ఆసనం, నిలకడగా ప్రశాంతంగా కూర్చొనగలిగే పద్ధతిని అలవర చుకోవాలి. పద్మాసనం అన్నింటికి అనుకూలమైన ఆసనం. అంత ఎత్తున కాకుండా, మరీ క్రింద కాకుండా దర్భాసనం, దానిమీద జింకచర్మం,

దానిమీద సన్నని వస్త్రం సర్వసామాన్యంగా వాడగలిగిన ఆసనం. మంచి స్థలంలో, మంచి మనసుతో, మంచి మంచి ఆలోచనలతో ఆత్మశుద్ధికి ప్రయత్నించాలి. ఏకాగ్రత కుదిరేందుకు ఇంద్రియనిగ్రహం, చిత్తవృత్తి నిరోధం అవసరం. నడుమునుండి మెడవరకు ఉండే మధ్యభాగం, శిరస్సు, మెడ ఒకేవరుసలో ఉండేట్టు నిలకడగా కూర్చుని, అటూ ఇటూ చూడకుండా, తన ముక్కు (ఇతరుల ముక్కు కాదు)చివరిభాగాన్ని తదేకదృష్టితో చూస్తూ, బ్రహ్మభావాన్ని ధ్యానిస్తూఉంటే, క్రమంగా మనస్సు నిలబడుతుంది. నిగ్రహం కుదురుతుంది. పరమ నిర్వాణం, శాశ్వత శాంతి చేకూరుతుంది.

ఇలా యోగసాధన చేసేవాళ్ళు ఎక్కువగా తినకూడదు. అసలు తినకుండాకూడా ఉండకూడదు. ఎక్కువగా నిద్రపోకూడదు. పూర్తిగా మేల్కొని జాగరణకూడా చెయ్యకూడదు. మితంగా భుజించి, మితంగా నిదురించి, మితంగా మాట్లాడేవాళ్ళకే యోగం సాధ్య మవుతుంది. ఇలా క్రమంగా యోగసాధనలవల్ల మనస్సు స్వాధీనమై ఆత్మలో లీనమైనపుడు, ఎప్పటివలె చలించదు. గాలి వీచనిచోట దీపం నిలబడినట్టు, విషయవాసనలు ప్రవేశించని చోట మనస్సు స్థిరంగా నిలబడుతుంది. ఆత్మతో కూడిన మనస్సు ఆత్మానందాన్ని అనుభవించి, తనలో తాను తన్మయమైపోతుంది. బాహ్యసుఖాల వైపు మరలదు. అంతకు మించిన సుఖం లేదనిపిస్తుంది. ఇంతవరకు ఎంత మోసపొయ్యామో! అని అంతరాత్మతో తన ఆవేదనను విన్నవించుకుంటుంది. ఆ తర్వాత ఎంత దుఃఖం వచ్చినా మనస్సు చలించదు. పరమసుఖం లభించిన తర్వాత ఏ విధమైన దుఃఖానికీ చోటు లేదు.

ఈ యోగసాధన అందరికీ సాధ్యం కాదు. నిశ్చలమైన నిష్ఠతో విసుగు విరామం లేకుండా సాధించాలి. అన్ని సంకల్పాలను, అన్ని రకాల కోరికలను పూర్తిగా పరిత్యజించాలి. ఓపికతో, నిర్మలమైన మనోబలంతో క్రమంగా సాధన చేస్తే సాధ్యంకానిది లేదు. మనస్సు ఎక్కడికి వెళ్ళుతుందో గమనించి, అక్కడినుంచి దాన్ని మరల్చేందుకు ముందుముందు ప్రయత్నించాలి. క్రమంగా మనస్సులోని వికారాలు తగ్గి ప్రశాంతమైన మనఃస్థితి ఏర్పడుతుంది.

మనస్సులోని కాలుష్యమంతా నశించాలి. నిర్మలమైన మనస్సు ఆత్మలో సులభంగా కలిసిపోతుంది. బ్రహ్మపదార్థం నిర్మలం కాబట్టి, నిర్మలమైన మనస్సునే బ్రహ్మతత్త్వం అంగీకరిస్తుంది. ఇలా సాధన చేయగా చేయగా, ఏదో ఒక క్షణంలో బ్రహ్మసంస్పర్శ అనుభవంలోకి వస్తుంది. బ్రహ్మానందం లభిస్తుంది. ఆ స్థితిలో ఎక్కడ చూచినా బ్రహ్మపదార్థమే కనిపిస్తుంది. అందరిలో పరమాత్మనూ, పరమాత్మలో అందరినీ చూడగలిగినవాడే నిజమైన ద్రష్ట. అతనికి పరమాత్మ సర్వస్వం. పరమాత్మకు అతను సర్వస్వం. అందరిలో ఏకాత్మకంగా వ్యాపించియున్న పరమాత్మస్వరూపాన్ని సాక్షాత్కరించుకున్నప్పుడే కర్మయోగికి కావలసిన సమదృష్టికూడా లభిస్తుంది. యోగదృష్టితో చూస్తే ప్రపంచమంతా పరమాత్మస్వరూపమే.

ఇంతవరకు మౌనంగా గీతామృతాన్ని ఆస్వాదిస్తున్న అర్జునుడికి ఇక్కడ ఏదో సందేహం వచ్చింది. కర్మయోగంగానీ, జ్ఞానయోగంగానీ రెండూ ఆత్మయోగానికి రెండు రూపాలే -- అని అతనికి తెలిసింది. రెంటికికూడా ఆత్మసంయమ మనేది మూలమనీ, మనస్సును తన అధీనంలో పెట్టుకొననిదే, ఏ యోగంకూడా సాధ్యం కాదనే విషయంకూడా అతనికి రూఢిగా తెలిసిపోయింది. కాని మనసు చాల చంచలమైనది. విచ్చలవిడిగా వీచే గాలిని ఉచ్చుముడి వేసి పట్టుకోవడం సాధ్యమా? అనే అనుమానం అతనికి వేసింది. మనస్సు నిలిస్తేకాని, సామ్యయోగం సాధ్యం కాదు. 'కష్ట సుఖాలను సమానంగా చూడాలి. ఉన్నవాళ్ళకోసం, పోయినవాళ్ళకోసం బాధపడకూడదు. రాగద్వేషాలు మానెయ్యాలి. కోపం రాకూడదు. తలపెట్టిన పని నెరవేరినా, నెరవేరకపోయినా పట్టించుకోగూడదు. కాని, చేయవలసినపని చేసితీరాలి, తెలిసి చెయ్యాలి'. ఇదీ ఆత్మయోగానికి (లేక సామ్యయోగానికి) సారం. చెప్పటం సులభమే కాని, చెయ్యటం సాధ్యమా? మనస్సును విషయవాసనలనుండి మరల్చటం అంత తేలిక కాదు. మనస్సే మనం చెప్పినమాట విననప్పుడు, మరి మనం సాధించే యోగమేముంది? ఇలాంటి సందేహాలే అర్జునుడు కృష్ణునితో చెప్తాడు. ఇందులో ప్రశ్న లేదు. ఆలోచనమాత్రం కనిపిస్తుంది. అర్జును డడిగే ప్రశ్నల్లో క్రమంగా మార్పు కనిపిస్తుంది. విషాదయోగం(మొదటి అధ్యాయం)లో పిచ్చి వాగుడు

వాగిన పార్థుడు, సాంఖ్యయోగం(రెండవ అధ్యాయం)చివర స్థితప్రజ్ఞుని స్థితిగతులు కనుక్కునే స్థితికి వస్తాడు. కర్మయోగంలో పని చెయ్యాలా? చేయనక్కరలేదా? అనే మీమాంసలోకి దిగుతాడు. నాల్గవ అధ్యాయం (జ్ఞానయోగం) లో ఈ వేదాంతం చెప్పే వ్యక్తి మనకు తెలిసిన కన్నయ్యా? లేక అందరిని కన్న బ్రహ్మయ్యా? అని ఆలోచిస్తాడు. అయిదవ అధ్యాయం (కర్మసన్న్యాసయోగం)లో కర్మసన్న్యాసం, కర్మయోగం -- ఈ రెంటిలో ఏది మంచిది అని ఆరాతీస్తాడు. ఆరవ అధ్యాయం (ధ్యానయోగం)లోకి వచ్చేసరికి నోరుతెరుచుకొని వింటూ ఉంటాడు. మధ్యలో మనస్సు నిలబెట్టుకొనటం ఎలా -- అని ఆలోచిస్తూ తన ఆలోచనలను గీతాచార్యునికి చెప్పుకుంటాడు. సమాధానం అడిగినా అడగకపోయినా గీతాచార్యుడు వెంటనే బదులు చెప్తాడు.

"నిజమే, మనస్సు ఒక రాగాన నిలబడదు. కాని, అభ్యాస వైరాగ్యాలతో ఒక నాటికి తప్పక స్వాధీనమవుతుంది. విసుగు విరామం లేకుండా సాధించాలి. క్షణభంగురమైన భోగలాలసలో ఏమీ సారం లేదనే విషయం సాధ్యమైనంత త్వరలో గమనించాలి. కాని 'మనసు నిల్పు శక్తి లేకపోతే' మంత్ర తంత్రాలు, జప తపాలు, యజ్ఞ యాగాలు సాంఖ్య యోగాలు -- అన్నీ నిరర్థకమైపోతాయి. సంయమం కలవాడే యోగానికి అర్హుడు. లేనివాడు పనికిరాడని కృష్ణుడు చెప్తాడు. ఒక వేళ జీవితమంతా యోగసాధన చేసి చివరిదశలో మనస్సు చలిస్తే, ఈ చేసిందంతా వ్యర్థమేనా? అని మరో సందేహం అర్జునుని మనస్సులో ఉదయిస్తుంది. సంశయాలు సంయమానికి అడ్డు వస్తాయని ఇంతకుముందు కృష్ణుడు చెప్పాడు. కాని, సందేహాలు రాకుండా ఉండాలంటే, ఉన్నసందేహాలను వెంటవెంటనే తీర్చుకుంటే, కొత్తసందేహాలు రాకుండా చూచుకోవచ్చు. కాబట్టి యోగభ్రష్టుని స్థితి ఏమవుతుంది! మధ్యలో సాధన చెడిపోతే అంతటితో ఇహానికీ, పరానికీ రెంటికీ చెడ్డ రేవడ అయిపోతాడా? -- అని అర్జునుని సందేహం. దీనికి వెంటనే సమాధానం చెప్తాడు -- యోగీశ్వరుడు: "అలా కాదు. చేసిన సాధన ఏ మాత్రం వ్యర్థం కాదు. ఇది కల్యాణ మార్గం. 'కల్య' అంటే ఉదయం, రేపు. నిత్యం ఉదయించే ప్రాణశక్తి కల్యాణి. ఎప్పటి కప్పుడు

నిత్యనూతనంగా కనిపించే పరమపద సాధన ఎంతవరకు చేస్తే అంతవరకు ఫలితం దక్కుతుంది. మధ్యలో శరీరం నశించినా, ఈ జన్మలో చేసిన సాధన మరుజన్మలో వెంటనే వస్తుంది. పూర్వసాధనాబలంతో ముందుకంటె తొందరగా స్థిరంగా యోగసాధన చేసేందుకు అవకాశం లభిస్తుంది. సగం మిగిలిన సాధనతో పోతే, శ్రీమంతుడైన పవిత్రుని గర్భంలో జన్మించటం జరుగుతుంది. స్వల్పసాధనమాత్రం మిగిలితే, యోగి కడుపున జన్మించే అవకాశం లభిస్తుంది. ఆ మిగిలిన కొద్దిపాటి సాధనను త్వరగా ముగించుకొని పరమాత్మ సాయుజ్యాన్ని పొందవచ్చు. ఇలాంటి జన్మ అంతకు ముందు చేసిన సాధనాబలంవల్లనే లభిస్తుంది. తొలి జన్మలో సాధించిన, సంపాదించిన బుద్ధిబలం, ఆత్మబలంకూడా ఈ జన్మలో లెక్కప్రకారం ఒక్కపిసరు తక్కువలేకుండా కూడుకొని వస్తుంది. తీసివేత లేకపోతే, కూడిక గుణకారి అవుతుంది. గుణ విభజన లేకుండా గుణాతీతుని భజిస్తే, భోగం యోగంగా మారుతుంది. మాటలు మంత్రాలుగా మారి, మాటల కందని మహామహుని మహనీయ స్థితిలో ఐక్యం కావటం సాధ్యమవుతుంది. కాని, ఇది ఒక్కజన్మలో సాధించగలిగినది కాదు. అనేక జన్మ సంసిద్ధతవల్ల పరమగతి ప్రాప్తిస్తుంది.

అందువల్ల తపస్సంపన్నులకంటే, జ్ఞానయోగులకంటే, కర్మయోగుల కంటే కూడా ఆత్మయోగి, ఆత్మసంయమయోగి ఉత్తముడు. కాబట్టి ఈ యోగాన్ని శ్రద్ధాభక్తులతో, సంయమంతో, శాంతచిత్తంతో, సమబుద్ధితో, సర్వే-శ్వరభావనతో సాధించాలి. అలా ఆత్మయోగాన్ని సాధించిన యోగి, నాకు నచ్చిన పరమయోగి. ఆత్మయోగాన్ని మించిన యోగం లేదు.

ఇక మళ్ళీ అర్జునునిమనస్సులో సందేహాలు ఉదయించలేదు. ఏడవ అధ్యాయం (జ్ఞానవిజ్ఞానయోగం) పూర్తిగా భగవద్వాక్యం. ప్రశ్నలేని ప్రత్యుత్తరం. తిరుగులేని సమాధానం. తిరిగి సందేహాలు రాకుండా పరమాత్మస్వరూపాన్ని సమగ్రంగా తెలుసుకునేందుకు జ్ఞానం, విజ్ఞానం రెంటినీ పరమాత్మ ఇష్టుడైన అర్జునునికి ప్రసాదిస్తాడు. ఇది కోరని వరం. ప్రయత్నించినా లభించని పరమ పదం. దీనికోసం ప్రయత్నించగల అధికారం

గలవాళ్ళే చాల కొద్దిమంది. వెయ్యి కొకరుంటారు. అలా ప్రయత్నించిన సిద్ధుల(యోగుల)లో కూడా నూటికి కోటికి ఎవరికో కాని పరమార్థం బోధపడదు.

కనిపించేది ప్రకృతి. కన్నతండ్రి పురుషుడు. అతడే పురుషోత్తముడు, పరమపురుషుడు. కనిపించే ప్రకృతిలోకూడా రెండు భేదాలు -- స్థూలం, సూక్ష్మం. స్థూలప్రకృతి, అపరాప్రకృతి. భూమి, జలం, అగ్ని, వాయువు, ఆకాశం, మనస్సు, బుద్ధి, అహంకారం -- ఈ ఎనిమిది అపరాప్రకృతికి చెందినవి. ఇది కానిది పరాప్రకృతి, పరమసూక్ష్మమైనది. పరమపురుషుని చెప్పుచేతల్లో పరాప్రకృతి చరాచరజగత్తును సృష్టిస్తుంది. సృష్టి చేసేది ప్రకృతి. అనుభవించేది పురుషుడు. ప్రకృతిసిద్ధమైన పరిణతివల్లనే ప్రాణం ఏర్పడుతుంది. ఆ ప్రాణాలను ధరించేందుకు ప్రాణికూడా ఏర్పడుతాడు. ఈ ప్రాణికోటికీ, ప్రాణశక్తికీ మూలకారణుడు కల్యాణధాముడు. ఆ పరంధాముని మించిన పరతత్త్వం లేదు. ప్రపంచంలోని సమస్తజీవులు కల్యాణధాముని మెడలోని మణిహారాలు. మనోహరమేకాక ఆత్మహారమైన యీ హారంలో సూత్రం విశ్వాత్మ. మణులు జీవాత్మలు. ఏ మణిని చూచినా, దానిలో దారముంది. ఇరుప్రక్కల దారముంది. ఆ దారమే అన్నిమణుల్లో ఉంది. అదే హారానికి ఆధారం.

నీటిలో రసస్వరూపంగా, సూర్యచంద్రులలో కాంతిగా, వసుమతిలో కమ్మని వాసనలుగా, అగ్నిలో తేజస్సుగా, ప్రాణికోటిలో ప్రాణశక్తిగా, తపస్సు చేసేవాళ్ళలో తపస్సుగా, బుద్ధిమంతులలో బుద్ధిగా, తేజోవంతులలో దీప్తిగా, బలవంతులలో బలంగా, సకల భూతాలకు బీజప్రాయంగా అంతటా పరమాత్మ రూపంలో నేను వ్యాపించియున్నాను. కామక్రోధాలకు, రాగ ద్వేషాలకు దూరమైన పరాక్రమంలో నా అంశ ఉన్నది. ధర్మసమ్మతమైన కామంలో నా రూపముంది. సత్త్వ రజ స్తమోగుణాలు నానుంచే ఉదయించాయి. కాని నే నా గుణాలకు అతీతంగా ఉన్నందువల్ల, గుణబద్ధులైన సామాన్యజనులు నన్ను గుర్తించలేరు. నేను రచించిన మాయలో చిక్కుకొని దానిని దాటలేక బాధపడుతున్నారు. మాయను దాటితే ఆత్మతత్త్వం

తెలుస్తుంది. కాని సామాన్యమానవులు మాయకు లొంగి, తనలో ఉన్న పరమాత్మస్వరూపాన్ని గుర్తించలేక నానావస్థలు పడుతుంటారు. ఏవేవో కోరికలతో నానాదేవతలను ఆరాధిస్తుంటారు.

నన్ను ఆరాధించేవాళ్ళు ముఖ్యంగా నాలుగు రకాలుగా ఉంటారు. ఆపదలో చిక్కుకుని భగవంతుని స్మరించే ఆపద మొక్కుల వాళ్ళు కొందరు. పరమార్థం తెలుసుకునేందుకు పాటుపడే జిజ్ఞాసువులు కొందరు. ఐహికమైన సుఖాన్ని, సంపదను, సంతతిని కోరి భగవంతునికి కైంకర్యం చేసే భక్తులు కొందరు. నిజమైన ఆత్మ జ్ఞానంతో జ్ఞాన విజ్ఞాన సర్వస్వమయిన పరమాత్మను సర్వకాల సర్వావస్థలయందు స్మరిస్తూ, తాము తరించి ఇతరులను తరింపజేసే జ్ఞానసంపన్నులు కొందరు. ఈ నాలుగు రకాల భక్తులలో జ్ఞానసంపన్నుడైన భక్తుడు నాకు చాలా ఇష్టుడు. అతని భక్తికి మేర లేదు. ఒకానొక ప్రయోజనంతో, కోరికతో చేసే ఆరాధన కాకపోవటంవల్ల అది నిలకడగా ఉంటుంది. మిగిలిన భక్తులుకూడా పుణ్యాత్ములే. అసలు తత్త్వచింతన లేకుండా ఉండేకంటే ఏదో ఒక నెపంతో అంతరాత్మను స్మరించటం మంచిది. బాధతో బొబ్బపెట్టేవాడు, పరమతత్త్వం తెలుసుకోవాలని పరితపించేవాడు, భోగభాగ్యాల కోసం భజన చేసేవాడు, అన్నీ తెలిసి ఆరాధించేవాడు -- అందరూ ఉదారులే. కాని, అన్నీ తెలిసి ఆరాధించే జ్ఞాని పరమాత్మకు ఆత్మీయుడు.

తత్త్వంతెలిసి చేసే యీ స్థితి ఒక్క జన్మలో సిద్ధించదు. ఎన్ని జన్మలనుంచి సాధనచేస్తూ వస్తేనో కాని, ఈ జన్మలో జ్ఞానం లభించదు. అంతకు ముందు ఎంతమంది చిల్లరదేవుళ్ళకో మొక్కి ఉండాలి. ఎన్నెన్ని తీర్థయాత్రలో చేసి ఉండాలి. ఏవేవో గ్రంథాలు చదివి ఉండాలి. ఏవేవో సత్కర్మలు చేసి ఉండాలి. ఇలా జన్మ జన్మాంతర సంస్కారంచేత చివరిజన్మలో సహజమైన జ్ఞానం లభిస్తుంది. కాని, తెలిసి చేసినా, తెలియక చేసినా పుణ్యకర్మలు ఫలిస్తాయి. సకలారాధనకు సర్వేశ్వరుడే కారకుడు. ఏ దేవత నారాధించినా సర్వాత్మను సేవించినట్టే. ఆరాధనకు కావలసిన శ్రద్ధా భక్తులుకూడా సర్వేశ్వరుని అనుగ్రహంవల్లనే లభిస్తాయి. ఏ పూజలు

చేసినా వాటి ఫలితం సర్వేశ్వరుడు ప్రసాదించవలసిందే. అల్పబుద్ధి వల్ల సామాన్యులు తమతమ దేవతలను గొప్పగా, ఇతర దేవతలను కొద్దిగా చెప్పకుంటారు. కాని 'దైవతం దేవతానాం చ' (దేవతలకు దేవుడైన) ఆదిదేవుడే అందరికీ ఆరాధ్యుడు. అవ్యక్త స్వరూపుడైన పరమాత్మకు ఏదో ఒక రూపం కల్పించి, సగుణారాధకులు సేవిస్తారు. సాకారంగా సేవించినా, నిరాకారంగా భావించినా పరమాత్మకే సకలారాధన చెందుతుంది. తనలో నున్న దివ్యత్వం తనకు గోచరిస్తే అన్ని ఆరాధనలకు ప్రయోజనం ఒకటే అనే విషయం బాగా బోధపడుతుంది.

తెలియక చేసే పని మాయ, తెలిసిచేసే పని యోగం. యోగేశ్వరుని యోగమాయవలన వ్యక్తికి తనవ్యక్తిత్వం తెలియదు. అవ్యక్త స్వరూపుడైన పరమాత్మనుకూడా తనలాంటి వ్యక్తిలాగానే భావించి ఆ రూపంలోనే సేవించేందుకు ప్రయత్నిస్తాడు. కాని పరమాత్మ త్రిగుణాతీతుడు. త్రికాలాతీతుడు. భూత భవిష్యద్ వర్తమానాలు అతని చెప్పచేతల్లో నడుస్తాయి. కాని యీ దేశకాలాలకు బద్ధులైన సామాన్యజీవులకు లోకాతీత, గుణాతీత, కాలాతీతమైన యీ స్వరూపం సులభంగా బోధపడదు. స్వ స్వరూపానుసంధానమే దీనికి ఏకైకమార్గం. తానెవరు? తాను చేయవలసిన పని యేమి? ఎందుకు చెయ్యాలి? ఏ భావంతో చెయ్యాలి? మాటిమాటికి ఈ పుట్టటం, గిట్టటం ఎందుకు జరుగుతున్నది? పాప పుణ్యాలు, కష్ట సుఖాలు, లాభ నష్టాలు వీటిని అధిగమించి శాశ్వతసుఖాన్ని పొందే మార్గమేదయినా ఉందా? అని తత్త్వచింతన చేసి, పరతత్త్వాన్ని బోధపరచుకొని, తనకర్తవ్యం తాను నెరవేర్చే కర్మయోగికి, ఆత్మ యందలి పరమాత్మతత్త్వం తెలుస్తుంది.

జీవితమంతా యీ అధ్యాత్మచింతనకు వినియోగించి, అసంఖ్య జీవ రాశిలో నిండియున్న పరబ్రహ్మ స్వరూపాన్ని అధిభూతంగా, అధిదైవంగా, అధియజ్ఞంగా అతడు గుర్తించగలుగుతాడు. నరునిలో, నారాయణునిలో, నరనారాయణ సంవాదంలో, ఏకాత్మ ప్రత్యయసారంగా వ్యాపించిన పర తత్త్వం నరనరాలలో జీర్ణించిపోయిన పరమయోగికి చరమదశలో కూడా నారాయణతత్త్వమే గోచరిస్తుంది. యోగసాధనలో ఆరితేరిన ఆత్మయోగికి,

మరణం దారుణమైన సంఘటన కాదు. అదికూడా ఒక ప్రయాణంలాంటిది. అంతవరకు ప్రాణం, శరీరంతోపాటు ప్రయాణం చేసింది. ఇప్పుడు శరీరాన్ని వదలి ఒంటరిగా ప్రయాణం చేస్తున్నది. సామాన్యంగా తనవెంట వచ్చే శరీరంమీద మమకారం పోయినతర్వాత, ఒంటరిగా ప్రయాణం చేసేందుకు ప్రాణాయామ పరాయణుడయిన పరమయోగికి బాధ వెయ్యదు. మనం చేసే ప్రతిప్రయాణానికీ ఏదో ప్రయోజనం ఉంటుంది. అలాగే ప్రాణం చేసే యీ ప్రయాణానికికూడా ఏదో గొప్ప ప్రయోజనం ఉండాలి. ఆ ప్రయోజనం సిద్ధించేందుకు శరీరం పనికి రాదు. దీనివల్ల సాధించవలసిన ప్రయోజనం సిద్ధించింది. ఇక దానితో ప్రమేయం లేదు. ఒంటరిగా వెళ్ళి, తన నిజస్వరూపాన్ని చూచుకొనాలి. దానికి శరీరం అంతరాయం.

ఈ జ్ఞానం అవసానకాలంలో ఎంతటి తపస్సంపన్నులకోగాని లభించదు. మరణకాలంలో ఏవేవో గుర్తుకు వస్తాయి. కాని, తన నిజరూపం స్ఫురించదు. దీనికి జీవితమంతా సాధన చెయ్యాలి. చేయవలసిన పనులను చేయవలసిన పద్ధతిలో తెలిసి చేస్తూ వచ్చిన కర్మయోగికే ఈ నిలకడ, మెలకువ సాధ్యం.

* * *

# చతుర్థోఽధ్యాయః

# జ్ఞానయోగః

శ్రీ భగవానువాచ:

ఇమం వివస్వతే యోగం ప్రోక్తవా నహ మవ్యయమ్,
వివస్వా న్మనవే ప్రాహ మను రిక్ష్వాకవేఽబ్రవీత్. 1

ఏవం పరమ్పరాప్రాప్త మిమం రాజర్షయో విదుః,
స కాలేనేహ మహతా యోగో నష్టః పరన్తప! 2

స ఏవాయం మయా తేఽద్య యోగః ప్రోక్తః పురాతనః,
భక్తోఽసి మే సఖాచేతి రహస్యం హ్యేత దుత్తమమ్. 3

అర్జున ఉవాచ:

అపరం భవతో జన్మ పరం జన్మ వివస్వతః,
కథ మేత ద్విజానీయాం త్వమాదౌ ప్రోక్తవానితి. 4

శ్రీ భగవానువాచ:

బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున!
తాన్యహం వేద సర్వాణి న త్వం వేత్థ పరన్తప! 5

అజోఽపి సన్నవ్యయాత్మా భూతానా మీశ్వరోఽపి సన్,
ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవా మ్యాత్మమాయయా. 6

యదా యదా హి ధర్మస్య గ్లాని ర్భవతి భారత!
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్. 7

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్,
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే. 8

జన్మ కర్మ చ మే దివ్య మేవం యో వేత్తి తత్త్వతః,
త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మా మేతి సోఽర్జున! 9

వీతరాగ భయక్రోధా మన్మయా మా ముపాశ్రితాః,
బహవో జ్ఞాన తపసా పూతా మద్భావ మాగతాః. 10

యే యథా మాం ప్రపద్యన్తే తాం స్తథైవ భజామ్యహమ్,
మమ వర్త్మానువర్తన్తే మనుష్యాః పార్థ సర్వశః. 11

కాంక్షన్తః కర్మణాం సిద్ధిం యజన్త ఇహ దేవతాః,
క్షిప్రం హి మానుషే లోకే సిద్ధి ర్భవతి కర్మజా. 12

చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణ కర్మ విభాగశః,
తస్య కర్తారమపి మాం విద్ధ్యకర్తార మవ్యయమ్. 13

న మాం కర్మాణి లిమ్పన్తి న మే కర్మఫలే స్పృహా,
ఇతి మాం యోఽభిజానాతి కర్మభి ర్న స బధ్యతే. 14

ఏవం జ్ఞాత్వా కృతం కర్మ పూర్వైరపి ముముక్షుభిః,
కురు కర్మైవ తస్మాత్త్వం పూర్వైః పూర్వతరం కృతమ్. 15

కిం కర్మ కి మకర్మేతి కవయోఽప్యత్ర మోహితాః,
త త్తే కర్మప్రవక్ష్యామి యద్ జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్. 16

కర్మణోహ్యపి బోద్ధవ్యం బోద్ధవ్యం చ వికర్మణః,
అకర్మణశ్చ బోద్ధవ్యం గహనా కర్మణో గతిః. 17

కర్మణ్యకర్మ యః పశ్యే దకర్మణి చ కర్మ యః,
స బుద్ధిమాన్మనుష్యేషు స యుక్తః కృత్స్నకర్మకృత్. 18

యస్య సర్వే సమారమ్భాః కామసఙ్కల్ప వర్జితాః,
జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం తమాహుః పణ్డితం బుధాః. 19

త్యక్త్వా కర్మఫలాసఙ్గం నిత్యతృప్తో నిరాశ్రయః,
కర్మణ్యభిప్రవృత్తోఽపి నైవ కిఞ్చిత్కరోతి సః. 20

నిరాశీ ర్యతచిత్తాత్మా త్యక్త సర్వపరిగ్రహః,
శారీరం కేవలం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్. 21

యదృచ్ఛా లాభ సన్తుష్టో ద్వన్ద్వాతీతో విమత్సరః,
సమ స్సిద్ధావసిద్ధౌ చ కృత్వాఽపి న నిబధ్యతే. 22

గతసఙ్గస్య ముక్తస్య జ్ఞానావస్థిత చేతసః,
యజ్ఞా యాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే. 23

బ్రహ్మార్పణం బ్రహ్మహవి ర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్,
బ్రహ్మైవ తేన గన్తవ్యం బ్రహ్మకర్మ సమాధినా. 24

దైవ మేవాపరే యజ్ఞం యోగినః పర్యుపాసతే,
బ్రహ్మాగ్నా వపరే యజ్ఞం యజ్ఞే నైవోపజుహ్వతి. 25

శ్రోత్రాదీ నీన్ద్రియా ణ్యన్యే సంయమాగ్నిషు జుహ్వతి,
శబ్దాదీ న్విషయానన్యే ఇన్ద్రియాగ్నిషు జుహ్వతి. 26

సర్వాణీన్ద్రియకర్మాణి ప్రాణకర్మాణి చాపరే,
ఆత్మసంయమ యోగాగ్నౌ జుహ్వతి జ్ఞానదీపితే. 27

ద్రవ్యయజ్ఞా స్తపోయజ్ఞా యోగయజ్ఞా స్తథాఽపరే,
స్వాధ్యాయ జ్ఞానయజ్ఞాశ్చ యతయ స్సంశితవ్రతాః. 28

అపానే జుహ్వతి ప్రాణం ప్రాణేఽపానం తథాపరే,
ప్రాణాపానగతీ రుద్ధ్వా ప్రాణాయామ పరాయణాః. 29

అపరే నియతాహారాః ప్రాణాన్ప్రాణేషు జుహ్వతి,
సర్వేఽప్యేతే యజ్ఞవిదో యజ్ఞ క్షపిత కల్మషాః. 30

యజ్ఞశిష్టామృతభుజో యాన్తి బ్రహ్మ సనాతనమ్,
నాయం లోకోఽస్త్యయజ్ఞస్య కుతోఽన్యః కురుసత్తమ! 31

ఏవం బహువిధా యజ్ఞా వితతా బ్రహ్మణో ముఖే,
కర్మజా న్విద్ధి తాన్సర్వా నేవం జ్ఞాత్వా విమోక్ష్యసే. 32

శ్రేయా న్ద్రవ్యమయాద్యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః పరన్తప!
సర్వం కర్మాఖిలం పార్థ! జ్ఞానే పరిసమాప్యతే. 33

తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా,
ఉపదేక్ష్యన్తి తే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వదర్శినః. 34

యద్జ్ఞాత్వా న పునర్మోహ మేవం యాస్యసి పాణ్డవ!
యేన భూతాన్యశేషేణ ద్రక్ష్య స్యాత్మ న్యథో మయి. 35

అపి చేదసి పాపేభ్య స్సర్వేభ్యః పాపకృత్తమః,
సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సన్తరిష్యసి. 36

యథైధాంసి సమిద్ధోఽగ్ని ర్భస్మసాత్కురుతేఽర్జున!
జ్ఞానాగ్ని స్సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా. 37

న హి జ్ఞానేన సదృశం పవిత్రం మిహ విద్యతే,
తత్స్వయం యోగసంసిద్ధః కాలే నాత్మని విన్దతి. 38

శ్రద్ధావాఞ్ లభతే జ్ఞానం తత్పర స్సంయతేన్ద్రియః,
జ్ఞానం లబ్ధ్వా పరాం శాన్తి మచిరేణాధిగచ్ఛతి. 39

అజ్ఞ శ్చాశ్రద్దధానశ్చ సంశయాత్మా వినశ్యతి,
నాయం లోకోఽస్తి న పరో న సుఖం సంశయాత్మనః. 40

యోగసన్న్యస్త కర్మాణం జ్ఞానసంఛిన్న సంశయమ్,
ఆత్మవన్తం న కర్మాణి నిబధ్నన్తి ధనంజయ! 41

తస్మా దజ్ఞానసంభూతం హృత్‌స్థం జ్ఞానాసినాత్మనః,
ఛిత్త్వైనం సంశయం యోగ మాతిష్ఠోత్తిష్ఠ భారత! 42

ఓం తత్సదితి

శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జునసంవాదే జ్ఞానయోగో నామ
చతుర్థోఽధ్యాయః.

* * *

పఞ్చమోఽధ్యాయః

# కర్మసన్న్యాస యోగః

అర్జున ఉవాచః

సన్న్యాసం కర్మణాం కృష్ణ! పునర్యోగం చ శంససి,
యచ్ఛ్రేయ ఏతయో రేకం తన్మే బ్రూహి సునిశ్చితమ్. 1

శ్రీ భగవానువాచః

సన్న్యాసః కర్మయోగశ్చ నిశ్శ్రేయసకరావుభౌ,
తయోస్తు కర్మసన్న్యాసా త్కర్మయోగో విశిష్యతే. 2

జ్ఞేయ స్స నిత్యసన్న్యాసీ యో న ద్వేష్టి న కాంక్షతి,
నిర్ద్వన్ద్వో హి మహాబాహో! సుఖం బన్ధా త్ప్రముచ్యతే. 3

సాంఖ్యయోగౌ పృథ గ్బాలాః ప్రవదన్తి న పణ్డితాః,
ఏకమప్యాస్థిత స్సమ్య గుభయో ర్విన్దతే ఫలమ్. 4

యత్సాఙ్ఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగైరపి గమ్యతే,
ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి. 5

సన్న్యాసస్తు మహాబాహో! దుఃఖమాప్తు మయోగతః,
యోగయుక్తో ముని ర్బ్రహ్మ న చిరేణాధిగచ్ఛతి. 6

యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేన్ద్రియః,
సర్వభూతాత్మ భూతాత్మా కుర్వన్నపి న లిప్యతే. 7

నైవ కిఞ్చిత్కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్,
పశ్యఞ్ శృణ్వ ఞ్స్పృశ ఞ్జిఘ్ర న్నశ్న న్గచ్ఛ న్స్వప ఞ్శ్వసన్. 8

ప్రలపన్ విసృజన్ గృహ్ణ న్నున్మిష న్నిమిషన్నపి,
ఇన్ద్రియా ణీన్ద్రియార్థేషు వర్తన్త ఇతి ధారయన్. 9

బ్రహ్మ ణ్యాధాయ కర్మాణి సఙ్గం త్యక్త్వా కరోతి యః,
లిప్యతే న స పాపేన పద్మపత్ర మివామ్భసా. 10

కాయేన మనసా బుద్ధ్యా కేవలై రిన్ద్రియైరపి,
యోగినః కర్మ కుర్వన్తి సఙ్గం త్యక్త్వాత్మశుద్ధయే. 11

యుక్తః కర్మఫలం త్యక్త్వా శాన్తి మాప్నోతి నైష్ఠికీమ్,
అయుక్తః కామకారేణ ఫలే సక్తో నిబధ్యతే. 12

సర్వకర్మాణి మనసా సన్న్యస్యాస్తే సుఖం వశీ,
నవద్వారే పురే దేహీ నైవ కుర్వ న్న కారయన్. 13

న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభుః,
న కర్మఫలసంయోగం స్వభావస్తు ప్రవర్తతే. 14

నాదత్తే కస్యచిత్పాపం న చైవ సుకృతం విభుః,
అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యన్తి జన్తవః. 15

జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశిత మాత్మనః,
తేషా మాదిత్యవద్ జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్. 16

తద్బుద్ధయః తదాత్మాన స్తన్నిష్ఠా స్తత్పరాయణాః,
గచ్ఛ న్త్యపునరావృత్తిం జ్ఞాననిర్ధూత కల్మషాః. 17

విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని,
శుని చైవ శ్వపాకే చ పణ్డితా స్సమదర్శినః. 18

ఇహైవ తైర్జిత స్సర్గో యేషాం సామ్యే స్థితం మనః,
నిర్దోషం హి సమం బ్రహ్మ తస్మా ద్బ్రహ్మణి తే స్థితాః. 19

న ప్రహృష్యే త్ప్రియం ప్రాప్య నోద్విజేత్ప్రాప్య చాప్రియమ్,
స్థిరబుద్ధి రసమ్మూఢో బ్రహ్మవిద్బ్రహ్మణి స్థితః. 20

బాహ్యస్పర్శే ష్వసక్తాత్మా విన్దత్యాత్మని యత్సుఖమ్,
స బ్రహ్మ యోగయుక్తాత్మా సుఖ మక్షయ మశ్నుతే. 21

యే హి సంస్పర్శజా భోగా దుఃఖయోనయ ఏవ తే,
ఆద్యన్తవన్తః కౌన్తేయ! న తేషు రమతే బుధః. 22

శక్నోతీహైవ యస్సోఢుం ప్రాక్శరీర విమోక్షణాత్,
కామక్రోధోద్భవం వేగం స యుక్త స్స సుఖీ నరః. 23

యోఽన్తస్సుఖోఽన్తరారామ స్తథాఽన్తర్జ్యోతిరేవ యః,
స యోగీ బ్రహ్మనిర్వాణం బ్రహ్మభూతోఽధిగచ్ఛతి. 24

లభన్తే బ్రహ్మనిర్వాణ మృషయః క్షీణకల్మషాః,
ఛిన్నద్వైధా యతాత్మాన స్సర్వభూత హితే రతాః. 25

కామ క్రోధ వియుక్తానాం యతీనాం యతచేతసామ్,
అభితో బ్రహ్మనిర్వాణం వర్తతే విదితాత్మనామ్. 26

స్పర్శా న్కృత్వా బహిర్బాహ్యాం శ్చక్షుశ్చైవాన్తరే భ్రువోః,
ప్రాణాపానౌ సమౌ కృత్వా నాసాభ్యన్తరచారిణౌ. 27

యతేన్ద్రియ మనోబుద్ధి ర్ముని ర్మోక్షపరాయణః,
విగతేచ్ఛాభయక్రోధో య స్సదా ముక్త ఏవ సః. 28

భోక్తారం యజ్ఞతపసాం సర్వలోకమహేశ్వరమ్,
సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాన్తి మృచ్ఛతి. 29

ఓం తత్సదితి
శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జునసంవాదే కర్మసన్న్యాసయోగో నామ
పఞ్చమోఽధ్యాయః.

* * *

## షష్ఠోఽధ్యాయః

# ఆత్మసంయమయోగః

### శ్రీ భగవానువాచః

అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మ కరోతి యః,
స సన్న్యాసీ చ యోగీ చ న నిరగ్ని ర్నచాక్రియః. 1

యం సన్న్యాసమితి ప్రాహు ర్యోగం తం విద్ధి పాణ్డవ!
న హ్యసన్న్యస్త సంకల్పో యోగీ భవతి కశ్చన. 2

ఆరురుక్షో ర్మునే ర్యోగం కర్మ కారణ ముచ్యతే,
యోగారూఢస్య తస్యైవ శమః కారణ ముచ్యతే. 3

యదా హి నేన్ద్రియార్థేషు న కర్మస్వనుషజ్జతే,
సర్వసంకల్ప సన్న్యాసీ యోగారూఢ స్తదోచ్యతే. 4

ఉద్ధరే దాత్మనాత్మానం నాత్మాన మవసాదయేత్,
ఆత్మైవ హ్యాత్మనో బన్ధు రాత్మైవ రిపు రాత్మనః. 5

బన్ధు రాత్మాఽఽత్మనస్తస్య యేనాత్మై వాత్మనా జితః,
అనాత్మనస్తు శత్రుత్వే వర్తే తాత్మైవ శత్రువత్. 6

జితాత్మనః ప్రశాన్తస్య పరమాత్మా సమాహితః,
శీతోష్ణ సుఖ దుఃఖేషు తథా మానవమానయోః. 7

జ్ఞాన విజ్ఞాన తృప్తాత్మా కూటస్థో విజితేన్ద్రియః,
యుక్త ఇత్యుచ్యతే యోగీ సమలోష్టాశ్మకాఞ్చనః. 8

సుహృన్మిత్రార్యుదాసీన మధ్యస్థ ద్వేష్య బన్ధుషు,
సాధుష్వపి చ పాపేషు సమబుద్ధి ర్విశిష్యతే. 9

యోగీ యుఞ్జీత సతత మాత్మానం రహసి స్థితః,
ఏకాకీ యతచిత్తాత్మా నిరాశీ రపరిగ్రహః. 10

శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసన మాత్మనః,
నాత్యుచ్ఛ్రితం నాతినీచం చేలాజినకుశోత్తరమ్. 11

తత్రైకాగ్రం మనః కృత్వా యత చిత్తేన్ద్రియక్రియః,
ఉపవిశ్యాసనే యుఞ్జ్యాద్యోగ మాత్మ విశుద్ధయే. 12

సమం కాయ శిరో గ్రీవం ధారయ న్నచలం స్థిరః,
సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్. 13

ప్రశాన్తాత్మా విగతభీ ర్బ్రహ్మచారివ్రతే స్థితః,
మన స్సంయమ్య మచ్చిత్తో యుక్త ఆసీత మత్పరః. 14

యుఞ్జన్నేవం సదాత్మానం యోగీ నియతమానసః,
శాన్తిం నిర్వాణపరమాం మత్సంస్థా మధిగచ్ఛతి. 15

నాత్యశ్నతస్తు యోగోఽస్తి న చైకాన్తమనశ్నతః,
న చాతిస్వప్నశీలస్య జాగ్రతో నైవ చార్జున! 16

యుక్తాహార విహారస్య యుక్త చేష్టస్య కర్మసు,
యుక్త స్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా. 17

యదా వినియతం చిత్త మాత్మన్యేవావతిష్ఠతే,
నిస్స్పృహ స్సర్వ కామేభ్యో యుక్త ఇత్యుచ్యతే తదా. 18

యథా దీపో నివాతస్థో నేఙ్గతే సోపమా స్మృతా,
యోగినో యతచిత్తస్య యుఞ్జతో యోగ మాత్మనః. 19

యత్రోపరమతే చిత్తం నిరుద్ధం యోగసేవయా,
యత్ర చైవాత్మనాత్మానం పశ్యన్నాత్మని తుష్యతి. 20

సుఖ మాత్యన్తికం యత్త ద్బుద్ధిగ్రాహ్య మతీన్ద్రియమ్,
వేత్తి యత్ర న చైవాయం స్థిత శ్చలతి తత్త్వతః. 21

యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః,
యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాఽపి విచాల్యతే. 22

తం విద్యా ద్దుఃఖసంయోగ వియోగం యోగసంజ్ఞితమ్,
స నిశ్చయేన యోక్తవ్యో యోగోఽనిర్విణ్ణచేతసా. 23

సంకల్పప్రభవా న్కామాం స్త్యక్త్వా సర్వా నశేషతః,
మనసై వేన్ద్రియగ్రామం వినియమ్య సమన్తతః. 24

శనైశ్శనై రుపరమే ద్బుద్ధ్యా ధృతిగృహీతయా,
ఆత్మసంస్థం మనః కృత్వా న కించిదపి చిన్తయేత్. 25

యతో యతో నిశ్చరతి మన శ్చంచల మస్థిరమ్,
తత స్తతో నియమ్యైత దాత్మన్యేవ వశం నయేత్. 26

ప్రశాన్తమనసం హ్యేనం యోగినం సుఖ ముత్తమమ్,
ఉపైతి శాన్తరజసం బ్రహ్మభూత మకల్మషమ్. 27

యుఞ్జన్నేవం సదాత్మానం యోగీ విగతకల్మషః,
సుఖేన బ్రహ్మసంస్పర్శ మత్యన్తం సుఖ మశ్నుతే. 28

సర్వభూతస్థ మాత్మానం సర్వభూతాని చాత్మని,
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః. 29

యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి,
తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి. 30

సర్వభూత స్థితం యో మాం భజత్యేకత్వ మాస్థితః,
సర్వథా వర్తమానోఽపి స యోగీ మయి వర్తతే. 31

ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున!
సుఖం వా యదివా దుఃఖం స యోగీ పరమో మతః. 32

అర్జున ఉవాచ:

యోఽయం యోగ స్త్వయా ప్రోక్త స్సామ్యేన మధుసూదన!
ఏతస్యాహం న పశ్యామి చఞ్చలత్వా త్స్థితిం స్థిరామ్. 33

చఞ్చలం హి మనః కృష్ణ! ప్రమాథి బలవద్దృఢమ్,
తస్యాహం నిగ్రహం మన్యే వాయోరివ సుదుష్కరమ్. 34

శ్రీ భగవానువాచ:

అసంశయం మహాబాహో! మనో దుర్నిగ్రహం చలమ్,
అభ్యాసేన తు కౌన్తేయ! వైరాగ్యేణ చ గృహ్యతే. 35

అసంయతాత్మనా యోగో దుష్ప్రాప ఇతి మే మతిః,
వశ్యాత్మనా తు యతతా శక్యోఽవాప్తు ముపాయతః. 36

అర్జున ఉవాచ:

అయతి శ్శ్రద్ధయోపేతో యోగా చ్చలితమానసః,
అప్రాప్య యోగసంసిద్ధిం కాం గతిం కృష్ణ! గచ్ఛతి. 37

కచ్చి న్నోభయవిభ్రష్ట శ్ఛిన్నాభ్రమివ నశ్యతి,
అప్రతిష్ఠో మహాబాహో! విమూఢో బ్రహ్మణః పథి. 38

ఏత న్మే సంశయం కృష్ణ! ఛేత్తు మర్హ స్యశేషతః,
త్వదన్య స్సంశయస్యాస్య ఛేత్తా న హ్యుపపద్యతే. 39

శ్రీ భగవానువాచ:

పార్థ! నైవేహ నాముత్ర వినాశ స్తస్య విద్యతే,
న హి కల్యాణకృ త్కశ్చి దుర్గతిం తాత! గచ్ఛతి. 40

ప్రాప్య పుణ్యకృతాం లోకా నుషిత్వా శాశ్వతీ స్సమాః,
శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోఽభిజాయతే. 41

అథవా యోగినా మేవ కులే భవతి ధీమతామ్,
ఏతద్ధి దుర్లభతరం లోకే జన్మ యదీదృశమ్. 42

తత్ర తం బుద్ధిసంయోగం లభతే పౌర్వదైహికమ్,
యతతే చ తతో భూయ స్సంసిద్ధౌ కురునన్దన! 43

పూర్వాభ్యాసేన తేనైవ హ్రియతే హ్యవశోఽపి సః,
జిజ్ఞాసురపి యోగస్య శబ్దబ్రహ్మాతివర్తతే. 44

ప్రయత్నా ద్యతమానస్తు యోగీ సంశుద్ధ కిల్బిషః,
అనేకజన్మసంసిద్ధ స్తతో యాతి పరాం గతిమ్. 45

తపస్విభ్యోఽధికో యోగీ జ్ఞానిభ్యోఽపి మతోఽధికః,
కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున! 46

యోగినామపి సర్వేషాం మద్గతేనాన్తరాత్మనా,
శ్రద్ధావా న్భజతే యో మాం స మే యుక్తతమో మతః. 47

ఓం తత్సదితి

శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే,
శ్రీకృష్ణార్జునసంవాదే ఆత్మసంయమయోగో నామ
షష్ఠోఽధ్యాయః.

* * *

# సప్తమోఽధ్యాయః

# విజ్ఞానయోగః

## శ్రీ భగవానువాచః

మయ్యాసక్త మనాః పార్థ! యోగం యుఞ్జ న్మదాశ్రయః,
అసంశయం సమగ్రం మాం యథా జ్ఞాస్యసి తచ్ఛృణు. 1

జ్ఞానం తేఽహం సవిజ్ఞాన మిదం వక్ష్యా మ్యశేషతః,
యద్జ్ఞాత్వా నేహ భూయోఽన్యద్ జ్ఞాతవ్య మవశిష్యతే. 2

మనుష్యాణాం సహస్రేషు కశ్చి ద్యతతి సిద్ధయే,
యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః. 3

భూమి రాపోఽనలో వాయుః ఖం మనో బుద్ధి రేవ చ,
అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతి రష్టధా. 4

అపరేయమిత స్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరామ్,
జీవభూతాం మహాబాహో! యయేదం ధార్యతే జగత్. 5

ఏతద్యోనీని భూతాని సర్వాణీ త్యుపధారయ,
అహం కృత్స్నస్య జగతః ప్రభవః ప్రలయ స్తథా. 6

మత్తః పరతరం నాన్య త్కించిదస్తి ధనంజయ!
మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ. 7

రసోఽహ మప్సు కౌన్తేయ! ప్రభా స్మి శశి సూర్యయోః,
ప్రణవ స్సర్వవేదేషు శబ్దః ఖే పౌరుషం నృషు. 8

పుణ్యో గన్ధః పృథివ్యాం చ తేజశ్చాస్మి విభావసౌ,
జీవనం సర్వభూతేషు తపశ్చాస్మి తపస్విషు. 9

బీజం మాం సర్వభూతానాం విద్ధి పార్థ! సనాతనమ్,
బుద్ధి ర్బుద్ధిమతామస్మి తేజ స్తేజస్వినా మహమ్. 10

బలం బలవతాం చాహం కామరాగవివర్జితమ్,
ధర్మావిరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ! 11

యే చైవ సాత్త్వికా భావా రాజసా స్తామసాశ్చ యే,
మత్త ఏవేతి తా న్విద్ధి న త్వహం తేషు తే మయి. 12

త్రిభి ర్గుణమయై ర్భావై రేభి స్సర్వమిదం జగత్,
మోహితం నాభిజానాతి మా మేభ్యః పర మవ్యయమ్. 13

దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా,
మామేవ యే ప్రపద్యన్తే మాయా మేతాం తరన్తి తే. 14

న మాం దుష్కృతినో మూఢాః ప్రపద్యన్తే నరాధమాః,
మాయయాఽపహృతజ్ఞానాః ఆసురం భావ మాశ్రితాః. 15

చతుర్విధా భజన్తే మాం జనా స్సుకృతినోఽర్జున!
ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ! 16

తేషాం జ్ఞానీ నిత్యయుక్తః ఏకభక్తి ర్విశిష్యతే,
ప్రియో హి జ్ఞానినోఽత్యర్థ మహం స చ మమ ప్రియః. 17

ఉదారాస్సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్,
ఆస్థిత స్స హి యుక్తాత్మా మామేవానుత్తమాం గతిమ్. 18

బహూనాం జన్మనా మన్తే జ్ఞానవా న్మాం ప్రపద్యతే,
వాసుదేవ స్సర్వమితి స మహాత్మా సుదుర్లభః. 19

కామై స్తై స్తై ర్హృతజ్ఞానాః ప్రపద్యన్తేఽన్యదేవతాః,
తం తం నియమ మాస్థాయ ప్రకృత్యా నియతా స్స్వయా. 20

యో యో యాం యాం తనుం భక్తః శ్రద్ధయాఽర్చితు మిచ్ఛతి,
తస్య తస్యాచలాం శ్రద్ధాం తా మేవ విదధామ్యహమ్. 21

స తయా శ్రద్ధయా యుక్త స్తస్యారాధన మీహతే,
లభతే చ తతః కామా న్మయైవ విహితా న్హితాన్. 22

అన్తవత్తు ఫలం తేషాం తద్భవత్యల్పమేధసామ్,
దేవా న్దేవయజో యాన్తి మద్భక్తా యాన్తి మామపి. 23

అవ్యక్తం వ్యక్తి మాపన్నం మన్యన్తే మా మబుద్ధయః,
పరం భావ మజానన్తో మమావ్యయ మనుత్తమమ్. 24

నాహం ప్రకాశ స్సర్వస్య యోగమాయా సమావృతః,
మూఢోఽయం నాభిజానాతి లోకో మా మజ మవ్యయమ్. 25

వేదాహం సమతీతాని వర్తమానాని చార్జున!
భవిష్యాణి చ భూతాని మాం తు వేద న కశ్చన. 26

ఇచ్ఛా ద్వేష సముత్థేన ద్వన్ద్వమోహేన భారత!
సర్వభూతాని సమ్మోహం సర్గే యాన్తి పరన్తప! 27

యేషాం త్వన్తగతం పాపం జనానాం పుణ్యకర్మణామ్,
తే ద్వన్ద్వమోహనిర్ముక్తాః భజన్తే మాం దృఢవ్రతాః. 28

జరామరణ మోక్షాయ మా మాశ్రిత్య యతన్తి యే,
తే బ్రహ్మ తద్విదుః కృత్స్న మధ్యాత్మం కర్మ చాఖిలమ్. 29

సాధిభూతాధిదైవం మాం సాధియజ్ఞం చ యే విదుః,
ప్రయాణకాలేఽపి చ మాం తే విదు ర్యుక్తచేతసః. 30

ఓం తత్సదితి
శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జునసంవాదే విజ్ఞానయోగో నామ
సప్తమోఽధ్యాయః

జ్ఞానవల్లి సమాప్తం.

* * *

ఓం

# గీతామృతం

## భక్తివల్లి : చేసి చూడాలి


| | | | |
|---|---|---|---|
| అధ్యా. | 8 | : | అక్షరపరబ్రహ్మ యోగం |
| ,, | 9 | : | రాజవిద్యారాజగుహ్య యోగం |
| ,, | 10 | : | విభూతి యోగం |
| ,, | 11 | : | విశ్వరూపసందర్శన యోగం |
| ,, | 12 | : | భక్తి యోగం |

# చేసి చూడాలి

కర్మయోగం, కర్మసన్న్యాసం, సాంఖ్యం, యోగం -- ఈ పద జాలంతోనే బాధపడుతున్న పార్థునికి, అధిభూతం, అధిదైవం, అధియజ్ఞం, అధ్యాత్మంలాంటి సాంకేతిక పదాలు వినవచ్చేసరికి అతని మూలాధారం చలిస్తుంది. ఈ మాటలు నాకు బోధపడటం లేదు. కొంచెం వివరంగా చెప్ప వలసిందని అతడు తన బావగారిని బ్రతిమాలుకుంటాడు. ప్రాణ ప్రయాణ సమయంలో పరమాత్మను స్మరించటం ఎలా సాధ్యమవుతుందోకూడా తెలియ జెప్పవలసిందని ప్రార్థిస్తాడు.

అనుకూలమైన మనఃస్థితికోసం ఎదురుచూస్తున్న యోగేశ్వరుడు ఈ ప్రశ్నలకు సమాధానంగా, తన అక్షరభారతిని ప్రారంభిస్తాడు. 'కిం తద్ బ్రహ్మ?'(బ్రహ్మ పదార్థమంటే ఏమిటి?) అనే ప్రశ్నకు ముచ్చటగా మూడు మాటల్లో 'అక్షరం బ్రహ్మ పరమం' అని సారగర్భితంగా సమాధానం చెప్తాడు. క్షరం కానిది అక్షరం. అలాంటి అక్షరభారతిలో అగ్రగణ్యమైనది ప్రణవం. పరమపవిత్రమైన ప్రణవాక్షరమే బ్రహ్మ. ప్రణవంలాగానే బ్రహ్మపదార్థంకూడా నిత్యనూతనం, పరమ పురాతనం, అవ్యయం, అవ్యక్తం. ప్రణవంలోని నాలుగు మాత్రలలో -- అకార, ఉకార, మకార, మాత్రాహీన తురీయ భాగాల్లో చతుర్ముఖమైన బ్రహ్మస్వరూపం ఉంది. ఇది అక్షర పరబ్రహ్మ లక్షణం.

'అధ్యాత్మ' తత్త్వమంటే ఏమిటి? -- అనేది అర్జును డడిగిన రెండవ ప్రశ్న. 'స్వభావమే అధ్యాత్మ' అంటాడు స్వామి. పరమాత్మ జీవాత్మలో ప్రవేశించటం స్వభావసిద్ధమయిన సంఘటన. అవ్యక్తమయిన పరమాత్మ, వ్యక్తిగతమైన ఆత్మను చేరటమే అధ్యాత్మతత్త్వం. ఆత్మకు పంచభూతాలతో సంబంధం లేదు. భావజగత్తుతో ప్రమేయం లేదు. సృష్టి స్థితులకు అతీతమై ఉంటుంది. కాని, సక్రియరూపంలో ఆత్మకు వీటన్నిటితో సంబంధ మేర్ప-డుతుంది. ఆత్మ శరీరాన్ని ఆశ్రయించినప్పుడు, శరీరంలో పంచభూతాలు ప్రవేశిస్తాయి. మనస్సులో అనేక భావాలు ఉదయిస్తాయి. పుట్టటం పెరగటం జరుగుతుంది. స్థూలశరీరంనుండి కర్మసంతతి ఉదయిస్తుంది.

వాక్కు, ఆలోచనలు, చేష్టలు అన్నీ విసర్గరూపం ధరించిన కర్మ సముచ్చయం. కర్మ అంటే ఏమిటి? -- అన్న మూడో ప్రశ్నకు చెప్పిన సమాధానమిది.

'అధిభూత'మంటే ఏమిటి? -- అనేది నాలుగో ప్రశ్న. క్షర స్వభావమే అధిభూతం అని సమాధానం. క్షీణించే శరీరం, శరీరంలోని భాగాలు, శరీరం చేసే పనులు, అనుభవించే కష్టసుఖాలు -- ఇవన్నీ 'అధిభూతం' కిందికి వస్తాయి. ఐదో ప్రశ్నలో అధిదైవాన్ని గురించి చర్చ జరుగుతుంది. పురుషుడే అధిదైవం అని గీతాచార్యుని క్లుప్తమైన సమాధానం. క్షరస్వభావం గలిగిన దేహంలో అక్షరరూపంలో ఉన్న దేహి -- క్షేత్రంలో ఉన్న క్షేత్రజ్ఞుడే పురుషుడు. అతడే అధి దైవం. ఆరో ప్రశ్న అధియజ్ఞానికి సంబంధించింది. 'నేనే అధియజ్ఞుణ్ణి. యజ్ఞరూపంలో అందరి అంతఃకరణంలో నేను ప్రవేశించి ఉంటాను' అని కృష్ణుని సమాధానం. ఇంతవరకు ఈ ప్రశ్నోపనిషత్తు సక్రమంగానే జరుగుతుంది. చివరి ప్రశ్న చిక్కుప్రశ్న. చివరి దశలో మరణం ఆసన్నమయిన సమయంలో, పరమాత్మను ఎలా స్మరించటం? అనేది యీ జటిల సమస్య. దీనికి చెప్పిన సమాధానమే అక్షర పరబ్రహ్మను ప్రత్యక్షం చేస్తుంది. అదే అక్షరపరబ్రహ్మయోగంలోని ప్రధానవిషయం. చివరి క్షణంలో పరమాత్మను స్మరించటమే జరిగితే ఆత్మసాయుజ్యం తప్పక లభిస్తుంది. కాని, దారుణమైన మృత్యువు సమీపిస్తున్న సమయంలో నిర్భయంగా, నిష్కం- టకంగా, నిశ్చలంగా పరమాత్మను స్మరించటం సామాన్యులకు సాధ్యమయ్యే విషయం కాదు. జీవితాంతం చేసిన సాధన ఒక్క క్షణంలో ఫలిస్తుంది. అందువల్ల ఎప్పుడో ఒకసారి జ్ఞాపకం వచ్చినపుడు భగవచ్చింతన చేస్తే చాలదు. దైవచింతన అనేది దైనందిన జీవితంలో ఒక భాగమై పోవాలి. నిద్రపోయేప్పుడు లేపినా లేవగానే భగవన్నామం మనస్సుకు స్ఫురించాలి. అందుకే నిద్రపట్టే సమయంలో, నిద్ర లేచే సమయంలో భగవన్నామం ఏదో రూపంలో తప్పక స్మరించాలి. ఇలా అంగాంగంలో పరమాత్మ స్వరూపం రంగరించుకొని పోయినప్పుడే అవసానదశలో అప్రయత్నంగా అంతరంగుడు గుర్తుకు వస్తాడు. అదికూడా ఒక అదృష్టం. దానికి నోచుకోవాలి. జీవిత మంతా నానా యాతనలతో గడిచినా చివరిదశలో చైతన్యం లభిస్తే జన్మ తరిస్తుంది. అలా తరించిన అదృష్టవంతులుకూడా ఉన్నారు. కాని

మామూలు పద్ధతిలో నిరంతర సాధనవల్ల, అభ్యాసయోగంవల్ల అవసానదశలో అంతరాత్మ ధ్యానం కుదురుతుంది.

జీవితమంతా ఒక యెత్తు. చివరిక్షణం ఒక యెత్తు. పరీక్షలకు తీవ్రంగా చదివి, పరీక్ష సమయంలో అనారోగ్యంవల్లనో పరధ్యానంవల్లనో మరో చిరాకువల్లనో చదువుకున్న నాలుగుముక్కలూ గుర్తుకు రాకపోతే పరీక్ష మునిగినట్టే. కాని, క్షుణ్ణంగా చదివిన విద్యార్థి ఎంత ప్రతికూలపరిస్థితులున్నా, వాటిని లెక్కచేయక జయాన్ని సాధించగలుగుతాడు. అలాగే జీవిత పరీక్షలో కూడా నిరంతర చింతనతో అభ్యాసబలంతో చివరి దశలో సచ్చింతన సాధ్యమవుతుంది. అజ్ఞానమనే చీకటికి ఆవలి వైపున జ్ఞానభాస్కరునిలా వెలిగే సనాతన సత్యస్వరూపాన్ని సర్వజ్ఞునిగా, సర్వేశ్వరునిగా, సర్వలోక మహేశ్వ-రునిగా, స్రష్టగా, ద్రష్టగా ఊహించి, అనుక్షణం సేవించిన జీవికి చివరి దశలో అనాయాసంగా ఆ రూపం స్ఫురిస్తుంది. చలించని మనస్సు, అనన్యమైన భక్తి, జ్ఞానంతోకూడిన యోగబలంవల్ల చివరి క్షణంలో కనుబొమలమధ్య కూడిన ప్రాణశక్తి పరమపురుషుని దర్శించగలుగుతుంది. క్షణకాలంలో సర్వేశ్వరుని అనంతవిభూతిని సమగ్రంగా స్మరించటం సాధ్యం కాదు. అందుకని నిగమాగమ సారమైన ఓంకారాన్ని స్మరిస్తే చాలు. వేదవాఙ్మయమంతా ఓంకారంలో ఇమిడిఉన్నది. సర్వసంగపరిత్యాగం చేసిన యోగులు బ్రహ్మచర్య సాధనతో ప్రయత్నించేది యీ ప్రణవసిద్ధికే. అలాంటి ఓంకారాన్ని మనస్సులో ఎప్పుడూ ధ్యానిస్తూ ఉండాలి. పరమాత్మను పిలిచేందుకు ప్రణవమే సాధనం. ఓంకారాన్ని ఉచ్చరించగానే హృదయకుహరంలో ఉన్న హృషీకేశుడు లలాటంమీద లాస్యం చేస్తాడు. మిగిలిన వాకిళ్ళన్నీ మూసి, తలమీద నున్న బ్రహ్మరంధ్రంలో ప్రణవనాదాన్ని ప్రతిష్ఠించి, మెలకువతో నిలుపుకుంటే ఆ నాదమే జీవికి పరమగతిని ప్రసాదిస్తుంది.

సామాన్యంగా కొందరు తుమ్ము వచ్చినా, దగ్గు వచ్చినా, కాలు నొచ్చినా శరీరానికి ఏవిధమైన బాధకలిగినా వెంటనే అప్రయత్నంగా రామా! హరీ! నారాయణా! తండ్రీ! అని ఆవేదన తెలియ పరచినట్టుగా భగవన్నామం స్మరిస్తారు. ఇది మంచి అలవాటు. బయటికి నామోచ్చారణ

చెయ్యకపోయినా, మానసికంగా లోలోపల ఓంకారాన్ని స్మరించటంకూడా మంచి అలవాటే. సామాన్యమైన శరీరవికారానికే భగవన్నామం స్మరిస్తే, అవసానదశలో తప్పక గుర్తుకు వస్తుంది. ఇదే అభ్యాస యోగం. ఓంకారం అన్నింటిని మించిన నామం, ఒకటే అక్షరం. స్మరించేందుకు కూడా సులువు. సంయుక్తాక్షరాలు కూడా లేవు. అన్నిభాషలకు చెందిన వ్యక్తులకూ ఉచ్చరించేందుకు వీలుగా ఉంటుంది. నిఘంటువుల సాయంలేకుండా అర్థ నిరపేక్షంగా ఆస్వాదించదగిన ఏకాక్షరపదం. దీన్ని శ్వాసలో భాగంగా చేసుకో గలిగిన నిత్యయోగులు పరమధన్యులు. ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు అనుగుణంగా ప్రతివ్యక్తీ ఏదో ఒక భగవన్నామాన్ని తన జీవితక్షణాలతో మిళితం చేసుకోవాలి. ఆ మాట స్మరించగానే పరమాత్మ స్ఫురించాలి. ఆ నామాన్ని ఎంత ఎక్కువగా స్మరిస్తే అంత ప్రభావం దానిలో ఉంటుంది. నామధారియైన ప్రతి జీవధారికూడా సర్వధారియై సర్వకాల సర్వావస్థలలో సర్వేశ్వరుని స్మరిస్తూఉంటాడు. అందువల్ల నామాన్ని మించిన నియమం లేదు. మానసికమైన నామస్మరణకు చిహ్నంగా పంగనామాలు బయలుదేరాయి. కాని, కాలక్రమంలో పంగనామాలు మిగిలి, అసలు నామాలు లోపించటం, కొన్నాళ్ళకు ఆ నామాలుకూడా పోవటం విచారకరమైన విషయం. మనస్సులో స్థిరంగా నెలకొన్న నామం చివరకు తారక మవుతుంది.

అందువల్లనే అనన్యభావనతో పరమాత్మను స్మరించాలని గీతాచార్యుడు సూచిస్తాడు. నిత్యయుక్తుడైన యోగి 'సతతం', 'నిత్యశః' పరమాత్మను స్మరిస్తూ ఉంటాడు. కాబట్టి అతనికి మృత్యుభయం ఉండదు. చివరి దశలో భగవంతుని స్మరించిన వాళ్ళకు పునర్జన్మ ఉండదు. అయితే ఇక్కడ ఒక సందేహం వస్తుంది. చివరి దశలో పరమాత్మను స్మరించకపోతే, జీవితంలో చేసిన సాధన అంతా వ్యర్థమయిపోతుందా? ఈ సందేహం అర్జునుడికి వచ్చిఉంటుంది. కాని అడగకుండానే కృష్ణుడు గమనించి తనంతట తానే దానికి సమాధానం చెప్తాడు.

కైవల్యపదంకోసం చేసిన సాధన ఎప్పుడూ వ్యర్థం కాదు. భూలోకం భువర్లోకం, సువర్లోకం, మహర్లోకం, జనోలోకం, తపోలోకం, సత్య (బ్రహ్మ)

లోకం -- అని ఏడులోకాలున్నాయి. ఆ పయిది వైకుంఠం. బ్రహ్మనిర్వాణం పొందలేని సాధకులు తమతమ సాధన ననుసరించి యీ యేడు లోకాలలో ఏదో ఒక లోకానికి వెళుతారు. కాని, భూలోకంనుంచి బ్రహ్మలోకంవరకు ఏ లోకానికి వెళ్ళినా, మళ్ళీ తిరిగిరావలసిందే. కాని బ్రహ్మనిర్వాణంపొందిన పరమయోగి తిరిగి రాడు. ఈ లోకాల కాలమానాలు వేరువేరుగా ఉంటాయి మనుష్య (భూ) లోకంలో వెయ్యియుగాలు గడిస్తే బ్రహ్మలోకంలో ఒకదినం గడిచినట్టు. కాలమానంలోని యీ భేదం తెలిసిన యోగికి రాత్రింబవళ్ళ రహస్యం తెలుస్తుంది. మిగిలిన వాళ్ళకు తెలియదు. భూలోకంలోనే ఒకరికి పగలయితే మరొకరికి రాత్రి. కాబట్టి పగలు, రాత్రి దేశ కాల సాపేక్షములే కాని, నిరపేక్షములు కావు. మనకు పగలయితే, అందరికీ అది పగలు కావలసిన పని లేదు. మనకు వసంతమైతే మరొకరికి హేమంతం కావచ్చు. మనకు ఉత్తరాయణమైతే మరొకరికి దక్షిణాయనం కావచ్చు. ఒకరికి శుక్లపక్షమయినది మరొకరికి కృష్ణపక్షం కావచ్చు. మనకు పున్నమవెన్నెల కాసినట్టు, చంద్రమండలంలోని జీవులకు పుడమివెన్నెల మరో సమయంలో కనిపించవచ్చు. ఇలా ఏడు లోకాలలో ఏడు రకాల కాలమానాలు ఉంటాయి కాబట్టి కాలానికి ఒకప్రమాణం లేదు.

బహిర్లోకాల కాలమానంలో భేద మున్నట్టుగానే, అంతర్లోకానికి కూడా వేరే కాలమానముంది. పగలంతా పదహారు గంటలుగా గడిస్తే, నిద్ర పోయే ఎనిమిదిగంటలూ ఒక గడియగా గడిచిపోతాయి. చీకటి గదిలో కళ్ళుమూసుకొని పండుకుంటే, పండువెన్నెల కలలో కనిపిస్తుంది. ఇది అంతర్లోకంలోని ఆలోకం వెలయించే దేశ కాల పరిస్థితి. ఈ మనఃస్థితి మనిషిసంస్కారాన్ని వ్యక్తం చేస్తుంది. అవసానదశలో మనస్సు ఏ స్థితిలో ఉంటే అలాంటి లోకాలు లభిస్తాయి. బాహ్యాజగత్తులో శుక్లపక్షం, కృష్ణపక్షం, పగలు, రాత్రి, ఉత్తరాయణం, దక్షిణాయనం, వెలుగు, పొగ ఉన్నట్టే, అంతర్జగత్తులో కూడా ఇవన్నీ ఉన్నాయి. చివరిదశలో -- లోపల వెలుగు, వెచ్చదనం, పగలు, వెన్నెల, ఉత్తరోత్తర గమనం -- ఇలాంటి భావాలుంటే, ఆ దశలో దేహత్యాగం చేసిన బ్రహ్మవేత్త బ్రహ్మలో లీనమైపోతాడు. అలాకాక -- పొగమంచు, రాత్రి, చీకటి, దక్షిణాభిముఖ

గమనం -- ఇలాంటిభావాలుంటే, యోగి చంద్రమండలం చేరుకొని, మళ్ళీ తిరిగివస్తాడు. ఈ రెండు మార్గాలలో ఒకటి తెలుపు, మరొకటి నలుపును సూచిస్తాయి. ఇవి సనాతనమైన మార్గాలు. శుక్లమార్గంలో వెళ్ళినవాడు తిరిగి రాడు. కృష్ణమార్గంలో వెళ్ళినవాడు తిరిగి వస్తాడు. ఈ రెండు దారులను (సృతులను) సమగ్రంగా తెలుసుకున్నవాడు పొరబడడు. పరతత్త్వం అతనికి కరతలామలకమయి ఉంటుంది. కాబట్టి సర్వకాల సర్వావస్థలయందు అగ్ని, జ్యోతి, పగలు, ఉత్తరాయణం ఇలాంటి భావాలతో యోగయుక్తుడై ఉండాలి. కుండలిని మూలాధారంనుంచి సహస్రారంవరకు పైకి ప్రసరింపజేయటం ఉత్తరాయణం. అలా ఊర్ధ్వముఖంకాక, అధోముఖంగా మూలశక్తిని అణచివేయటం దక్షిణాయనం. కనిపించే కాలమానం, కాలచిహ్నాలు కాలాన్ని జయించిన ఆత్మకు లేవు. ఆత్మ లోకంలోని కాలమానాలే వేరు.

బ్రహ్మలోకంలో -- తెల్లవారితే జీవకోటి ఉదయిస్తుంది. చీకటి పడితే ప్రళయం వస్తుంది. ఇలా బ్రహ్మాండంలో అనేక జీవకోటి మాటిమాటికి ప్రభవిస్తూ, మాటిమాటికి లయిస్తూ ఉంటుంది. కాని సకలచరాచరసృష్టి నశించినా, అక్షయంగా అవ్యయంగా సనాతనంగా ఉండే సచ్చిదానంద స్వరూపం ఒకటి ఉంది. అది అవ్యక్తం. అక్షరం. అక్షరపరబ్రహ్మ స్వరూపమైన యీ పరంధామం భక్తివల్లనే లభిస్తుంది. వేరే మార్గం లేదు. పురుషోత్తమ భావంతో పరమాత్మను తదేకనిష్ఠతో ధ్యానించటంవల్ల నిశ్చలమైన భక్తి కుదురుతుంది. నిశ్చలమైన భక్తి కుదిరిన యోగికి వేదశాస్త్రాలతో, యజ్ఞయాగాలతో, జప తపాలతో, దాన ధర్మాలతో పనిలేదు. అన్నింటికి సారం భక్తి.

భక్తిలోనే జ్ఞానం, విజ్ఞానం, కర్మ, బ్రహ్మ -- సమస్తం ఉన్నాయి. అనన్య భక్తితో పరమాత్మను ధ్యానిస్తూ 'సర్వం సర్వేశ్వరుని లీలావిలాస'మనే భావనతో చేసిన పనులన్నీ బ్రహ్మవిద్యకు దారి చూపిస్తాయి. బ్రహ్మను తెలుసుకోవటమంటే ఆత్మను అవగాహన చేసుకోవటం. ఆత్మను దర్శించిన ద్రష్టకు పరమరహస్యమైన జ్ఞానం, విజ్ఞానం అవలీలగా అర్థమయిపోతాయి. పరబ్రహ్మస్వరూపమైన ఆత్మను సాక్షాత్కరించుకోవటమే రాజవిద్య, రాజ

యోగం. రాజయోగులకుమాత్రమే తెలిసిన పరమగోప్యమైన విషయం కాబట్టి ఇది రాజగుహ్యం. అతిపవిత్రమై, అత్యుత్తమమై, ధర్మసమ్మతమైన సుఖాన్ని ప్రసాదించే యీ రాజవిద్య, ప్రత్యక్షంగా చూచి అర్థంచేసుకోవాలే కాని, మాటలతో చెపితే బోధపడేది కాదు. ఈ రహస్యంలో నమ్మకంలేని అవివే-కులు, నన్ను (పరమాత్మను) చేరలేక, మధ్యలోనే తిరిగి సంసారకూపంలో పడిపోతారు.

ప్రపంచంలో కనిపించకుండా, సూక్ష్మరూపంలో నేను అంతటా వ్యాపించి ఉన్నాను. నానుండి ఉదయించిన జీవకోటి నాలోనే చేరి ఉన్నాయి. వాళ్ళలో నేను లేను. అవికూడా నాలో లేవు. అదే చమత్కారం. ఈ విచిత్రమైన దృశ్యం చూస్తేగాని బోధపడదు. ప్రాణికోటిని సృష్టించిన నేను, ప్రాణులలో లేకుండానే, నా ఆత్మతత్త్వాన్ని ప్రాణుల రూపంలో వెలయింపజేస్తున్నాను. నాలోని అవ్యక్తచైతన్యం జీవులలో వ్యక్తమవుతున్నది. అవ్యక్తంనుంచి వ్యక్తం ఉదయించింది. కాని వ్యక్తంలో అవ్యక్తం ఉండదు. ఆకాశంలో కనిపించని గాలి సంచరిస్తున్నట్టుగా, నానుండి జీవకోటి ఉద-యిస్తున్నది. కాని నాలోనే ఉండటం లేదు. గాలిలో ఆకాశం ఉండనట్టు నేనుకూడా జీవకోటిలో ఉండటం లేదు.

సృష్టి ఆరంభమయ్యేప్పుడు జీవకోటి నానుంచే ఉదయిస్తుంది. కల్పాం-తంలో మళ్ళీ నాలోనే లయిస్తుంది. మాటిమాటికి జీవకోటిని వెలయిం చటం, విలీనం చెయ్యటం నా స్వభావం. ప్రకృతి నాచేత బలవంతంగా ఇలా సృష్టిలయాలను చేయిస్తుంది. కాని, వాటికి అతీతంగా, ఉన్నతమైన స్థాయిలో ఉన్నందువల్ల, నన్ను కర్మబంధం బాధించదు. నా ఆధ్వర్యంలో నేను చెప్పినట్లు ప్రకృతి సచరాచర జగత్తును సృష్టిస్తుంది. ప్రభవం, విభవం, ప్రళయం -- ఇలా ప్రపంచం పరిణామచక్రంలో పరిభ్రమిస్తూ ఉంటుంది. కాని, సామాన్య మానవులు నా నిజస్వరూపాన్ని తెలుసుకోలేక, నేనుకూడా వాళ్ళలాంటి దేహధారినని భావిస్తారు. అల్పజ్ఞులైన వ్యర్థజీవులు రాక్షసబుద్ధితో నా స్వరూప స్వభావాలను అర్థం చేసుకోలేక, పనికిరాని పనులు చేస్తుంటారు. కాని మహనీయులు కొందరు మంచివాళ్ళు దైవచింతనతో నాలోని అక్షర

తత్త్వాన్ని తెలుసుకొని, చలించని మనస్సుతో నన్ను భజిస్తారు. సకల చరాచరసృష్టికి నేను కారకుడనని వాళ్ళకు తెలుసు.

నన్ను ఆరాధించేందుకు అనేక మార్గాలు ఉన్నాయి. గట్టి సంకల్పంతో, నిశ్చలమైన భక్తితో కొందరు నా గుణగణాలను కీర్తిస్తారు. కొందరు నమస్కరిస్తారు. మరికొందరు నిత్యయుక్తులై ఆరాధిస్తారు. కొందరు జ్ఞానయజ్ఞంతో నన్ను ఉపాసిస్తారు. కొందరు జీవబ్రహ్మైక్యభావంతో నన్ను సేవిస్తారు. మరికొందరు ఈశ్వర భావంతో పూజిస్తారు. అనేకులు అనేకవిధాలుగా నన్ను భజిస్తారు. ఎవరు ఏ భావంతో సేవిస్తే, వాళ్ళకు ఆ రూపంలోనే నా అనుగ్రహం లభిస్తుంది. కర్మకాండను నేనే, యజ్ఞాన్ని నేనే, మంత్రాలు నేనే, అర్చన నేనే, ఆహుతి నేనే, అగ్ని నేనే, ఆజ్యం నేనే. ప్రపంచానికి తల్లిని, తండ్రిని, తాతను, ధాతను నేనే. వేదత్రయంలో ప్రణవాన్ని నేను. దారి చూపేవాణ్ణి నేనే, సరియైన దారిని వెళ్ళుతుంటే చూచేవాణ్ణికూడా నేనే. అందరికీ యజమానిని, యోగక్షేమాలు విచారించే మిత్రుణ్ణి, ఆశ్రయమిచ్చే ఆధారాన్ని, సృష్టి స్థితి లయాలకు మూల కారణం నేనే. ఎండ కాచేందుకు, వాన కురిసేందుకు, పట్టుకునేందుకు, విడిపించేం-దుకు, జీవించేందుకు, మరణించేందుకు, మంచికీ, చెడుకూ -- అన్నింటికీ నేనే కారణం.

ఋగ్యజుస్సామ వేదాలలో చెప్పబడిన విహితకర్మలను ఆచరించిన తపోధనులుకూడా పుణ్యలోకాలలో దివ్యభోగాలను అనుభవిస్తారు కాని, పుణ్యం క్షీణించగానే మళ్ళీ మర్త్యలోకంలోకి దిగివస్తారు. కాని, అనన్యభావంతో నన్ను ఉపాసించే నిత్యయుక్తులైన భక్తుల యోగక్షేమాలను నేను చూచుకుంటాను. ఇతరదైవములను కూడా శ్రద్ధాభక్తులతో సేవించేవారి అర్చనలుకూడా, నాకే చెందుతాయి. కాని, నేరుగా చేరకుండా మధ్యవర్తిద్వారా కొంచెం ఆలస్యంగా చేరుతాయి. ప్రజానీకం చేసే యజ్ఞయాగాదులకు నేనే అధిపతిననే విషయం తెలియక, చాలమంది చెడిపోతారు. దేవతలను ఆరాధించినవాళ్లు దేవతలను పొందుతారు. పితృదేవతలను తృప్తిపరచినవాళ్లు పితృదేవతల అనుగ్రహానికి పాత్రులవుతారు. భూతాలను సేవించినవాళ్లు ఆ యా విభూతిని సాధిస్తారు. కాని నన్ను కొలిచినవాళ్లు నన్నే పొందుతారు.

తనలో ఉన్న పరమాత్మను ఆరాధించటం చాలా సులభం. స్థూల రూపంలో నన్ను పూజించేందుకుకూడా ప్రభూతమైన ద్రవ్యం అక్కరలేదు. తులసీదళం చాలు. విచ్చిన పువ్వు చాలు. ఏమీ లేకుంటే, దోసిలి నిండా నీళ్ళు తీసుకొని అర్ఘ్యం ఇస్తే చాలు. కాని ఏమి ఇచ్చినా భక్తితో ఇవ్వాలి. నీవు చేసిన పని, నీవు తిన్న ఆహారం, నీవు చేసిన యజ్ఞం, నీ విచ్చిన దానం, నీవు ఆచరించిన తపస్సు భక్తితో నాకు అర్పిస్తే చాలు. నీవు చేసే ప్రతికార్యం ఈశ్వర కైంకర్యమే. ప్రత్యేకంగా పూజలూ, పునస్కారాలూ చేయవలసిన పని లేదు. చేసే పని ఈశ్వరార్పణం అనుకొని చేస్తే చాలు. చేసిన పనివల్ల లభించే శుభాశుభాలతో నీకు ప్రమేయం ఉండదు. కర్మబంధం తొలగి జన్మరాహిత్యం లభిస్తుంది.

నాకు ఒకరిమీద ఇష్టం, మరొకరిని చూస్తే ద్వేషం లేవు. అందరూ నాకు సమానులే. భక్తితో నన్ను భజించేవాళ్లు నా వాళ్లు. నేను వాళ్లవాడిని. ఎంత చెడ్డవాడయినాసరే. నాయందు భక్తి కుదిరితే వాడి రోజులు తిరిగినట్టే. మొదటినుంచి ఆరాధించే సాధువుకన్నా అతనే ఎక్కువ భక్తితో నన్ను సేవిస్తాడు. అతని నిష్ఠకు తిరుగులేదు. నన్ను నమ్మినవానికి శాశ్వతశాంతి తథ్యం. నా భక్తుడు నశించడు. ఇది నా ప్రతిజ్ఞ. ఎంత నీచకులంలో పుట్టినా సరే, భక్తి కుదిరితే చాలు. జీవితం తరించిపోతుంది. కాబట్టి, నాయందు మనస్సు పెట్టి, నన్ను భక్తితో నమస్కరించి, నన్నుగురించే నిరంతరం ధ్యానిస్తూ, నన్ను ఆరాధించే ఆత్మయోగికి, ఆత్మసాయుజ్యం తప్పక లభిస్తుంది.

ఇలా కృష్ణుడు చెప్పుకుపోతున్నాడు, అర్జునుడు వింటూ ఉన్నాడు. అనంతుడు తన అనంత విభూతినిగురించి అడగకుండానే చెప్తూఉంటే, అమృతాయమానంగా పార్థుడు విని పరవశుడు అయిపోతున్నాడు. రాజ విద్యనుండి విభూతిలోకి ప్రవేశించాడు. సంఖ్యం (యుద్ధం) నుంచి సాంఖ్యం, సాంఖ్యంనుంచి యోగం, యోగంనుంచి ధ్యానం, ధ్యానంనుంచి జ్ఞానం, జ్ఞానంనుంచి విజ్ఞానం, విజ్ఞానంనుంచి విద్య, - విద్యనుంచి విభూతి - ఇలా అంచెలంచెలుగా అర్జునుని భావరథాన్ని బావగారు చక్కగా నడుపుతున్నారు.

విభూతియోగంలోకి ప్రవేశించేసరికి ప్రశ్నలతో ప్రమేయం లేకుండానే ప్రవ-చనం సాగిపోతుంది. "నీ మేలుకోసం, నీ ఆనందంకోసం పరమరహస్యమైన పరమార్థాన్ని మళ్ళీ ఒకసారి చెపుతున్నా" నని ఆరంభిస్తాడు కృష్ణుడు.

దేవతలకు, ఋషులకు ఆదికారణమైన నన్ను, మహర్షులు కాని, దేవతలు కాని సమగ్రంగా తెలుసుకోలేరు. అక్షరపరంగా అచ్చులు దేవతలు. హల్లులు ఋషులు. సకల వర్ణసమామ్నాయానికి మూలకారణమైన ఓంకారాన్ని నేను. లౌకికంగా సర్వలోక మహేశ్వరుణ్ణి నేను. ఇలా నన్ను అర్థంచేసుకుని ఆరాధించే ఆత్మయోగికి పాపం అంటదు. అతనికి కావలసిన బుద్ధిని, జ్ఞానాన్ని, వివేకాన్ని, ఓర్పును, సత్యనిష్ఠను, శమదమాది సాధనసంపదను నేనే ప్రసాదిస్తాను. కష్టసుఖాలు, ఉత్పత్తిలయాలు, హింసను వదలి అందరినీ సమానంగా చూడగలిగే సాత్త్వికదృష్టి, తుష్టి, తపఃపుష్టి, దానబుద్ధి, కీర్తి, అపకీర్తి -- అన్నీ నావల్లనే ఏర్పడుతాయి. మనుష్యులే కాదు. ఏడుగురు మహర్షులు, అంతకుముందున్న సనక సనందనాదులు నలుగురు, మను మహారాజులు -- అందరూ నా సంకల్పంచేత నా ఆశయాలతో ప్రభవించిన ప్రబుద్ధులే. ఇలా అంతులేని నా ఐశ్వర్యాన్ని సాంగోపాంగంగా సరహస్యంగా తెలుసుకొన్న తత్త్వవేత్తకు నిశ్చలమైన యోగం కుదురుతుంది. అన్నింటికి ఆది కారణమైన నన్ను బుద్ధిమంతులు పరిపరివిధాల భావించి సేవిస్తూ ఉంటారు. ఒకరికి తెలియని విషయాలు మరొకరివల్ల తెలుసుకునేందుకు ప్రయత్నిస్తాను. వాళ్ళ మనస్సులో ఉదయించిన నిజమైన జిజ్ఞాసను గమనించి నేను వాళ్ళకు కావలసిన బుద్ధిబలాన్ని, ఆలోచనాశక్తిని, నిశ్చలమైన భక్తిని, సకలభూతములయందు సమానమైన అనురక్తిని ప్రసాదిస్తాను. ఒకరితో ఒకరు సంప్రదించుకొని నా విభూతిని కొనియాడుతూ వాళ్ళల్లో వాళ్ళు తన్మయులయిపోతూ ఉంటారు. వాళ్ళ భక్తికి మెచ్చుకొని, వాళ్ల మనస్సులో శేషించిన అజ్ఞానతిమిరాన్ని పారద్రోలి జ్ఞానాన్ని వెలిగిస్తాను.

ఇలా చెప్పుకొనిపోవటమేకాని, తనవిభూతి ఇలా ఉంటుంది -- అని నిదర్శనంగా తన నిజ స్వరూపం చూపించటం లేదని అర్జునుని మనస్సులో కుతూహలం ఏర్పడుతుంది. కాని అంత సూటిగా తన కోరిక చెప్పకుండా,

పరమవిభూతిని ప్రశంసించటం మొదలు పెడతాడు. "నీవే పరబ్రహ్మావు, పరంధాముడివి, పరమపవిత్రమైన దివ్యపురుషుడివి. ఆద్యంతములు లేని శాశ్వతవైభవం నీది. దేవతలు, ఋషులు అందరూ నీ ఘనతను కీర్తిస్తారు. నీవుకూడా చెప్పావు. నీవు చెప్పిన మాటలన్నీ నిజమే. ఒప్పుకుంటాను. నీ యంతట నీవు నిన్నుగురించి చెపితేకాని, దేవతలకుకూడా నీ దివ్యతేజస్సులో ఉన్న రహస్యం గోచరించదు. సకలజీవకోటికి ప్రభువైన నీవు పురుషోత్త-ముడివి. దేవదేవుడివి, లోకేశ్వరుడివి. కాని, ప్రపంచంలోని ప్రతి కణంలో నీ విభూతి ఎలా వ్యాపించిఉందో నాకు ఇంకా విస్తారంగా, నిశ్శేషంగా, సాంతంగా, సమగ్రంగా చెప్పాలి. నిన్ను ఏ రూపంలో ధ్యానించాలి. ఏ రూపంలో భావించాలి. ఏ రూపంలో నీ రూపును చూచేందుకు వీలుంటుంది -- ఈ విషయాలన్నీ విశదంగా చెప్పు. ఎంత చెప్పినా తనివిదీరని నీ వచనామృతం ఇంకా ఇంకా వినాలని ఉంది." ఇలా అర్జును డన్నమాటల్లో అతని వైఖరి ఎంత మారిందో స్పష్టంగా గోచరిస్తుంది. సందేహాలు నశించి సంతోషంగా దివ్యరూప సందర్శనంకోసం అతని మనస్సు ఉవ్విళ్లూరుతున్నది. కాని, రూపసందర్శనం కోరలేదు. అడగబోయి ఆగాడు. దివ్యవిభూతి కోరాడు. పరమాత్ముడు వెంటనే ప్రసాదించాడు.

నా దివ్యవిభూతి ఎక్కడెక్కడ గోచరిస్తుందో ముఖ్యమైన స్థానాలు చెప్తాను. అనంతమైన విభూతితో నేను అందరిలో అంతటా నిండి ఉంటాను. ఆది, మధ్య, అంతం నేనే. ద్వాదశాదిత్యులలో (అదితి కన్న సంతతిలో) విష్ణువును నేను. విశ్వమే విష్ణుస్వరూపం. వెలుగును ప్రసాదించే జ్యోతిర్మయ గోళాలలో సూర్యుణ్ణి నేను. నానారకాల వాయువుల్లో మరీచిని (కిరణసమీరం) నేను. చుక్కల్లో చంద్రుణ్ణి నేను. వేదాలలో సామవేదాన్ని నేను. సమత్వం, సంగీతం, సామరస్యం సామవేదానికి సారం. దేవతలలో దేవేంద్రుణ్ణి నేను. సకలేంద్రియ సమూహంలో మనస్సును నేను. జీవకోటిలో చైతన్యాన్ని నేను. రుద్రులలో మంచిని పెంచే శంకరుణ్ణి నేను. యక్షరాక్షస సంఘంలో కుబేరుణ్ణి నేను. పురోహితులలో దేవతలకు గురువైన బృహస్పతిని నేను. సేనాపతులలో కుమారస్వామిని నేను. జలాశయాల్లో జలనిధిని నేను. మహర్షులలో భృగుమహర్షిని నేను. వాక్కులలో ఏకాక్షరమైన

ప్రణవపదాన్ని నేను. యజ్ఞాలలో జపయజ్ఞాన్ని నేను. నిలకడగా నెలకొన్న పర్వతాల్లో పార్వతిని గన్న హిమవత్పర్వతాన్ని నేను. చెట్లల్లో రావిచెట్టును నేను. దేవర్షులలో త్రిలోకసంచారియైన నారదుణ్ణి నేను. నరులకూ నారాయణునికీ మధ్యవర్తిగా నారత్వాన్ని ఏర్పికూర్చే నారదుడు బ్రహ్మ మానసపుత్రుడు -- సత్యం అతనికి జన్మస్థానం. గంధర్వుల్లో చిత్రరథుణ్ణి నేను. సిద్ధుల్లో కపిలుణ్ణి నేను.

మనుష్యుల్లో, మహర్షుల్లో, దేవతల్లో, గంధర్వుల్లోనే కాదు, పశు పక్ష్యాదుల్లో, వృక్షాల్లో, అస్త్రాల్లో, శస్త్రాల్లోకూడా నా విభూతి వ్యాపించి ఉంది. క్షీరసాగరమథనంలో వెలువడిన ఉచ్చైశ్శ్రవమనే గుఱ్ఱాన్ని నేను. నా వైకుంఠంలో ఏ మూలన నేను కూర్చునిఉన్నా అన్ని లోకాలలో ధ్వని నా చెవులలోకి ప్రవేశిస్తుంది. అమృతం నా జన్మస్థానం. అలాగే ఉద్భవించిన ఐరావతమనే ఏనుగునుకూడా నేనే. ప్రజలను పాలించే రాజులో నా అంశ ఉంది. ఆయుధాల్లో వజ్రాయుధాన్ని నేను. ఆవుల్లో కామధేనువును నేను. మమకారాన్ని పెంచే మనుష్యసంతతిని వృద్ధిచేసే మన్మథుణ్ణి నేను. మహాసర్పాలనదగిన నాగజాతి పాముల్లో అనంతుణ్ణి నేను. అనంతుడు నాకు చక్కని పాన్పుగా పనికివస్తాడు. భూభారాన్నికూడా మోస్తాడు. జలచరాల్లో వరుణదేవతను నేను. పితృదేవతల్లో అర్యముణ్ణి నేను. సంయమం నేర్పేవాళ్ళలో యమధర్మరాజును నేను. మృత్యుభయంతో మర్త్యులు ఎంత పనైనా చేస్తారు. మృత్యువుకూడా మూలశక్తికి భయపడే ప్రాణుల ప్రాణాలను హరిస్తుంది. రాక్షసవంశంలో పుట్టి ఆ వంశాన్ని తరింపజేసిన ప్రహ్లాదుణ్ణి నేను. సకలచైతన్యాన్ని కబళించే కాలాన్ని నేను. అడవిమృగాల్లో సింహాన్ని నేను. పక్షుల్లో గరుడపక్షిని నేను. ప్రసరించే పదార్థాల్లో వాతావరణాన్ని పవిత్రంచేసే పావన పవనాన్ని నేను. శస్త్రధారుల్లో శాంతమూర్తి అయిన రామమూర్తిని నేను. మత్స్యాల్లో మొసలిని నేను. నదుల్లో గంగను నేను.

ఇన్ని రకాలుగా చెప్పనక్కరలేదు. ఈ చరాచరసృష్టికి మొదలు, తుద, మధ్యభాగం -- అన్నీ నేనే. తెలిసికొనవలసిన విద్యలలో రాజ విద్యయైన

అధ్యాత్మవిద్యను నేను. వాద్యాలలో నాదాన్ని నేను. అక్షరాల్లో అకారాన్ని నేను. వేరు వేరుగా ఉన్నవాటిని సమకూర్చే సమాసాల్లో ద్వంద్వసమాసాన్ని నేను. ఎంత జరిగినా తరగని అనంత కాలాన్ని నేను. ఎక్కడ చూస్తే అక్కడ కనిపించే ధాతయ్యను నేను. తల్లిదండ్రులకు తండ్రినయిన తాతయ్యను నేను. జననం నేను. మరణం నేను. గతాగతాలకు కారణం నేను. స్త్రీలలో శోభించే శ్రీమతి, హ్రీమతి, కీర్తిమతి, మతి, స్మృతి, ధృతి, శ్రుతి నేను. ప్రతి పురుషునిలోని పరమేశ్వరుడు, ప్రతి స్త్రీలోని పరమేశ్వరి నాకు ప్రతిరూపాలే.

సామగానంలోని వేదనాదంలో చెవుల కింపయిన బృహత్ సామాన్ని నేను. వేదమంత్రాల్లో వేదమాతయైన గాయత్రీమంత్రాన్ని నేను. మాసాలలో మార్గశిరమాసాన్ని నేను. పరమపదాన్ని చేరుకునే ప్రశస్తమార్గానికి శీర్ష స్థానంలో ఉన్న మార్గశిరం (అగ్రహాయణం) సాక్షాత్ పరమాత్మస్వరూపం. అలాగే ఋతువుల్లో వసంతఋతువు పరమానందకరంగా ఉంటుంది కాబట్టి, అందులోని ఆనందాన్ని నేను. మోసంచేసేవాటిల్లో జూదాన్నిగా ఉంటాను. తేజోవంతుల్లో తేజస్సుగా కూడా ఉంటాను. బలవంతుల్లో జవ సత్త్వంగా, విజయవంతుల్లో జయంగా, పరిశ్రమ చేసేవాళ్ళల్లో పట్టుదలగా ఉంటాను. వృష్ణి వంశంలో వాసుదేవునిగా, పాండవుల్లో ధనంజయుణ్ణిగా కూడా నేనే ఉన్నాను. ఈ మాట ధనంజయునికే చెప్తున్న విషయం జాగ్రత్తగా గమనించాలి. 'మీ వాళ్ళలో నీవు నేను' -- అంటే విచిత్రంగా ఉంది. మునులలో వ్యాసమహామునిని నేను. కవులలో శుక్రాచార్యుణ్ణి నేను. దండించేవాళ్ళల్లో దండాన్ని నేను. జయాన్ని సాధించే విజయసేనలో నీతిని నేను. రహస్యాలలో మౌనాన్ని నేను. జ్ఞానులలో జ్ఞానాన్ని నేను. ఇలా ఎన్ని పదార్థాలు నీకు కనిపిస్తే ప్రతిపదార్థంలోని పరమార్థాన్ని నేనని గ్రహిస్తే చాలు. సకల చరాచరసృష్టిలో నేను లేని పదార్థం లేదు. స్థూలంగా కంటికి కనిపించే ముఖ్యమైన పదార్థాలను మచ్చుకు చెప్పాను. ఒక్కమాటలో చెప్పాలంటే, ఎక్కడ విశిష్టమైన విభూతి కీర్తి, శోభ, ప్రతిభ, పరాక్రమం కనిపిస్తుందో -- అది నేనని భావించవచ్చు. నాలోని ఒకలంశ అందులో ఉంటుంది.

యద్య ద్విభూతిమత్సత్త్వం శ్రీమ దూర్జితమేవ వా,
తత్త దేవావగచ్ఛ త్వం మమ తేజోఽంశసంభవమ్.

ఇక అర్జునుడు తనను ఆపుకోలేకపోయినాడు. 'ఎక్కడపడితే అక్కడ నా రూపం కనిపిస్తుందని అంటున్నాడు కదా! ఆ రూపాన్ని ఒకసారి చూపించ కూడదా!' అని అర్జునుడి ఆలోచన. అడగందే తనంతట తాను ఎందుకు చూపించాలని యదునందనుని రాజసం. చివరకు అర్జునుడే ధైర్యం చేసి నోరుతెరిచి అడుగుతాడు. తీరా అడిగినతర్వాత కాదంటే బాగుండదని, వీలయితే ఒక్కసారి నీ రూపాన్ని చూపించవలసినదని కోరుకుంటాడు.

మన్యసే యది తచ్ఛక్యం మయా ద్రష్టు మితి ప్రభో!
యోగేశ్వర! తతో మే త్వం దర్శయాత్మాన మవ్యయమ్.

నాకు చూచే అధికారం ఉంటే పరమయోగులు చూచే పరమైశ్వర్య స్వరూపాన్ని, అవ్యయమైన ఆత్మరూపాన్ని చూపించవలసిందని యోగేశ్వరు డైన కృష్ణుణ్ణి ప్రార్థిస్తాడు. అడిగిందే తడవుగా ఆత్మీయుడైన పరమాత్మ 'పశ్య' (చూడు) అని వెంటనే తన దివ్య రూపాన్ని చూపిస్తాడు. అర్జునుడు తన చర్మచక్షువులతో ఆ రూపాన్ని చూడలేడని కృష్ణునికి తెలుసు. కాని ముందుగా ఆ మాట చెప్పలేదు. అనేకరూపాలతో, అనేకములయిన వన్నె లను వెలయిస్తూ, వందల కొలది, వేలకొలదిగా పెరిగిపోతున్న పరమాత్మ దివ్యమంగళ విగ్రహాన్ని అర్జునుడు ఆప్యాయంగా ఆశ్చర్యంతో చూస్తు న్నాడు. ఆదిత్యులు, వసువులు, రుద్రులు, అశ్వినీదేవతలు, వాయు దేవతలు -- అంతకుముందెప్పుడూ చూడని వింత వింత దృశ్యాలు కృష్ణమూర్తిలో కనిపిస్తున్నాయి. ఇక్కడనే ఉండి ఎక్కడెక్కడి దృశ్యాలు, - వింతలు, వినోదాలు, చిత్రవిచిత్ర సంఘటనలు చూడవచ్చునని చెపుతూ రెప్పలు వాలుస్తూ తెరుస్తూ అనంతతేజోరాశిని చూచేందుకు తన రెండు కళ్ళు చాలక ఉబ్బి తబ్బిబ్బయిపోతున్న పార్థుని వాలకం గమనించి, పరమేశ్వరుడు తనంతట తానే అతనికి దివ్యదృష్టిని ప్రసాదిస్తాడు.

అబ్బ! ఆ దృశ్యం చూచి తీరాలి. యోగేశ్వరుడు తన ఐశ్వర్యాన్ని పార్థునికి కన్నులపండువుగా కనబరచిన క్షణం కలకాలం కాలమానంలో

నిలిచిపోయే చక్షుర్మహోలయం. చూస్తున్న దెవరు, చూపిస్తున్న దెవరు, చూడబడుతున్నవాళ్ళెవరూ తెలియని సమైక్యభావం విశ్వరూప సందర్శనం.

ఎక్కడ చూచినా విశ్వరూపుని అసంఖ్యాక వదనాలు, అనంత నయనాలు, అత్యద్భుతములైన రూపురేఖలు, సాటిలేని అలంకారాలు, తళతళలాడే సర్వప్రహరణాయుధాలు, ధగధగలాడే దివ్యహారాలు, ఘుమఘుమలాడే దివ్యపరిమళాలు -- ఎటు చూచినా ఏదో ఆశ్చర్యం. ఎటునుంచి చూచినా, ఆ రూపం మనలను అటునుంచి చూచినట్టు తోస్తుంది. అన్ని వైపుల సమానంగా తనచూపులను ప్రసరించిన విశ్వమూర్తి, ఒక్కసారి వెయ్యి సూర్యులు ఆకాశంలో ప్రకాశిస్తే ప్రసరించే ప్రచండకాంతితో జగజ్జేగీయమానంగా తేజరిల్లుతున్నాడు. దేవదేవుని శరీరంలోనే సకల చరాచరజగత్తు ప్రతిఫలించి కనిపిస్తూ ఉంది. ఆ విశ్వరూప సందర్శనంతో విస్మయంచెందిన పార్థుడు, పులకితగాత్రుడై ఎదుట నిలచిన దైవానికి సాష్టాంగంగా నమస్కరించి, చేతులు జోడించి, తన్మయభావంతో తదీయమైన రూపలావణ్యానికి తడబడుతూ, ధ్యానాన్ని గానంగా మార్చుకుంటున్నాడు.

"దేవదేవా! దేవాలయంలాంటి నీ దేహగేహంలో సమస్త దేవతలు, యక్ష రాక్షస గంధర్వులు, బ్రహ్మ విష్ణు మహేశ్వరులు, మహర్షులు కనిపిస్తున్నారు. గొప్పగొప్ప సర్పాలుకూడా కనిపిస్తూ ఉన్నాయి. అనేక బాహువులతో, అనేక నయనాలతో, అనేక ముఖాలతో నీ రూపానికి మొదలు, తుద, మధ్య తెలియటంలేదు. ప్రపంచమంతా నీ రూపంతో నిండినట్టు తోస్తున్నది. తలపై కిరీటం, చేతుల్లో గద, చక్రం ధరించిన నీ తేజస్సు రగులుకొన్న అగ్నిలా, మండే సూర్యునిలా ధగద్ధగాయమానంగా, చూచేందుకు వీలులేకుండా నలువైపుల ప్రజ్వలిస్తూ ఉంది. అక్షరమైన పరతత్త్వం నేనని నీవు చెప్పినమాట అక్షరాల నిజం. నిన్ను తెలుసుకుంటే ప్రపంచాన్ని తెలుసుకున్నట్టే. నిన్ను మించిన పరతత్త్వం ప్రపంచంలో లేదు. శాశ్వతంగా ధర్మాన్ని నిలబెట్టేందుకు కంకణం గట్టుకున్న సనాతన ధర్మకర్తవు నీవు. ఆది మధ్యాంతములు లేని నీ అనంత పరాక్రమం, అనంత బాహుబలం, సూర్య చంద్రుల్లాంటి జ్యోతిర్నయనాలు, అగ్నిలా ప్రజ్వలించే ప్రచండవదనం ప్రపంచాన్నంతా తపింపచేస్తున్నట్టు తోస్తున్నది. భూమ్యాకా-

శాలను ఆవరించిన నీ రూపం దశదిశల్లో వ్యాపించినట్టు కనిపిస్తూ ఉంది. ఇంతటి ఉగ్రరూపాన్ని చూచి మూడు లోకాలు కంపించి పోతున్నాయి. సకలదేవతలు నీలో ప్రవేశించి పోతున్నారు. కొందరు భయభీతులై ఏవేవో చెప్పుకుంటున్నారు. మహర్షులు, సిద్ధులు ప్రశస్తమైన ప్రశంసలతో నిన్ను స్తుతిస్తున్నారు. ఏకాదశ రుద్రులు, ద్వాదశాదిత్యులు, అష్టవసువులు, సిద్ధులు, సాధ్యులు, విశ్వేదేవతలు, అశ్వినీకుమారులు, వాయుదేవతలు, పితరులు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు -- అందరూ నివ్వెరపోయి నీ రూపాన్ని చూస్తున్నారు. భయంకరమైన నీ ఉగ్రరూపాన్ని చూచి లోకాలన్నీ గజగజలాడిపోతున్నాయి. లెక్కలేనన్ని ముఖాలు, నేత్రాలు, బాహువులు, ఊరువులు, పాదాలు, ఉదరాలు, కోరలు రంగురంగుల కాంతులను వెలయిస్తూ ఆకాశాన్ని అంటుతూఉంటే నాకు కాళ్ళకింద నేల నిలవటం లేదు. కాలాగ్నిలాగా మండుతున్న వాడి వాడి కోరలతో మిడిమిడిలాడే నీ ముఖమండలం చూస్తే నాకు దిక్కు తెలియటంలేదు. ధైర్యం చిక్కటం లేదు. నా మనస్సు కుదుటపడేట్టు శాంతించు ప్రభూ!

ధృతరాష్ట్రుని కుమారులందరూ మిగిలిన రాజాధిరాజులతో కూడా నీ కరాళవక్త్రంలో దూరిపోతున్నారు. అయ్యో! భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, ఇంకా మనవాళ్ళు కూడా ఎంతమందో నీ ముఖంలోకి చొచ్చుకొనిపోతున్నారు. ఏదో ముంచుకపోతున్నట్టు అందరూ త్వరత్వరగా నీలో చేరిపోతున్నారు. కొందరు పలువరుసమధ్యనే చిక్కుకొనిపోయినారు. వాళ్ళ తలలు తెగి కిందపడుతూ ఉన్నాయి. నదులు సముద్రంలో చేరినట్టు, దీపపుపురుగులు దీపంలో పడి ప్రాణాలు కోల్పోయినట్టు లోకాలు లోకపాలకులు, వీరాధివీరులు నీలో లయించిపోతున్నారు. జగజ్జేగీయమానంగా వెలుగుతున్న నీ ఉగ్రముఖంలో సమగ్రమైన సృష్టి పచ్చడిపచ్చడిగా నలిగిపోతూ ఉన్నది. ఇంత ఉగ్రమూర్తివని నే ననుకోలేదు. ప్రభూ! అసలు నీ వెవ్వరివో తేల్చి చెప్పు. నీ ఆద్యంతాలు నాకు బోధపడటం లేదు.

నీ వెవరివని ప్రశ్నించగానే కృష్ణుడు వెంటనే సమాధానం చెప్తాడు: "నేను కాలుణ్ణి. కాలరూపంలో లోకాలను కబళించేందుకు ఇక్కడికి వచ్చాను. నీవు చంపినా చంపకపోయినా నీ వాళ్ళంతా బ్రతకరు.

ఇంతకుముందే వాళ్ళ మరణం నేను నిర్ణయించి పెట్టాను. ఆ పని నీచేత చేయిద్దామని నా సంకల్పం. కాబట్టి వెంటనే లేచి యుద్ధం చెయ్యి. నీవు గురుభావంతో చూస్తున్న ద్రోణ భీష్మ జయద్రథు లందరూ ఇంతకుముందే నా చేతుల్లో చిక్కి ఉన్నారు. ఇక వాళ్ళెవ్వరికీ దక్కరు. కాబట్టి విచారం మాని యుద్ధం సాగించు. జయం సాధించు, ధర్మాన్ని నిలబెట్టు.

ఈ మాటలు విన్న అర్జునుడు భయంతో కంపించిపోయినాడు. కృష్ణపరమాత్మకు మాటిమాటికి నమస్కరించి గద్గదస్వరంతో వినయంగా చెప్పసాగాడు: అవును, నీ నిజస్వరూపం నా కిప్పుడు బోధపడింది. ప్రపంచం నిన్ను ప్రశంసించటం ఊరక కాదు. రాక్షసులు నిన్ను చూచి భయపడి పారిపోతున్నారు. బ్రహ్మకంటె ఉన్నత స్థాయిలో ఉన్న నీకు ఎవరైనా నమస్కరిస్తారు. ప్రపంచమంతా నీకు నివాసం. మంచిచెడ్డల కతీతమైన మహనీయస్థితిలో ఉన్న నీకు క్షరం లేదు. నీవు అక్షర పరబ్రహ్మవు. సనాతన సత్యనారాయణుడవు. తెలిసినవాడవు. తెలుసుకొనవలసినవాడవు. పంచభూతాలలో అష్టమూర్తులలో నీ తేజస్సే ఉంది. నీకు పదివేల నమస్కారాలు, కోటినమస్కారాలు, ముక్కోటి నమస్కారాలు. అన్ని వైపులనుంచి నమస్కారాలు. ఎటునుంచి చూచినా నీ ముఖం కనిపిస్తునే ఉంది. అందువల్ల అన్ని వైపులనుంచి నీకు నమస్కరిస్తున్నాను. నా అపరాధాలు క్షమించు. మా బావ కదా! -- అని సరసంగా చనువుగా ఏమేమో అన్నాను. ఎలాగో పిలిచాను. అవన్నీ మన్నించి మరిచిపో. నీవు లోకాలకే తండ్రివి. చరాచరసృష్టి నిన్ను పూజిస్తుంది. పెద్దలకంటె పెద్దవు. నిన్ను మించినవా డేమిటి, నీతో సమాన మైనవాడే లేదు. మూడు లోకాలలో నీ ప్రభావం అద్వితీయం. అందరికీ నీవు ఆరాధ్యుడవు. నా నమస్కారం కూడా స్వీకరించి నన్ను మన్నించు. తండ్రి కొడుకులను మన్నించినట్లు, స్నేహితుడు స్నేహితుని సహించినట్లు, ప్రియురాలిని ప్రియుడు ప్రేమతో చేరదీసినట్లు, నేను తెలియక చేసిన తప్పులను మన్నించు. ఇంతకుముం దెన్నడూ చూడని ఉగ్రరూపాన్ని చూచి నేను చాల ఆనందపడుతున్నాను. కొంత ఆందోళనగాకూడా ఉంది. కలత చెందిన మనస్సు కుదుటపడేటట్టు శంఖ, చక్ర, గదా, పద్మాలతో, కిరీటమండిత మస్తకంతో నీ చతుర్భుజ

రూపాన్ని, ప్రసన్న రూపాన్ని చూడాలని ఉంది. సహస్ర బాహువులను చతుర్బాహువులుగా మార్చి, నా కోరిక తీర్చు.

వెంటనే కృష్ణుడు ప్రసన్నుడై శాంతించాడు. విశ్వరూపం విష్ణురూపంగా మారింది. విష్ణురూపం కృష్ణరూపం ధరించింది. ఇలాంటి రూపలావణ్యం ప్రతిదినం చూడాలని పరమఋషులు, దేవతలు పరితపిస్తారు. కాని, వేదాధ్యయనంవల్లగాని, దానధర్మాలవల్లకాని ఇలాంటి రూపం చూడటం సాధ్యం కాదు. మనుష్యలోకంలో అసలే సాధ్యం కాదు. భక్తి ఒక్కటే దీనికి కావలసిన అర్హత. అనన్యమైన భక్తిభావంవల్లనే విశ్వరూపంలో ఉన్న విష్ణుస్వరూపాన్ని దర్శించటం సాధ్యమవుతుంది. నేను చెప్పిన పనులు, నా కిష్టమయిన పనులు నా కోసం చేస్తూ విషయవాసనలకు దూరంగా ఫలాపేక్ష లేకుండా సర్వలోకప్రియంగా లోకకల్యాణంకోసం పాటుపడే భక్తులంటే నాకు చాలా ఇష్టం. తెలిసి చేసిన కర్మయోగి తెలిసికొన్న తత్వాన్ని చూడగలుగుతాడు. చూడవలెననే కోరిక గాఢంగా ఉండాలి.

విశ్వరూపం చూచిన తర్వాత అర్జునుని మనస్సులో ఒక కొత్త ప్రశ్న ఉదయిస్తుంది. అవ్యక్తమయిన పరబ్రహ్మ -- భక్తులకోసం ఆకారాన్ని ధరిస్తాడు. కాబట్టి సాకారంగా సేవించటం మంచిదా? నిరాకారం, నిర్గుణం, నిరంజనమైన అక్షరపరబ్రహ్మను - జ్ఞానమార్గంలో సేవించడం మంచిదా? ఈ ప్రశ్నకు పరమాత్మ సమాధానం చెప్తూ భక్తియోగంలోని సౌలభ్యాన్ని వివరిస్తాడు.

నాయందు మనస్సు పెట్టి నిశ్చలమైన కర్మయోగంతో శ్రద్ధగా నన్ను ఆరాధించే భక్తులే పరమయోగ్యులు. అవ్యక్తం, అనిర్దేశ్యం, అక్షరం అయిన నిర్గుణపరబ్రహ్మను ఆత్మసంయమంతో అచంచల దీక్షతో ఆరాధించేవాళ్ళు కూడా నా అనుగ్రహానికి పాత్రు లవుతారు. కాని, నిర్గుణపరబ్రహ్మను ఆరాధించడం కష్టసాధ్యం. శరీరధారులకు మూర్తిగా భగవంతుని ఆరాధించటం సులభం. సాకారంగా సేవించినా, నిరాకారంగా భావించినా చేసిన కర్మలను పరమాత్మకు అర్పించి చేస్తే అదే యోగమవుతుంది. అలాంటి కర్మయోగులకు జ్ఞానం, భక్తి సహకరిస్తాయి. నాయందు మనస్సుపెట్టి

నన్ను ధ్యానించే యోగులు అచిర కాలంలోనే జనన మరణ సంసరణంనుంచి విడివడుతారు. కాని, మనస్సును నాయందు నిలిపి, ఫలాపేక్ష లేకుండా పనిచెయ్యటం అంత సులభమైన పని కాదు. అభ్యాసంవల్ల, వైరాగ్యంవల్ల క్రమంగా సాధించాలి. అభ్యాసంకూడా కష్టసాధ్యమని తోస్తే, చేసే పనులన్నీ భగవత్ సేవగా భావిస్తే చాలు. పనులు చేస్తూ ఫలితం పరమాత్మకు వదిలివెయ్యడం అన్నిటికంటె సులభమయిన మార్గం. నిష్కామకర్మవల్ల నిశ్చలమైన మనస్సు కుదురుతుంది. నిర్మలమైన మనస్సుకు నిశ్శ్రేయసం త్వరలో సిద్ధిస్తుంది.

జ్ఞానం పునాది. జ్ఞానం ధ్యానానికి ఆధారం. ధ్యానం చేయగా చేయగా కర్మఫలత్యాగం సిద్ధిస్తుంది. కర్మఫలత్యాగంవల్ల త్వరలో శాంతి చేకూరుతుంది. చేయవలసిన పనులను చేసితీరాలనే ధృడమైన సంకల్పం కర్మయోగం. చేసే పనులను ఎందుకు చెయ్యాలో, ఎలా చెయ్యాలో తెలిసిచెయ్యటం జ్ఞానయోగం. ఫలాపేక్ష లేకుండా చేయవలసిన పనులను సక్రమంగా చేసి, చిత్తశుద్ధిని సాధించి, అంతరంగంలోని అంతరాత్మను చూచి ఆనందించటం, తనలోనున్న ఆత్మతత్త్వాన్నే అంతటాచూచి తన్మయత్వం పొందటం నిజమైన భక్తియోగం. ఇలా కర్మ జ్ఞాన భక్తి సమన్వయంతో ఆత్మసాక్షాత్కారాన్ని పొందిన ఆత్మయోగి ఎలా ఉంటాడో? అతని లక్షణాలేవో? కృష్ణపరమాత్మ భక్తియోగానికి సారాంశంగా వివరిస్తాడు:

ఎవరినీ అతడు ద్వేషించడు. 'ద్వి' (రెండు) అనే భావం నుంచే ద్వేషం బయలుదేరుతుంది. కాని నిజమైన భక్తునికి అందరూ మిత్రులే. అందరినీ దయతో చూస్తాడు. అహంకారం, మమకారం అతన్ని అంటవు. అందరూ తనవారే, పరులే లేరు. కష్ట సుఖాలను సమానంగా సహిస్తాడు. ఎప్పుడూ ఆనందంగా తృప్తిగా ఉంటాడు. తనను తాను అదుపులో పెట్టుకొని నియమితమైన ఆచరణ కావిస్తాడు. అతని సంకల్పానికి తిరుగు లేదు. అతని మనస్సు, బుద్ధి ఈశ్వరార్పితం. అతనివల్ల ప్రపంచానికి క్షోభం కలుగదు. ప్రపంచంవల్ల అతనికి క్షోభ కలుగదు. సంతోషం, దుఃఖం అతని మనస్సును చలింపలేవు. ఫలాపేక్ష లేదు. పరాపేక్ష లేదు. పరమ పవిత్రమైన

మనస్తత్వంతో, నిర్వికారంగా నిర్మలంగా నిష్ఠతో అన్నింటికి అతీతమైన అవధూతస్థాయిలో, భక్తిని పెంచుకొనే భావయోగి పరమాత్మకు చాలా ఇష్టుడవుతాడు. సుఖం వచ్చినప్పుడు ఆనందంతో పొంగిపోడు. ఇతరుల ఔన్నత్యం చూచి అసూయపడడు. ఉన్నది పోయిందని విచారించడు. లేనిది రాలేదని కాంక్షించడు. మంచిని చెడును మంచిగానే భావిస్తాడు. శత్రువులనుకూడా మిత్రులుగానే చూస్తాడు. అవమానాన్నికూడా సన్మానంగానే భావిస్తాడు. చల్లదనం, వెచ్చదనం, కష్టం, సుఖం -- అన్నింటిని సమానంగా సేవిస్తాడు. ప్రపంచంలో జరిగే ప్రతిసంఘటనకూడా పరమేశ్వర సంకల్పమని భావిస్తాడు. నిందించినా, స్తుతించినా కోపగించుకోడు. ఉబ్బిపోడు. ఏ నాటికి ఏది లభిస్తే దానితో తృప్తిపడి అంతవరకే ప్రాప్తమని ఆనందిస్తాడు. అలాంటివాడికి ప్రపంచ మంతా ఇల్లే. ఎక్కడ కూర్చుంటే అక్కడ అతని మనస్సు సమాధిస్థితికి వస్తుంది. శ్రద్ధాభక్తులు అతనికి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు. భగవద్వచనామృతం అతనికి సంజీవని. పరమాత్మ సందర్శనం అతని ఏకైక ధ్యేయం. అలాంటి భక్తుడంటే భగవంతునికి చాలా ఇష్టం. పరమ వరేణ్యుడయిన పరమాత్మను దర్శించినవానికే ఇలాంటి నిశ్చలమైన భక్తి కుదురుతుంది. ఏనాటికైనా ఆ రూపం చూచి తీరాలి.

* * *

## అష్టమోఽధ్యాయః

# అక్షరపరబ్రహ్మయోగః

అర్జున ఉవాచ:

కిం తద్బ్రహ్మ? కిమధ్యాత్మం? కిం కర్మ? పురుషోత్తమ!
అధిభూతం చ కిం ప్రోక్త మధిదైవం కిముచ్యతే? 1

అధియజ్ఞః కథం కోఽత్ర? దేహేఽస్మి న్మధుసూదన!
ప్రయాణకాలే చ కథం జ్ఞేయోఽసి నియతాత్మభిః. 2

శ్రీ భగవానువాచ:

అక్షరం బ్రహ్మ పరమం స్వభావోఽధ్యాత్మ ముచ్యతే,
భూతభావోద్భవకరో విసర్గః కర్మసంజ్ఞితః. 3

అధిభూతం క్షరో భావః పురుష శ్చాధిదైవతమ్,
అధియజ్ఞోఽహ మేవాత్ర దేహే దేహభృతాంవర! 4

అన్తకాలే చ మామేవ స్మర న్ముక్త్వా కలేబరమ్,
యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః. 5

యం యం వాఽపి స్మర న్భావం త్యజత్యన్తే కలేబరమ్,
తం తమేవైతి కౌన్తేయ! సదా తద్భావ భావితః. 6

తస్మాత్సర్వేషు కాలేషు మా మనుస్మర యుధ్య చ,
మయ్యర్పిత మనో బుద్ధి ర్మామేవైష్య స్యసంశయమ్. 7

అభ్యాసయోగ యుక్తేన చేతసా నాన్యగామినా,
పరమం పురుషం దివ్యం యాతి పార్థానుచిన్తయన్. 8

కవిం పురాణ మనుశాసితార
మణోరణీయాంస మనుస్మ రే ద్యః,
సర్వస్య ధాతార మచిన్త్యరూప
మాదిత్యవర్ణం తమసః పరస్తాత్. 9

ప్రయాణకాలే మనసాఽచలేన
భక్త్యాయుక్తో యోగబలేన చైవ,
భ్రువోర్మధ్యే ప్రాణ మావేశ్య సమ్య
క్స తం పరంపురుష ముపైతి దివ్యమ్. 10

యదక్షరం వేదవిదో వదన్తి
విశన్తి యద్యతయో వీతరాగాః,
యదిచ్ఛన్తో బ్రహ్మచర్యం చరన్తి
త త్తే పదం సంగ్రహేణ ప్రవక్ష్యే. 11

సర్వద్వారాణి సంయమ్య మనో హృది నిరుధ్య చ,
మూర్ధ్న్యాధాయాత్మనః ప్రాణ మాస్థితో యోగధారణామ్. 12

ఓ మిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహర న్మామనుస్మరన్,
యః ప్రయాతి త్యజన్దేహం స యాతి పరమాం గతిమ్. 13

అనన్యచేతా స్సతతం యో మాం స్మరతి నిత్యశః,
తస్యాహం సులభః పార్థ! నిత్యయుక్తస్య యోగినః. 14

మా ముపేత్య పునర్జన్మ దుఃఖాలయ మశాశ్వతమ్,
నాప్నువన్తి మహాత్మాన స్సంసిద్ధిం పరమాం గతాః. 15

ఆబ్రహ్మభువనా ల్లోకాః పునరావర్తినోఽర్జున!
మా ముపేత్య తు కౌన్తేయ! పునర్జన్మ న విద్యతే. 16

సహస్రయుగ పర్యన్త మహ ర్యద్బ్రహ్మణో విదుః,
రాత్రిం యుగసహస్రాన్తాం తే ఽహోరాత్రవిదో జనాః. 17

అవ్యక్తాద్వ్యక్తయ స్సర్వాః ప్రభవన్త్యహరాగమే,
రాత్ర్యాగమే ప్రలీయన్తే తత్రైవావ్యక్త సంజ్ఞకే. 18

భూతగ్రామ స్స ఏవాయం భూత్వా భూత్వా ప్రలీయతే,
రాత్ర్యాగమేఽవశః పార్థ! ప్రభవత్యహరాగమే. 19

పరస్తస్మాత్తు భావోఽన్యోఽవ్యక్తోఽవ్యక్తాత్సనాతనః,
య స్స సర్వేషు భూతేషు నశ్యత్సు న వినశ్యతి. 20

అవ్యక్తోఽక్షర ఇత్యుక్త స్తమాహుః పరమాం గతిమ్,
యం ప్రాప్య న నివర్తన్తే తద్ధామ పరమం మమ. 21

పురుష స్స పరః పార్థ! భక్త్యా లభ్య స్త్వనన్యయా,
యస్యాన్తస్థాని భూతాని యేన సర్వమిదం తతమ్. 22

యత్ర కాలే త్వనావృత్తి మావృత్తిం చైవ యోగినః,
ప్రయాతా యాన్తి తం కాలం వక్ష్యామి భరతర్షభ! 23

అగ్ని ర్జ్యోతి రహ శ్శుక్ల ష్షణ్మాసా ఉత్తరాయణమ్,
తత్ర ప్రయాతా గచ్ఛన్తి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః. 24

ధూమో రాత్రి స్తథా కృష్ణ ష్షణ్మాసా దక్షిణాయనమ్,
తత్ర చాన్ద్రమసం జ్యోతి ర్యోగీ ప్రాప్య నివర్తతే. 25

శుక్ల కృష్ణే గతీ హ్యేతే జగత శ్శాశ్వతే మతే,
ఏకయా యాత్యనావృత్తి మన్యయాఽఽవర్తతే పునః. 26

నై తే సృతీ పార్థ! జానన్యోగీ ముహ్యతి కశ్చన,
తస్మా త్సర్వేషు కాలేషు యోగయుక్తో భవార్జున! 27

వేదేషు యజ్ఞేషు తపస్సు చైవ
దానేషు యత్పుణ్య ఫలం ప్రదిష్టమ్,
అత్యేతి తత్సర్వమిదం విదిత్వా
యోగీ పరం స్థాన ముపైతి చాద్యమ్. 28

ఓం తత్సదితి
శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జునసంవాదే అక్షరపరబ్రహ్మయోగో నామ
అష్టమోఽధ్యాయః.

* * *

## నవమోఽధ్యాయః

# రాజవిద్యారాజగుహ్యయోగః

### శ్రీ భగవానువాచ:

ఇదం తు తే గుహ్యతమం ప్రవక్ష్యా మ్యనసూయవే,
జ్ఞానం విజ్ఞాన సహితం యద్జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్. 1

రాజవిద్యా రాజగుహ్యం పవిత్ర మిద ముత్తమమ్,
ప్రత్యక్షావగమం ధర్మ్యం సుసుఖం కర్తుమవ్యయమ్. 2

అశ్రద్దధానాః పురుషాః ధర్మస్యాస్య పరన్తప!
అప్రాప్య మాం నివర్తన్తే మృత్యు సంసార వర్త్మని. 3

మయా తత మిదం సర్వం జగదవ్యక్తమూర్తినా,
మత్‌స్థాని సర్వభూతాని న చాహం తేష్వవస్థితః. 4

న చ మత్‌స్థాని భూతాని పశ్య మే యోగమైశ్వరమ్,
భూతభృ న్న చ భూతస్థో మమాత్మా భూతభావనః. 5

యథాఽఽకాశస్థితో నిత్యం వాయు స్సర్వత్రగో మహాన్,
తథా సర్వాణి భూతాని మత్‌స్థానీత్యుపధారయ. 6

సర్వభూతాని కౌన్తేయ! ప్రకృతిం యాన్తిమామికామ్,
కల్పక్షయే పున స్తాని కల్పాదౌ విసృజామ్యహమ్. 7

ప్రకృతిం స్వామవష్టభ్య విసృజామి పునః పునః,
భూతగ్రామ మిమం కృత్స్న మవశం ప్రకృతే ర్వశాత్. 8

న చ మాం తాని కర్మాణి నిబధ్నన్తి ధనంజయ!
ఉదాసీనవదాసీన మసక్తం తేషు కర్మసు. 9

మయాఽధ్యక్షేణ ప్రకృతి స్సూయతే సచరాచరమ్,
హేతునాఽనేన కౌన్తేయ! జగద్విపరివర్తతే. 10

అవజానన్తి మాం మూఢాః మానుషీం తనుమాశ్రితమ్,
పరం భావ మజానన్తో మమ భూతమహేశ్వరమ్. 11

మోఘాశా మోఘకర్మాణో మోఘజ్ఞానా విచేతసః,
రాక్షసీ మాసురీం చైవ ప్రకృతిం మోహినీం శ్రితాః. 12

మహాత్మానస్తు మాం పార్థ! దైవీం ప్రకృతి మాశ్రితాః,
భజన్త్యనన్యమనసో జ్ఞాత్వా భూతాది మవ్యయమ్. 13

సతతం కీర్తయన్తో మాం యతన్తశ్చ దృఢవ్రతాః,
నమస్యన్తశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే. 14

జ్ఞానయజ్ఞేన చాప్యన్యే యజన్తో మా ముపాసతే,
ఏకత్వేన పృథక్త్వేన బహుధా విశ్వతోముఖమ్. 15

అహం క్రతు రహం యజ్ఞ స్స్వధాఽహ మహ మౌషధమ్,
మన్త్రోఽహ మహమేవాజ్య మహ మగ్ని రహం హుతమ్. 16

పితాఽహమస్య జగతో మాతా ధాతా పితామహః,
వేద్యం పవిత్ర మోంకార ఋక్సామయజు రేవ చ. 17

గతి ర్భర్తా ప్రభు స్సాక్షీ నివాస శ్శరణం సుహృత్,
ప్రభవః ప్రలయః స్థానం నిధానం బీజమవ్యయమ్. 18

తపామ్యహ మహం వర్షం నిగృహ్ణా మ్యుత్సృజామి చ,
అమృతంచైవ మృత్యుశ్చ సదసచ్చాహ మర్జున!. 19

త్రైవిద్యా మాం సోమపాః పూతపాపా
యజ్ఞై రిష్ట్వా స్వర్గతిం ప్రార్థయన్తే,
తే పుణ్య మాసాద్య సురేన్ద్రలోక
మశ్నన్తి దివ్యా న్దివి దేవభోగాన్. 20

తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం
క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి,
ఏవం త్రయీ ధర్మ మనుప్రపన్నాః
గతాగతం కామకామా లభన్తే. 21

అనన్యా శ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే,
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్. 22

యేఽప్యన్య దేవతా భక్తా యజన్తే శ్రద్ధయాఽన్వితాః,
తేఽపి మామేవ కౌన్తేయ! యజన్త్యవిధిపూర్వకమ్. 23

అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ,
న తు మా మభిజానన్తి తత్త్వేనాతశ్చ్యవన్తి తే. 24

యాన్తి దేవవ్రతా దేవాః పితౄన్ యాన్తి పితృవ్రతాః,
భూతాని యాన్తి భూతేజ్యా యాన్తి మద్యాజినోఽపి మామ్. 25

పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి,
తదహం భక్త్యుపహృత మశ్నామి ప్రయతాత్మనః. 26

యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్,
యత్తపస్యసి కౌన్తేయ! తత్కురుష్వ మదర్పణమ్. 27

శుభాశుభ ఫలై రేవం మోక్ష్యసే కర్మబన్ధనైః,
సన్న్యాసయోగ యుక్తాత్మా విముక్తో మా ముపైష్యసి. 28

సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః,
యే భజన్తి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్. 29

అపి చే త్సుదురాచారో భజతే మా మనన్యభాక్,
సాధురేవ స మన్తవ్య స్సమ్య గ్వ్యవసితో హి సః. 30

క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాన్తిం నిగచ్ఛతి,
కౌన్తేయ! ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి. 31

మాం హి పార్థ! వ్యపాశ్రిత్య యేఽపి స్యుః పాపయోనయః,
స్త్రియో వైశ్యా స్తథా శూద్రా స్తేఽపి యాన్తి పరాంగతిమ్. 32

కిం పున ర్బ్రాహ్మణాః పుణ్యాః భక్తా రాజర్షయ స్తథా,
అనిత్య మసుఖం లోక మిమం ప్రాప్య భజస్వ మామ్. 33

మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు,
మా మేవైష్యసి యుక్త్వైవ మాత్మానం మత్పరాయణః. 34

ఓం తత్సదితి

శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జునసంవాదే రాజవిద్యారాజగుహ్యయోగో నామ
నవమోఽధ్యాయః.

* * *

## దశమోఽధ్యాయః

# విభూతి యోగః

### శ్రీ భగవానువాచః

భూయ ఏవ మహాబాహో! శృణు మే పరమం వచః,
యత్తేఽహం ప్రీయమాణాయ వక్ష్యామి హితకామ్యయా. 1

న మే విదు స్సురగణాః ప్రభవం న మహర్షయః,
అహ మాది ర్హి దేవానాం మహర్షీణాం చ సర్వశః. 2

యో మా మజ మనాదిం చ వేత్తి లోకమహేశ్వరమ్,
అసమ్మూఢ స్స మర్త్యేషు సర్వపాపైః ప్రముచ్యతే. 3

బుద్ధిర్ జ్ఞాన మసమ్మోహః క్షమా సత్యం దమ శ్శమః,
సుఖం దుఃఖం భవోఽభావో భయం చాభయమేవ చ. 4

అహింసా సమతా తుష్టి స్తపో దానం యశోఽయశః,
భవన్తి భావా భూతానాం మత్త ఏవ పృథగ్విధాః. 5

మహర్షయ స్సప్త పూర్వే చత్వారో మనవ స్తథా,
మద్భావా మానసా జాతా యేషాం లోక ఇమాః ప్రజాః. 6

ఏతాం విభూతిం యోగం చ మమ యో వేత్తి తత్త్వతః,
సోఽవికమ్పేన యోగేన యుజ్యతే నాఽత్ర సంశయః. 7

అహం సర్వస్య ప్రభవో మత్త స్సర్వం ప్రవర్తతే,
ఇతి మత్వా భజన్తే మాం బుధా భావసమన్వితాః. 8

మచ్చిత్తా మద్గతప్రాణా బోధయన్తః పరస్పరమ్,
కథయన్తశ్చ మాం నిత్యం తుష్యన్తి చ రమన్తి చ. 9

తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్,
దదామి బుద్ధియోగం తం యేన మా ముపయాన్తి తే. 10

తేషామేవానుకమ్పార్థ మహ మజ్ఞానజం తమః,
నాశయా మ్యాత్మ భావస్థో జ్ఞానదీపేన భాస్వతా. 11

అర్జున ఉవాచ:

పరం బ్రహ్మ పరం ధామ పవిత్రం పరమం భవాన్,
పురుషం శాశ్వతం దివ్య మాదిదేవ మజం విభుమ్. 12

ఆహు స్త్వా మృషయ స్సర్వే దేవర్షి ర్నారద స్తథా,
అసితో దేవలో వ్యాస స్స్వయంచైవ బ్రవీషి మే. 13

సర్వ మేత దృతం మన్యే యన్మాం వదసి కేశవ!
న హి తే భగవన్! వ్యక్తిం విదు ర్దేవా న దానవాః. 14

స్వయ మేవాత్మనాఽఽత్మానం వేత్థ త్వం పురుషోత్తమ!
భూతభావన! భూతేశ! దేవ దేవ! జగత్పతే! 15

వక్తు మర్హస్యశేషేణ దివ్యా హ్యాత్మవిభూతయః,
యాభి ర్విభూతిభి ర్లోకా నిమాం స్త్వం వ్యాప్య తిష్ఠసి. 16

కథం విద్యామహం యోగిం స్త్వాం సదా పరిచిన్తయన్,
కేషు కేషు చ భావేషు చిన్త్యోఽసి భగవన్! మయా. 17

విస్తరేణాత్మనో యోగం విభూతిం చ జనార్దన!
భూయః కథయ తృప్తిర్హి శృణ్వతో నాస్తిమేఽమృతమ్. 18

శ్రీ భగవానువాచ:

హంత! తే కథయిష్యామి దివ్యా హ్యాత్మవిభూతయః,
ప్రాధాన్యతః కురుశ్రేష్ఠ! నాస్త్యన్తో విస్తరస్య మే. 19

అహమాత్మా గుడాకేశ! సర్వభూతాశయస్థితః,
అహ మాదిశ్చ మధ్యం చ భూతానా మన్త ఏవ చ. 20

ఆదిత్యానా మహం విష్ణు ర్జ్యోతిషాం రవి రంశుమాన్,
మరీచి ర్మరుతామస్మి నక్షత్రాణా మహం శశీ. 21

వేదానాం సామవేదోఽస్మి దేవానామస్మి వాసవః,
ఇన్ద్రియాణాం మనశ్చాస్మి భూతానామస్మి చేతనా. 22

రుద్రాణాం శంకరశ్చాస్మి విత్తేశో యక్షరక్షసామ్,
వసూనాం పావకశ్చాస్మి మేరు శ్శిఖరిణామహమ్. 23

పురోధసాం చ ముఖ్యం మాం విద్ధి పార్థ! బృహస్పతిమ్,
సేనానీనా మహం స్కన్ద స్సరసా మస్మి సాగరః. 24

మహర్షీణాం భృగురహం గిరామస్మ్యేక మక్షరమ్,
యజ్ఞానాం జపయజ్ఞోఽస్మి స్థావరాణాం హిమాలయః. 25

అశ్వత్థ స్సర్వవృక్షాణాం దేవర్షీణాం చ నారదః,
గన్ధర్వాణాం చిత్రరథ స్సిద్ధానాం కపిలో మునిః. 26

ఉచ్చైశ్శ్రవస మశ్వానాం విద్ధి మా మమృతోద్భవమ్,
ఐరావతం గజేన్ద్రాణాం నరాణాం చ నరాధిపమ్. 27

ఆయుధానా మహం వజ్రం ధేనూనామస్మి కామధుక్,
ప్రజనశ్చాస్మి కన్దర్ప స్సర్పాణామస్మి వాసుకిః. 28

అనన్తశ్చాస్మి నాగానాం వరుణో యాదసామహమ్,
పితౄణా మర్యమాచాస్మి యమ స్సంయమతా మహమ్. 29

ప్రహ్లాదశ్చాస్మి దైత్యానాం కాలః కలయతా మహమ్,
మృగాణాం చ మృగేన్ద్రోఽహం వైనతేయశ్చ పక్షిణామ్. 30

పవనః పవతామస్మి రామ శ్శస్త్రభృతా మహమ్,
ఝషాణాం మకరశ్చాస్మి స్రోతసామస్మి జాహ్నవీ. 31

సర్గాణా మాది రన్తశ్చ మధ్యంచైవాహ మర్జున!
అధ్యాత్మవిద్యా విద్యానాం వాదః ప్రవదతా మహమ్. 32

అక్షరాణా మకారోఽస్మి ద్వన్ద్వ స్సామాసికస్య చ,
అహమేవాక్షయః కాలో ధాతాఽహం విశ్వతోముఖః. 33

మృత్యు స్సర్వహర శ్చాహ ముద్భవశ్చ భవిష్యతామ్,
కీర్తి శ్శ్రీ ర్వాక్చ నారీణాం స్మృతి ర్మేధా ధృతిః క్షమా. 34

బృహత్సామ తథా సామ్నాం గాయత్రీ ఛన్దసా మహమ్,
మాసానాం మార్గశీర్షోఽహ మృతూనాం కుసుమాకరః. 35

ద్యూతం ఛలయతామస్మి తేజ స్తేజస్వినా మహమ్,
జయోఽస్మి వ్యవసాయోఽస్మి సత్త్వం సత్త్వవతామహమ్. 36

వృష్ణీనాం వాసుదేవోఽస్మి పాణ్డవానాం ధనంజయః,
మునీనామప్యహం వ్యాసః కవీనా ముశనా కవిః. 37

దణ్డో దమయతామస్మి నీతిరస్మి జిగీషతామ్,
మౌనం చైవాస్మి గుహ్యానాం జ్ఞానం జ్ఞానవతామహమ్. 38

యచ్చాపి సర్వభూతానాం బీజం తదహ మర్జున!
న తదస్తి వినా యత్స్యా న్మయా భూతం చరాచరమ్. 39

నాన్తోఽస్తి మమ దివ్యానాం విభూతీనాం పరన్తప!
ఏష తూద్దేశతః ప్రోక్తో విభూతే ర్విస్తరో మయా. 40

యద్యద్విభూతిమత్సత్త్వం శ్రీమదూర్జిత మేవ వా,
తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోఽంశసంభవమ్. 41

అథ వా బహునైతేన కిం జ్ఞాతేన తవార్జున!
విష్టభ్యాహమిదం కృత్స్న మేకాంశేన స్థితో జగత్. 43

ఓం తత్సదితి

శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జునసంవాదే విభూతియోగో నామ
దశమోఽధ్యాయః

* * *

ఏకాదశోఽధ్యాయః

# విశ్వరూపసందర్శనయోగః

అర్జున ఉవాచ:

మదనుగ్రహాయ పరమం గుహ్య మధ్యాత్మసంజ్ఞితమ్,
యత్త్వయోక్తం వచ స్తేన మోహోఽయం విగతో మమ. 1

భవాప్యయౌ హి భూతానాం శ్రుతౌ విస్తరశో మయా,
త్వత్తః కమలపత్రాక్ష! మాహాత్మ్యమపి చావ్యయమ్. 2

ఏవ మేతద్యథాఽఽత్థ త్వ మాత్మానం పరమేశ్వర!
ద్రష్టు మిచ్ఛామి తే రూప మైశ్వరం పురుషోత్తమ! 3

మన్యసే యది తచ్ఛక్యం మయా ద్రష్టుమితి ప్రభో!
యోగేశ్వర! తతో మే త్వం దర్శయాత్మాన మవ్యయమ్. 4

శ్రీ భగవానువాచ:

పశ్య మే పార్థ! రూపాణి శతశోఽథ సహస్రశః,
నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీని చ. 5

పశ్యాదిత్యా న్వసూ న్రుద్రా నశ్వినౌ మరుత స్తథా,
బహూ న్యదృష్టపూర్వాణి పశ్యాశ్చర్యాణి భారత! 6

ఇహైకస్థం జగత్కృత్స్నం పశ్యాద్య సచరాచరమ్,
మమ దేహే గుడాకేశ! యచ్చాన్యద్ద్రష్టు మిచ్ఛసి. 7

న తు మాం శక్యసే ద్రష్టు మనేనైవ స్వచక్షుషా,
దివ్యం దదామి తే చక్షుః పశ్య మే యోగమైశ్వరమ్. 8

సఞ్జయ ఉవాచ:

ఏవముక్త్వా తతో రాజన్! మహాయోగేశ్వరో హరిః,
దర్శయామాస పార్థాయ పరమం రూపమైశ్వరమ్. 9

అనేక వక్త్రనయన మనేకాద్భుత దర్శనమ్,
అనేక దివ్యాభరణం దివ్యానేకోద్యతాయుధమ్. 10

దివ్యమాల్యామ్బరధరం దివ్యగన్ధానులేపనమ్,
సర్వాశ్చర్యమయం దేవ మనన్తం విశ్వతోముఖమ్. 11

దివి సూర్య సహస్రస్య భవే ద్యుగపదుత్థితా,
యది భా స్సదృశీ సా స్యా ద్భాస స్తస్య మహాత్మనః. 12

తత్రైకస్థం జగత్కృత్స్నం ప్రవిభక్త మనేకధా,
అపశ్య ద్దేవదేవస్య శరీరే పాణ్డవ స్తదా. 13

తత స్స విస్మయావిష్టో హృష్టరోమా ధనఞ్జయః,
ప్రణమ్య శిరసా దేవం కృతాఞ్జలి రభాషత. 14

అర్జున ఉవాచ:

పశ్యామి దేవాం స్తవ దేవ! దేహే
సర్వాం స్తథా భూతవిశేష సఙ్ఘాన్,
బ్రహ్మాణ మీశం కమలాసనస్థం,
ఋషీంశ్చ సర్వా నురగాంశ్చ దివ్యాన్. 15

అనేక బాహూదరవక్త్రనేత్రం
పశ్యామి త్వాం సర్వతోఽనన్తరూపమ్,
నాన్తం న మధ్యం న పున స్తవాదిం
పశ్యామి విశ్వేశ్వర! విశ్వరూప! 16

కిరీటినం గదినం చక్రిణం చ
తేజోరాశిం సర్వతో దీప్తిమన్తమ్,
పశ్యామి త్వాం దుర్నిరీక్ష్యం సమన్తా
ద్దీప్తానలార్కద్యుతి మప్రమేయమ్. 17

త్వ మక్షరం పరమం వేదితవ్యం
త్వమస్య విశ్వస్య పరం నిధానమ్,
త్వ మవ్యయ శ్శాశ్వత ధర్మగోప్తా
సనాతన స్త్వం పురుషో మతో మే. 18

అనాది మధ్యాన్త మనన్తవీర్య
మనన్త బాహుం శశిసూర్య నేత్రమ్,
పశ్యామి త్వాం దీప్తహుతాశ వక్త్రం
స్వ తేజసా విశ్వమిదం తపన్తమ్. 19

ద్యావాపృథివ్యో రిద మన్తరం హి
వ్యాప్తం త్వయైకేన దిశశ్చ సర్వాః,
దృష్ట్వాఽద్భుతం రూపముగ్రం త వేదం
లోకత్రయం ప్రవ్యథితం మహాత్మన్! 20

అమీహి త్వాం సురసఙ్ఘా విశన్తి
కేచిద్భీతాః ప్రాఞ్జలయో గృణన్తి,
స్వస్తీత్యుక్త్వా మహర్షి సిద్ధ సంఘాః
స్తువన్తి త్వాం స్తుతిభిః పుష్కలాభిః. 21

రుద్రాదిత్యా వసవో యే చ సాధ్యాః
విశ్వేఽశ్వినౌ మరుత శ్చో ష్మపాశ్చ,
గన్ధర్వ యక్షా సురసిద్ధసఙ్ఘాః
వీక్షన్తే త్వాం విస్మితాశ్చైవ సర్వే. 22

రూపం మహత్తే బహువక్త్రనేత్రం
మహాబాహో! బహుబాహూరుపాదమ్,
బహూదరం బహుదంష్ట్రాకరాలం
దృష్ట్వా లోకాః ప్రవ్యథితా స్తథాఽహమ్. 23

నభస్స్పృశం దీప్తమనేక వర్ణం
వ్యాత్తాననం దీప్త విశాల నేత్రమ్,
దృష్ట్వాహి త్వాం ప్రవ్యథితాన్తరాత్మా
ధృతిం న విన్దామి శమం చ విష్ణో! 24

దంష్ట్రాకరాలాని చ తే ముఖాని
దృష్ట్వైవ కాలానల సన్నిభాని,
దిశో న జానే న లభే చ శర్మ
ప్రసీద దేవేశ జగన్నివాస! 25

అమీ చ త్వాం ధృతరాష్ట్రస్య పుత్రా
స్సర్వే సహైవావనిపాలసఙ్ఘైః,
భీష్మో ద్రోణ స్సూతపుత్ర స్తథాఽసౌ
సహాస్మదీయైరపి యోధముఖ్యైః. 26

వక్త్రాణి తే త్వరమాణా విశన్తి
దంష్ట్రాకరాలాని భయానకాని,
కేచిద్విలగ్నా దశనాన్తరేషు
సందృశ్యన్తే చూర్ణితై రుత్తమాఙ్గైః. 27

యథా నదీనాం బహవోఽమ్బువేగా
స్సముద్రమేవాభిముఖా ద్రవన్తి,
తథా తవామీ నరలోకవీరాః
విశన్తి వక్త్రా ణ్యభివిజ్వలన్తి. 28

యథా ప్రదీప్తం జ్వలనం పతఙ్గాః
విశన్తి నాశాయ సమృద్ధవేగాః,
తథైవ నాశాయ విశన్తి లోకా
స్తవాపి వక్త్రాణి సమృద్ధవేగాః. 29

లేలిహ్యసే గ్రసమాన స్సమన్తా
ల్లోకా న్సమగ్రా న్వదనై ర్జ్వలద్భిః,
తేజోభి రాపూర్య జగత్సమగ్రం
భాస స్తవోగ్రాః ప్రతపన్తి విష్ణో! 30

ఆఖ్యాహి మే కో భవానుగ్రరూపో
నమోఽస్తు తే దేవవర! ప్రసీద,
విజ్ఞాతు మిచ్ఛామి భవన్తమాద్యం
నహి ప్రజానామి తవప్రవృత్తిమ్. 31

శ్రీ భగవానువాచ:

కాలోఽస్మి లోకక్షయకృత్ప్రవృద్ధో
లోకా న్సమాహర్తు మిహ ప్రవృత్తః,
ఋతేఽపి త్వాం న భవిష్యన్తి సర్వే
యేఽవస్థితాః ప్రత్యనీకేషు యోధాః. 32

తస్మా త్త్వ ముత్తిష్ఠ యశో లభస్వ
జిత్వా శత్రూ న్భుంక్ష్వ రాజ్యం సమృద్ధమ్,
మయైవైతే నిహతాః పూర్వమేవ
నిమిత్త మాత్రం భవ సవ్యసాచిన్! 33

ద్రోణం చ భీష్మం చ జయద్రథం చ
కర్ణం తథాన్యానపి యోధవీరాన్,
మయాహతాం స్త్వం జహి మా వ్యథిష్ఠా
యుధ్యస్వ జేతాఽసి రణే సపత్నాన్. 34

సఞ్జయ ఉవాచ:

ఏతచ్ఛ్రుత్వా వచనం కేశవస్య
కృతాఞ్జలి ర్వేపమానః కిరీటీ,
నమస్కృత్వా భూయ ఏవాహ కృష్ణం
సగద్గదం భీతభీతః ప్రణమ్య. 35

అర్జున ఉవాచ:

స్థానే హృషీకేశ! తవ ప్రకీర్త్యా
జగత్ప్రహృష్య త్యనురజ్యతే చ,
రక్షాంసి భీతాని దిశో ద్రవన్తి
సర్వే నమస్యన్తి చ సిద్ధసఙ్ఘాః. 36

కస్మాచ్చ తే న నమేరన్మహాత్మన్!
గరీయసే బ్రహ్మణోఽప్యాదికర్త్రే,
అనన్త దేవేశ! జగన్నివాస!
త్వమక్షరం సదసత్తత్పరం యత్. 37

త్వ మాదిదేవః పురుషః పురాణ
స్త్వమస్య విశ్వస్య పరం నిధానమ్,
వేత్తాఽసి వేద్యం చ పరం చ ధామ
త్వయా తతం విశ్వమనన్తరూప! 38

వాయు ర్యమోఽగ్ని ర్వరుణ శ్శశాఙ్కః
ప్రజాపతి స్త్వం ప్రపితామహశ్చ,
నమో నమస్తేఽస్తు సహస్రకృత్వః
పునశ్చ భూయోఽపి నమో నమస్తే. 39

నమః పురస్తాదథ పృష్ఠత స్తే
నమోఽస్తుతే సర్వత ఏవ సర్వ,
అనన్త వీర్యామిత విక్రమ స్త్వం
సర్వం సమాప్నోషి తతోఽసి సర్వః. 40

సఖేతి మత్వా ప్రసభం యదుక్తం
హే కృష్ణ! హే యాదవ! హే సఖేతి,
అజానతా మహిమానం తవేదం
మయా ప్రమాదా త్ప్రణయేన వాపి. 41

యచ్చావహాసార్థ మసత్కృతోఽసి
విహార శయ్యాసన భోజనేషు,
ఏకోఽథవాఽప్యచ్యుత! తత్సమక్షం
తత్ క్షామయే త్వా మహ మప్రమేయమ్. 42

పితాఽసి లోకస్య చరాచరస్య
త్వమస్య పూజ్యశ్చ గురు ర్గరీయాన్,
న త్వత్సమోఽస్త్యభ్యధికః కుతోఽన్యో
లోకత్రయేఽప్యప్రతిమప్రభావ! 43

తస్మాత్ప్రణమ్య ప్రణిధాయ కాయం
ప్రసాదయే త్వా మహ మీశ మీడ్యమ్,
పితేవ పుత్రస్య సఖేవ సఖ్యుః
ప్రియః ప్రియాయార్హసి దేవ! సోఢుమ్. 44

అదృష్ట పూర్వం హృషితోఽస్మి దృష్ట్వా
భయేన చ ప్రవ్యథితం మనో మే,
తదేవ మే దర్శయ దేవ! రూపం
ప్రసీద దేవేశ జగన్నివాస! 45

కిరీటినం గదినం చక్రహస్త
మిచ్ఛామి త్వాం ద్రష్టు మహం తథైవ,
తేనైవ రూపేణ చతుర్భుజేన
సహస్ర బాహో! భవ విశ్వమూర్తే! 46

శ్రీ భగవానువాచ:

మయా ప్రసన్నేన తవార్జునేదం
రూపం పరం దర్శిత మాత్మయోగాత్,
తేజోమయం విశ్వ మనన్త మాద్యం
యన్మే త్వదన్యేన న దృష్టపూర్వమ్. 47

న వేద యజ్ఞాధ్యయనై ర్న దానై
ర్న చ క్రియాభి ర్న తపోభి రుగ్రైః,
ఏవం రూప శ్శక్య అహం నృలోకే
ద్రష్టుం త్వదన్యేన కురుప్రవీర! 48

మా తే వ్యథా మా చ విమూఢభావో
దృష్ట్వా రూపం ఘోరమీదృఙ్మమేదమ్,
వ్యపేతభీః ప్రీతమనాః పునస్త్వం
తదేవమే రూప మిదం ప్రపశ్య. 49

సఞ్జయ ఉవాచ:

ఇత్యర్జునం వాసుదేవ స్తథోక్త్వా
స్వకం రూపం దర్శయామాస భూయః,
ఆశ్వాసయామాస చ భీత మేనం
భూత్వా పున స్సౌమ్యవపు ర్మహాత్మా. 50

అర్జున ఉవాచః

దృష్ట్వేదం మానుషం రూపం తవ సౌమ్యం జనార్దన!
ఇదానీమస్మి సంవృత్త స్సచేతాః ప్రకృతిం గతః. 51

శ్రీ భగవానువాచః

సుదుర్దర్శమిదం రూపం దృష్టవానసి యన్మమ,
దేవా అప్యస్య రూపస్య నిత్యం దర్శనకాంక్షిణః. 52

నాహం వేదై ర్న తపసా న దానేన న చేజ్యయా,
శక్య ఏవంవిధో ద్రష్టుం దృష్టవానసి మాం యథా. 53

భక్త్యా త్వనన్యయా శక్య అహ మేవంవిధోఽర్జున!
జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరన్తప! 54

మత్కర్మకృ న్మత్పరమో మద్భక్త స్సఙ్గవర్జితః,
నిర్వైర స్సర్వభూతేషు య స్సమామేతి పాణ్డవ! 55

ఓం తత్సదితి

శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జునసంవాదే విశ్వరూపసందర్శనయోగో నామ
ఏకాదశోఽధ్యాయః

* * *

# ద్వాదశోఽధ్యాయః

# భక్తియోగః

అర్జున ఉవాచ:

ఏవం సతతయుక్తా యే భక్తా స్త్వాం పర్యుపాసతే,
యే చాప్యక్షర మవ్యక్తం తేషాం కే యోగవిత్తమాః. 1

శ్రీ భగవానువాచ:

మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే,
శ్రద్ధయా పరయోపేతా స్తే మే యుక్తతమా మతాః. 2

యే త్వక్షర మనిర్దేశ్య మవ్యక్తం పర్యుపాసతే,
సర్వత్రగ మచిన్త్యం చ కూటస్థ మచలం ధ్రువమ్. 3

సంనియమ్యేన్ద్రియగ్రామం సర్వత్ర సమబుద్ధయః,
తే ప్రాప్నువన్తి మామేవ సర్వభూతహితే రతాః. 4

క్లేశోఽధికతర స్తేషా మవ్యక్తాసక్త చేతసామ్,
అవ్యక్తా హి గతి ర్దుఃఖం దేహవద్భి రవాప్యతే. 5

యే తు సర్వాణి కర్మాణి మయి సన్న్యస్య మత్పరాః,
అనన్యేనైవ యోగేన మాం ధ్యాయన్త ఉపాసతే. 6

తేషా మహం సముద్ధర్తా మృత్యు సంసార సాగరాత్,
భవామి న చిరాత్పార్థ! మయ్యావేశిత చేతసామ్. 7

మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ,
నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః. 8

అథ చిత్తం సమాధాతుం న శక్నోషి మయి స్థిరమ్,
అభ్యాస యోగేన తతో మామిచ్ఛాప్తుం ధనంజయ! 9

అభ్యాసేఽప్యసమర్థోఽసి మత్కర్మపరమో భవ,
మదర్థమపి కర్మాణి కుర్వ న్సిద్ధి మవాప్స్యసి. 10

అథైతదప్యశక్తోఽసి కర్తుం మద్యోగ మాశ్రితః,
సర్వకర్మఫలత్యాగం తతః కురు యతాత్మవాన్. 11

శ్రేయో హి జ్ఞాన మభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే,
ధ్యానా త్కర్మఫలత్యాగ స్త్యాగా చ్ఛాన్తి రనన్తరమ్. 12

అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ,
నిర్మమో నిరహఙ్కార స్సమదుఃఖసుఖః క్షమీ. 13

సన్తుష్ట స్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః,
మయ్యర్పిత మనో బుద్ధి ర్యో మద్భక్త స్స మే ప్రియః. 14

యస్మా న్నోద్విజతే లోకో లోకా న్నోద్విజతే చ యః,
హర్షామర్ష భయోద్వేగై ర్ముక్తో య స్స చ మే ప్రియః. 15

అనపేక్ష శ్శుచి ర్దక్షః ఉదాసీనో గతవ్యథః,
సర్వారమ్భ పరిత్యాగీ యో మద్భక్త స్స మే ప్రియః. 16

యో వ హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి,
శుభాశుభ పరిత్యాగీ భక్తిమా న్య స్స మే ప్రియః. 17

సమ శ్శత్రౌ చ మిత్రే చ తథా మానావమానయోః,
శీతోష్ణ సుఖదుఃఖేషు సమ స్సఙ్గవివర్జితః. 18

తుల్యనిన్దాస్తుతి ర్మౌనీ సన్తుష్టో యేన కేనచిత్,
అనికేతః స్థిరమతి ర్భక్తిమా న్మే ప్రియో నరః. 19

యే తు ధర్మ్యామృత మిదం యథోక్తం పర్యుపాసతే,
శ్రద్దధానా మత్పరమా భక్తాస్తేఽతీవ మే ప్రియాః. 20

ఓం తత్సదితి

శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జునసంవాదే భక్తియోగో నామ
ద్వాదశోఽధ్యాయః

భక్తివల్లి సమాప్తం.

* * *

ఓం

# గీతామృతం

## ముక్తివల్లి : చూచి చేరాలి

| | | | |
|---|---|---|---|
| అధ్యా. | 13 | : | క్షేత్రక్షేత్రజ్ఞవిభాగ యోగం |
| ,, | 14 | : | గుణత్రయవిభాగ యోగం |
| ,, | 15 | : | పురుషోత్తమప్రాప్తి యోగం |
| ,, | 16 | : | దైవాసురసంపద్విభాగ యోగం |
| ,, | 17 | : | శ్రద్ధాత్రయవిభాగ యోగం |
| ,, | 18 | : | మోక్షసన్న్యాస యోగం |

# చూచి చేరాలి

చూడవలసిన రూపం చూచిన తర్వాతగాని, చేయవలసిన పని సక్ర-మంగా తెలిసి చేస్తేనేకాని, చూచేందుకు అధికారం లభించదనే విషయం సవ్యసాచికి బోధపడలేదు. చేయవలసినది చేయటంవల్ల చిత్తశుద్ధి ఏర్పడు-తుంది. తెలిసి చేసినందువల్ల నిర్మలమైన మనస్సులో జ్ఞానం ఉదయిస్తుంది. కర్మ జ్ఞాన సమన్వయంతో నిశ్చలమైన భక్తి కుదురుతుంది. భక్తి గల హృదయంలో భగవంతుడు కనిపిస్తాడు. ఇలా కర్మ జ్ఞాన భక్తి సమన్వ-యంతో ఆత్మయోగి తన అంతరాత్మలో పరమాత్మను దర్శించి జీవన్ముక్తు డవుతాడు. ఆత్మబలంతో ఆత్మను ఆత్మలో చూడగలిగిన ఆత్మ, ఆత్మలోనే లయించిపోతుంది. చేరిపోతుంది. ఇదే ఆత్మసాయుజ్యం. ఆత్మ యోగం వల్లనే అర్జునుడు విశ్వరూపాన్ని చూడగలిగాడు. చూచినంత మాత్రాన లాభం లేదు. చూచిన చోటుకు చేరితీరాలి -- అనే దృఢ సంకల్పంతోనే అర్జునుడు ఉపాసనా మార్గాన్ని గురించి ప్రశ్నిస్తాడు. అనన్యభక్తికి మించింది లేదని కృష్ణుడు సమాధానం చెప్పి, నిజమైన భక్తి లక్షణాలను వివరిస్తాడు. ఈ లక్షణాల్లో జీవన్ముక్తుని స్వరూపం కనిపిస్తుంది. తనది కానిది తెలుసుకొని తనదైన తత్త్వంలో లయించిపోవటమే ముక్తి. తనదేది, తనది కానిదేది -- అనే తత్త్వజ్ఞానాన్ని ఈ ముక్తివల్లి వివరిస్తుంది.

దేవదేవుని దేహంలోనే ధనంజయుడు విశ్వరూపం దర్శించాడు. ప్రతి జీవుని దేహంలో ఇలాంటి విశ్వం దాగి ఉంది. ఆత్మయోగంతో జాగ్రత్తగా పరిశీలించి చూస్తే, శరీరంలో కొంత భాగం క్షరం, మరికొంత అక్షరం కనిపిస్తుంది. శరీరం అనేది ఒక క్షేత్రం. ఈ క్షేత్రం సంగతి బాగా తెలిసిన శరీరి క్షేత్రజ్ఞుడు. ఎంత సుక్షేత్రమైనా సరిగా సాగుబడి చేయందే ఫలించదు. అలాగే సంస్కారంతో, సాధనతో, సంయమంతో శరీరమనే క్షేత్రాన్ని సాగు చేసి పండిస్తే దీనిలోని ఆత్మవైభవం బహిర్గత మవుతుంది. అక్షరమైన ఆత్మ వైభవం తెలిసిన తర్వాత క్షణికం, క్షరం, అస్థిరమైన శరీరంమీద వ్యామోహం తగ్గిపోతుంది. ఈ క్షేత్రాలకూ, క్షేత్రజ్ఞులకూ మూల కారకుడయిన పురు-

షోత్తముని స్వరూపం గోచరిస్తుంది. క్షరమయిన క్షేత్రంనుంచి ముక్తిని పొంది, అక్షరస్వరూపుడైన క్షేత్రజ్ఞుణ్ణి ఆవిష్కరించుకొనటమే మోక్షం.

క్షేత్రమంటే ఏమిటో ముందు తెలుసుకుంటే, క్షేత్రం కానిది క్షేత్ర-జ్ఞుని స్వరూపమని తెలుస్తుంది. ఇదే క్షేత్రక్షేత్రజ్ఞవిభాగ యోగం (13వ అధ్యాయం)లోని ప్రధానమైన విషయం. దీనినే మంత్రద్రష్ట లయిన మహ ర్షులు పరిపరి విధాల కీర్తించారు. వేదాలుకూడా దీనినిగురించే వాదించి వాదించి, తత్త్వసారాన్ని ప్రతిపాదించాయి. బ్రహ్మసూత్రాది మహోగ్రంథాలు సహేతుకంగా దీన్ని విమర్శించి ఇదమిత్థమని నిరూపించేందుకు ప్రయత్నిం చాయి. సర్వసామాన్యంగా ఆలోచించి చూస్తే -- క్షేత్రమనేది ఏమిటి? ఎలాంటిది? అందులో ఏర్పడే వికారాలు, మార్పులు ఎలా ఉంటాయి? క్షేత్ర గతమైన జ్ఞానం ఏమిటి? అనేది స్పష్టంగానే తెలుస్తుంది.

పంచ మహాభూతాలు (నేల, నీరు, నిప్పు, గాలి, ఆకాశం), పంచ కర్మేంద్రియాలు (చేతులు, కాళ్ళు, నోరు, గుహ్యేంద్రియాలు), పంచ జ్ఞానేంద్రియాలు (చెవులు, ముక్కు, కండ్లు, నాలుక, చర్మం), ఇంద్రియాలు గ్రహించే విషయాలు (శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం), మనస్సు, బుద్ధి, అహంకారం, అవ్యక్తమయిన మూలప్రకృతి -- ఇవన్నీ కలిపి (24 తత్త్వాలు) క్షేత్ర మవుతాయి. స్థూలంగా, సూక్ష్మంగా మానవశరీరంలో గోచరించే మృత్తత్త్వం (క్షేత్రం) ఇంతే. ఆత్మసంయోగం లేకపోతే ఇదంతా నిష్క్రియం, జడం. ఆత్మతో కలిసినప్పుడు ఈ క్షేత్రంలో అనేకవిధము లయిన మార్పులు, వికారాలు ఏర్పడుతాయి. అభిమానం, ద్వేషం, సుఖం, దుఃఖం, స్థూల శరీరం, సూక్ష్మ చైతన్యం, ధారణ ఇవన్నీ క్షేత్రంలో కలిగే మార్పులు. సహజంగా ఏర్పడే యీ మార్పులను నేర్పుతో నిగ్రహించి, ప్రవర్తించవలసిన పద్ధతిలో ప్రవర్తించటం జ్ఞాని చేసే పని. జ్ఞాని లక్షణాలను గమనిస్తే జ్ఞానమంటే ఏమిటో తెలుస్తుంది.

క్షేత్రజ్ఞుడయిన జ్ఞానికి మిథ్యాభిమాన ముండదు, గర్వ ముండదు. ఒకరిని హింసించడు. ఓర్పుతో, సాధు స్వభావాన్ని సంతరించుకుంటాడు. ఆచార్యులను గౌరవిస్తాడు. శుచిగా ఉంటాడు. మనస్సు చలించకుండా

తన్ను తాను అదుపులో పెట్టుకుంటాడు. శబ్ద స్పర్శ రూప రస గంధాలకు దూరంగా ఉంటాడు. అనుభవించినా త్యాగబుద్ధితో వైరాగ్యభావంతో వీటిని అనుభవిస్తాడు. అహంకారం అతణ్ణి అంటదు. జరా మరణాలతో జన్మ వ్యాధులతో, నానాబాధలతో కూడిన జీవితాన్ని స్మరించి, సహజమైన వైరాగ్య భావాన్ని అలవరచుకుంటాడు. ధన కనక వస్తు వాహనాల మీద అతనికి వ్యామోహం ఉండదు. భార్య, బిడ్డలమీద ఎక్కువ మమకారం పెట్టుకోడు. ఇష్టం, అనిష్టం అనే భేదం లేకుండా అన్నింటియందు సమబుద్ధిని పెంపొందించుకుంటాడు. పరమాత్మయందు నిశ్చలమైన భక్తిని సాధిస్తాడు. గుంపుకు దూరంగా ఏకాంతంగా ఆత్మచింతనతో కాలం గడుపుతాడు. తత్త్వజ్ఞానాన్ని తెలుసుకొనటమే కాకుండా, ప్రత్యక్షంగా చూచిన ద్రష్ట నిజమైన జ్ఞాని. అదే జ్ఞానం. అది కానిది అజ్ఞానం.

క్షేత్రరూపమయిన శరీరంలో జ్ఞానం, అజ్ఞానం రెండూ మిళితమై ఉంటాయి. అజ్ఞానంనుంచే జ్ఞానాన్ని వేరు చేసుకొని దానిలోని సత్యాన్ని, అనంతత్వాన్ని ఆస్వాదించి దర్శించటమే క్షేత్రజ్ఞత, తద్‌జ్ఞత. తద్‌జ్ఞులకు తెలిసిన ఆత్మస్వరూపం అనాదితత్త్వం. మంచికీ, చెడుకూ అతీతమైనది. అన్ని చేతులూ, అన్ని కాళ్లూ, అన్ని కళ్లూ, అన్ని తలలూ, అన్ని ముఖాలూ ఆత్మవే. ప్రపంచమంతటా ఆత్మ విస్తరించి ఉంటుంది. ఇంద్రియ సహకారంతో అన్ని పనులు చేస్తూకూడా వాటికి చిక్కుకొనకుండా, వాటియందు ఆసక్తి పెంచుకొనకుండా ఉంటుంది. ఆత్మ గుణగణాలకు ఆధ్వర్యం వహిస్తుంది కాని, తాను మాత్రం గుణాతీతమై నిర్గుణంగా ఉంటుంది. ప్రాణులకు లోపల, బయట చరాచరరూపంలో సంచరించే ఆత్మతత్త్వం చాల సూక్ష్మమయినది. కాబట్టి మామూలు దృష్టికి గోచరించదు. మనకు పరమ సమీపంగా ఉన్నప్పటికీ కనిపించనంతవరకు దూరంగా ఉన్నట్టే అవుతుంది. ఆత్మను విభజించడం అణువును విభజించటంలాంటిది. సామాన్యంగా అవిభాజ్యమైన ఆత్మతత్త్వం వేరువేరు క్షేత్రాల్లో వేరు వేరుగా కనిపిస్తుంది. కాని సకల భూతములను సృష్టించి, పోషించి, లయింపజేసే మూలప్రకృతి ఆత్మ. కారుచీకటికి దూరంగా ఆవలి వైపున ఉన్న వెలుగు, వెలుగులకు వెలుగు -- ఆత్మజ్యోతి. తెలివికి తెలివిగా తెలియదగిన పరతత్త్వంగా ప్రజల హృదయాల్లో ప్రవేశించిన జ్ఞానదీపం -- ఆత్మ.

ప్రకృతి, పురుషుడు -- ఈ క్షేత్రానికి కారకులు. కార్యకారణ సంబంధాన్ని పురస్కరించుకొని, ప్రకృతి చరాచర జగత్తును సృష్టిస్తుంది. పురుషుడు సుఖదుఃఖాలను అనుభవిస్తాడు. కర్తృత్వం ప్రకృతికి చెందింది. భోక్తృత్వం పురుషునికి సంబంధించింది. ప్రకృతి ప్రసాదించే గుణ సంపదను, ప్రకృతిని ఆశ్రయించిన పురుషుడు అనుభవిస్తూ ఉంటాడు. ఆ గుణాశ్రయంవల్లనే పురుషుడు మంచిగుణాలవల్ల మంచిజన్మల నెత్తుతాడు. చెడుగుణాలవల్ల దుష్ట జన్మల నెత్తుతాడు. కాని, క్షేత్రంలో ఉండే పర మాత్మకు ఈ గుణసముచ్చయంతో ప్రమేయం లేదు. జరిగినదంతా చూచి తోచిన సలహా చెప్తుంటాడు. ఇలా ఆత్మతత్త్వం తెలుసుకున్న వేత్త అన్ని పనులు చేస్తున్నా, ఏమీ చేయనట్టే అవుతుంది. కొందరు ధ్యానయోగంతో, కొందరు జ్ఞానయోగంతో, మరికొందరు కర్మయోగంతో తమలోని ఆత్మ తత్త్వాన్ని ఆత్మలో చూడగలుగుతారు. ఎక్కువ మేధాశక్తి లేని సామాన్యులు ఇతరులు చెప్పగా విని ఆత్మజ్ఞానం పొందుతారు. అలాంటి శ్రుతపాండిత్యం కలవారుకూడా మృత్యువును జయించి అమృతత్వాన్ని పొందుతారు.

ప్రపంచంలోని ప్రతి ప్రాణికూడా క్షేత్ర క్షేత్రజ్ఞ సంయోగం వల్లనే జన్మిస్తాడు. అందరిలో ఒకే పరమేశ్వర తత్త్వం -- శరీరం నశించినా నశించని అక్షరరూపం ఉంది. అన్నింటిలో వ్యాపించిన యీ అవినశ్వర తత్త్వాన్ని చూచినవాడే ఈశ్వరుని చూచిన ద్రష్ట. అతనికి ఆత్మహాని లేదు. ప్రకృతిసిద్ధంగా జరుగవలసిన పనులన్నీ వాటంతట అవి జరుగుతున్నాయని భావించగలిగిన భావయోగి, చేసినా చేయనట్టే. వేరు వేరు జీవుల్లో ఒకే ఆత్మ ప్రకాశిస్తున్నదనే పరమార్థం తెలిసినవాడే బ్రహ్మభావాన్ని పొంద గలుగుతాడు. అందరిలో వ్యాపించిన పరమాత్మ స్వరూపం నిర్గుణం, అనాది అవటంవల్ల కర్మబంధం దానికి లేదు. అంతట నిండియున్న ఆకాశానికి ఏదీ అంటనట్టే, సర్వాంతర్యామియైన ఆత్మకు శరీర వాసనలు సోకవు. సూర్యు డొక్కడే సమస్తజీవులకు వేరు వేరుగా కనిపిస్తున్నట్టు, క్షేత్రస్వామి అన్ని క్షేత్రాలలో ప్రకాశిస్తూ ఉంటాడు. క్షేత్రానికి క్షేత్రజ్ఞునికి ఉన్న యీ చిరంతన సంబంధాన్ని సమగ్రంగా గ్రహించేందుకు జ్ఞాననేత్రం కావాలి. అలాంటి దృష్టితో ఆత్మను సాక్షాత్కరించుకొన్న ద్రష్టలు పరమపదాన్ని చేరగలరు. చూడవలసినది చూచి చేరేందుకు క్షేత్ర క్షేత్రజ్ఞ వివేకం అవసరం.

సకల జీవకోటికి ప్రకృతి జనయిత్రి, పురుషుడు బీజప్రదాత. ప్రకృతి సిద్ధంగా ప్రతిజీవిలో ప్రధానంగా మూడు రకాల గుణాలు గోచరిస్తాయి. సత్త్వగుణం, రజోగుణం, తమోగుణం. పశువును తాళ్ళతో కట్టినట్లు, ప్రకృతి జీవులను గుణాలతో బంధించివేస్తుంది. ఈ మూడింటిలో సత్త్వగుణం నిర్మలమైనది, వెలుగు నిచ్చేది. వికారాలకు దూరమయినది. సుఖలాలస, జ్ఞానపిపాస -- ఈ రెండింటితో ఇది జీవుని బంధిస్తుంది. రజోగుణం రాగద్వేషాలతో కూడినది. ఆశ, ఆసక్తి దీని లక్షణాలు. ఇది జీవులను కర్మబంధంతో కట్టి వేస్తుంది. తమోగుణం అజ్ఞానంవల్ల ఏర్పడుతుంది. దీనితో మంచి, చెడు అనే విచక్షణ నశిస్తుంది. పొరబాటు, సోమరితనం, నిద్ర దీనికి లక్షణాలు -- వీటితో ఇది జీవిని బంధిస్తుంది. సత్త్వగుణం సుఖాన్ని ఇస్తుంది. రజోగుణం కర్మనిరతిని సమకూర్చుతుంది. తమోగుణం అజ్ఞానంతో కూడిన అంధకారంలోకి తీసుకువెళుతుంది.

క్షేత్రరూపమైన శరీరంలో ఈ మూడు గుణాలు ఎలా ఉదయిస్తాయో గమనించాలి. ప్రతిజీవిలో సామాన్యంగా మూడు గుణాలూ ఏదో ఒక పరిమాణంలో ఉంటాయి. వాటిలో దేని పరిమాణం ఎక్కువయితే ఆ గుణం అతనిలో ప్రధానమని భావించాలి. రజస్సు, తమస్సుకంటె సత్త్వం ఎక్కువగా ఉంటే, అతడు సత్త్వగుణప్రధాను డవుతాడు. అలాగే రజోగుణ ప్రధానునిలో సత్త్వం, తమస్సు కంటె రజస్సు ఎక్కువగా ఉంటుంది. సత్త్వ రజస్సులకంటె తమస్సు ఎక్కువగా ఉంటే అతడు తామసు డవుతాడు. మనుష్య దేహంలోని అన్ని అవయవాలలో, అన్ని వాకిళ్ళలో జ్ఞానతేజస్సు వెలుగుతూ ఉంటే అతడు సాత్త్వికు డనుకోవాలి. లోభం, లాలస, పట్టుదల, అశాంతి, అసంయమం, ఆవేశం, ఆందోళన ఇవన్నీ రాజసుని లక్షణాలు. ఇక తామసుడు మంచిని చెడుగా, పొరబాటును అలవాటుగా, చీకటిని వెలుగుగా భావించి, తనకు మించినవాడు లేడని, తాను సాధించవలసినది లేదని తనలో తాను నిర్ణయించుకొని, కడుపునిండా తిని, కంటినిండా నిద్ర పట్టించి 'హాయిగా' కాలం గడుపుతాడు. నత్త్వగుణం ప్రధానంగా ఉన్న సమయంలో అవసానకాలం వస్తే అతనికి నిర్మలమైన ఆత్మసాయుజ్యం లభిస్తుంది. రాజసవేళలో లయిస్తే కర్మబంధం మళ్ళీ చుట్టుకుంటుంది.

తామసునిగానే జీవితం చాలిస్తే నికృష్టమైన జీవజంతువుల్లో జన్మించ వలసిఉంటుంది. ఒక్కొక్క సమయంలో ఒక్కొక్క గుణం ప్రధానంగా ఉంటుంది. చివరి దశలో ప్రాధాన్యం వహించిన గుణాన్నిబట్టి మరుజన్మ నిర్ణయమవుతుంది. కాబట్టి ఎప్పుడూ సత్త్వగుణప్రధానుడుగా ఉండేందుకు ప్రయత్నించాలి.

మూడు గుణాలకూ మూడు రకాల ఫలితా లున్నాయి. సాత్త్వికుడు మంచి మంచి పనులను చేసి మనో నైర్మల్యాన్ని సాధిస్తాడు. రాజసుడు నానాబాధలు పడతాడు. తామసుడు అజ్ఞానంలో పడిపోతాడు. సత్త్వం అన్నిటికంటె గొప్పది. రజస్సు మధ్యరకం. తామసం అన్నిటికంటె నికృష్ట మైనది. కాని, యీ గుణత్రయ విభాగానికి అతీతుడైన యోగి, అన్నింటిని సాక్షిభూతంగా చూస్తూ, దేనికీ అంటకుండా ఉంటాడు. అలాంటి గుణా తీతుడు జన్మ మృత్యు జరా దుఃఖాలకు గురికాడు. వీటిచేత బద్ధుడు కాకుండా నిత్య శుద్ధ ముక్తిని సాధిస్తాడు.

గుణాతీతుని ప్రసక్తి వచ్చేసరికి అర్జునుడు తన భుజాలు తడువు కున్నాడు. అంతవరకు తదేకధ్యానంతో శ్రీకృష్ణుని వచనామృతం వింటు-న్నవాడు, త్రిగుణాతీతు డనేమాట వినవచ్చేసరికి, 'ఈ మూడు గుణాలను మించిన మంచితనం ఎలా ఉంటుందో చెప్పవలసిం'దని అడుగుతాడు. మధ్య మధ్య ప్రశ్నలు వెయ్యకపోతే తామసం ప్రబలుతుందేమోననికూడా అనుకోవచ్చు. ఎలాగయితేం, అర్జును డడిగే ప్రశ్నల్లో ఈపాటికి చాలా మార్పు వచ్చినట్టు స్పష్టంగా కనిపిస్తుంది.

త్రిగుణాతీతుని లక్షణాలు పరమాత్మ నోట వెలువడుతాయి. సత్త్వ రజ స్తమో గుణాలు శరీరంనుండి ఉదయిస్తాయి. శరీరంలోనే లయి స్తాయి. వెలుగులో సత్త్వం, పట్టుదలలో రజస్సు, పొరబాటులో తమస్సు కనిపిస్తాయి. సహజంగా ఉదయించి, కొంత కాలానికి లయించే యీ గుణప్రవర్తనకు మక్కువ చూపించక, ఎక్కువగా ద్వేషించక, తటస్థంగా ఉన్నవాడు గుణాతీతుడు. గుణమంటే త్రాడు. శరీరంనుంచి ఉదయించే గుణాలు శరీరిని బంధించేందుకు చూస్తాయి. కాని, గుణాతీతుడు వీటికి

చిక్కక ఉన్నతస్థాయిలో ఉంటాడు. ఆత్మకు ఎంత సమీపంగా ఉంటే శరీరానికీ, శరీరంనుంచి ఉదయించే గుణత్రయానికీ అంత దూరమైనట్టు భావించవచ్చు. కాబట్టి ఆత్మవంతుడు గుణబద్ధుడు కాక గుణాతీతు డవుతాడు.

గుణాతీతుడు చేసేపనులు ఎలా ఉంటాయో సర్వగుణ సంపన్ను డయిన గీతాచార్యుడు సంగ్రహంగా చెప్తాడు: కష్టసుఖాలకు చలించడు. తన నిజస్వరూపాన్ని ఎప్పుడూ విస్మరించడు. మట్టి పెళ్ళనూ, బండరాతినీ, బంగారాన్నీ సమానదృష్టితో చూస్తాడు. మంచిగానీ, చెడుగానీ, ఒకరు నిందించనీ, స్తుతించనీ, దేనికీ చలించని ధీరుడు త్రిగుణాతీతుడు. తోటి మానవులు తననుగురించి గొప్పగా చెప్పుకోనీ, కించపరచనీ, స్నేహంగా ఉండనీ, విరోధంగా ఉండనీ అన్నింటికీ హర్షించి నిష్కామంగా కర్మసాధన చేసేవాడు త్రిగుణాతీతుడు. అలాంటి గుణాతీతుని మనస్సు పరమాత్మలో అనాయాసంగా లయించిపోతుంది. అనన్యమైన అనురాగం, నిశ్చలమైన భక్తి అతని సొత్తు. బ్రహ్మభావం అతని స్వభావం. బ్రహ్మభావంతో బ్రహ్మలో చేరి, శాశ్వతమైన ధర్మాన్ని గుర్తించి, ఏకాంతమైన ఆత్మానందంలో మునిగి ఉంటాడు. అతనికి చావు లేదు. అమృతం తా నయిన ఆత్మయోగి అనంతుడు, అవ్యయుడు.

అతని దృష్టిలో ఈ ప్రపంచం ఒక రావిచెట్టులాంటిది. మట్టిలో పుట్టి, గంభీరంగా మహోన్నతస్థాయి నందుకొని, నిలువుగా అడ్డంగా కూడా గుబురుగా పెరిగి, ఆకుల గలగలలతో ఆకాశాన్ని పలకరించే అశ్వత్థం, ఎంత మహోన్నతంగా కనిపించినా అది శాశ్వతం కాదు, అ+శ్వత్+థం (రేపులేనిది) అశ్వత్థం. రేపు లేనిది అంటే రేపటికి ఉండనిది (అశాశ్వతం) అనీ, రేపు అనేదే లేని సనాతన సత్యమనీ -- రెండురకాల అర్థాలు వస్తాయి. ప్రపంచమనే అశ్వత్థంలో కూడా ఈ రెండు తత్త్వాలూ మిళితమై ఉన్నాయి. దీనిలో కొంత రాలిపోయే భాగముంది. రాలకుండా కలకాలం నిలిచే మూలశక్తి కూడా ఉంది. కాని, దీనికి ఆధారమైన వేళ్ళు భూమిలో లేవు. ఆకాశంలో ఉన్నాయి. పరమాకాశంలో ప్రకాశరూపంలో ఉండే పరమ పురుషుడు, పురుషోత్తముడు దీనికి మూలాధారం. కొమ్మలు

క్రిందికి ప్రాకి ఉన్నాయి. ఒకటి కాదు, లెక్కలేనన్ని కొమ్మలు. అనేక కోటి జీవరాశి కొమ్మల్లో వ్యాపించిన రెమ్మలు. ఆకులు లేనిదే కొమ్మలలో నిండుతనం రాదు. పరమానందాన్ని స్వచ్ఛందంగా కీర్తించే ఛందస్సాహితి (వేదవాఙ్మయం) ఆకులు. ఒక కొమ్మకు ఆకులు ఎక్కువ. మరొక కొమ్మకు తక్కువ. ఒక్కొక్క కొమ్మలో అప లాకులే ఉండవు. ఆకుల గలగలలే ఆ చెట్టుకు కళకళలు. ఈ రావిచెట్టు రహస్యం తెలుసుకుంటే పురుషోత్తముని పుట్టుపూర్వోత్తరాలు బోధపడిపోతాయి. ఇదే పురుషోత్తమప్రాప్తి.

ఈ చెట్టుకొమ్మలు పైకీ, కిందికీకూడా పెరుగుతాయి. ఈ కొమ్మలు ఎక్కువగా పెరగకుండా త్రాటితో (గుణాలతో) కట్టివేస్తే మరీ ఎక్కువగా పెరుగుతాయట. విషయ వాసనలనే చిగుళ్ళను త్రుంచేకొద్దీ క్రొంజిగురు వేస్తాయట. కర్మబంధం వేళ్ళవరకూ వ్యాపించి అంతటా ప్రాకిపోతుందట. దీనికొక రూపమంటూ లేదు. ఎటయినా పెరగవచ్చు. ఎలాగయినా పెరగ వచ్చు. ఇలా పాతుకుపోయిన యీ పాతచెట్టును అనాసక్తితో ఛేదించాలి. దాన్ని పట్టించుకోకుండా ఉంటే దానంతట అది వాడిపోతుంది. వేళ్లు మిగులుతాయి. అవే అన్నింటికి మూలం. మూలాధారమైన పరమపదాన్ని చేరిన తర్వాత మళ్ళీ తిరిగి రావటమంటూ లేదు. అదే సనాతనుడైన పురుషోత్తముని పరమవరేణ్య పదనిధి.

ఆ పదనిధిని పొందేందుకు ఒక పదవిధి ఉంది. ఆ మార్గంలో వెళ్ళితే అవ్యయుడైన ఆదిపురుషుడు కనిపిస్తాడు. మానం, మోహం పూర్తిగా విసర్జించాలి. ఏ పని చేసినా దానిఫలితంమీద ఆసక్తి పెట్టుకోకూడదు. శరీరాన్నిగురించి తక్కువగా, ఆత్మనుగురించి ఎక్కువగా నిరంతరంగా ఆలోచిస్తూ ఉండాలి. కోరికలకు దూరంగా ఉండాలి. కష్టసుఖాలకు కదలకూడదు. అలాంటి యోగులకు (ఆత్మజ్ఞులకు) పరమపదం లభిస్తుంది. ఆ పరంధాముడు ప్రకాశించేచోట సూర్యచంద్రులు భాసించరు. అగ్ని వెలుగదు. అక్కడికి వెళ్ళిన తర్వాత తిరిగి రావటం లేదు.

ఆ పరంధాముని వెలుగులో ఒక కిరణమే జీవి. పంచేంద్రియాలు, మనస్సు, జీవాత్మను పరమాత్మతో బంధిస్తాయి. శరీరయాత్ర జరిగినంత కాలం ఇంద్రియములతోకూడి ఆరవదయిన మనస్సు, జీవునికీ పురుషునికీ

మధ్యవర్తిత్వం చేస్తుంది. శరీరం చాలించిన తర్వాత జీవితాంతం అనుభవించిన సుఖదుఃఖాలను, ఇంద్రియానుభవసారాన్ని ఆత్మకు అప్పచెప్తుంది. గాలి సువాసనలను మోసుకొని వెళ్ళినట్టుగా, అంతరాత్మ యీ ఇంద్రియ వాసనలను మనస్సునుండి గ్రహిస్తుంది. చెవులు విన్నవి, కళ్ళు చూచినవి, నాలుక ఆస్వాదించినవి, ముక్కులు మూర్కొన్నవి అన్నీ సంగ్రహించి మనస్సు ఆత్మకు నివేదిస్తుంది. ఈ నివేదికనుబట్టి ఆత్మ అనంతర కార్యక్రమాన్ని నిర్ణయించుకుంటుంది. ఈ విషయం ఆత్మజ్ఞానికే తెలుసు. దీనిని గమనించేందుకు జ్ఞానచక్షువులు కావాలి. యోగులకు తమలోని ఆత్మతత్త్వం తెలుస్తుంది. సంస్కారంలేని సంసారులకు ఇందులోని సారం, సారస్యం తెలియదు.

చూడగలిగిన శక్తి ఉంటే పరతత్త్వం అంతటా కనిపిస్తుంది. సూర్య కాంతిలో, చంద్రుని వెన్నెలలో, అగ్నిలో -- కనిపించే వెలుగు లోపలివెలుగే. అదే పరంజ్యోతి. అలాగే, పంటలు పండించి అన్ని జీవులను పోషించే రసాధిపతి పరమాత్మ. తిన్న తిండి జీర్ణమయ్యేట్టు వైశ్వానరరూపంలో లోపల ప్రవేశించి, జఠరానలాన్ని ప్రజ్వలింపచేసేదికూడా పరంధాముడే. అందరి హృదయంలో ఆ పరంజ్యోతి ప్రకాశిస్తూ ఉంటుంది. మనస్సులో రకరకాల ఆలోచనలను వెలయించి వివేకాన్ని ప్రసాదించే విజ్ఞానఖని ఆ విశ్వ రూపుడే. వేదాలకు లక్ష్యమైన వేదవేద్యుడు -- తన వాక్కులో ఋగ్వేదాన్ని, చేష్టల్లో యజుర్వేదాన్ని, మనస్సులో సామవేదాన్ని, హృదయంలో అథర్వాన్ని వెలయించాడు.

లోకంలో క్షరమనీ, అక్షరమనీ రెండు తత్త్వా లున్నాయి. శరీరం క్షరం, శరీరంలోని ఆత్మ అక్షరం. ఈ రెండింటికీ -- క్షరానికీ, అక్షరానికీ ఆదికారణమైన పరమాత్మ ఉత్తమస్థాయికి చెందిన పురుషరూపం. అతన్నే పురుషోత్తముడని వేదాలు స్తుతిస్తాయి. మూడులోకాలుకూడా అతనివల్లనే నడుస్తున్నాయి. ఇలా క్షరానికీ, అక్షరానికీ అతీతమైన పురుషోత్తమతత్త్వాన్ని గుర్తించిన మహనీయులు నన్ను (పరమాత్మను) ఏకభక్తితో ఆరాధించి చివరకు నాలో చేరిపోతారు.

కాని, ప్రపంచంలో మంచితోపాటు చెడుకూడా ఉంటుంది. దేవతల్లాంటి మనుష్యు లున్నారు. రాక్షసుల్లాంటివాళ్లుకూడా ఉన్నారు. దేవతాసంబంధ మయిన గుణగణాలతోకూడిన జ్ఞానులు సత్త్వగుణ ప్రధానులుగా ఉంటారు. నిర్భయంగా, నిష్కల్మషంగా తమ నియత కర్మలను ఆచరిస్తూ ఉంటారు. దానధర్మాలు, శమదమాలు, యజ్ఞయాగాలు, అధ్యయనం, మననం అంటే వాళ్ళకు ఇష్టం. ఒకరిని హింసించరు. అసత్యం చెప్పరు. కోపపడరు. చేతనయిన త్యాగం చేస్తారు. ఇతరుల సంపదను ఆశించరు. భూత దయతో, మృదుస్వభావం కలిగి, నిశ్చలంగా నిర్మలంగా ప్రశాంతంగా జీవితం గడుపుకుంటారు. తమ గొప్ప చెప్పుకునేందుకు సిగ్గుపడుతారు. ఇతరుల తప్పులను మన్నిస్తారు. తేజోవంతులైకూడా వినయంగా ఉంటారు. ధైర్యంగా నిలకడగా పవిత్రమైన జీవితం గడుపుతారు. ఒకరికి ద్రోహం తలపెట్టరు. ఇలాంటి దైవీసంపదను పొందిన ధన్యజీవులు ముక్తికి అధికారు లవుతారు.

ఆసురీసంపద దీనికి విరుద్ధమయినది. అది రాక్షసలక్షణాలతో కూడు కొని ఉంటుంది. అహంకారం, ఆడంబరం, అభిమానం, కోపం, గడుసుతనం, అజ్ఞానం -- ఇవి అసుర లక్షణాలు. హాస్యప్రియుడైన శ్రీకృష్ణుడు ఉన్న-ట్టుండి 'అర్జునా! నీవు దిగులుపడకు, నీవు దేవతాసంబంధమయిన సంపదకు చెందినవాడివేలే' అని చమత్కరిస్తాడు. కాని, అసుర లక్షణాలుకూడా తెలుసు కొని ఉండటం మంచిది. ఏమి చెయ్యాలో, ఏమి చెయ్యకూడదో వాళ్ళకు తెలియదు. పరిశుభ్రత వాళ్ళల్లో శూన్యం. ఆచారం దూరం. సత్యం అసాధ్యం. ప్రపంచమే అసత్య మంటారు. ప్రపంచంలో పరమేశ్వరుడు ఎక్కడున్నాడని ప్రశ్నిస్తారు. స్త్రీ పురుష సంయోగంవల్ల ప్రజలు జన్మిస్తూ ఉంటే భగవంతు డెక్కడినుండి వచ్చాడు? -- అని వాళ్ళవాదం. కామ క్రోధాదులు వాళ్ళ సంపద. భోగాలను అనుభవించటమే జీవిత పరమావధి -- అని వాళ్ళ సిద్ధాంతం. ఆశలను పెంచుకుంటూ, కోరికలను తీర్చుకుంటూ, అన్యాయంగా, అక్రమంగా అన్యాక్రాంతమైన ధనంతో జీవిస్తూ, ఇదంతా నా పురుషార్థం, నన్ను మించినవాడు ప్రపంచంలోనే లేడని విఱ్ఱవీగే వెఱ్ఱిజాతి అసురజాతి. తనకున్నది ఇతరుల కిచ్చేవాడు సురుడు. అలా చేయనివాడు అసురుడు. అస్తమానం తన ఆరోగ్యం, తన ఐశ్వర్యం, తన లావణ్యం,

తన సామర్థ్యం -- అంతేకాని, అంతరంగంలోని అనంత తేజోరాశి అతని కంటికి కనిపించనే కనిపించదు. తన చిత్తం, తన విత్తం తప్ప మరొకటి వాళ్ళ కక్కర్లేదు. ఎప్పుడయినా పొరబాటున మంచి పని చేస్తే, దానికి మించిన ప్రచారం కావాలి. నామమాత్రం చేసిన సత్కర్మలనుకూడా తన గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పుకునేందుకే వాడుకుంటారు. అంతా స్వార్థం, పరమార్థం శూన్యం. ఇలాంటి రాక్షస లక్షణాలతో జీవించే వ్యర్థజీవులు మాటిమాటికి జనన మరణ సంసరణంలో సంచరిస్తూ ఉంటారు.

కామ క్రోధ లోభాలు నరకానికి మూడు ద్వారాలు. ఆత్మ హానికి మూలకారణాలు. వాటిని తప్పించుకొని తిరగటం శ్రేయస్కరం. వేదవిహిత మైన కర్మల నాచరిస్తూ, కామ క్రోధ లోభాలను పరిహరించి ప్రవర్తించేవాళ్లు దైవీసంపదకు చెందుతారు. వాళ్ళే ముక్తికి అర్హులవుతారు. శాస్త్రం చెప్పిన విషయాలను జాగ్రత్తగా పరిశీలించాలి. తెలుసుకొన్న విషయాలను ఆచరణలో పెట్టాలి. తెలిసి చేసిన పనులు తెలియవలసిన పరతత్త్వాన్ని తెలియపరుస్తాయి. లోపలి వెలుగును వెలయిస్తాయి. ఆత్మను పరమాత్మకు దగ్గరగా తీసుకొని వెళతాయి.

ఆత్మసంపదకు శ్రద్ధాభక్తులు ఆధారం. శ్రద్ధగలవానికే జ్ఞానం లభిస్తుంది. శ్రద్ధామయుడయిన పురుషుడు పిండికొద్ది రొట్టెలాగా, శ్రద్ధకొద్ది జ్ఞానాన్ని సంపాదించి పరమగతిని పొందగలుగుతాడు. ఈ రహస్యాన్ని గమనించి పార్థుడు శ్రద్ధాతత్త్వం చెప్పవలసిందని కృష్ణుణ్ణి అడుగుతాడు. "శ్రద్ధ అనేది కొద్దో గొప్పో అందరికీ ఉంటుంది. కాని వాళ్ళ వాళ్ళ సంస్కారాన్నిబట్టి, సత్త్వ రజ స్తమో గుణాల భేదాన్నిబట్టి వేరువేరుగా కనిపిస్తుంది. సాత్త్వికం, రాజసం, తామసం -- అని శ్రద్ధకూడా మూడురకాలు" అని శ్రద్ధాత్రయ రహస్యాన్ని గీతాచార్యుడు వివరిస్తాడు:

సాత్త్వికులకు దేవతలమీద, రాజసులకు యక్షరాక్షసులమీద, తామసు-లకు భూత ప్రేత పిశాచాదులమీద శ్రద్ధ కుదురుతుంది. రాక్షస భావంతో ఫలాపేక్షతో ఆడంబరానికి చేసే పూజలు, పురస్కారాలూ అసురసంపదను సూచిస్తాయి. శరీరాన్నే కాక లోపలి అంతరాత్మనుకూడా బాధించి కృశింపజేసే అసురకర్మలు ఆత్మయోగానికి అంతరాయాన్నే కల్పిస్తాయి.

ఆహారాన్నిబట్టి కూడా శ్రద్ధాపద్ధతి తెలుసుకోవచ్చు. తీసుకునే ఆహారాన్నిబట్టి చేసే యజ్ఞ యాగాలు, జపతపాలు, దానధర్మాలు ఉంటాయి. శరీరానికీ, మనస్సుకూ పుష్టి నిచ్చి, ఆయుస్సును పెంచే, ఆత్మ కింపయిన భోజనం సాత్త్వికులు తీసుకుంటారు. తినేందుకు రుచిగా, శుచిగా, తిన్న తర్వాత హాయి నిచ్చే సాత్త్వికమైన ఆహారం సాత్త్వికమైన శ్రద్ధను పెంపొందిస్తుంది. అలా కాక, ఉప్పు, కారం, పులుపు మోతాధికంగా వాడి, నాలుకమీద పెట్టుకోగానే బ్రహ్మకపాలానికి అంటే బ్రహ్మాండమైన పిండివం టలతో కడుపు నిండటం రాజసులకు ఇష్టం. అలాంటి నోరుమండే ఆహారం తీసుకొనే పెద్దమనుష్యులు రోగాలతో బాధపడుతారు. వాళ్ళు రాజసమైన శ్రద్ధను సేవిస్తారు. ఇక మూడోరకం తామసాహారం. చల్లబడి, నోరు జిల్లుమనే పాసిపోయిన పాయసాలు, కుళ్ళిపోయిన కాయగూరలు, ఘాటుగా వాసనవేసే నీరస రసాయనాలు ఈ తెగకు చెందినవి. ఆహారాన్నిబట్టే వ్యవహారం ఉంటుంది.

సాత్త్వికులు చేసే యజ్ఞయాగాదులు కర్తవ్యభావంతో ఫలాపేక్ష లేకుండా నిరాడంబరంగా ఉంటాయి. రాజసులు ఫలాపేక్షతో పటాటోపంతో బడాయికి చేస్తారు. తామసులు చేయనే చేయరు. ఒక వేళ చేసినా ఒక పద్ధతి ఉండదు. మంత్ర ముండదు. తంత్ర ముండదు. ద్రవ్యలోభంతో ఏదోవిధంగా చేశామంటే చేశామనిపించేట్టు చేసినట్టు నటిస్తారు.

తపస్సుకూడ అంతే. వాక్కు, మనస్సు, కాయం -- ఈ మూడింటితో చేసే తపస్సుకూడా మూడువిధాలు. దేవతలను పూజించటం, వేదం చదివిన బ్రాహ్మణులను గౌరవించటం, జ్ఞానోపదేశం చేసిన గురువులకు, పెద్దలకు నమస్కరించటం, వారివల్ల తెలియని విషయాలు తెలుసుకొనటం, పరిశుభ్రంగా, అంతఃకరణశుద్ధితో ప్రవర్తించటం, ప్రపంచమంతా బ్రహ్మ స్వరూపమనే భావనతో, బ్రహ్మ యందు చరిస్తూ తనవల్ల ఎవరికీ ఏ బాధ కలుగకుండా చూడటం శారీరకమైన తపస్సు. ఇతరులకు ఇష్టమైన మాటలు సత్యదూరం కాకుండా, ఓర్పుతో, నేర్పుతో, మనస్సుకు బాధ కలుగకుండా చెప్పటం, వేదాధ్యయనం చెయ్యటం, తెలిసిన జ్ఞానాన్ని కార్యరూపంలో పెట్టటం

వాక్కుకు సంబంధించిన వాఙ్మయ తపస్సు. ఎప్పుడూ ఆనందంగా, ప్రశాంతంగా, సౌమ్యంగా, నిర్మలంగా, నిష్కల్మషంగా ఉండటం, తక్కువగా మాట్లాడుతూ మనస్సును చిరాకుపరచుకోకుండా ఉండటం మానసికమైన తపస్సు. పవిత్ర భావాలు పవిత్రమైన మనస్సులో ఉదయించి పవిత్రమైన పరమాత్మకు ప్రీతిని చేకూర్చుతాయి. ఈ మూడు రకాల తపస్సును సాత్త్వికులు ఫలాపేక్ష లేకుండా శ్రద్ధతో చేస్తారు. రాజసులు పేరు ప్రతిష్ఠల కోసం ఆడంబరంగాచేస్తారు. అలాంటిపనులు ఎక్కువ రోజులు సాగవు. తామసులు విధిలేక చేస్తారు. లేకుంటే ఇతరులను బాధించేందుకు చేస్తారు. అలాంటివాళ్ళ సాధన వాళ్ళకూ ఇతరులకుకూడా బాధాకరంగా ఉంటుంది.

దానంకూడా మూడురకాలు. సాత్త్వికమైన దానం ఉపకారానికి ప్రత్యుపకారంగా చేసేది కాదు. ఇవ్వాలని మనఃస్ఫూర్తిగా అనిపించి ఇచ్చేది సాత్త్వికం. ఇది దేశ కాల పాత్రలను గమనించి ఇవ్వాలి. శ్రద్ధ ఉంటేనే ఇవ్వాలి. లేకుంటే లేదు. ఇవ్వాల్సివచ్చిందని విధిలేక ఇచ్చేది, ప్రతిఫలాపేక్షతో ఇచ్చేది రాజస దాన మవుతుంది. దేశ కాల పాత్ర వివక్షత లేకుండా ఎవరికో ఒకరికి తిరస్కారభావంతో ఇచ్చేది తామసమైన దానం.

చేసిన దానం కాని, ఆచరించిన తపస్సుకాని, అనుష్ఠానం కాని బ్రహ్మభావంతో చెయ్యాలి. అందువల్లనే పారాయణం, స్తోత్రం, మంత్రపాఠం చివర సామాన్యంగా 'ఓం తత్ సత్' అంటారు. ఈ మూడూ బ్రహ్మ పేర్లు. మొదటిది ఓంకారం వేదవాఙ్మయానికి మూలం. త్రికాలాలకు, త్రిలోకాలకు, త్రిమూర్తులకు ఆధారం. రెండవది: తత్, మోక్షవాచకం. తత్ పదార్థాన్ని తెలుసుకున్న తత్త్వజ్ఞులు తన్మయులై పోతారు. మహామునులు నివసించే మనోవనం తద్వనం. చివరిది: 'సత్'. ఏకం సత్-విప్రా బహుధా వదంతి. సత్పదార్థం ఒకటే. దానినే తాత్త్వికులు అనేక రూపాల్లో వ్యాఖ్యానిస్తారు. ఇలా ఓం-తత్-సత్ అనే మూడు నామాలు పరబ్రహ్మను తెలియపరిచే పారిభాషిక పదాలు కాబట్టి మనం చేసే ప్రతి పనిని పరమాత్మకు అర్పిస్తున్నట్టుగా భావించి 'ఓం తత్ సత్ బ్రహ్మార్పణమస్తు' అని వాచికంగా పలికితే,

మనస్సులో ఆలోచనకు, చేసే పనికి, చెప్పేమాటకు పొత్తు కుదిరి, త్రికరణ శుద్ధి ఏర్పడుతుంది. త్రికరణ శుద్ధిగా ఏ పని చేసినా అందులో కర్మ జ్ఞాన భక్తి సమన్వయం కుదిరి ముక్తికి సాధన అవుతుంది. కర్మఫలసన్న్యాసంవల్ల కర్మయోగి సన్న్యాసికి లభించే పరమపదాన్ని కూడా పొందగలుగుతాడు. కర్మసన్న్యాసికన్నా కర్మఫల సన్న్యాసి నిజమైన మనస్సన్న్యాసి.

రామాయణమంతా విని రాముడికి సీత ఏం కావాలని అడిగినట్టుగా, చివరి అధ్యాయం (మోక్ష సన్న్యాసయోగం) ఆరంభంలో అర్జును డడిగిన ప్రశ్న - అత డడిగిన ప్రశ్నల్లో చివరిది. సన్న్యాసమంటే ఏమిటి? త్యాగమంటే ఏమిటి? విడివిడిగా వీటిని వివరించవలసిందని కేశి నిషూదనుడైన కృష్ణుణ్ణి భారతసత్తము డడుగుతాడు. ఈ సందర్భంలో వాడిన ఈ రెండుమాటలను జాగ్రత్తగా గమనించాలి. అసలు వెలుగును మరుగుపరచే కిరణజాలం కేశం. అలాంటి కేశాలుగల కేశి అనే రాక్షసుణ్ణి చంపినవాడు కేశి నిషూదనుడు, కేశవుడు, కృష్ణుడు. అనవసరమైన వితండవాదాలతో తలదిరిగిపోతున్న సామాన్యజనానికి సులభంగా అర్థమయ్యే మాటల్లో చెప్ప బడింది -- గీతామృతం. అందువల్లనే యిది 'దుగ్ధం గీతామృతం మహత్' అని కీర్తింపబడింది. అలాంటి గీతను వెలయించిన యోగేశ్వరుణ్ణి 'కేశి నిషూదన!' -- అని సంబోధించటంలో ఎంతో సార్థక్యముంది. అర్జును డడిగిన చివరి ప్రశ్నకూడా చాలా ముఖ్యమైన ప్రశ్న. భరతసత్తముల కందరికీ దీని సమాధానం అవసరం. ఒక వైపు యుద్ధం చేయవలసిందని ప్రేరేపిస్తూ, మరో వైపు వైరాగ్యాన్ని బోధిస్తున్న కృష్ణుని మాటలను సరిగా అర్థం చేసుకునేందుకు అర్జును డడిగిన చివరి ప్రశ్న ఇది. దీనికి గీతాచార్యుడు చెప్పిన సమాధానంలో గీతార్థసార ముంది.

'ఇష్టసిద్ధికోసం చేయదగిన పుణ్య(కామ్య)కర్మలను వదలి వెయ్యటం సన్న్యాసమని చదువుకున్నవాళ్లు అంటారు. చేయవలసిన పనులను చేస్తూ, వాటి ఫలితాన్ని వదలివెయ్యటం త్యాగమని తెలిసిన వాళ్ళు అంటారు. దోషరహితమైన కర్మ లేనే లేదు. కాబట్టి అన్ని కర్మలనూ వదలిపెట్టటం శ్రేయస్కరమని ఆలోచనాపరులు కొందరు తీర్మానించారు. కాని యజ్ఞ

యాగాదులు, దానధర్మాదులు, జపతపాదులు వదలిపెట్టటం మంచిది కాదని మరికొందరు సూచించారు. త్యాగమంటే కేవలం వదలిపెట్టటం కాదు. గుణభేదంవల్ల అది మూడు రకాలుగా ఉంటుంది. ఎలాంటి త్యాగమైనా సరే యజ్ఞయాగాదులు పుణ్యకర్మలు. తపస్సువల్ల తేజస్సు లభిస్తుంది. పవిత్రత వస్తుంది. అలాంటి కర్మలను వదలిపెట్టటం వాంఛనీయం కాదు. మంచి మంచి పనులను చేసితీరాలి. కాని కర్తవ్యభావంతో చెయ్యాలి. ఫలాపేక్షతో కాని, మరో ఆసక్తితోకాని చెయ్యకూడదు. చేయవలసిన పనులను వీలులేకనో, ఇష్టం లేకనో, కష్టసాధ్యమనో వదలిపెట్టటం త్యాగమవదు. పిరికితన మవుతుంది. తెలియక చేయకపోతే తామసమైన త్యాగ మవుతుంది. ఒళ్ళు గాక మానేస్తే రాజసమైన త్యాగమవుతుంది. ఇవి రెండూ నిజమైన త్యాగాలు కావు. తన విధిగా భావించి, తాను చేయవలసిన పనులను సక్రమంగా చేసి, వాటి ఫలితాన్ని, వాటిమీద ఆసక్తిని వదలిపెట్టటం నిజమైన త్యాగం. అప్పుడే త్యాగం ఫలిస్తుంది. ఫలిత మక్కరలేదనుకొని చేసిన పని ఫలిస్తుంది. ఫలాపేక్షతో చేసిన పని ఫలించినా ఫలితం దక్కదు. తెలివి గలవారు తాము చేయవలసిన పని తమకు తగినదని కానీ, తగనిదని కానీ ఆలోచించరు. బుద్ధిమంతుడు లేనిపోని సందేహాలతో కాలం వ్యర్థంచెయ్యక చెయ్య వలసినపనిని మనసార చేస్తాడు. కాని, దాని పర్యవసానం, ప్రయోజనం, ఫలితం -- వీటిమీద ఆసక్తి చూపించడు. పని చెయ్యటంవరకే తన విధి. ఆ పయిన దైవాయత్తం. ఈ భావంతో పనిచేసినవాడు ఎప్పటికీ చెడిపోడు. కాబట్టి వదలవలసింది కర్మఫలాన్నిగాని, కర్మలను కాదు. కర్మలను వదలటం సాధ్యంకూడా కాదు.

ఒకవేళ ఫలితాన్ని అపేక్షించి పని చేసినా, ఫలితం తప్పక లభిస్తుందనికూడా చెప్పలేము. ఒకప్పుడు కోరినది నెరవేరవచ్చు. ఒకప్పుడు నెరవేరకపోవచ్చు. కోరని అనిష్టం రావచ్చు. సామాన్యంగా కార్యఫలం ఇష్టానిష్ట సమ్మిశ్రితంగా ఉంటుంది. ఫలాపేక్షతో చేసిన పనికి ఒక్కొక్కప్పుడు మరణించిన తర్వాత ఫలితం దక్కవచ్చు. కాని, కర్మసన్న్యాసికి ఫలితంతో ప్రమేయమే లేదు. అసలు, పని చేయనివానికి ఫలితం దక్కటమనే ప్రశ్నే లేదు. ఫలాపేక్షతో పనిచేసే కర్మిష్ఠికీ, పని చెయ్యటమే మానిన

కర్మసన్న్యాసికీ లభించని అవకాశం కర్మఫలత్యాగికి దక్కుతుంది. తాను చేస్తున్నానని అనుకోకుండా చేస్తాడు. ఫలితంకోసం ఎదురుచూడడు. ఆశించింది లేదు కనుక నిరాశకూడా లేదు. కార్యమే అతని సాధనం, సాధ్యం. కొంచెం స్థిరబుద్ధితో ఆలోచిస్తే పని చేసేవాడే పనికి ఏకైక కారకుడు కాదు. ప్రతిపనికీ ఒక మూల కారణం ఉంటుంది. ఏదో ఒక నిమిత్తంతో పని ప్రారంభమవుతుంది. దాన్నే అధిష్ఠానమని అనుకుందాం. దానిని పురస్కరించుకుని కర్త (చేసేవాడు) పని ప్రారంభిస్తాడు. చేసేందుకు ఎన్నో సాధనలు, ఉపకరణాలు కావాలి. ఎన్నో ప్రయత్నాలు చెయ్యాలి. అన్నింటిని మించి దైవం సాయం చెయ్యాలి. ఇలా చేసేందుకు మూల కారణం, చేసేవాడు, చేసేందుకు ఉపకరించే ఉపకరణాలు, చేసేందుకు ముందు, మధ్య చేసే వివిధ చేష్టలు (ప్రయత్నాలు), చేసే పనికి తోడ్పడే దైవం -- ఈ అయిదు హేతువులతో ఏ పనయినా జరగాలి. ఇందులో కర్తది అయిదో భాగం. కాని, త్యాగబుద్ధిలేని కర్త అంతా తానే చేశానని అనుకుంటాడు. ఇది అన్యాయం కదా! మనస్సు, వాక్కు, క్రియ -- ఈ మూడింటితో చేసే పనిలో కర్త అనుకొనేవాని కర్తృత్వం నగణ్యం.

కాబట్టి, అహంకారం లేకుండా నిర్లిప్తమైన భావంతో చేసిన పని దుష్కృతమైనా సత్కార్యమవుతుంది. అపకారంకూడా ఉపకారంగా తోస్తుంది. చంపినా చక్కని పని చేశాడనిపిస్తుంది. తెలుసుకొనేవాడు, తెలుసుకొన వలసిన విషయం, తెలుసుకొనే పని -- ఈ మూడూ కర్మను ప్రేరేపిస్తాయి. మనస్సు, వాక్కు, కాయం అనే త్రికరణాలూ, చేసే కర్త, కర్మ -- యథార్థమైన కార్యరంగంలో కార్యనిర్వహణ చేస్తాయి. 'తెలిసి చేసే పని' -- అన్నప్పుడు తెలివి(జ్ఞానం), చేసేవాడు(కర్త), చేసేపని(కర్మ) -- మూడూ ప్రసక్తిలోకి వస్తాయి. సత్త్వ రజ స్తమో గుణ భేదంవల్ల ఈ మూడూ మూడు రకాలుగా ఉంటాయి.

సాత్త్వికమైన జ్ఞానం సకల జీవుల్లో ఒకే ఆత్మతత్త్వాన్ని అవ్యయ రూపంలో సాక్షాత్కరించుకుంటుంది. రాజసం వేరువేరు రూపాల్లో వేరువేరు జీవులను వేరువేరు భావనలతో పోల్చుకుంటుంది. తామసం తన

తనువే శాశ్వతమని సత్యమని మరో పదార్థం లేదనీ భావిస్తుంది. అలాగే చేసే కర్మకూడా సాత్త్విక,రాజస, తామస భేదాలతో మూడు రకాలుగా ఉంటుంది. సాత్త్వికమైన కర్మ రాగద్వేషాలకు దూరంగా, ఫలనిరపేక్షంగా, ఆసక్తిరహితంగా ఉంటుంది. రాజసమైన కర్మ ఆహంకారంతో కూడుకుని ఇష్టంలేక కష్టపడి చేసినట్టుంటుంది. తామసమైన కర్మ యుక్తాయుక్తవివేకం లేకుండా అజ్ఞానంతో అవివేకంతో కూడుకొని ఉంటుంది. సాత్త్వికుడైన కర్త సంగరహితుడై వినయంతో ఉత్సాహంతో సాఫల్యంతో ప్రమేయం లేకుండా పని చేస్తాడు. రాజసుదు కర్మఫలాపేక్షతో ఏదో విధంగా పని సాధిస్తాడు. తామసుడు సోమరితనంతో ఆలస్యంగా ఆలోచించి ఆలోచించి చివరకు విధిలేక చేసినట్టు చేస్తాడు.

ఇలాగే బుద్ధిలో ధైర్యంలోకూడా మూడురకాల భేదాలు కనిపిస్తాయి. ఏమి చెయ్యాలో, ఏమి చెయ్యకూడదో, దేనిలో ప్రవేశించాలో, దేనిని వదలుకోవాలో, దేనికి భయపడాలో, దేనికి భయపడకూడదో, ఏది బంధమో, ఏది మోక్షమో తెలుసుకోగలిగిన బుద్ధి సాత్త్విక మనబడుతుంది. ధర్మాధర్మాలను, కార్యాకార్యాలను సమగ్రంగా తెలుసుకోలేని మధ్యరకపు బుద్ధి రాజస మవుతుంది. తామసమైన బుద్ధి-ధర్మాన్ని అధర్మమని, అధర్మాన్ని ధర్మమనీ భావించి విపరీతమైన భావాలను అలవరచుకుంటుంది.

మనస్సుతోకూడిన పంచప్రాణాలనూ, పంచేంద్రియవర్గాన్నీ స్థిరంగా నిలుపుకోగలిగిన ధైర్యం సాత్త్విక మవుతుంది. ధర్మార్థ కామాలను ఫలాసక్తితో సేవించే ధృతి రాజసమవుతుంది. తామసమైన ధైర్యం అస్తమానం దిగులుపడుతూ నైరాశ్యంచెంది నిద్రాణమై కూరుకుపోతూ ఉంటుంది.

మూడు గుణాలవల్ల లభించే సుఖంకూడా మూడు రకాలుగా ఉంటుంది. ఆరంభంలో విషంలా ఉన్నా, చివరకు అమృతాన్ని ప్రసాదించే సుఖం సాత్త్వికం. ఆత్మకు హితకరమైన సుఖ మిలాగే ఉంటుంది. విషయవాసనల వల్ల అప్పటి కప్పుడు ఆనందాన్ని ఇచ్చినా, చివరకు విషాదంగా పరిణమించే సుఖం రాజసం. మొదటినుండి చివరవరకు విషాదాన్ని ఇచ్చేది తామసం.

ప్రపంచంలోని మానవులందరూ ఈ మూడుగుణాలచేత బద్ధులై యుంటారు. గుణాలు మనస్సుకు తేజస్సు నిస్తాయి. కర్మలు శరీరానికి వర్చస్సు నిస్తాయి. వారివారి గుణాలనుబట్టి, చేసే పనులనుబట్టి వ్యక్తిత్వం ఏర్పడుతుంది. శమదమాది సాధనతో, తపోనిష్ఠతో, బాహ్యశుచితో, ఆభ్యంతర రుచితో, ఓర్పుతో, నేర్పుతో, నిలకడతో, మెలకువతో జ్ఞాన విజ్ఞాన సంపదను సేవించే సంస్కారుల ముఖంలో బ్రహ్మవర్చస్సు కనిపిస్తుంది. అలాగే తేజస్సు, ఓజస్సు, శౌర్యం, ధైర్యం, రణరంగంలో నిలబడి పోరాడటం, రెండుచేతులతో దానం చెయ్యటం, తమ ఆధిపత్యాన్ని, ఐశ్వర్యాన్ని ప్రదర్శించటం -- ఇలాంటి గుణ కర్మ పరిపక్వతవల్ల బాహువుల్లో క్షాత్రతేజం ఉట్టిపడుతూ ఉంటుంది. పరమార్థాన్ని పంచిపెట్టే బ్రహ్మవేత్తలు బ్రహ్మవర్చస్సును ప్రసరింపజేసినట్లే పార్థివసంపదను, పాడిపంటలను, ధనధాన్యాలను పదిమందికి అందేట్టు చూచే సార్థవాహులలో ధనలక్ష్మి కళకళలాడుతూ ఉంటుంది. అలాగే మానవ సేవే మాధవసేవగా భావించి, నరరూపంలో నారాయణుని ఆరాధించే సేవామూర్తులలో వినయవిధేయతలు అడుగడుగునా పొడచూపుతూ ఉంటాయి. ఇలా ఎవరి వర్చస్సునుబట్టి వారు సర్వేశ్వరుని ఆరాధనలో నిమగ్నులై జీవితాన్ని చరితార్థం చేసుకుంటూ ఉంటారు. ఇందులో ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ అనే భేదం లేదు. అందరూ పరమేశ్వరుని బిడ్డలే. విరాట్పురుషునిలోని భాగాలే. అందరికీ ఆరాధ్యుడైన ఆదిదేవుడు ధర్మపరాయణుడు. ఎవరి ధర్మాన్ని వాళ్ళు నిర్వర్తిస్తూ ఉంటే ఆయనకు పరమానంద మవుతుంది. తన విధులు తాను నిర్వహిస్తే జీవితం తరించి పరమగతి లభిస్తుంది. సహజంగా స్వభావ సిద్ధంగా తన అంతరంగానికి మంచిదని తోచిన పని చేయటంలో ఏ మాత్రం తప్పు లేదు. నిష్పాక్షికంగా నిరపేక్షంగా ఆలోచించిచూస్తే ఏ పనికూడా తప్పు కాదు. చేసే పద్ధతిలో తప్పొప్పులు ఉంటాయి. కాని, పనిలో ఉండవు. ప్రతి చిన్న పనిలో పరమార్థముంది. కాని, నివురు గప్పిన నిప్పులాగా పైన కమ్ముకున్న పొగ తొలగితేగాని లోపలి వెలుగు కనిపించదు.

కర్మసన్న్యాసంవల్లకూడా పరమపదాన్ని పొందవచ్చు. దేనియందు ఆసక్తి లేకుండా ఆత్మనిగ్రహంతో అంతరాత్మను ధ్యానించి నైష్కర్మ్యదశను

సాధించవచ్చు. సిద్ధిని పొందేందుకు ఇది(సాంఖ్యం)కూడా ప్రశస్తమైన మార్గమే. కాని, నిర్మలమైన అంతఃకరణం కావాలి. నిష్ఠతో నియమాలను పాటించాలి. శబ్ద స్పర్శ రూప రస గంధాలకు లొంగకూడదు. రాగ ద్వేషాలను పూర్తిగా దూరంగా ఉంచాలి. వాక్కును, మనస్సును, శరీరాన్ని స్వాధీనం చేసుకుని, ఆహార విహారాలను అదుపులో పెట్టుకొని, ధ్యాన యోగాన్ని ఓపికగా సాధించాలి. అలా క్రమక్రమంగా వైరాగ్యబలంతో, అభ్యాస సహకారంతో కామక్రోధాదులను జయించి అహంకారం, అభిమానం, గర్వంలాంటి వికారాలను పూర్తిగా పరిత్యజించి, ప్రశాంతమయిన బ్రహ్మ భావాన్ని పొందవచ్చు. అలా బ్రాహ్మీస్థితిలో ప్రవేశించిన బ్రహ్మవిద్యా పారంగతుడు ప్రపంచంలో అంతటా ఆత్మతత్త్వాన్నే చూస్తాడు. అందరిలో పరమాత్మస్వరూపం కనిపిస్తుంది. అప్పు డతనికి విచారము ఉండదు. అభి లాషలు ఉండవు. అలాంటి స్థితిలో అతనికి నిశ్చలమైన భక్తి కుదురుతుంది. భక్తితో నన్ను చేరుకుంటాడు. జ్ఞానమార్గంలో కూడా భక్తి కుదరనిదే ముక్తి లభించదు.

నిష్కామకర్మయోగంవల్లకూడా ముక్తిని ప్రసాదించే భక్తి ఇంకా సుల-భంగా కుదురుతుంది. చేయవలసిన పనులు సక్రమంగా చేస్తూనే, వాటి కర్తృత్వ భోక్తృత్వాలను నాకు(పరమాత్మకు) అర్పించి, ఆరాధనాభావంతో నన్ను సేవిస్తే, నా అనుగ్రహంవల్ల అవ్యయమైన శాశ్వతపదం లభిస్తుంది. శారీరకంగా పనిచేస్తూ, మానసికంగా నన్ను స్మరించే నిష్కామ కర్మ యోగులకు నేను బుద్ధి యోగాన్ని ప్రసాదిస్తాను. విశుద్ధబుద్ధితో తెలిసి చేసిన పనులు చిత్తశుద్ధిని ప్రసాదిస్తాయి. చిత్తశుద్ధివల్ల భక్తి కుదురుతుంది. భక్తివల్ల ముక్తి లభిస్తుంది. అలా కాక, అహంకారంతో నేను యుద్ధం చెయ్యనని మొండికివేసి కూర్చుంటే లాభం లేదు. చివరకు బలీయమైన విధి నీచేత ఆ పని చేయించితీరుతుంది. జగదీశ్వరుడు జీవుల హృదయంలో చేరి వాళ్ళచేత అన్నిపనులు చేయిస్తూ ఉంటాడు. నియమించిన పనిని యంత్రంలాగా నెరవేర్చవలసిందే కాని, చెయ్యననేందుకు నీకు అధికారం లేదు. చేసి తీరాలి, తెలిసి చెయ్యాలి, చేసి చూడాలి, చూచి చేరాలి.

సర్వేశ్వరభావంతో సకల కర్మలను సంగరహితంగా ఆచరించి, సర్వే శ్వరునికి అర్పితమని భావించి సేవిస్తే, సర్వేశ్వరుని అనుగ్రహం తప్పక లభిస్తుంది. పరమరహస్యమైన యీ జ్ఞానాన్ని సవిస్తరంగా నీకు వివరించాను. నీకు ఎలా తోస్తే అలా చెయ్యి. నీమీద నాకు అపారమైన అభిమానం కాబట్టి ఇంతగా చెప్పాను. చెప్పిందే చెప్పాను. చెప్పవలసిందంతా చెప్పాను. ఇంతవరకు చెప్పినదానికి సారాంశం మళ్ళీ రెండుమాటల్లో చెప్తున్నాను. జాగ్రత్తగా విను. నాయందు మనస్సుపెట్టి, నామీద భక్తితో, నన్ను ఆరాధించు. నాలో చేరగలవు. ఇది నిజం. ప్రతిజ్ఞ చేసి చెప్తున్నాను. వెయ్యి మాటలు అక్కరలేదు. ఇన్ని ధర్మాలు అక్కరలేదు. నన్ను నమ్ముకొని నా వెంత చేరితే నిన్ను నేను కాపాడుతాను. సకల పాపాలనుండి, కర్మ బంధాలనుండి ముక్తిని ప్రసాదిస్తాను.

సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ,
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః.

అభయముద్రతో చెప్పిన యీ వాక్యంతో గీతామృతం పరిపూర్ణమవు తుంది. "పరమరహస్యమైన యీ జ్ఞానాన్ని విన్నా చెప్పినా నిశ్చలమైన భక్తి కుదురుతుంది. నిర్మలమైన కైవల్యం చేకూరుతుంది. మన సంభాషణను విన్నవాళ్ళు జ్ఞానయజ్ఞంతో నన్ను ఆరాధించినందువల్ల లభించే ఫలితాన్ని పొందుతారు. శ్రద్ధాభక్తులతో ఈ గీతామృతాన్ని విన్న ధన్యజీవులుకూడా నిశ్శ్రేయసానందాన్ని పొందుతారు" -- అని గీతాచార్యుడు శాసిస్తాడు. శ్రీకృష్ణుని మాటలు విన్న అర్జునుడు "నీవు విప్పిచెప్పిన పరమ రహస్య ములయిన విషయాలు విన్న తర్వాత సందేహానికి తావు లేదు. ఇక నీవు ఎలా చెయ్యవలసిందని చెపితే అలా చేస్తాను" -- అని అణకువతో విన్న వించుకుంటాడు. ఈ జరిగిన వృత్తాంతమంతా సంజయుడు ధృతరాష్ట్రునికి చెపుతాడు. ఆ సంభాషణ, ఆ స్నేహం, ఆ వాత్సల్యం, ఆ భక్తి, ఆ విశ్వరూపం, ఆ ప్రశ్నలు, ఆ సమాధానాలు, ఆ సంతోషం, ఆ ఆవేశం విని కని ఆనందించవలసిందే కాని, చెప్ప నలవి కాదని సంజయుడు పట్టలేని సంతోషంతో పొంగిపోతూ చెప్తాడు. సంజయ ధృతరాష్ట్ర సంభాషణతో

ఆరంభించిన నర నారాయణ సంవాదం చివరకు సంజయ వాక్యంతోనే సమాప్తి చెందుతుంది. అదే గీతామృతానికి భరత వాక్యం.

యత్ర యోగేశ్వరః కృష్ణో
యత్ర పార్థో ధనుర్ధరః,
తత్ర శ్రీ ర్విజయో భూతిః
ధ్రువా నీతి ర్మతి ర్మమ.

ఓం తత్ సత్.

త్రయోదశోఽధ్యాయః

# క్షేత్రక్షేత్రజ్ఞవిభాగయోగః

అర్జున ఉవాచ:

ప్రకృతిం పురుషం చైవ క్షేత్రం క్షేత్రజ్ఞ మేవ చ,
ఏత ద్వేదితు మిచ్ఛామి జ్ఞానం జ్ఞేయం చ కేశవ! 1

శ్రీ భగవానువాచ:

ఇదం శరీరం కౌన్తేయ! క్షేత్రమిత్యభిధీయతే,
ఏతద్యో వేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః. 2

క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత!
క్షేత్ర క్షేత్రజ్ఞయోర్ జ్ఞానం యత్తద్జ్ఞానం మతం మమ. 3

తత్ క్షేత్రం యచ్చ యాదృక్చ యద్వికారి యతశ్చ యత్,
స చ యో యత్ప్రభావశ్చ తత్సమాసేన మే శృణు. 4

ఋషిభి ర్బహుధా గీతం ఛన్దోభి ర్వివిధైః పృథక్,
బ్రహ్మసూత్ర పదైశ్చైవ హేతుమద్భి ర్వినిశ్చితైః. 5

మహాభూతా న్యహంకారో బుద్ధి రవ్యక్తమేవ చ,
ఇన్ద్రియాణి దశైకం చ పఞ్చ చేన్ద్రియగోచరాః. 6

ఇచ్ఛా ద్వేష స్సుఖం దుఃఖం సంఘాత శ్చేతనా ధృతిః,
ఏతత్ క్షేత్రం సమాసేన సవికార ముదాహృతమ్. 7

అమానిత్వ మదమ్భిత్వ మహింసా క్షాన్తి రార్జవమ్,
ఆచార్యోపాసనం శౌచం స్థైర్య మాత్మవినిగ్రహః. 8

ఇన్ద్రియార్థేషు వైరాగ్య మనహంకార ఏవ చ,
జన్మ మృత్యు జరా వ్యాధి దుఃఖ దోషానుదర్శనమ్. 9

అసక్తి రనభిష్వఙ్గః పుత్ర దార గృహాదిషు,
నిత్యం చ సమచిత్తత్వ మిష్టానిష్టోపపత్తిషు. 10

మయి చానన్య యోగేన భక్తి రవ్యభిచారిణీ,
వివిక్తదేశ సేవిత్వ మరతి ర్జనసంసది. 11

అధ్యాత్మజ్ఞాన నిత్యత్వం తత్త్వజ్ఞానార్థదర్శనమ్,
ఏతద్ జ్ఞానమితి ప్రోక్త మజ్ఞానం యదతోఽన్యథా. 12

జ్ఞేయం యత్తత్ప్రవక్ష్యామి యద్జ్ఞాత్వాఽమృత మశ్నుతే,
అనాదిమత్పరంబ్రహ్మ న సత్తన్నాసదుచ్యతే. 13

సర్వతః పాణిపాదం త త్సర్వతోఽక్షిశిరోముఖమ్,
సర్వత శ్శ్రుతిమల్లోకే సర్వ మావృత్య తిష్ఠతి. 14

సర్వేన్ద్రియ గుణాభాసం సర్వేన్ద్రియ వివర్జితం,
అసక్తం సర్వభృచ్చైవ నిర్గుణం గుణభోక్తృ చ. 15

బహిరన్తశ్చ భూతానా మచరం చరమేవ చ,
సూక్ష్మత్వా త్తదవిజ్ఞేయం దూరస్థం చాన్తికే చ తత్. 16

అవిభక్తం చ భూతేషు విభక్తమివ చ స్థితమ్,
భూతభర్తృ చ తద్జ్ఞేయం గ్రసిష్ణు ప్రభవిష్ణు చ. 17

జ్యోతిషామపి తజ్జ్యోతి స్తమసః పర ముచ్యతే,
జ్ఞానం జ్ఞేయం జ్ఞాన గమ్యం హృది సర్వస్య విష్ఠితమ్. 18

ఇతి క్షేత్రం తథా జ్ఞానం జ్ఞేయం చోక్తం సమాసతః,
మద్భక్త ఏతద్విజ్ఞాయ మద్భావాయోపపద్యతే. 19

ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి,
వికారాంశ్చ గుణాంశ్చైవ విద్ధి ప్రకృతి సంభవాన్. 20

కార్యకారణ కర్తృత్వే హేతుః ప్రకృతి రుచ్యతే,
పురుష స్సుఖదుఃఖానాం భోక్తృత్వే హేతు రుచ్య తే. 21

పురుషః ప్రకృతిస్థో హి భుఙ్క్తే ప్రకృతిజా న్గుణాన్,
కారణం గుణసఙ్గోఽస్య సదసద్యోని జన్మసు. 22

ఉపద్రష్టాఽనుమన్తా చ భర్తా భోక్తా మహేశ్వరః,
పరమాత్మేతి చాప్యుక్తో దేహేఽస్మి న్పురుషః పరః. 23

య ఏవం వేత్తి పురుషం ప్రకృతిం చ గుణైస్సహ,
సర్వథా వర్తమానోఽపి న స భూయోఽభిజాయతే. 24

ధ్యానేనాత్మని పశ్యన్తి కేచిదాత్మాన మాత్మనా,
అన్యే సాఙ్ఖ్యేన యోగేన కర్మయోగేన చాపరే. 25

అన్యే త్వేవ మజానన్త శ్శ్రుత్వాఽన్యేభ్య ఉపాసతే,
తేఽపి చాతితరన్త్యేవ మృత్యుం శ్రుతిపరాయణాః. 26

యావత్సఞ్జాయతే కిఞ్చి త్సత్త్వం స్థావరజఙ్గమమ్,
క్షేత్రక్షేత్రజ్ఞ సంయోగా త్తద్విద్ధి భరతర్షభ! 27

సమం సర్వేషు భూతేషు తిష్ఠన్తం పరమేశ్వరమ్,
వినశ్యత్స్వవినశ్యన్తం యః పశ్యతి స పశ్యతి. 28

సమం పశ్యన్ సర్వత్ర సమవస్థితమీశ్వరమ్,
న హినస్త్యాత్మనాఽఽత్మానం తతో యాతి పరాంగతిమ్. 29

ప్రకృత్యైవ చ కర్మాణి క్రియమాణాని సర్వశః,
యః పశ్యతి తథాఽఽత్మాన మకర్తారం స పశ్యతి. 30

యదా భూతపృథగ్భావ మేకస్థ మనుపశ్యతి,
తత ఏవ చ విస్తారం బ్రహ్మ సంపద్యతే తదా. 31

అనాదిత్వా న్నిర్గుణత్వా త్పరమాత్మాఽయ మవ్యయః,
శరీరస్థోఽపి కౌన్తేయ! న కరోతి న లిప్యతే. 32

యథా సర్వగతం సౌక్ష్మ్యా దాకాశం నోపలిప్యతే,
సర్వత్రావస్థితో దేహే తథాఽఽత్మా నోపలిప్యతే. 33

యథా ప్రకాశయత్యేకః కృత్స్నం లోకమిమం రవిః,
క్షేత్రం క్షేత్రీ తథా కృత్స్నం ప్రకాశయతి భారత! 34

క్షేత్రక్షేత్రజ్ఞయో రేవ మన్తరం జ్ఞానచక్షుషా,
భూతప్రకృతిమోక్షం చ యే విదు ర్యాన్తి తే పరమ్. 35

ఓం తత్సదితి

శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జునసంవాదే క్షేత్రక్షేత్రజ్ఞవిభాగయోగో నామ
త్రయోదశోఽధ్యాయః.

* * *

## చతుర్దశోఽధ్యాయః

# గుణత్రయవిభాగయోగః

### శ్రీ భగవానువాచ:

పరం భూయః ప్రవక్ష్యామి జ్ఞానానాం జ్ఞానముత్తమమ్,
యద్జ్ఞాత్వా మునయ స్సర్వే పరాం సిద్ధి మితో గతాః. 1

ఇదం జ్ఞాన ముపాశ్రిత్య మమ సాధర్మ్య మాగతాః,
సర్గేఽపి నోపజాయన్తే ప్రలయే న వ్యథన్తి చ. 2

మమ యోని ర్మహద్బ్రహ్మ తస్మి న్గర్భం దధామ్యహమ్,
సంభవ స్సర్వ భూతానాం తతో భవతి భారత! 3

సర్వయోనిషు కౌన్తేయ! మూర్తయ స్సంభవన్తి యాః,
తాసాం బ్రహ్మ మహద్యోని రహం బీజప్రదః పితా. 4

సత్త్వం రజ స్తమ ఇతి గుణాః ప్రకృతిసంభవాః,
నిబధ్నన్తి మహాబాహో! దేహే దేహిన మవ్యయమ్. 5

తత్ర సత్త్వం నిర్మలత్వా త్ప్రకాశక మనామయమ్,
సుఖసఙ్గేన బధ్నాతి జ్ఞానసఙ్గేన చానఘ! 6

రజో రాగాత్మకం విద్ధి తృష్ణాసఙ్గసముద్భవమ్,
తన్నిబధ్నాతి కౌన్తేయ! కర్మసఙ్గేన దేహినమ్. 7

తమ స్త్వజ్ఞానజం విద్ధి మోహనం సర్వ దేహినామ్,
ప్రమాదాలస్యనిద్రాభి స్తన్నిబధ్నాతి భారత! 8

సత్త్వం సుఖే సంజయతి రజః కర్మణి భారత!
జ్ఞాన మావృత్య తు తమః ప్రమాదే సంజయత్యుత. 9

రజస్తమ శ్చాభిభూయ సత్త్వం భవతి భారత!
రజస్సత్త్వం తమశ్చైవ తమ స్సత్త్వం రజస్తథా. 10

సర్వద్వారేషు దేహేఽస్మి న్ప్రకాశ ఉపజాయతే,
జ్ఞానం యదా తదా విద్యా ద్వివృద్ధం సత్త్వ మిత్యుత. 11

లోభః ప్రవృత్తి రారమ్భః కర్మణా మశమః స్పృహా,
రజస్యేతాని జాయన్తే వివృద్ధే భరతర్షభ! 12

అప్రకాశోఽప్రవృత్తిశ్చ ప్రమాదో మోహ ఏవ చ,
తమస్యేతాని జాయన్తే వివృద్ధే కురునన్దన! 13

యదా సత్త్వే ప్రవృద్ధేతు ప్రలయం యాతి దేహభృత్,
తదోత్తమవిదాం లోకా నమలా న్ప్రతిపద్యతే. 14

రజసి ప్రలయం గత్వా కర్మసఙ్గిషు జాయతే,
తథా ప్రలీన స్తమసి మూఢయోనిషు జాయతే. 15

కర్మణ స్సుకృతస్యాహు స్సాత్త్వికం నిర్మలం ఫలమ్,
రజసస్తు ఫలం దుఃఖ మజ్ఞానం తమసః ఫలమ్. 16

సత్త్వా త్సంజాయతే జ్ఞానం రజసో లోభ ఏవ చ,
ప్రమాద మోహౌ తమసో భవతోఽజ్ఞానమేవ చ. 17

ఊర్ధ్వం గచ్ఛన్తి సత్త్వస్థా మధ్యే తిష్ఠన్తి రాజసాః,
జఘన్యగుణవృత్తిస్థా అధో గచ్ఛన్తి తామసాః. 18

నాన్యం గుణేభ్యః కర్తారం యదా ద్రష్టాఽనుపశ్యతి,
గుణేభ్యశ్చ పరం వేత్తి మద్భావం సోఽధిగచ్ఛతి. 19

గుణానేతా నతీత్య త్రీ న్దేహీ దేహసముద్భవాన్,
జన్మ మృత్యు జరా దుఃఖై ర్విముక్తోఽమృత మశ్నుతే. 20

అర్జున ఉవాచ:

కై ర్లిఙ్గై స్త్రీన్గుణా నేతా నతీతో భవతి ప్రభో!
కి మాచారః కథం చైతాం స్త్రీన్గుణా నతివర్తతే. 21

శ్రీ భగవానువాచ:

ప్రకాశం చ ప్రవృత్తిం చ మోహమేవ చ పాణ్డవ!
న ద్వేష్టి సంప్రవృత్తాని న నివృత్తాని కాఙ్క్షతి. 22

ఉదాసీనవదాసీనో గుణై ర్యో న విచాల్యతే,
గుణా వర్తన్త ఇత్యేవ యోఽవతిష్ఠతి నేఙ్గతే. 23

సమదుఃఖసుఖ స్స్వస్థ స్సమలోష్టాశ్మకాఞ్చనః,
తుల్యప్రియాప్రియో ధీర స్తుల్యనిన్దాత్మసంస్తుతిః. 24

మానావమానయో స్తుల్య స్తుల్యో మిత్రారిపక్షయోః,
సర్వారమ్భపరిత్యాగీ గుణాతీత స్స ఉచ్యతే. 25

మాం చ యోఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే,
స గుణాన్సమతీత్యైతా న్బ్రహ్మభూయాయ కల్పతే. 26

బ్రహ్మణో హి ప్రతిష్ఠాఽహ మమృతస్యావ్యయస్య చ,
శాశ్వతస్య చ ధర్మస్య సుఖస్యైకాన్తికస్య చ. 27

ఓం తత్సదితి

శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీ కృష్ణార్జునసంవాదే గుణత్రయవిభాగయోగో నామ
చతుర్దశోఽధ్యాయః.

* * *

## పఞ్చదశోఽధ్యాయః

# పురుషోత్తమప్రాప్తియోగః

శ్రీ భగవానువాచ:

ఊర్ధ్వమూల మధశ్శాఖ మశ్వత్థం ప్రాహు రవ్యయమ్,
ఛన్దాంసి యస్య పర్ణాని య స్తం వేద స వేదవిత్. 1

అధశ్చోర్ధ్వం ప్రసృతా స్తస్య శాఖాః
గుణప్రవృద్ధా విషయప్రవాలాః,
అధశ్చ మూలా న్యనుసన్తతాని
కర్మానుబన్ధీని మనుష్యలోకే. 2

న రూపమస్యేహ తథోపలభ్యతే
నాన్తో నచాది ర్నచ సంప్రతిష్ఠా,
అశ్వత్థమేనం సువిరూఢమూల
మసఙ్గశస్త్రేణ దృఢేన ఛిత్త్వా. 3

తతః పదం తత్పరిమార్గితవ్యం
యస్మిన్గతా న నివర్తన్తి భూయః,
తమేవ చాద్యం పురుషం ప్రపద్యే
యతః ప్రవృత్తిః ప్రసృతా పురాణీ. 4

నిర్మానమోహా జితసఙ్గదోషా
అధ్యాత్మనిత్యా వినివృత్తకామాః,
ద్వన్ద్వై ర్విముక్తా స్సుఖదుఃఖసంజ్ఞై
ర్గచ్ఛన్త్యమూఢాః పద మవ్యయం తత్. 5

న త ద్భాసయతే సూర్యో న శశాఙ్కో న పావకః,
యద్గత్వా న నివర్తన్తే తద్ధామ పరమం మమ. 6

మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః,
మన షష్ఠానీన్ద్రియాణి ప్రకృతిస్థాని కర్షతి. 7

శరీరం యదవాప్నోతి యచ్చాప్యుత్క్రామతీశ్వరః,
గృహీత్వైతాని సంయాతి వాయు ర్గన్ధానివాశయాత్. 8

శ్రోత్రం చక్షుః స్పర్శనం చ రసనం ఘ్రాణమేవ చ,
అధిష్ఠాయ మనశ్చాయం విషయా నుపసేవతే. 9

ఉత్క్రామన్తం స్థితం వాపి భుఞ్జానం వా గుణాన్వితమ్,
విమూఢా నానుపశ్యన్తి పశ్యన్తి జ్ఞానచక్షుషః. 10

యతన్తో యోగిన శ్చైనం పశ్యన్త్యాత్మన్యవస్థితమ్,
యతన్తోఽప్యకృతాత్మానో నైనం పశ్యన్త్యచేతసః. 11

య దాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలమ్,
య చ్చన్ద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకమ్. 12

గామావిశ్య చ భూతాని ధారయామ్యహ మోజసా,
పుష్ణామి చౌషధీ స్సర్వా స్సోమో భూత్వా రసాత్మకః. 13

అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహ మాశ్రితః,
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్. 14

సర్వస్య చాహం హృది సన్నివిష్టో
మత్త స్స్మృతిర్ జ్ఞాన మపోహనం చ,
వేదైశ్చ సర్వై రహమేవ వేద్యో
వేదాన్తకృ ద్వేదవిదేవ చాహమ్. 15

ద్వావిమౌ పురుషౌ లోకే క్షర శ్చాక్షర ఏవ చ,
క్షర స్సర్వాణి భూతాని కూటస్థోஉక్షర ఉచ్యతే. 16

ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః,
యో లోకత్రయ మావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః. 17

యస్మాత్ క్షరమతీతోஉహ మక్షరాదపి చోత్తమః,
అతోஉస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః. 18

యో మామేవ మసంమూఢో జానాతి పురుషోత్తమమ్,
స సర్వవిద్భజతి మాం సర్వభావేన భారత! 19

ఇతి గుహ్యతమం శాస్త్ర మిదముక్తం మయాஉనఘ!
ఏతద్బుద్ధ్వా బుద్ధిమాన్స్యా త్కృతకృత్యశ్చ భారత! 20

ఓం తత్సదితి

శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జునసంవాదే పురుషోత్తమప్రాప్తియోగో నామ
పఞ్చదశోஉధ్యాయః.

షోడశోఽధ్యాయః

# దైవాసురసంపద్విభాగయోగః

శ్రీ భగవానువాచ:

అభయం సత్త్వసంశుద్ధిః జ్ఞానయోగ వ్యవస్థితిః,
దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయ స్తప ఆర్జవమ్. 1

అహింసా సత్య మక్రోధ స్త్యాగ శ్శాన్తి రపైశునమ్,
దయా భూతేష్వలోలత్వం మార్దవం హ్రీ రచాపలమ్. 2

తేజః క్షమా ధృతి శ్శౌచ మద్రోహో నాతిమానితా,
భవన్తి సంపదం దైవీ మభిజాతస్య భారత! 3

దమ్భో దర్పోఽభిమానశ్చ క్రోధః పారుష్యమేవ చ,
అజ్ఞానం చాభిజాతస్య పార్థ! సంపద మాసురీమ్. 4

దైవీసంప ద్విమోక్షాయ నిబన్ధాయాసురీ మతా,
మా శుచ స్సంపదం దైవీ మభిజాతోఽసి పాణ్డవ! 5

ద్వౌ భూతసర్గౌ లోకేఽస్మి న్దైవ ఆసుర ఏవ చ,
దైవో విస్తరశః ప్రోక్త ఆసురం పార్థ! మే శృణు. 6

ప్రవృత్తిం చ నివృత్తిం చ జనా న విదు రాసురాః,
న శౌచం నాపి చాచారో న సత్యం తేషు విద్యతే. 7

అసత్య మప్రతిష్ఠం తే జగదాహు రనీశ్వరమ్,
అపరస్పర సంభూతం కిమన్య త్కామహైతుకమ్. 8

ఏతాం దృష్టి మవష్టభ్య నష్టాత్మానోఽల్పబుద్ధయః,
ప్రభవన్త్యుగ్రకర్మాణః క్షయాయ జగతోఽహితాః. 9

కామ మాశ్రిత్య దుష్పూరం దమ్భ మాన మదాన్వితాః,
మోహాద్గృహీత్వాఽసద్గ్రాహా న్ప్రవర్తన్తేఽశుచి వ్రతాః. 10

చిన్తా మపరిమేయాం చ ప్రలయాన్తా ముపాశ్రితాః,
కామోపభోగపరమాః ఏతావదితి నిశ్చితాః. 11

ఆశాపాశశతై ర్బద్ధాః కామక్రోధ పరాయణాః,
ఈహన్తే కామభోగార్థ మన్యాయే నార్థసఞ్చయాన్. 12

ఇదమద్య మయా లబ్ధ మిమం ప్రాప్స్యే మనోరథమ్,
ఇద మస్తీదమపి మే భవిష్యతి పున ర్ధనమ్. 13

అసౌ మయా హత శ్శత్రు ర్హనిష్యే చాపరానపి,
ఈశ్వరోఽహ మహం భోగీ సిద్ధోఽహం బలవా న్సుఖీ. 14

ఆఢ్యోఽభిజనవానస్మి కోఽన్యోఽస్తి సదృశో మయా,
యక్ష్యే దాస్యామి మోదిష్య ఇత్యజ్ఞాన విమోహితాః. 15

అనేకచిత్తవిభ్రాన్తా మోహజాల సమావృతాః,
ప్రసక్తాః కామభోగేషు పతన్తి నరకేఽశుచౌ. 16

ఆత్మసంభావితాః స్తబ్ధా ధన మాన మదాన్వితాః,
యజన్తే నామయజ్ఞై స్తే దమ్భేనావిధిపూర్వకమ్. 17

అహంకారం బలం దర్పం కామం క్రోధం చ సంశ్రితాః,
మా మాత్మపరదేహేషు ప్రద్విషన్తోఽభ్యసూయకాః. 18

తానహం ద్విషతః క్రూరా న్సంసారేషు నరాధమాన్,
క్షిపామ్యజస్ర మశుభా నాసురీష్వేవ యోనిషు. 19

ఆసురీం యోని మాపన్నా మూఢా జన్మని జన్మని,
మా మప్రాప్యైవ కౌన్తేయ! తతో యా న్త్యధమాంగతిమ్. 20

త్రివిధం నరక స్యేదం ద్వారం నాశన మాత్మనః,
కామః క్రోధ స్తథా లోభ స్తస్మా దేతత్త్రియం త్యజేత్. 21

ఏతై ర్విముక్తః కౌన్తేయ! తమోద్వారై స్త్రిభి ర్నరః,
ఆచర త్యాత్మనశ్శ్రేయ స్తతో యాతి పరాంగతిమ్. 22

య శ్శాస్త్రవిధి ముత్సృజ్య వర్తతే కామకారతః,
న స సిద్ధిమవాప్నోతి న సుఖం న పరాంగతిమ్. 23

తస్మా చ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ,
జ్ఞాత్వా శాస్త్రవిధానోక్తం కర్మ కర్తు మిహార్హసి. 24

ఓం తత్సదితి

శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జునసంవాదే దైవాసురసంపద్విభాగయోగో నామ
షోడశోఽధ్యాయః.

* * *

## సప్తదశోఽధ్యాయః

# శ్రద్ధాత్రయవిభాగయోగః

అర్జున ఉవాచ:

యే శాస్త్రవిధి ముత్సృజ్య యజన్తే శ్రద్ధయాఽన్వితాః,
తేషాం నిష్ఠా తు కా కృష్ణ! సత్త్వ మాహో రజ స్తమః. 1

శ్రీ భగవానువాచ:

త్రివిధా భవతి శ్రద్ధా దేహినాం సా స్వభావజా,
సాత్త్వికీ రాజసీ చైవ తామసీ చేతి తాం శృణు. 2

సత్త్వానురూపా సర్వస్య శ్రద్ధా భవతి భారత!
శ్రద్ధామయోఽయం పురుషో యో యచ్ఛ్రద్ధ స్స ఏవ సః. 3

యజన్తే సాత్త్వికా దేవా న్యక్ష రక్షాంసి రాజసాః,
ప్రేతా న్భూతగణాం శ్చాన్యే యజన్తే తామసా జనాః. 4

అశాస్త్రవిహితం ఘోరం తప్యన్తే యే తపో జనాః,
దమ్భాహంకార సంయుక్తాః కామ రాగ బలాన్వితాః. 5

కర్శయన్త శ్శరీరస్థం భూతగ్రామ మచేతసః,
మాం చైవాన్త శ్శరీరస్థం తా న్విద్ధ్యాసుర నిశ్చయాన్. 6

ఆహారస్త్వపి సర్వస్య త్రివిధో భవతి ప్రియః,
యజ్ఞ స్తప స్తథా దానం తేషాం భేద మిమం శృణు. 7

ఆయు స్సత్త్వ బలారోగ్య సుఖప్రీతి వివర్ధనాః,
రస్యాః స్నిగ్ధాః స్థిరా హృద్యా ఆహారా స్సాత్త్వికప్రియాః. 8

కట్వామ్ల లవణాత్యుష్ణ తీక్ష్ణ రూక్షవిదాహినః,
ఆహారా రాజసస్యేష్టా దుఃఖశోకామయప్రదాః. 9

యాతయామం గతరసం పూతి పర్యుషితం చ యత్,
ఉచ్ఛిష్టమపి చామేధ్యం భోజనం తామసప్రియమ్. 10

అఫలాకాంక్షిభి ర్యజ్ఞో విధిదృష్టో య ఇజ్యతే,
యష్టవ్య మేవేతి మన స్సమాధాయ స సాత్త్వికః. 11

అభిసన్ధాయ తు ఫలం దమ్భార్థమపి చైవ యత్,
ఇజ్యతే భరతశ్రేష్ఠ! తం యజ్ఞం విద్ధి రాజసమ్. 12

విధిహీన మసృష్టాన్నం మన్త్రహీన మదక్షిణమ్,
శ్రద్ధావిరహితం యజ్ఞం తామసం పరిచక్షతే. 13

దేవ ద్విజ గురు ప్రాజ్ఞ పూజనం శౌచ మార్జవమ్,
బ్రహ్మచర్య మహింసా చ శారీరం తప ఉచ్యతే. 14

అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్,
స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే. 15

మనః ప్రసాద స్సౌమ్యత్వం మౌన మాత్మవినిగ్రహః,
భావసంశుద్ధి రిత్యేత త్తపో మానస ముచ్యతే. 16

శ్రద్ధయా పరయా తప్తం తప స్తత్త్రివిధం నరైః,
అఫలాకాంక్షిభి ర్యుక్తై స్సాత్త్వికం పరిచక్షతే. 17

సత్కార మాన పూజార్థం తపో దమ్భేన చైవ యత్,
క్రియతే తదిహ ప్రోక్తం రాజసం చల మధ్రువమ్. 18

మూఢగ్రాహేణాత్మనో యత్పీడయా క్రియతే తపః,
పరస్యోత్సాదనార్థం వా తత్తామస ముదాహృతమ్. 19

దాతవ్యమితి యద్దానం దీయతే ఽనుపకారిణే,
దేశే కాలే చ పాత్రే చ తద్దానం సాత్త్వికం స్మృతమ్. 20

యత్తు ప్రత్యుపకారార్థం ఫల ముద్దిశ్య వా పునః,
దీయతే చ పరిక్లిష్టం తద్దానం రాజసం స్మృతమ్. 21

అదేశకాలే యద్దాన మపాత్రేభ్యశ్చ దీయతే,
అసత్కృత మవజ్ఞాతం తత్తామస ముదాహృతమ్. 22

ఓం తత్సదితి నిర్దేశో బ్రహ్మణ స్త్రివిధః స్మృతః,
బ్రాహ్మణా స్తేన వేదాశ్చ యజ్ఞాశ్చ విహితాః పురా. 23

తస్మా దోమిత్యుదాహృత్య యజ్ఞ దాన తపః క్రియాః,
ప్రవర్తన్తే విధానోక్తా స్సతతం బ్రహ్మవాదినామ్. 24

తదిత్యనభిసన్ధాయ ఫలం యజ్ఞ తపః క్రియాః,
దానక్రియాశ్చ వివిధాః క్రియన్తే మోక్షకాంక్షిభిః. 25

సద్భావే సాధుభావే చ సదిత్యేత త్ప్రియుజ్యతే,
ప్రశస్తే కర్మణి తథా సచ్ఛబ్దః పార్థ! యుజ్యతే. 26

యజ్ఞే తపసి దానే చ స్థితి స్సదితి చోచ్యతే,
కర్మచైవ తదర్థీయం సదిత్యేవాభిధీయతే. 27

అశ్రద్ధయా హుతం దత్తం తప స్తప్తం కృతం చ యత్,
అసదిత్యుచ్యతే పార్థ! న చ తత్ప్రేత్య నో ఇహ. 28

ఓం తత్సదితి

శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జునసంవాదే శ్రద్ధాత్రయవిభాగయోగో నామ
సప్తదశోఽధ్యాయః.

* * *

# అష్టాదశోఽధ్యాయః

# మోక్షసన్న్యాసయోగః

అర్జున ఉవాచ:

సన్న్యాసస్య మహాబాహో! తత్త్వమిచ్ఛామి వేదితుమ్,
త్యాగస్య చ హృషీకేశ! పృథ క్కేశినిషూదన! 1

శ్రీభగవానువాచ:

కామ్యానాం కర్మణాం న్యాసం సన్న్యాసం కవయో విదుః,
సర్వకర్మ ఫలత్యాగం ప్రాహు స్త్యాగం విచక్షణాః. 2

త్యాజ్యం దోషవదిత్యేకే కర్మ ప్రాహు ర్మనీషిణః,
యజ్ఞ దాన తపః కర్మ న త్యాజ్యమితి చాపరే. 3

నిశ్చయం శృణు మే తత్ర త్యాగే భరతసత్తమ!
త్యాగో హి పురుషవ్యాఘ్ర! త్రివిధ స్సంప్రకీర్తితః. 4

యజ్ఞ దాన తపః కర్మ న త్యాజ్యం కార్యమేవ తత్,
యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణామ్. 5

ఏతాన్యపి తు కర్మాణి సఙ్గం త్యక్త్వా ఫలాని చ,
కర్తవ్యానీతి మే పార్థ! నిశ్చితం మత ముత్తమమ్. 6

నియతస్య తు సన్న్యాసః కర్మణో నోపపద్యతే,
మోహా త్తస్య పరిత్యాగ స్తామసః పరికీర్తితః. 7

దుఃఖమిత్యేవ యత్కర్మ కాయక్లేశభయా త్త్యజేత్,
స కృత్వా రాజసం త్యాగం నైవ త్యాగఫలం లభేత్. 8

కార్యమిత్యేవ యత్కర్మ నియతం క్రియతేఽర్జున!
సఙ్గం త్యక్త్వా ఫలంచైవ స త్యాగ స్సాత్త్వికో మతః. 9

న ద్వేష్ట్యకుశలం కర్మ కుశలే నానుషజ్జతే,
త్యాగీ సత్త్వసమావిష్టో మేధావీ ఛిన్నసంశయః. 10

న హి దేహభృతా శక్యం త్యక్తుం కర్మా ణ్యశేషతః,
యస్తు కర్మఫలత్యాగీ స త్యాగీత్యభిధీయతే. 11

అనిష్ట మిష్టం మిశ్రం చ త్రివిధం కర్మణః ఫలమ్,
భవత్యత్యాగినాం ప్రేత్య న తు సన్న్యాసినాం క్వచిత్. 12

పఞ్చైతాని మహాబాహో! కారణాని నిబోధ మే,
సాంఖ్యే కృతాన్తే ప్రోక్తాని సిద్ధయే సర్వకర్మణామ్. 13

అధిష్ఠానం తథా కర్తా కరణం చ పృథగ్విధమ్,
వివిధాశ్చ పృథ క్చేష్టా దైవం చైవాత్ర పఞ్చమమ్. 14

శరీర వా ఙ్మనోభి ర్యత్కర్మ ప్రారభతే నరః,
న్యాయ్యం వా విపరీతం వా పఞ్చైతే తస్య హేతవః. 15

తత్రైవం సతి కర్తార మాత్మానం కేవలం తు యః,
పశ్యత్యకృతబుద్ధిత్వా న్న స పశ్యతి దుర్మతిః. 16

యస్య నాహంకృతో భావో బుద్ధి ర్యస్య న లిప్యతే,
హత్వాఽపి స ఇమా న్లోకా న్న హన్తి న నిబధ్యతే. 17

జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా త్రివిధా కర్మచోదనా,
కరణం కర్మ కర్తేతి త్రివిధః కర్మసంగ్రహః. 18

జ్ఞానం కర్మ చ కర్తా చ త్రిధైవ గుణభేదతః,
ప్రోచ్యతే గుణసంఖ్యానే యథావచ్ఛృణు తాన్యపి. 19

సర్వభూతేషు యేనైకం భావ మవ్యయ మీక్షతే,
అవిభక్తం విభక్తేషు తద్జ్ఞానం విద్ధి సాత్త్వికమ్. 20

పృథక్త్వేన తు యద్జ్ఞానం నానాభావా న్పృథగ్విధాన్,
వేత్తి సర్వేషు భూతేషు తద్జ్ఞానం విద్ధి రాజసమ్. 21

యత్తు కృత్స్నవదేకస్మి న్కార్యే సక్త మహైతుకమ్,
అతత్త్వార్థవదల్పం చ తత్తామస ముదాహృతమ్. 22

నియతం సఙ్గరహిత మరాగ ద్వేషతః కృతమ్,
అఫలప్రేప్సునా కర్మ య త్తత్సాత్త్విక ముచ్యతే. 23

యత్తు కామేప్సునా కర్మ సాహంకారేణ వా పునః,
క్రియతే బహులాయాసం తద్రాజస ముదాహృతమ్. 24

అనుబన్ధం క్షయం హింసా మనపేక్ష్య చ పౌరుషమ్,
మోహా దారభ్యతే కర్మ యత్త త్తామస ముచ్యతే. 25

ముక్తసఙ్గోఽనహంవాదీ ధృత్యుత్సాహ సమన్వితః,
సిద్ధ్యసిద్ధ్యో ర్నిర్వికారః కర్తా సాత్త్విక ఉచ్యతే. 26

రాగీ కర్మఫలప్రేప్సు ర్లుబ్ధో హింసాత్మకోఽశుచిః,
హర్ష శోకాన్వితః కర్తా రాజసః పరికీర్తితః. 27

అయుక్తః ప్రాకృతః స్తబ్ధ శ్శఠో నైష్కృతికోఽలసః,
విషాదీ దీర్ఘసూత్రీ చ కర్తా తామస ఉచ్యతే. 28

బుద్ధే ర్భేదం ధృతేశ్చైవ గుణత స్త్రివిధం శృణు,
ప్రోచ్యమాన మశేషేణ పృథక్త్వేన ధనంజయ! 29

ప్రవృత్తిం చ నివృత్తిం చ కార్యాకార్యే భయాభయే,
బన్ధం మోక్షం చ యా వేత్తి బుద్ధి స్సా పార్థ! సాత్త్వికీ. 30

యయా ధర్మ మధర్మం చ కార్యం చాకార్యమేవ చ,
అయథావ త్ప్రజానాతి బుద్ధి స్సా పార్థ! రాజసీ. 31

అధర్మం ధర్మమితి యా మన్యతే తమసావృతా,
సర్వార్థా న్విపరీతాంశ్చ బుద్ధి స్సా పార్థ! తామసీ. 32

ధృత్యా యయా ధారయతే మనః ప్రాణేన్ద్రియక్రియాః,
యోగేనావ్యభిచారిణ్యా ధృతి స్సా పార్థ! సాత్త్వికీ. 33

యయా తు ధర్మకామార్థా న్ధృత్యా ధారయతేఽర్జున!
ప్రసఙ్గేన ఫలాకాంక్షీ ధృతి స్సా పార్థ! రాజసీ. 34

యయా స్వప్నం భయం శోకం విషాదం మద మేవ చ,
న విముఞ్చతి దుర్మేధా ధృతి స్సా పార్థ! తామసీ. 35

సుఖం త్విదానీం త్రివిధం శృణు మే భరతర్షభ!
అభ్యాసా ద్రమతే యత్ర దుఃఖాన్తం చ నిగచ్ఛతి. 36

యత్తదగ్రే విషమివ పరిణామేఽమృతోపమమ్,
తత్సుఖం సాత్త్వికం ప్రోక్త మాత్మబుద్ధి ప్రసాదజమ్. 37

విషయేన్ద్రియ సంయోగా ద్యత్తదగ్రేఽమృతోపమమ్,
పరిణామే విషమివ తత్సుఖం రాజసం స్మృతమ్. 38

యదగ్రే చానుబన్ధే చ సుఖం మోహన మాత్మనః,
నిద్రాలస్య ప్రమాదోత్థం తత్తామస ముదాహృతమ్. 39

న తదస్తి పృథివ్యాం వా దివి దేవేషు వా పునః,
సత్త్వం ప్రకృతిజై ర్ముక్తం యదేభిస్స్యా త్త్రిభి ర్గుణైః. 40

బ్రాహ్మణ క్షత్రియ విశాం శూద్రాణాం చ పరంతప!
కర్మాణి ప్రవిభక్తాని స్వభావప్రభవై ర్గుణైః. 41

శమో దమ స్తప శ్శౌచం క్షాన్తి రార్జవమేవ చ,
జ్ఞానం విజ్ఞాన మాస్తిక్యం బ్రాహ్మం కర్మ స్వభావజమ్. 42

శౌర్యం తేజో ధృతి ర్దాక్ష్యం యుద్ధే చాప్యపలాయనమ్,
దాన మీశ్వరభావశ్చ క్షాత్రం కర్మ స్వభావజమ్. 43

కృషి గోరక్ష వాణిజ్యం వైశ్యం కర్మ స్వభావజమ్,
పరిచర్యాత్మకం కర్మ శూద్రస్యాపి స్వభావజమ్. 44

స్వే స్వే కర్మణ్యభిరత స్సంసిద్ధిం లభ తే నరః,
స్వకర్మనిరత స్సిద్ధిం యథా విన్దతి తచ్ఛృణు. 45

యతః ప్రవృత్తి ర్భూతానాం యేన సర్వమిదం తతమ్,
స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విన్దతి మానవః. 46

శ్రేయా న్స్వధర్మో విగుణః పరధర్మా త్స్వనుష్ఠితాత్,
స్వభావనియతం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్. 47

సహజం కర్మ కౌన్తేయ! సదోషమపి న త్యజేత్,
సర్వారమ్భా హి దోషేణ ధూమేనాగ్నిరివావృతాః. 48

అసక్త బుద్ధి స్సర్వత్ర జితాత్మా విగతస్పృహః,
నైష్కర్మ్యసిద్ధిం పరమాం సన్న్యాసేనాధిగచ్ఛతి. 49

సిద్ధిం ప్రాప్తో యథా బ్రహ్మ తథాప్నోతి నిబోధ మే
సమాసేనైవ కౌన్తేయ! నిష్ఠా జ్ఞానస్య యా పరా. 50

బుద్ధ్యా విశుద్ధయా యుక్తో ధృత్యాత్మానం నియమ్యచ,
శబ్దాదీ న్విషయాం స్త్యక్త్వా రాగద్వేషౌ వ్యుదస్య చ. 51

వివిక్తసేవీ లఘ్వాశీ యతవాక్కాయమానసః,
ధ్యానయోగపరో నిత్యం వైరాగ్యం సముపాశ్రితః. 52

అహంకారం బలం దర్పం కామం క్రోధం పరిగ్రహమ్,
విముచ్య నిర్మమ శ్శాన్తో బ్రహ్మభూయాయ కల్పతే. 53

బ్రహ్మభూతః ప్రసన్నాత్మా న శోచతి న కాంక్షతి,
సమ స్సర్వేషు భూతేషు మద్భక్తిం లభతే పరామ్. 54

భక్త్యా మా మభిజానాతి యావా న్యశ్చాస్మి తత్త్వతః,
తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనన్తరమ్. 55

సర్వ కర్మాణ్యపి సదా కుర్వాణో మద్వ్యపాశ్రయః,
మత్ప్రసాదా దవాప్నోతి శాశ్వతం పద మవ్యయమ్. 56

చేతసా సర్వకర్మాణి మయి సన్న్యస్య మత్పరః,
బుద్ధియోగ ముపాశ్రిత్య మచ్చిత్త స్సతతం భవ. 57

మచ్చిత్త స్సర్వదుర్గాణి మత్ప్రసాదా త్తరిష్యసి,
అథ చేత్త్వమహంకారా న్న శ్రోష్యసి వినజ్‌క్ష్యసి. 58

యద్యహంకార మాశ్రిత్య న యోత్స్య ఇతి మన్యసే,
మిథ్యైష వ్యవసాయ స్తే ప్రకృతి స్త్వాం నియోక్ష్యతి. 59

స్వభావజేన కౌన్తేయ! నిబద్ధ స్స్వేన కర్మణా,
కర్తుం నేచ్ఛసి యన్మోహా త్కరిష్యస్యవశోఽపి తత్. 60

ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశేఽర్జున! తిష్ఠతి,
భ్రామయ న్సర్వభూతాని యన్త్రారూఢాని మాయయా. 61

తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత!
తత్ప్రసాదా త్పరాం శాన్తిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్. 62

ఇతి తే జ్ఞాన మాఖ్యాతం గుహ్యాద్గుహ్యతరం మయా,
విమృశ్యైతదశేషేణ యథేచ్ఛసి తథా కురు. 63

సర్వగుహ్యతమం భూయ శ్శృణు మే పరమం వచః,
ఇష్టోఽసి మే దృఢమితి తతో వక్ష్యామి తే హితమ్. 64

మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు,
మామేవైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసి మే. 65

సర్వధర్మా న్పరిత్యజ్య మా మేకం శరణం వ్రజ,
అహం త్వా పాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః. 66

ఇదం తే నాతపస్కాయ నాభక్తాయ కదాచన,
న చాశుశ్రూషవే వాచ్యం న చ మాం యోఽభ్యసూయతి. 67

య ఇదం పరమం గుహ్యం మద్భక్తే ష్వభిధాస్యతి,
భక్తిం మయి పరాం కృత్వా మామేవైష్య త్యసంశయః. 68

న చ తస్మా న్మనుష్యేషు కశ్చిన్మే ప్రియకృత్తమః,
భవితా న చ మే తస్మా దన్యః ప్రియతరో భువి. 69

అధ్యేష్యతే చ య ఇమం ధర్మ్యం సంవాద మావయోః,
జ్ఞానయజ్ఞేన తేనాహ మిష్టస్స్యామితి మే మతిః. 70

శ్రద్ధావా ననసూయశ్చ శృణుయాదపి యో నరః,
సోఽపి ముక్త శ్శుభాన్ లోకా న్ప్రాప్నుయా త్పుణ్యకర్మణామ్. 71

కచ్చిదేత చ్ఛ్రుతం పార్థ! త్వయైకాగ్రేణ చేతసా,
కచ్చి దజ్ఞానసమ్మోహః ప్రణష్ట స్తే ధనంజయ! 72

అర్జున ఉవాచ:

నష్టో మోహః స్మృతి ర్లబ్ధా త్వత్ప్రసాదా న్మయాఽచ్యుత!
స్థితోఽస్మి గతసందేహః కరిష్యే వచనం తవ. 73

సఞ్జయ ఉవాచ:

ఇత్యహం వాసు దేవస్య పార్థస్య చ మహాత్మనః,
సంవాద మిమ మశ్రౌష మద్భుతం రోమహర్షణమ్. 74

వ్యాసప్రసాదా చ్ఛ్రుతవా నేత ద్గుహ్యతమం పరమ్,
యోగం యోగేశ్వరా త్కృష్ణా త్సాక్షాత్కథయత స్స్వయమ్. 75

రాజ న్సంస్మృత్య సంస్మృత్య సంవాద మిమ మద్భుతమ్,
కేశవార్జునయోః పుణ్యం హృష్యామి చ ముహు ర్ముహుః. 76

తచ్చ సంస్మృత్య సంస్మృత్య రూప మత్యద్భుతం హరేః,
విస్మయో మే మహాన్ రాజన్! హృష్యామి చ పునః పునః. 77

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః,
తత్ర శ్రీ ర్విజయో భూతి ర్ధ్రువా నీతి ర్మతిర్మమ. 78

ఓం తత్సదితి

శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జునసంవాదే మోక్షసన్న్యాసయోగో నామ
అష్టాదశోఽధ్యాయః.

ముక్తివల్లి సమాప్తం.

* * *

T.T.D. Religious Publications Series No. 572 Rs. 30/-

Price :

Published by Dr. P. Krishnaiah, I.A.S., Executive Officer,
Tirumala Tirupati Devasthanams, Tirupati and Printed at T.T.D. Press, Tirupati.